

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 285

శనివారం 5-1-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తు

ఎన్‌ఐఏకు అప్పగింత

కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ



శిక్షార్హమైన నేరమే..

- ఘటన తీవ్రత దృష్ట్యా ఎన్‌ఐఏ దర్యాప్తు అవసరం ఉంది
- ఉత్తర్వుల్లో పేర్కొన్న కేంద్ర హోంశాఖ

2లో

- వెంటనే రంగంలోకి దిగిన ఎన్‌ఐఏ.. ఎఫ్‌ఐఆర్ నమోదు
- హైకోర్టుకు నివేదించిన కేంద్ర ప్రభుత్వం
- ఎన్‌ఐఏ దర్యాప్తు నేపథ్యంలో ఈ పిటిషన్లపై తదుపరి విచారణ అవసరం లేదు..
- కాబట్టి ఈ వ్యాజ్యాలను మూసేస్తున్నాం
- ఉత్తర్వులు జారీ చేసిన ధర్మాసనం
- కేంద్రం అధికార పరిధిని దాటి ఉత్తర్వులిచ్చింది
- హైకోర్టుకు తెలిపిన అడ్వొకేట్ జనరల్
- వాటిని సవాలు చేసే విషయంలో నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదేనన్న కోర్టు
- స్థానిక పోలీసుల దర్యాప్తును ఆపేలా ఆదేశించాలని జగన్ న్యాయవాది వినతి
- ఈ విషయం ఎన్‌ఐఏ చట్టంలోనే స్పష్టంగా ఉంది
- అందువల్ల ఇక ప్రత్యేకంగా మా ఉత్తర్వులు అవసరం లేదు
- స్పష్టతనిచ్చిన న్యాయస్థానం

సాక్షి, అమరావతి: విశాఖపట్నం విమానాశ్రయంలో గత ఏడాది అక్టోబర్ 25న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనపై దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)కు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ఎన్‌ఐఏ హత్యాయత్నం ఘటనకు సంబంధించి ఈనెల 1వతేదీన ఎఫ్‌ఐఆర్‌ను కూడా నమోదు చేసింది. కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) కె.లక్ష్మణ్ శుక్రవారం ఈ వివరాలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు సమర్పించారు. వీటిని పరిశీలించిన హైకోర్టు.. పిటిషనర్లు కోరిన విధంగా కేంద్రం ఎన్‌ఐఏ దర్యాప్తునకు ఆదేశించిన నేపథ్యంలో ఈ వ్యాజ్యాలపై ఇక విచారించేందుకు ఏమీ లేదని స్పష్టం చేసింది. కేంద్రం సమర్పించిన వివరాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ వ్యాజ్యాలను మూసివేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.వి.భట్, జస్టిస్ కొంగర విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ఆధారంగా ఎన్‌ఐఏ ఇప్పటికే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలో జగన్‌పై హత్యాయత్నం ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన దర్యాప్తును నిలిపివేయాల్సి ఉంటుంది. ఈ కేసులో ఇప్పటివరకు సేకరించిన ఆధారాలతో కేసు డాక్యుమెంట్లను, రికార్డులన్నింటినీ చట్ట నిబంధనల మేరకు ఎన్‌ఐఏకు అప్పగించాల్సి ఉంటుంది.

వైఎస్ జగన్ తదితరుల అభ్యర్థనలివీ...


తనపై జరిగిన హత్యాయత్నం ఘటన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ నిర్వచన పరిధిలోకే వస్తుందని, పౌర విమానయాన భద్రతా చట్ట నిబంధ నల ప్రకారం ఇలాంటి ఘటనలపై దర్యాప్తు చేసే అధికార పరిధి ఎన్‌ఐఏకు ఉందని, అందువల్ల సమగ్ర దర్యాప్తు జరిపేలా కేంద్ర హోంశాఖను ఆదేశించాలని కోరుతూ వైఎస్ జగన్ హైకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సైతం ఇదే అభ్యర్థనతో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనపై దర్యాప్తును పక్కదారి పట్టించేలా అటు ముఖ్యమంత్రి, ఇటు డీజీపీ ఇద్దరూ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఈ కేసు విచారణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో లేని స్వతంత్ర సంస్థకు అప్పగించేలా ఆదేశించాలంటూ వైఎస్సార్ సీపీ తరఫున పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కూడా

మిగతా 2వ పేజీలో ▶



రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మీద హత్యాయత్నం జరిగిన తర్వాత నిందితుడి స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం ఠానేలంకతో పాటు హత్యాయత్నం జరిగిన విశాఖపట్నంలో 'సాక్షి' బృందం విస్తృతంగా పరిశోధన చేసింది. విపక్ష నేత మీద జరిగిన హత్యాయత్నంలో నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావును 'ఇన్‌స్ట్రుమెంట్'గా కుట్ర సూత్రధారులు వాడుకున్నారని తేలింది. ప్రతిపక్ష నేతను అంతమొందించిన తర్వాత (సూత్రధారులు అనుకున్నట్లుగా జరగలేదు. ఒకవేళ జరిగి ఉంటే..) కుట్రలో ఇన్‌స్ట్రుమెంట్‌గా వాడిన శ్రీనివాసరావును మాత్రమే చట్టం ముందు నిలబెట్టి, తామంతా సురక్షితంగా బయటపడటానికి సూత్రధారులు పకడ్బందీగా ప్రణాళిక రూపొందించినట్లు 'సాక్షి బృందం' పరిశోధనలో స్పష్టమైంది. అందుకు తగిన ఆధారాలూ లభించాయి. సూత్రధారుల ప్రణాళిక ప్రకారం.. అసలు కుట్రదారుల జోలికి వెళ్లకుండా దర్యాప్తును కేవలం నిందితుడు శ్రీనివాసరావుకే పరిమితం చేసినట్లు బుధవారం విశాఖపట్నం పోలీసు కమిషనర్ వెల్లడించిన విషయాలు.. 'సాక్షి'కి లభించిన ఆధారాలకు బలం చేకూర్చాయి. పది రోజులపాటు 'సాక్షి' బృందం విస్తృతంగా తిరిగి.. ఇటు ఠానేలంక అటు విశాఖలో వందల మందిని కలిసింది. కేసుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్నవారు, ఠానేలంకలోని నిందితుని మిత్రులు, బంధువులు, ఇరుగుపొరుగు వారు, ఊళ్లోని పరిచయస్తులు, విశాఖపట్నం విమానాశ్రయంలో వివిధ స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది, ఉద్యోగులు, అధికారులు, వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిట్ బృందంలోని అధికారులు, సిబ్బంది, విమానాశ్రయం పోలీస్‌స్టేషన్ సిబ్బంది.. ఇలా వందల మందితో మాట్లాడి వివరాలు సేకరించింది. కొంతమంది తమకు తెలిసిన వివరాలు చెప్పారు. ఇంకొంతమంది తమకున్న అనుమానాలు వెలిబుచ్చారు. లాజిక్‌కు అందని ఎన్నో ప్రశ్నలను మా ముందు ఉంచారు. వారి చెప్పిన వివరాలు.. వ్యక్తంచేసిన అనుమానాలు, అడిగిన ప్రశ్నలను పాఠకుల ముందు 'సాక్షి' ఉంచుతోంది.

- వివరాలు 8,9లో



విచారిస్తేనే నిజాల నిగ్గుతేలేది

- జగన్‌పై హత్యాయత్నం కేసులో ఎన్‌ఐఏ విచారణపై సర్వత్రా ఆసక్తి
- సీఎం, డీజీపీ ప్రకటనల వెనుక మర్మమేమిటో?
- కుట్రదారులను కాపాడేందుకు ఉన్నతస్థాయిలో ప్రయత్నాలు

- వివరాలు 2లో



రైల్వేలో కొత్త పోస్టులు 13,847

- నోటిఫికేషన్ జారీ

7లో

నాతో పెట్టుకుంటే ఫినిష్



కాకినాడ జన్మభూమిలో తనను అడ్డుకున్న మహిళలపై సీఎం ఫైర్

"లేనిపోని ప్రాబ్లమ్స్ పెట్టుకోవద్దు ఇక్కడ..
పెట్టుకుంటే మీరు ఫినిష్ అయిపోతారు
మర్యాదగా ఉండు..
చాలా సమస్యలు వస్తాయి..
ఢిల్లీలో నిన్న కూడా లాఠీ చార్జీ చేశారు.
ఈ నీళ్లు తాగుతున్నారు.. ఈ గడ్డ మీద ఉన్నారు... ఏయ్ ఉండండీ.. నేను అడిగింది చెప్పు..
ఏం చేశారు మీ మోదీ.. ముంచాడు
అందరినీ.. రాష్ట్రాన్నీ, దేశాన్ని...
బయటకు వస్తే వదలరు.. మిమ్మల్ని పబ్లిక్...
ఏమన్నా ఉందా మీకు కొంచెమైనా..?

- కాకినాడ జన్మభూమిలో తనను అడ్డుకున్న మహిళలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం

- వివరాలు 4లో

నీరు, నేల సాక్షిగా స్వాహా పర్వం

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల ముసుగులో యథేచ్ఛగా చంద్రబాబు ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతోంది. పోలవరం మొదలు అన్ని ప్రాజెక్టుల్లోనూ అవినీతి తాండవం చేస్తోంది. అంచనాల పెంపుతో కాంట్రాక్టర్లకు దోచి పెడుతోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఎండగడుతూనే ఉన్నారు. తాము అధికారంలోకి రాగానే నవరత్నాల పేరుతో ఓ బృహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. అందులో భాగంగా జలయజ్ఞానికి పెద్దపీట వేశారు. దీన్ని నిర్విఘ్నంగా పూర్తి చేసి రాష్ట్రాన్ని సుభిక్షం చేసే సమర్థత.. ప్రణాళిక ఒక్క వైఎస్ జగన్‌కే ఉన్నాయని సాగునీటి రంగ నిపుణులు, రైతు సంఘాల నేతలు, రైతులు స్పష్టీకరిస్తున్నారు.

- ఫ్యామిలీలో





రేపు ఆదివారం సంచికతో పాటు 'ఫన్‌డే' మ్యాగజైన్‌కు బదులుగా క్యాలెండర్ స్పెషల్‌గా ఇస్తున్నాము. గమనించగలరు.

'రఫేల్'పై మళ్లీ రచ్చ

- లోక్‌సభలో వాడివేడి చర్చ.. ప్రధాని నోరు విప్పాలన్న కాంగ్రెస్
- ముడుపులు ముట్టనందుకే ఒప్పందానికి అడ్డుపడ్డ యూపీయే..
- బోఫోర్స్‌తో మునిగిన కాంగ్రెస్.. రఫేల్‌తో మోదీకి తిరిగి అధికారం
- కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్



రఫేల్ ఒప్పందం మీకు నచ్చలేదు. దాని నుంచి మీకు ఎలాంటి ముడుపులు రాలేదు. అందుకే, ఓ వైపు వైమానిక దళం ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కీలకమైన రఫేల్ ఒప్పందాన్ని చాలా రోజుల పాటు అడ్డుకున్నారు. కాంగ్రెస్ ఒప్పందాల్లో క్యూ(ఖత్రోచి), ఆర్‌వీ (రాబర్ట్ వాద్రా) ఉన్నారు. బోఫోర్స్ ఒక కుంభకోణం. కానీ రఫేల్ ఒక ఒప్పందం.

– నిర్మలా సీతారామన్



2019 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తే రఫేల్ ఒప్పందంపై విచారణ చేపడతాం. దోషుల్ని శిక్షించకుండా వదిలిపెట్టం. రఫేల్‌పై చర్చకు రాకుండా ప్రధాని మోదీ పారిపోతున్నారు. ప్రధాని పార్లమెంట్‌కు రారు. గోవా ముఖ్యమంత్రేమో రఫేల్ ఫైల్స్ తన వద్ద ఉన్నాయని అంటున్నారు. రక్షణ మంత్రి రెండు గంటలు ప్రసంగించినా నా ప్రశ్నలను దాటవేశారు.

– రాహుల్‌గాంధీ

7లో

ఇదండీ సంగతి




రూంను చక్కదిద్దుకోవడం కాదు!
ముందే మిమ్మల్ని మీరు చక్కదిద్దుకుంటే
ఇలా అయ్యేదికాదుగా!

ఏటా 20 ఈఎల్స్ వాడాల్సిందే!

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై ఏడాదిలో 20 ఎర్న్‌డ్ లీవులు (ఆర్జిత సెలవులు) తప్పనిసరిగా వాడుకోవలసి ఉంటుంది. పదవీ విరమణ సమయంలో అదనపు భత్యం కింద వీటిని దాచుకోవడానికి ఇకపై వీలుండదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది.

7లో



ప్రజాసంకల్ప యాత్ర 337 వ రోజు



నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉదయం 7.30 గంటలకు, తురకశాసనం క్రాస్

ముఖ్యాంశాలు


- ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని సోంపేట మండలం పాలవలస, కొర్లాం, బారువ కూడలి, లక్కవరం క్రాస్ ప్రజలతో మమేకం

విచారిస్తేనే నిజాల నిగ్గుతేలేది

- జగన్‌పై హత్యాయత్నం కేసులో ఎన్‌ఐఏ విచారణపై సర్వత్రా ఆసక్తి
- సీఎం, డీజీపీ ప్రకటనల వెనుక మర్మమేమిటో?
- కుట్రదారులను కాపాడేందుకు ఉన్నతస్థాయిలో ప్రయత్నాలు

సాక్షి, అమరావతి బ్యూరో: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో కుట్ర కోణాన్ని ఇప్పటికైనా ఛేదిస్తారా? జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) ముందున్న సవాల్ ఇదీ. జగన్‌పై హత్యాయత్నం కేసును పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వ పెద్దలు చేయని ప్రయత్నమంటూ లేదు. సీఎం చంద్రబాబు, డీజీపీ ఠాకూర్, విశాఖపట్నం పోలీసు అధికారులతోపాటు అందరూ రంగంలోకి దిగి తిమ్మిని బమ్మి చేసేందుకు యత్నించారు. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణను చేపట్టిన ఎన్‌ఐఏ ఏం చేయనుందన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. జగన్‌పై హత్యాయత్నం కేసును తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించిన చంద్రబాబుతోపాటు మిగిలిన కీలక పాత్రధారులను విచారిస్తేనే కుట్రకోణం నిగ్గుతేలుతుంది. ఇంతవరకు అంతుచిక్కని ప్రశ్నలకు సమాధానాలు కనుగొనాలంటే ఎన్‌ఐఏ చేయాల్సింది ఏమిటంటే...

చంద్రబాబు వ్యాఖ్యల వెనుక మర్మం?



ప్రతిపక్ష నేత జగన్‌పై హత్యాయత్నం జరిగితే సీఎం చంద్రబాబు బాధ్యతారాహిత్యంగా స్పందించడం వెనుక లోగుట్టు ఏమిటన్నది ఛేదించాలి. కనీసం పోలీసుల ప్రాథమిక విచారణ కూడా ముగియకముందే జగన్‌పై హత్యాయత్నం సానుభూతి కోసమేనంటూ ఎంతో హేళనగా చంద్రబాబు తేల్చేశారు. హత్యాయత్నం అనంతరం విశాఖపట్నం విమానాశ్రయంలోనే ప్రథమ చికిత్స చేయించుకుని జగన్ హైదరాబాద్‌కు బయలుదేరారు. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా హాస్పిటల్‌కు వెళ్లి పూర్తిస్థాయిలో చికిత్స తీసుకున్నారు. వాస్తవం ఇలా ఉంటే... చంద్రబాబు మాత్రం పూర్తిగా అవాస్తవాలను ప్రచారంలోకి తెచ్చేందుకు ఆరాటపడ్డారు. ''జగన్ హైదరాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా తమ ఇంటికి వెళ్లారు. ఢిల్లీ నుంచి ఫోన్ ద్వారా సూచనలు అందిన తర్వాతే ఆసుపత్రికి వెళ్లి అడ్మిట్ అయ్యారు'' అని నిస్సిగ్గుగా అబద్ధాలు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అధినేతగా ఆ విధంగా వ్యాఖ్యానించడం ద్వారా పోలీసుల విచారణను ఆయన ప్రభావితం చేశారు. పోలీసు వ్యవస్థను అంతగా ప్రభావితం చేసేందుకు చంద్రబాబు ఎందుకు ప్రయత్నించారన్నది కీలకంగా మారింది. చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లకు సన్నిహితుడైన టీడీపీ నేత హర్షవర్ధన్ చౌదరికి చెందిన రెస్టారెంట్‌లోనే నిందితుడు శ్రీనివాసరావు కొన్నాళ్లుగా పని చేస్తుండటం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. హత్యాయత్నం వెనుక ఉన్న సూత్రధారులను రక్షించేందుకే చంద్రబాబు పోలీసులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారా? అన్న సందేహాలు బలపడుతున్నాయి.

కుట్ర కోణాన్ని ఎందుకు చేర్చలేదు?

ప్రతిపక్ష నేతపై జరిగిన హత్యాయత్నం కేసులో కుట్రకోణాన్ని విశాఖపట్నం పోలీసులు ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. కేవలం హత్యాయత్నం అభియోగాల కింద సెక్షన్ 307 ప్రకారం నిందితుడు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశారు. కానీ ఈ హత్యాయత్నం వెనుక కుట్ర ఏమిటి? సూత్రధారులు ఎవరు అన్నది విచారించాలి అంటే సెక్షన్ 120–బి కింద కూడా కేసు నమోదు చేయాలి. కానీ, పోలీసులు అలా చేయలేదు. హత్యాయత్నం వెనుక కుట్రదారులను రక్షించేందుకు ప్రభుత్వ పెద్దల సూచనలతోనే ఈ సెక్షన్‌ను చేర్చలేదు. దీనిపై నిజాలు వెలుగులోకి రావాలంటే విశాఖపట్నం సీపీ లడ్హా, 'సిట్' అధికారులు విచారించాల్సిన అవసరం ఉంది.

'గరుడ పురాణం' చెప్పించిందెవరు?

రాష్ట్రంలో ప్రతిపక్ష నేతపై హత్యాయత్నం జరుగుతుందని సినీ నటుడు శివాజీ కొన్ని నెలల క్రితమే 'ఆపరేషన్ గరుడ' పేరుతో ఓ కథ వినిపించారు. ఆయన చెప్పినట్టుగానే ప్రతిపక్ష నేత జగన్‌పై హత్యాయత్నం జరిగింది. ఈ సంగతి శివాజీకి ముందే ఎలా తెలిసింది? కుట్రదారులతో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం ఏమిటి? నిజంగా ఆయనకు అలాంటి కుట్ర సమాచారం తెలిస్తే పోలీసులు ఫిర్యాదు చేసి ఆ హత్యాయత్నాన్ని అడ్డుకునేందుకు ఎందుకు ప్రయత్నించలేదు? ఆ హత్యాయత్నం కుట్ర సమాచారం ఆయనకు ఎలా తెలిసిందని పోలీసులు ఎందుకు ముందుగానే విచారించి తగిన జాగ్రత్తలు తీసుకోలేదు? కనీసం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగిన అనంతరం అయినాసరే పోలీసులు శివాజీని ఎందుకు విచారించలేదు? సీఎం చంద్రబాబుకు రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితులు వచ్చిన ప్రతిసారి శివాజీ ఆయనను సమర్థిస్తూ ఎందుకు తెరపైకి వస్తున్నారు? ఇవన్నీ ఈ కేసు విచారణలో అత్యంత కీలకమైనవే.

'ఎన్‌వోసీ'పై దొంగాట



నేర చరిత్ర ఉన్న నిందితుడు శ్రీనివాసరావు విమానాశ్రయంలో అనధికారికంగా ఎలా మాటు వేయగలిగాడన్నది అంతుచిక్కకుండా ఉంది. నిబంధనల ప్రకారం విమానాశ్రయంలో పనిచేసే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులకు ఏరోడ్రోమ్ ఎంట్రీ పర్మిట్(ఏఈపీ) తప్పనిసరిగా ఉండాలి. అందుకోసం పోలీసుల నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) తీసుకుని, సమర్పించాలి. నిందితుడు శ్రీనివాసరావు 'ఎన్‌వోసీ'పై విశాఖపట్నం పోలీసులు మొదటి నుంచీ తప్పుదారి పట్టించే ప్రకటనలే చేశారు. శ్రీనివాసరావు సొంత జిల్లా తూర్పుగోదావరి పోలీసులు ఎన్‌వోసీ ఇచ్చారని మొదట చెప్పారు. తాము ఎన్‌వోసీ ఇవ్వలేదని ఆ జిల్లా పోలీసులు స్పష్టం చేశారు. దాంతో విశాఖపట్నం సీపీ లడ్హా మళ్లీ మాటమార్చారు. విశాఖపట్నం విమానాశ్రయ పోలీస్ స్టేషన్ నుంచి శ్రీనివాసరావు ఎన్‌వోసీ తీసుకున్నారని ప్రకటించారు. ఢిల్లీలోని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ(బీసీఏఎస్) డీజీ కుమార్ రాజేష్‌చంద్ర అసలు విషయం కుండబద్దలు కొట్టారు. శ్రీనివాసరావుకు ఏఈపీ కోసం అతను గానీ, హర్షవర్ధన్ గానీ కనీసం దరఖాస్తు చేయనే లేదని ప్రకటించారు. దాంతో తమకు ఎన్‌వోసీ సమర్పించాల్సిన అవసరమే తలెత్తలేదని కూడా తేల్చిచెప్పారు. అంటే ఏఈపీ గానీ, ఎన్‌వోసీ గానీ లేకుండానే శ్రీనివాసరావు విమానాశ్రయంలో ఏడాదిగా పనిచేస్తున్నాడని స్పష్టమవుతోంది. మరి విశాఖపట్నం విమానాశ్రయ పోలీస్ స్టేషన్ నుంచి ఎన్‌వోసీ జారీ చేశామని విశాఖపట్నం సీపీ లడ్హా ఎలా ప్రకటించారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ హత్యాయత్నం కుట్ర వెనుక ఉన్న పెద్దలను రక్షించేందుకే ఆయన ఉద్దేశపూర్వకంగా ఇలా ప్రకటించారని పోలీసువర్గాలే సందేహం వ్యక్తం చేస్తున్నాయి. ఇక శ్రీనివాసరావు అనధికారికంగా విమానాశ్రయంలో ఏడాదిగా దర్జాగా తిరుగుతుంటే విమానాశ్రయ భద్రతా అధికారులు ఎందుకు పట్టించుకోలేదు? విమానాశ్రయంలో మూడు నెలలుగా సీసీ కెమెరాలు పనిచేయకున్నా సరే ఎవరూ స్పందించనే లేదు. విమానాశ్రయ భద్రతా అధికారి వేణుగోపాల్‌రావుకు రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్‌తో ఉన్న సాన్నిహిత్యమే అందుకు కారణమా? ఈ నేపథ్యంలో ఎన్‌వోసీ మీద తప్పుడు ప్రకటన వెనుక ఉన్న అసలు కథ ఏమిటన్నది నిగ్గుతేలాలి అంటే సీపీ లడ్హాను ఎన్‌ఐఏ విచారించాల్సిన అవసరం ఉంది. శ్రీనివాసరావు అనధికారికంగా విమానాశ్రయంలో చేర్పించడం వెనుక ఉన్న కుట్రకోణాన్ని ఛేదించాలి అది జరగాలంటే భద్రతా అధికారి వేణుగోపాలరావును విచారించాలి.

హర్షవర్ధన్ చౌదరే కీలకం



వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కుట్రలో టీడీపీ నేత హర్షవర్ధన్ చౌదరి పాత్ర అత్యంత కీలకం. సీఎం చంద్రబాబు, లోకేష్‌లతో ఉన్న సాన్నిహిత్యంతోనే ఆయనకు విశాఖపట్నం విమానాశ్రయంలో రెస్టారెంట్ లీజుకు లభించింది. ఈ నేపథ్యంలో హర్షవర్ధన్ తన రెస్టారెంట్‌లో ఏడాది క్రితం పనిలోకి తీసుకున్న శ్రీనివాసరావే జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడటం గమనార్హం. అతన్ని రెస్టారెంట్‌లోకి పనిలోకి ఎలా తీసుకున్నారన్న దానిపై ఇంతవరకు హర్షవర్ధన్ సరైన సమాధానం చెప్పనే లేదు. ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో ఇంతవరకు పోలీసులు హర్షవర్ధన్‌ను సరైన రీతిలో విచారించనే లేదు. ఆయనను విచారిస్తేనే ఈ హత్యాయత్నం వెనుక ఉన్న అసలు కుట్రదారుల బండారం బయటపడుతుంది.

డీజీపీ ఠాకూర్‌ను విచారిస్తేనే...



సక్రమంగా విచారించి దోషులను శిక్షిస్తాం.. సాధారణంగా ఎవరిపైన అయినా హత్యాయత్నం జరిగితే రాష్ట్ర పోలీస్ బాస్ నుంచి సాధారణ ఎస్సై వరకు చెప్పే మాట ఇదీ. కానీ, జగన్‌పై హత్యాయత్నంపై రాష్ట్ర డీజీపీ ఆర్పీ ఠాకూర్ స్పందన అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. సానుభూతి కోసమే జగన్‌పై హత్యాయత్నం చేశారని ఆయన ప్రకటించేశారు. అప్పటికి నిందితుడు శ్రీనివాసరావును ప్రాథమికంగా కూడా విచారించలేదు. రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి బాస్ అయిన డీజీపీ అలా వ్యాఖ్యానించడం ఏదో యాదృచ్ఛికం కాదు. ప్రభుత్వ పెద్దల ప్రమేయంతోనే ఆయన ఉద్దేశపూర్వకంగానే అలా మాట్లాడినట్లు ఆరోపణలున్నాయి. తద్వారా ఈ కేసును విచారిస్తున్న తన కిందిస్థాయి అధికారులు ఏం చేయాలన్న దానిపై డీజీపీ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. అంతగా కేసు విచారణను పక్కదారి పట్టించేందుకు డీజీపీ ఠాకూర్ ఎందుకు యత్నించారన్న దానిపై ఎన్‌ఐఏ దృష్టి సారించాలి. డీజీపీ ఠాకూర్‌ను పూర్తిస్థాయిలో విచారిస్తేగానీ అసలు విషయం బయటపడదు.

లాఠీచార్జ్‌ని ఖండించిన వైఎస్ జగన్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధుకు ఫోన్‌చేసి మద్దతు ప్రకటించిన ప్రతిపక్షనేత

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం ఢిల్లీలో నిరసన ప్రదర్శన చేస్తున్న వామపక్ష పార్టీల కార్యకర్తలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆయన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధుకు ఫోన్ చేసి ప్రత్యేక హోదా ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.

శ్రీనివాస్‌కు రిమాండ్ పొడిగింపు

ఆరిలోవ (విశాఖతూర్పు): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన జె.శ్రీనివాసరావుకు విశాఖ కోర్టు మరో 14 రోజులు రిమాండ్ పొడిగించింది. శుక్రవారం విశాఖ కేంద్ర కారాగారంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జైల్ నుంచే అధికారులు జడ్జి ముందు హాజరు పరిచారు. శ్రీనివాస్‌కు ఈనెల 18 వరకు న్యాయమూర్తి మళ్లీ రిమాండ్ పొడిగించారు. కాగా ఈ కేసు విచారణను హైకోర్టు శుక్రవారం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌ఐఏ)కి అప్పగించి నందున శ్రీనివాస్‌ను రిమాండ్ సమయంలో ఏరోజైనా విజయవాడకు తరలించే అవకాశం ఉందని జైలు అధికారులు తెలిపారు.

ఆ రెండు కేసులూ విశాఖ పరిధిలోనివే

- అరుకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల హత్య కేసు ఎన్‌ఐఏకు అప్పగింత
- తాజాగా జగన్‌పై హత్యాయత్నం కేసు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం : కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల్లో ఒకటైన నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్‌ఐఏ) ఏర్పాటై దాదాపు పదేళ్లు కావస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో గోకుల్‌చాట్, దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన బాంబు పేలుళ్ల అనంతరం ఈ సంస్థను ఏర్పాటు చేశారు. ఆ కేసును ఎన్‌ఐఏ సమర్థవంతంగా విచారించి, దోషులకు శిక్ష పడేలా చేసింది. ఏదైనా కుట్రకేసుకు సంబంధించిన నెట్‌వర్క్ వివిధ రాష్ట్రాలు, వివిధ దేశాల వరకు విస్తరించి ఉంటే అలాంటి కేసులను ఎన్‌ఐఏకు అప్పగిస్తారు. టాడా చట్టం స్థానంలో తీసుకొచ్చిన అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్టు(యూఏపీఏ) కింద నమోదైన కేసులను కూడా ఎన్‌ఐఏకు అప్పగిస్తారు. జాతీయ, అంతర్జాతీయ భద్రతతో ముడిపడి ఉన్న కేసులను ఎన్‌ఐఏ విచారిస్తుంది. ఈ సంస్థకు ఆయా రాష్ట్రాల రాజధానుల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులుంటాయి. మన రాష్ట్రానికి సంబంధించి విజయవాడలో ఎన్‌ఐఏకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్‌కోర్టు ఉంది. కాగా ఎన్‌ఐఏ కార్యాలయం ఇంకా హైదరాబాద్‌లోనే కొనసాగుతోంది.

విశాఖలో తాత్కాలిక కార్యాలయం?

ఎన్‌ఐఏకు అప్పగించే ఏ కేసులోనైనా సరే అప్పటివరకు ఏ కోర్టు పరిధిలో విచారణ జరిగినా.. కోర్టు ప్రొసీడింగ్స్ పూర్తిగా ఎన్‌ఐఏ ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు బదలీ చేస్తారు. మామూలుగా ఏ కేసులోనైనా కేసు తీవ్రను బట్టి జ్యుడీషియల్ రిమాండ్ గడువు 90 రోజులకు మించి ఉండదు. ఆ తర్వాత బెయిల్ ఇచ్చి తీరాల్సిందే. కానీ, ఎన్‌ఐఏ పరిధిలోకి వచ్చే కేసుల్లో నిందితులకు 180 రోజులకు బెయిల్ ఇచ్చే అవకాశం ఉండదు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా ఎన్‌ఐఏ విచారిస్తున్న రెండు కేసులు విశాఖ జిల్లా పరిధిలో జరిగినవే కావడం గమనార్హం. 2018 సెప్టెంబర్ 23వ తేదీన డుంబ్రిగుడ మండలం లివిటిపుట్టు వద్ద అరుకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమను మావోయిస్టులు హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసు తదుపరి విచార ణను కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆదేశాలతో డిసెంబర్ 14వ తేదీన ఎన్‌ఐఏకు అప్పగించారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై గత ఏడాది అక్టోబర్ 25వ తేదీన జరిగిన హత్యాయత్నం కేసును హైకోర్టు ఆదేశాలతో తాజాగా ఎన్‌ఐఏకు అప్పగించారు. విశేషం ఏమిటంటే.. ఈ రెండు కేసుల విచారణ కోసం ప్రభుత్వం తొలుత 'సిట్'ను ఏర్పాటు చేసింది. ఈ రెండు 'సిట్'కు తొలుత సీనియర్ ఐపీఎస్ అధికారి ఫకీరప్ప నాయకత్వం వహించడం గమనార్హం. విశాఖ జిల్లాలోనే రెండు కేసుల విచారణ చేపట్టిన ఎన్‌ఐఏ ఇక్కడ తాత్కాలికంగా కార్యాలయం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జగన్‌పై హత్యాయత్నం కుట్ర నిగ్గు తేలాల్సిందే : ఉమ్మారెడ్డి



సాక్షి, హైదరాబాద్: వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం కుట్రలో భాగస్వాములెవరో నిగ్గుతేలాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, శాసనమండలిలో ప్రతిపక్షనేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకుతున్న నేపథ్యంలో అడ్డదారుల్లో గెలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాన ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగితే చంద్రబాబు మానవత్వం లేకుండా మాట్లాడారని, ఇలాంటి మనస్తత్వం ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి పదవికి అనర్హుడన్నారు. హత్యాయత్నం కేసును ఎన్‌ఐఏకు అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వాస్తవాలు బయటకి వస్తే అసలు కుట్రదారులు ఎవరో ప్రజలకు తెలుస్తుందన్నారు. ప్రతిపక్షనేతపై దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగానే ప్రజలు భావించారని, దాడి జరిగిన గంటలోపే డీజీపీ ఎలాంటి విచారణ చేయకుండా కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేయడం దారుణమని దుయ్యబట్టారు. అలిపిరిలో చంద్రబాబుపై దాడి జరిగితే అప్పటి ప్రతిపక్షనేత వైఎస్ వెళ్లి గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్షలో పాల్గొన్నారని గుర్తుచేశారు. హై సెక్యూరిటీ ఉన్న చోట దాడి జరిగితే ఎవరు విచారణ చేయాలో డీజీపీకి తెలియదా? అని నిలదీశారు. ఇంత జరిగితే సీఎం కనీసం ఫోన్‌లో కూడా జగన్‌ను పరామర్శించకపోవడం ఆయన మనస్తత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు.

7 నుంచి 18 వరకు హైకోర్టుకు సెలవులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఈ నెల 7వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. 21వ తేదీన హైకోర్టు పునఃప్రారంభమవుతుంది. సంక్రాంతి సెలవుల్లో అత్యవసర కేసులను విచారించేందుకు వెకేషన్ బెంచీలను ఏర్పాటు చేశారు. జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి, జస్టిస్ ఎం.గంగారావులు వెకేషన్ కోర్టు జడ్జీలుగా వ్యవహరిస్తారు. వీరిలో జస్టిస్ శేషసాయి, జస్టిస్ గంగారావులు ధర్మాసనంలో ఉంటారు. జస్టిస్ సత్యనారాయణమూర్తి సింగిల్ జడ్జిగా కేసులను విచారిస్తారు. వెకేషన్ కోర్టుల్లో కేసులు దాఖలు చేయాలనుకునేవారు 9వ తేదీన దాఖలు చేయాల్సి ఉంటుంది. వాటిని న్యాయమూర్తులు 11వ తేదీన విచారిస్తారు.

ఎన్‌ఐఏకు అప్పగింత

▶ మొదటి పేజీ తరువాయి

పిటిషన్ దాఖలు చేశారు.

ఉమ్మడి హైకోర్టు ఆదేశమిదీ...

ఈ వ్యాజ్యాలన్నింటిపై ఉమ్మడి హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా పౌర విమానయాన భద్రతా చట్టం, ఎన్‌ఐఏ చట్ట నిబంధనలను పరిశీలించిన ఉమ్మడి హైకోర్టు ధర్మాసనం.. వైఎస్ జగన్‌పై హత్యాయత్నం ఘటన ఎన్‌ఐఏ చట్టంలో పేర్కొన్న నేరాల కిందకు వస్తుందో రాదో వెల్లడించాలని డిసెంబర్ 14న కేంద్ర హోంశాఖను ఆదేశించింది. ఎన్‌ఐఏ దర్యాప్తునకు ఆదేశించే విషయంలో కేంద్ర ప్రభుత్వమేనని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్‌ఐఏ దర్యాప్తునకు ఆదేశించే విషయంలో నిర్ణయం తీసుకుంటే ఆ వివరాలను తమ ముందుంచాలంటూ తదుపరి విచారణను జనవరి 4కి వాయిదా వేయడం తెలిసిందే.

విభజనతో ఏపీకి బదిలీ అయిన వ్యాజ్యాలు..

ఈలోపు ఉమ్మడి హైకోర్టు విభజన జరగడంతో ఈ వ్యాజ్యాలన్నీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యాయి. శుక్రవారం వీటిపై జస్టిస్ ఎస్.వి.భట్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఏఎస్‌జీ లక్ష్మణ్ వాదనలు వినిపిస్తూ వైఎస్ జగన్‌పై విశాఖ విమానాశ్రయంలో హత్యాయత్నం ఘటనపై దర్యాప్తు జరపాలని ఎన్‌ఐఏను ఆదేశిస్తూ కేంద్ర హోంశాఖ డిసెంబర్ 31న ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. వీటి ఆధారంగా ఎన్‌ఐఏ జనవరి 1వతేదీన ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసిందని చెప్పారు. కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు, ఎన్‌ఐఏ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను ఆయన ధర్మాసనం ముందుంచారు.

కేంద్రం అధికార పరిధి దాటి ఉత్తర్వులిచ్చింది...

ఈ సమయంలో రాష్ట్ర అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వం తన అధికార పరిధిని దాటి ఈ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వును సవాలు చేస్తే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. దీనిపై ధర్మాసనం జోక్యం చేసుకుంటూ... 'కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ ఉత్తర్వులను సవాలు చేసే విషయంలో ఉన్న హక్కులను ఉపయోగించుకోవాలా లేదా అన్నది రాష్ట్ర ప్రభుత్వ ఇష్టం. ఈ వ్యాజ్యాలన్నింటిలో ప్రధాన అభ్యర్థన దర్యాప్తును ఎన్‌ఐఏకి అప్పగించాలనే. ఇప్పుడు కేంద్రం ఈ కేసును ఎన్‌ఐఏకి అప్పగించింది. కేంద్రం ఉత్తర్వుల మేరకు ఎన్‌ఐఏ ఎఫ్ఐఆర్‌ను కూడా నమోదు చేసింది. కాబట్టి ఈ వ్యాజ్యాల్లో ఇకపై విచారించేందుకు ఏమీ ఉండదు. అందువల్ల వాటిని మూసేస్తున్నాం' అని స్పష్టం చేసింది.

ఉత్తర్వుల్లో అన్ని విషయాలను ప్రస్తావించిన ధర్మాసనం...

ఆ వెంటనే హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులను వెలువరిస్తూ కేంద్రం ఇచ్చిన ఆదేశాలు, అందుకు అనుగుణంగా ఎన్‌ఐఏ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ గురించి ప్రస్తావించింది. కేంద్రం ఆ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన విషయాన్ని కూడా ప్రస్తావించింది. అంతేకాకుండా అడ్వకేట్ జనరల్ చెప్పిన విషయాలు, జగన్ తరఫు న్యాయవాది నవీన్ ప్రస్తావించిన అంశాలను కూడా అందులో పొందుపరిచింది. పిటిషనర్ల అభ్యర్థన మేరకు కేంద్రం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ వ్యాజ్యాల్లో తదుపరి విచారణ అవసరం లేదని, అందువల్ల వాటిని మూసివేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

సెక్షన్ 6లో స్పష్టంగా ఉంది..

ఈ సమయంలో వైఎస్ జగన్ తరఫు న్యాయవాది నవీన్‌కుమార్ స్పందిస్తూ.. ఈ వ్యవహారంలో ఇకపై దర్యాప్తు చేయకుండా స్థానిక పోలీసులను నియంత్రిస్తూ, ఎన్‌ఐఏకి దర్యాప్తును అప్పగించేలా ఆదేశించాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. దీనికి ధర్మాసనం బదులిస్తూ.. ఎన్‌ఐఏ చట్టం సెక్షన్ 6ని ఒకసారి చదవాలని నవీన్‌కు సూచించింది. ఈ సెక్షన్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఏ పోలీసు అధికారి కూడా దర్యాప్తు విషయంలో ముందుకెళ్లడానికి వీల్లేదని, వెంటనే కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు, రికార్డులను ఎన్‌ఐఏకు అప్పగించాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. నిబంధనలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు ఈ విషయంలో తమ నుంచి తదుపరి ఆదేశాలు అవసరం లేదని పేర్కొంది.

శిక్షార్హమైన నేరమే

- వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తును ఎన్‌ఐఏకు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు
- పౌర విమానయాన చట్టం సెక్షన్ 3ఏ(1)(ఎ) ప్రకారం శిక్షార్హమైన నేరమే

సాక్షి, న్యూఢిల్లీ: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం కేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)కి అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ పరిధిలోని కౌంటర్ టెర్రరిజం అండ్ కౌంటర్ రాడికలైజేషన్ డివిజన్ (సీటీసీఆర్) డిసెంబరు 31న ఉత్తర్వులు జారీ చేసింది. 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం ఘటనకు సంబంధించి విశాఖ ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది అక్టోబర్ 25వ తేదీన ఐపీసీ 307 సెక్షన్ కింద నమోదైన ఎఫ్ఐఆర్‌పై కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. ఈ ఘటన పౌర విమానయాన చట్టం 1982 సెక్షన్ 3 ఏ (1)(ఏ) ప్రకారం శిక్షార్హమైన నేరం. జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం 2008 షెడ్యూల్ ప్రకారం కూడా నేరమే. ఘటన తీవ్రత దృష్ట్యా దీనిపై ఎన్‌ఐఏ దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉంది. ఎన్‌ఐఏ చట్టం 2008 సెక్షన్–6 (సెక్షన్–8తోపాటు చదివినప్పుడు)లోని ఉప సెక్షన్ (5) ద్వారా సంక్రమించిన అధికారాలతో ఈ కేసును దర్యాప్తు చేయాల్సిందిగా ఎన్‌ఐఏను ఆదేశిస్తున్నాం' అని కేంద్ర హోంశాఖ తరఫున ధర్మేందర్‌కుమార్ పేరుతో జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'సెక్షన్ 3 ఏ (1)(ఏ)' ఏం చెబుతోంది?

సెక్షన్ 3 ఏ: ఎయిర్‌పోర్టు వద్ద నేరానికి పాల్పడం.

(1): ఎవరైనా, ఏ ఎయిర్ పోర్టు వద్ద అయినా చట్ట వ్యతిరేకంగా, ఉద్దేశపూర్వకంగా, ఏదైనా సాధనాన్ని, ఆయుధాన్ని, పదార్థాన్ని వినియోగించడం.

(ఏ): హింసాత్మక చర్యకు పాల్పడడం ద్వారా తీవ్రంగా బాధించడం లేదా వ్యక్తి మృతి చెందేందుకు కారణం కావడం.

కేంద్ర హోంశాఖ ఉత్తర్వుల సారాంశం ఇదీ..



ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎయిర్‌పోర్టులో జరిగిన హత్యాయత్నం ఘటనపై ఐపీసీ సెక్షన్ 307 (హత్యాయత్నం) కింద విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్‌లో 2018 అక్టోబర్ 25వ తేదీన నమోదైన ఎఫ్ఐఆర్ 648/2018కి సంబంధించిన సమాచారం కేంద్ర ప్రభుత్వానికి అందింది.

ఈ ఘటన సప్రెషన్ ఆఫ్ అన్ లాఫుల్ యాక్ట్స్ ఎగనెస్ట్ సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ యాక్ట్ 1982లోని సెక్షన్ 3ఎ(1)(ఎ) కింద శిక్షార్హమైంది. అది జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) చట్టం ప్రకారం షెడ్యూల్డ్ నేరం.

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) చట్టం ప్రకారం షెడ్యూల్డ్ నేరం జరిగితే, ఆ నేరం తీవ్రమైనది అయితే దానిపై చట్ట ప్రకారం ఎన్‌ఐఏ దర్యాప్తు జరపాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడుతోంది.

కాబట్టి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) చట్టం సెక్షన్ 6 (5), రెడ్‌విత్ సెక్షన్ 8 కింద దఖలుపడ్డ అధికారాల ప్రకారం ఈ కేసు దర్యాప్తును చేపట్టాలని ఎన్‌ఐఏను కేంద్ర ప్రభుత్వం ఆదేశిస్తోంది.

ఎన్‌ఐఏ ఎఫ్ఐఆర్‌లో ముఖ్యాంశాలు...

ఎఫ్ఐఆర్ 1/2019. తేదీ 01.01.2019. భారతీయ శిక్షా స్మృతి సెక్షన్ 307, పౌర విమానయాన భద్రతా చట్టం 1982 సెక్షన్ 3ఎ(1)(ఎ).

25.10.2018న విశాఖ విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కత్తితో దాడి జరిగింది. నిందితుడిని జె. శ్రీనివాసరావుగా గుర్తించారు. వయసు 29/30. తండ్రి జె.తాతారావు. తూర్పు గోదావరి జిల్లా ముమ్మడివరం మండలం ఠానేలంక గ్రామ నివాసి. విశాఖ విమానాశ్రయంలోని ఫ్యూజన్ ఫుడ్స్‌లో సర్వీస్ బాయ్. ఇండిగో విమానంలో హైదరాబాద్ వెళ్లేందుకు జగన్‌మోహన్‌రెడ్డి తన పార్టీ నాయకులతో కలిసి వీఐపీ లాంజ్‌లో కూర్చొని ఉన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి టీ అందజేసే నిమిత్తం నిందితుడు శ్రీనివాసరావు వీఐపీ లాంజ్‌లోకి ప్రవేశించి తనతో సెల్ఫీ దిగాలని కోరారు. శ్రీనివాసరావు విన్నపాన్ని మన్నించిన జగన్‌మోహన్‌రెడ్డి సెల్ఫీ నిమిత్తం నిందితుడికి దగ్గరగా వచ్చారు. ఆ వెంటనే జగన్‌పై శ్రీనివాసరావు కత్తితో దాడి చేశారు. దీనికి సంబంధించి ఐపీసీ సెక్షన్ 307 కింద విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్‌లో 25.10.2018న ఎఫ్ఐఆర్ 648/2018 నమోదైంది. విశాఖ విమానాశ్రయ భద్రతాధికారి, సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ దినేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు మొదలైంది. కేంద్ర హోంశాఖ నుంచి హైదరాబాద్, ఎన్‌ఐఏ పీఎస్‌కు సమాచారం అందింది. 01.01.2019న సాయంత్రం 5.59కి జీడీ ఎంట్రీ 76 జరిగింది. హైదరాబాద్ ఎన్‌ఐఏ/అదనపు ఎస్పీ మహ్మద్ సాజిద్‌ఖాన్‌ను ప్రధాన దర్యాప్తు అధికారి (సీఐఒ)గా ఈ కేసు దర్యాప్తు బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు.

ఎన్‌ఐఏ రాకతో లడ్హాను రంగంలోకి దించిన పెద్దలు




వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటన గురించి విశాఖపట్నం పోలీస్ కమిషనర్ మహేష్‌చంద్ర లడ్హా ఈనెల 2వతేదీన హడావుడిగా విలేకరుల సమావేశం నిర్వహించారు. జగన్‌పై హత్యాయత్నం జరిగిన రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు, డీజీపీ ఠాకూర్ ఏం చెప్పారో లడ్హా కూడా అదే చెప్పారు. సందర్భం లేక పోయినా విలేకరుల సమావేశం నిర్వహించడంపై ఆరోజు సర్వత్రా చర్చ జరిగింది. అదే రోజు ఎందుకు సమావేశం నిర్వహించారనే ప్రశ్నకు ఇప్పుడు సమాధానం దొరికింది. హైకోర్టు ఆదేశాల మేరకు జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటన విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. నిబంధనల ప్రకారం ఈ ఘటన ఎన్‌ఐఏ చట్ట పరిధిలోకి వస్తుంది కాబట్టి దీనిపై దర్యాప్తు జరపాలని ఆదేశిస్తూ డిసెంబర్ 31న ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం అదే రోజు ఆ ఉత్తర్వులను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ తదితరులకు పంపింది. ఎన్‌ఐఏ జనవరి 1 తేదీన ఎఫ్ఐఆర్ నమోదు చేసి అదే రోజు సాయంత్రం 6.45కి విజయవాడ ఎన్‌ఐఏ స్పెషల్ కోర్టుకి, రాష్ట్ర డీజీపీకి కూడా పంపింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి పరిస్థితి అర్థమైపోయింది. కేసు విచారణ తమ చేతుల్లో నుంచి ఎన్‌ఐఏకి వెళ్లిపోయినట్లు తెలియటంతో ప్రభుత్వ పెద్దలు విశాఖ పోలీస్ కమిషనర్ లడ్హాను రంగంలోకి దింపారు. దీంతో జనవరి 2వ తేదీన ఆయన హడావుడిగా విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుడు శ్రీనివాసరావు ప్రచారం కోసమే దాడి చేశాడని, కుట్ర కోణం, ఎవరి ప్రమేయం లేదని ఘటన జరిగిన రోజున చంద్రబాబు, డీజీపీ ఠాకూర్‌లు చెప్పిన విషయాలనే వల్లె వేశారు. వాస్తవానికి ఆ రోజు విలేకరుల సమావేశం నిర్వహించే సందర్భం ఏదీ లేదు. అయితే తమ దర్యాప్తులో ఇదే తేలిందని, ఎన్‌ఐఏ చేసేదేమీ లేదన్న సంకేతాలను పంపేందుకు ఆయన ఈ విలేకరుల సమావేశం నిర్వహించినట్లు పేర్కొంటున్నారు. స్వయంగా హైకోర్టు ఈ కేసును పర్యవేక్షిస్తున్నా, ఈ వ్యవహారం న్యాయస్థానం పరిధిలో ఉందని తెలిసి కూడా ఆయన దర్యాప్తు గురించి మాట్లాడారు. అది కూడా హైకోర్టులో రెండు రోజుల్లో కేసు విచారణకు వస్తుందని తెలిసి కూడా మాట్లాడటం ఇక్కడ గమనార్హం

ఉమ్మడి హైకోర్టు కేంద్రానికి ఏం చెప్పిందంటే?

'వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటన ఎన్‌ఐఏ చట్టంలో పేర్కొన్న నేరాల కిందకు వస్తుందా? రాదా? దీన్ని తేల్చేందుకు మూడు మార్గాలున్నాయి. ఘటనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక తెప్పించుకోవడం ఒకటి. ఇతర మార్గాల ద్వారా అందిన సమాచారం రెండోది. కేంద్ర ప్రభుత్వమే సుమోటోగా (తనంతట తాను) సమాచారం తెప్పించుకోవడం మూడోది. ఈ మూడు మార్గాల్లో ఏదో ఒక దాని ద్వారా సమాచారం అందినప్పుడు నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వమే. ఈ కేసులో వీటి ప్రకారం ఓ నిర్ణయానికి రావాలి'

వైఎస్ జగన్ ఏమన్నారంటే...



'పౌర విమానయాన భద్రతకు వ్యతిరేకంగా జరిగే చట్ట విరుద్ధ కార్యకలాపాలను నిరోధించేందుకు 1982లో చట్టం వచ్చింది. 2008లో జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం వచ్చింది. ఈ చట్టంలోని సెక్షన్ 3, 3 ఏ ప్రకారం, ఏ విమానాశ్రయంలోనైనా ఉద్దేశపూర్వకంగా, చట్ట విరుద్ధంగా ఏదైనా ఆయుధాన్ని, పరికరాన్ని ఉపయోగించినా, హింస ద్వారా ఎవరైనా వ్యక్తిని గాయపరిచినా, హతమార్చినా, ఏదైనా విమానాన్ని నాశనం చేసినా, తీవ్రంగా నష్టపరిచినా, విమానాల రాకపోకలకు ఆటంకం కలిగించినా, విమానాశ్రయం భద్రతకు ప్రమాదంగా పరిణమించినా, బెదిరింపులకు పాల్పడినా అందుకు బాధ్యుడైన వ్యక్తికి జీవిత ఖైదు విధించవచ్చు. ఈ నేరాలపై సెక్షన్ 5 ఏ ప్రకారం కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా కేంద్ర ప్రభుత్వం నియమించిన అధికారి దర్యాప్తు చేయవచ్చు. పౌర విమానయాన భద్రతకు వ్యతిరేకంగా జరిగే చట్ట విరుద్ధ కార్యకలాపాలపై దర్యాప్తు జరిపే పరిధి ఎన్‌ఐఏకు ఉంది. విమానాశ్రయంలో ఏదైనా చట్ట విరుద్ధ కార్యకలాపాలు జరిగినప్పుడు అందుకు సంబంధించిన సమాచారాన్ని స్థానిక పోలీసులు వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలి. ఆ తరువాత ఆ సమాచారాన్ని నివేదిక రూపంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపుతుంది. ఘటన తీవ్రతను బట్టి కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు బాధ్యతలను ఎన్‌ఐఏకు అప్పగించాలా? లేదా? అనేదానిపై స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటుంది. అయితే నాపై (వైఎస్ జగన్) విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం ఘటనకు సంబంధించిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపనే లేదు. విమానాశ్రయాల్లో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఏం చేయాలో చట్ట నిబంధనలు స్పష్టంగా చెబుతున్నాయి.'

దేవాదాయ భూముల కబ్జానే లక్ష్యమా?: ఐవైఆర్



సాక్షి, అమరావతి: నిషిద్ధ భూముల జాబితా నుంచి కొన్ని భూములను సుమోటోగా తొలగించే అధికారం అధికారులకు ఇవ్వడం అక్రమాలకు ఆస్కారం ఇవ్వడమేనని, ఇది చూస్తుంటే ఇంతకుముందే కబ్జా చేసిన ప్రభుత్వ దేవాదాయ భూములను క్రమబద్ధీకరించడమే లక్ష్యంగా కనిపిస్తోందంటూ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ట్వీట్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడటానికి వీటిని నిషిద్ధ రిజిష్టర్లో పొందుపరిచారని, దీనివల్ల క్రయ విక్రయాలకు వీలుండదని, ఈ జాబితా తయారీలో కొన్ని పొరపాట్లు జరిగిన మాట వాస్తవమేనని తెలిపారు. కానీ సుమోటోగా ఈ పట్టిక నుంచి భూములను తీసేసే అధికారం ఇవ్వడం కుంభకోణాలు జరగడానికి ఆస్కారం ఇచ్చినట్లవుతుందని పేర్కొన్నారు. జరుగుతున్న తతంగాన్ని పరిశీలిస్తుంటే కొద్దిమంది బాధితుల ప్రయోజనాల కన్నా కబ్జాలను క్రమబద్ధీకరించుకోవడమే లక్ష్యంగా కనిపిస్తోందని, అప్రమత్తంగా లేకపోతే భవిష్యత్తులో అధికారులు సమస్యలు ఎదుర్కొనే అవకాశాలు ఉంటాయంటూ ఐవైఆర్ ట్వీట్‌లో హెచ్చరించారు.

జగన్ పాదయాత్ర చరిత్రాత్మకం

- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వెల్లడి
- చంద్రబాబు పాలనంతా కుంభకోణాలమయం
- శ్వేతపత్రాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమా?



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్న ప్రజాసంకల్ప యాత్ర నిజంగా చరిత్రాత్మకమని, ఇలాంటి పాదయాత్రను తాను గతంలో ఎన్నడూ చూడలేదు.. వినలేదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ చెప్పారు. వేల కిలోమీటర్లు నడవడం, వందల సభల్లో మాట్లాడడం, కోట్ల మందితో మమేకం కావడం నిజంగా గొప్ప విషయమని అన్నారు. ఇంతటి ప్రజాస్పందన లభిస్తున్న పాదయాత్రను ఇంతవరకు దేశంలో ఏ నాయకుడూ చేయలేదని పేర్కొన్నారు. ఉండవల్లి అరుణ్‌కుమార్ శుక్రవారం విశాఖ జర్నలిస్ట్ ఫోరం(వీజేఎఫ్) ఆధ్వర్యంలో విశాఖపట్నం ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడారు. జగన్ పాదయాత్ర ప్రభావం రానున్న ఎన్నికల్లో కచ్చితంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం వైఎస్సార్‌సీపీకి అనుకూల వాతావరణం ఉందని స్పష్టం చేశారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డిపై ప్రభుత్వంలోని కొందరు చేసిన అవినీతి ఆరోపణలపై తాను ఇప్పటికీ చర్చకు సిద్ధంగా ఉన్నానన్నారు. వారి దగ్గర ఆధారాలు ఉంటే తీసుకు రావాలని, కాదని తాను నిరూపిస్తానని సవాల్ విసిరితే ఎవరూ స్పందించలేదని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసును న్యాయస్థానం ఎన్ఐఏకు అప్పగించడంపై ఉండవల్లి స్పందిస్తూ... ఈ కేసులో 'సిట్' విచారణ సందేహాలకు తావిచ్చిందని, హైకోర్టు ఈ కేసును ఎన్ఐఏకు అప్పగించడం ద్వారా వైఎస్సార్‌సీపీ చేస్తున్న వాదన నిజమని తేలిందని అభిప్రాయపడ్డారు.

అటెండర్‌ను పంపినా చర్చకు సిద్ధం

సీఎం చంద్రబాబు విడుదల చేస్తున్న శ్వేతపత్రాల్లో అసత్యాలే ఉన్నాయని ఉండవల్లి విమర్శించారు. ఆ శ్వేతపత్రాలపై చర్చకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తోందో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వ ప్రతినిధిగా అటెండర్‌ను పంపినా తాము చర్చకు సిద్ధమేనని తేల్చిచెప్పారు. రోజుకో సబ్జెక్టుపై చర్చిద్దామని, చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రాల్లో ఉన్నవి వాస్తవాలే అయితే తన తప్పును ఒప్పుకొని క్షమించమని కోరుతానని తెలిపారు.

మేలో నీళ్లిస్తామంటూ అబద్ధాలు

పోలవరం ప్రాజెక్టు నుంచి మే నెలలో నీరు ఇస్తామని చంద్రబాబు అనడం విడ్డూరంగా ఉందని ఉండవల్లి పేర్కొన్నారు. మేలో గోదావరిలో ఇన్‌ఫ్లో ఉండదని, ఒకవేళ వరదలొచ్చినా గ్రావిటీ ద్వారా నీరివ్వడం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదని తేల్చిచెప్పారు. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తారో రారో తెలియదని, అందుకే నోటికొచ్చిన అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పాలన మొత్తం కుంభకోణాలమయంగా మారిపోయిందని ధ్వజమెత్తారు.

మైండ్ గేమ్ ఆడుతున్న చంద్రబాబు

పవన్ కల్యాణ్ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మైండ్‌గేమ్ ఆడుతున్నారని ఉండవల్లి ఆరోపించారు. నిన్నమొన్నటి వరకు మోదీతో పవన్ జతకట్టాడని ఆరోపించిన ఆయన ఇప్పుడు తనతో కలిసి రావాలని పిలుపునివ్వడం వెనుక మైండ్‌గేమ్ ఉందని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చే అవకాశం లేదన్నారు.



14 నుంచి కొత్తపట్నంలో బీచ్ కబడ్డీ పోటీలు

కొత్తపట్నం: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రకాశం జిల్లా కొత్తపట్నం సముద్ర తీరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు పోటీల నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో కొత్తపట్నం తీరంలోని కళామందిరం వద్ద నిర్వహించనున్న ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.30,116, ద్వితీయ బహుమతి రూ.20,116, తృతీయ బహుమతి రూ.15,116, నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.10,116, రూ.7,116, రూ.5,116 అందించనున్నట్లు తెలిపారు. 16న జరిగే ముగింపు వేడుకల్లో మాజీ మంత్రి బాలినేని, మాజీ జెడ్పీటీసీ లంకపోతు అంజిరెడ్డి చేతుల మీదుగా ఈ నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9848343301 నంబరులో సంప్రదించాలని కోరారు.

వేడుకగా కన్నడ సాహిత్య సమ్మేళనం

ప్రారంభించిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత కంబార

సాక్షి బెంగళూరు: సాంస్కృతిక నగరం ధారవాడ అపురూప సమ్మేళనానికి వేదికైంది. కన్నడ నాడు కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పేలా 84వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం శుక్రవారం ఇక్కడి వ్యవసాయ వర్సిటీలో ఘనంగా ప్రారంభమైంది. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ చంద్రశేఖర్ కంబార సమ్మేళనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పలు తీర్మానాలు చేశారు. మాతృభాషలోనే విద్యా బోధన చేయాలని, కర్ణాటక ఎట్టి పరిస్థితుల్లోనూ విభజన కాకూడదని, రాష్ట్ర భాష, సంస్కృతి, గౌరవాన్ని సంరక్షించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని, అన్ని వ్యవహారాలు కన్నడ భాషలోనే జరగాలని, ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు కన్నడలోనే ప్రాథమిక విద్య ఉండాలని తీర్మానాలు చేశారు.

55 మంది ఒడిశా విద్యార్థులకు కుచ్చుటోపీ

- బీఈడీ పరీక్షలు రాయిస్తామని డబ్బు వసూలు చేసిన సంస్థ
- అడ్మిషన్లే లేవన్న నాగార్జున యూనివర్సిటీ
- ఫీజులు చెల్లించామంటున్న కన్సల్టెంట్ ప్రతినిధి


పోలీసులకు వివరాలు చెబుతున్న విద్యార్థులు

మంగళగిరి: ఓ కన్సల్టెంట్ మాటలు నమ్మిన ఒడిశా రాష్ట్రానికి చెందిన 55 మంది బీఈడీ విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. భువనేశ్వర్‌లోని లక్ష్మీసాగర్ ప్రాంతంలో సిలికాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ అనే కన్సల్టెంట్ సంస్థ నడుస్తోంది. అదే ప్రాంతానికి చెందిన విద్యార్థులను గుంటూరు జిల్లా నరసరావుపేటలోని సాదుల్లా హుస్సేన్ బీఈడీ కాలేజీ ద్వారా పరీక్షలు రాయిస్తామంటూ సిలికాన్ సంస్థ ఒక్కో విద్యార్థి వద్ద రూ.30 వేల చొప్పున ఫీజులు వసూలు చేసింది. వాస్తవానికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ శుక్రవారం బీఈడీ పరీక్షలు నిర్వహించింది. విద్యార్థులంతా ఈనెల 2న కన్సల్టెంట్ మేనేజర్ సందీప్‌తో కలిసి పరీక్షలు రాసేందుకు బయలుదేరి 3న గుంటూరు చేరుకుని బస చేశారు. శుక్రవారం ఉదయం యూనివర్సిటీకి చేరుకున్న విద్యార్థులు అధికారులు చెప్పిన సమాధానంతో విస్తుపోయారు. అసలు ఆ విద్యార్థుల పేర్లతో అడ్మిషన్లే లేవని, మీరు మోసపోయారని చెప్పడంతో అవాక్కయ్యారు. దీనిపై గుంటూరు వచ్చి మేనేజర్ సందీప్‌ను అడిగ్గా నరసరావుపేటకు చెందిన సాదుల్లా హుస్సేన్ బీఈడీ కాలేజీ ద్వారా పరీక్షలు రాయించేందుకు ఫీజులు చెల్లించామని తెలిపాడు. అక్కడికి వెళదామంటూ విద్యార్థులు చెప్పగా, వర్సిటీలో హాల్‌టికెట్లు ఉన్నాయని, తాను ఇప్పిస్తానని పొంతనలేని సమాధానాలు ఇచ్చాడు. మోసపోయామని గ్రహించిన విద్యార్థులు సందీప్‌ను తీసుకుని శుక్రవారం వర్సిటీకి చేరుకున్నారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఏం చేయాలో పాలుపోక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళగిరి రూరల్ పోలీసులు సందీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. భువనేశ్వర్‌లోని సంస్థ మోసం చేసింది కనుక అక్కడ కేసు పెట్టాలని పోలీసులు మాట్లాడడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

అమరావతిలో హైకోర్టు తొలి తీర్పు

- ఏపీబీసీఎల్ ఎంఎఫ్‌ఎల్ హమాలీల సంఘం అప్పీల్ కొట్టివేత
- సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు నిరాకరణ

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతికి తరలివచ్చిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తన తొలి తీర్పును వెలువరించింది. ఆంధ్రప్రదేశ్ బేవరేజ్ కార్పొరేషన్ (ఏపీబీసీఎల్) మద్యం గోడౌన్లలో 40 శాతం మంది హమాలీలను కొత్త గోడౌన్లలో పనిచేసేందుకు అనుమతించాలంటూ హమాలీల సంఘం దాఖలు చేసిన అప్పీల్‌ను హైకోర్టు కొట్టివేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఉమ్మడి హైకోర్టు విభజన అనంతరం ఏపీ హైకోర్టు అమరావతి నుంచి కార్యకలాపాలు మొదలు పెట్టిన తరువాత వెలువడిన తొలి తీర్పు ఇదే కావడం గమనార్హం.

ఇదీ నేపథ్యం

విజయవాడ, గొల్లపూడిలో ఏపీబీసీఎల్ మద్యం గోడౌన్ నిర్వహించింది. ఇందులో పలువురు హమాలీలు పనిచేసేవారు. అనంతరం నిడమానూరులో కొత్త మద్యం గోడౌన్‌ను ఏపీబీసీఎల్ ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో గొల్లపూడి గోడౌన్‌లో పనిచేస్తున్న హమాలీల్లో 40 శాతం మందిని నిడమానూరు గోడౌన్‌లో పనిచేసేందుకు అనుమతించాలని కోరుతూ ఏపీబీసీఎల్ ఐఎంఎఫ్‌ఎల్ హమాలీల సంఘం ఏపీబీసీఎల్‌కు వినతిపత్రం సమర్పించింది. అధికారులు ఈ అభ్యర్థనను తోసిపుచ్చడాన్ని సవాల్ చేస్తూ యూనియన్ అధ్యక్షుడు ఎ.సతీష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో ఈ పిటిషన్‌పై ఉమ్మడి హైకోర్టులో విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ చల్లా కోదండరామ్ పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చారు. దీనిపై సతీష్ దాఖలు చేసిన అప్పీల్ తాజాగా ఏపీ హైకోర్టులో విచారణకు వచ్చింది. కొత్త గోడౌన్‌లో 40 శాతం మంది హమాలీలు పనిచేసేందుకు అనుమతిస్తూ గతంలో సర్క్యులర్ ఇచ్చారని పిటిషనర్ తరఫు న్యాయవాది సురేశ్‌కుమార్ తెలిపారు. అయితే ఆ సర్క్యులర్ కేవలం మానవతా దృక్పథంతోనే ఇచ్చామని ఏపీబీసీఎల్ తరఫు న్యాయవాది నివేదించారు. స్థానిక, స్థానికేతర హమాలీల మధ్య వివాదం చెలరేగి శాంతిభద్రతల సమస్యకు దారి తీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం యూనియన్ తరఫున సతీష్ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

జస్టిస్ బాలయోగికి హైకోర్టు ఘన సన్మానం

- ఈ నెల 14న పదవీ విరమణ
- 18 వరకు సంక్రాంతి సెలవులు
- దీంతో శుక్రవారమే వీడ్కోలు పలికిన హైకోర్టు




జస్టిస్ బాలయోగికి జ్ఞాపికను బహూకరిస్తున్న ఏసీజే జస్టిస్ ప్రవీణ్‌కుమార్.
జస్టిస్ బాలయోగిని ఘనంగా సన్మానిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నక్కా బాలయోగి ఈ నెల 14న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో శుక్రవారం ఆయనకు హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ నెల 7వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు కావడంతో శుక్రవారమే కార్యక్రమం నిర్వహించారు. జస్టిస్ బాలయోగికి వీడ్కోలు పలికేందుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో న్యాయమూర్తులందరూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, రిజిస్ట్రార్ జనరల్, ఇతర రిజిస్ట్రార్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఏసీజే ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థకు జస్టిస్ బాలయోగి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం బాలయోగి మాట్లాడుతూ ఇన్నేళ్ల తన న్యాయప్రస్థానంలో తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి హైకోర్టులో ఉన్నప్పుడు తాను జడ్జి పదవికి రాజీనామా చేశానని, అయితే న్యాయమూర్తుల సంఖ్య తక్కువ ఉన్న నేపథ్యంలో రాజీనామాను ఉపసంహరించుకోవాలని ఉమ్మడి హైకోర్టు సీజే చేసిన సూచన మేరకు రాజీనామాను ఉపసంహరించుకున్నానని ఆయన చెప్పారు. అంతకు ముందు రాష్ట్ర అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రామన్నదొర మాట్లాడారు. జస్టిస్ బాలయోగిని న్యాయవాదుల సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

'నగరాల కులస్తులకు 5 అసెంబ్లీ సీట్లివ్వాలి'

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ పశ్చిమంతో పాటు విశాఖ జిల్లాలోని పెందుర్తి, భీమిలి, విజయనగరం, శ్రీకాకుళం నియోజక వర్గాల్లో నగరాల సామాజిక వర్గానికి చెందిన వారికి సీట్లు కేటాయించాలని ఏపీ నగరాల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడలో నగరాల సంఘం నాయకులు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో తమ సామాజిక వర్గ బలం రాజకీయ నాయకుల గెలుపు ఓటములను నిర్ణయించే స్థాయిలో ఉందని చెప్పారు. సమావేశంలో ఏపీ నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాయన వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి పోతిన వెంకటేశ్వర స్వామి, కాంగ్రెస్ నాయకులు పణుకు శేషులు మాట్లాడారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంతో పాటు మిగిలిన నాలుగు స్థానాల్లో తమ సామాజిక వర్గం బలంగా ఉందని, ఆయా స్థానాల్లో తమ వర్గానికి సీటు ఇచ్చిన పార్టీలకే మద్దతిస్తామని తెలిపారు. దీనిపై నగరాల సంఘం ప్రతినిధులు అన్ని రాజకీయ పార్టీల అధినేతల్ని కలిసి తమ డిమాండ్లు వినిపిస్తారని చెప్పారు. ఫిబ్రవరి 10న విశాఖలో జరిగే ఆత్మీయ సభలో తమ తుది నిర్ణయాన్ని వెల్లడిస్తామని తెలిపారు. నగరాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి దానికి రూ.వంద కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

నాతో పెట్టుకుంటే ఫినిష్

కాకినాడ జన్మభూమి సభలో తనను అడ్డుకున్న మహిళపై చంద్రబాబు ఫైర్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ)/కాకినాడ: ''నాతో పెట్టుకుంటే ఫినిష్ అయిపోతారు జాగ్రత్త'' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తనను అడ్డుకున్న మహిళలను హెచ్చరించారు. శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో నిర్వహించిన 'జన్మభూమి–మా ఊరు' కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి కాన్వాయ్‌ను కాకినాడ ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో అడ్డుకున్నారు. 'సీఎం గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. దీంతో బస్సులో ఉన్న చంద్రబాబు బయటకు వచ్చి మండిపడ్డారు. మీకు ఏం కావాలంటూ రుసరుసలాడారు. తనను అడ్డుకున్న వారికి రాష్ట్రంలో ఉండే అర్హతలేదంటూ ఆగ్రహంవ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి అన్యాయం చేశారని, రాష్ట్రాన్ని మోసం చేసిన మోదీని సమర్థిస్తారా అంటూ ధ్వజమెత్తారు. నినాదాలు చేస్తే ప్రజలు కొడతారంటూ హెచ్చరించారు. బీజేపీకి చెందిన కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్నతో ముఖ్యమంత్రి వాగ్వాదానికి దిగారు. మోదీ ఇచ్చిన నిధుల వివరాలు సీఎంకు ఆమె వివరించే ప్రయత్నం చేస్తుండగా.. ఆయన వినకుండా బస్సు ఎక్కేశారు. కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న వైపు వేలు చూపిస్తూ మర్యాదగా ఉండాలంటూ హెచ్చరించారు. కాన్వాయ్‌ను అడ్డుకున్న బీజేపీ నాయకులను అరెస్టు చేసి సర్పవరం స్టేషన్‌కు తరలించారు.

మోదీ అడ్రస్ గల్లంతు కావడం తథ్యం: వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అడ్రస్ గల్లంతు కావడం తథ్యమని, బీజేపీకి డిపాజిట్లు కూడా రావని చంద్రబాబు అన్నారు. కాకినాడ జేఎన్‌టీయూ మైదానంలో జరిగిన ఆరో విడత జన్మభూమి కార్యక్రమంలో చంద్రబాబు ప్రధాని మోదీపై ధ్వజమెత్తారు. బీజేపీ పాలన అవినీతిమయంగా మారిందని విమర్శించారు.

నాలుగు ఉత్తమ నగరాల్లో ఒకటిగా చేస్తా

రాష్ట్రంలోని నాలుగు ఉత్తమ నగరాల్లో కాకినాడను ఒకటిగా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు చెప్పారు. ఇప్పటికే కాకినాడను స్మార్ట్‌సిటీగా ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు విమర్శలు చేశారు. సీబీఐకి భయపడి జగన్ పార్టీ కేంద్రానికి ఊడిగం చేసేందుకు కూడా వెనుకాడటంలేదని దూషించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్.. జగన్ జపం చేస్తున్నారని అక్కడ జరిగిన ఎన్నికల్లో పంపిణీ చేయగా మిగిలిపోయిన వాటిని ఇక్కడకు పంపుతున్నారని విమర్శించారు.

పవన్ పోరాడాలి..

మోదీ, జగన్‌పై విమర్శలు గుప్పించిన చంద్రబాబు.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కేంద్రంపై పోరాడాలని కోరారు. పవన్ నిజనిర్ధారణ కమిటీలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.75 వేల కోట్ల సహాయం అవసరమని ప్రకటించారని, రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నందున ఆ దిశగా ఆయన పోరాటం చేయాలని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రులు యనమల రామకృష్ణుడు, చినరాజప్ప, అధికారులు పాల్గొన్నారు.

బాబు ప్రసంగం.. వెళ్లిపోయిన జనం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జన్మభూమి సభలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తుండగానే సభికులు వెళ్లిపోయారు. వందల సంఖ్యలో విద్యార్థుల్ని సభకు తరలించారు. ఉదయం 11.20 గంటలకు ప్రారంభం కావల్సిన సభ మధ్యాహ్నం 1.05కు సీఎం వచ్చిన తర్వాత ప్రారంభమైంది. కానీ, కాసేపటికి జనాలు వెళ్లిపోవడం ప్రారంభించారు. వారిని ఆపడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సీఎం ప్రసంగిస్తుండగానే సభా ప్రాంగణం దాదాపు ఖాళీ అయిపోయింది. దీంతో చంద్రబాబు తీవ్ర అసహనానికి లోనైయ్యారని, జన సమీకరణలో విఫలమయ్యారని నేతలపై రుసరుసలాడారని తెలిసింది.

ఎంపీల సస్పెన్షన్ దారుణం

సాక్షి, అమరావతి: ఉండవల్లిలోని తన నివాసం నుంచి శుక్రవారం టీడీపీ ఎంపీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఢిల్లీలో ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులపై జరిగిన లాఠీచార్జిని అందరూ ఖండించాలన్నారు. టీడీపీ ఎంపీల సస్పెన్షన్ దారుణమన్నారు. రెండురోజుల్లో 45 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని, బీజేపీ నేతలకు ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం లేదని, రాజ్యాంగ విలువలపై నమ్మకం లేదని, మంద మెజారిటీతో మూర్ఖంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేంద్రం ప్రభుత్వంపై పోరాటం చేయాలని ఎంపీలకు సూచించారు.

మీ 40 ఏళ్ల అనుభవం ఇదేనా?: కన్నా



సాక్షి, అమరావతి: ఒక మహిళా ప్రజాప్రతినిధిని బహిరంగంగా ఫినిష్ చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు బెదిరించడం చూస్తుంటే ఆయనకు మహిళలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై ఉన్న గౌరవం ఏపాటిదో మరోసారి తేటతెల్లమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పర్యటనలో సీఎం చేసిన వ్యాఖ్యలపై కన్నా ట్విట్టర్‌లో శుక్రవారం స్పందించారు. 'మీ 40 సంవత్సరాల అనుభవం ఇదేనా' అని చంద్రబాబుని ప్రశ్నించారు. వంద రోజుల్లో మీ అవినీతి పాలనకు మహిళలే చరమ గీతం పాడతారని చంద్రబాబుని హెచ్చరించారు. మహిళా ప్రజాప్రతినిధిని ఉద్దేశించి మాట్లాడిన మాటలను ఉపసంహరించుకొని, తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో చంద్రబాబుని డిమాండ్ చేశారు. మహిళలపై బాబు బెదిరింపు ధోరణికి నిరసనగా ఆదివారం అన్ని జిల్లా కేంద్రాల్లో బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

టీడీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పిలుపు



కుమ్మరపల్లెలో నవరత్నాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే

రాయచోటి: ఉపాధి కూలీలకు డబ్బులు ఇవ్వకుండా మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్న టీడీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామంటూ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ జిల్లా రాయచోటి నియోజకవర్గం రామాపురం మండలం కుమ్మరపల్లె పంచాయతీలో శుక్రవారం చేపట్టిన 'నమ్మం బాబూ నమ్మం...నీ పాలనకొక దండం' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 4 నెలలుగా ఉపాధి బిల్లులను ఇవ్వడం లేదని కూలీలు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. ఇదే గ్రామ పరిధిలో నీరు–చెట్టు, ఇతర పనుల పేరుతో కోట్ల రూపాయలను బిల్లులు చేసుకున్నా వేల రూపాయల్లో ఉన్న ఉపాధి కూలీల డబ్బులు చెల్లించకపోవడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ఓట్ల ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఏ గ్రామానికి వెళ్లినా టీడీపీ నాయకుల అవినీతి గురించి బయటకు వస్తోందన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఉపాధి బిల్లుల చెల్లింపుతో పాటు, నవరత్న పథకాల ద్వారా అందే ఫలాల గురించి ఎమ్మెల్యే వివరించారు.

రైతు బజార్లకు ఇక నిధులివ్వం

సాక్షి, అమరావతి: ''రైతు బజార్లలో సర్వీస్, లెవీ చార్జీలు ఉండవు. పండించిన కూరగాయలను రైతులు నేరుగా వినియోగదారులకు అమ్ముకోవచ్చు. ఇందుకు సంబంధించి అన్ని సౌకర్యాలను ఉచితంగా ఏర్పాటు చేస్తాం. నగరాల్లోని పలు ప్రాంతాలు, మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో రైతు బజార్లను ఏర్పాటు చేస్తాం. జిల్లా జాయింట్ కలెక్టర్ల పర్యవేక్షణలో కొనసాగే రైతుబజార్ల అవసరాలకు రూ. 5 లక్షలను అందుబాటులో ఉంచుతాం.'' 1999లో కొత్తగా రైతుబజార్ల వ్యవస్థను ప్రారంభించిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్న అంశాలివి. అయితే రైతు బజారుల నిర్వహణకు అయ్యే ఖర్చులు భరించలేమని ఇప్పుడు ప్రభుత్వం చెబుతోంది. జిల్లాను యూనిట్‌గా తీసుకుని అక్కడి రైతు బజార్ల లాభనష్టాలను భరించాలని ఆదేశాలిచ్చింది. వచ్చే ఏడాది బడ్జెట్‌లో రైతుబజార్ల నిర్వహణకు అసలు నిధుల కేటాయింపు ఉండదని స్పష్టం చేసింది. ఇప్పటి నుంచే రైతు బజార్ల ద్వారా ఆదాయ వనరుల పెంపునకు ఎస్టేట్ అధికారులు దృష్టి కేంద్రీకరించాలంది. సైకిల్ స్టాండ్లు, క్యాంటిన్లను ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇవ్వడం ద్వారా, రైతు బజార్ల ఆవరణలో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సూచించింది.

6 నుంచి డీఎస్సీ సంగీత నైపుణ్య పరీక్షలు

సాక్షి, అమరావతి: డీఎస్సీ–2018 మ్యూజిక్ ఉపాధ్యాయ పోస్టులకు రాత పరీక్ష రాసిన అభ్యర్థులకు జనవరి 6 నుంచి 12 వరకు విజయవాడలోని దుర్గాపురంలోని శ్రీ ఘంటసాల వెంకటేశ్వర ప్రభుత్వ సంగీత కళాశాలలో సంగీత నైపుణ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యా కమిషనర్ కె.సంధ్యారాణి శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు ఏ రోజున సంగీత పరీక్షకు హాజరు కావాల్సి ఉందో వారి రోజువారీ షెడ్యూలును 'సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్'వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. అభ్యర్థులు ఈ వెబ్‌సైట్‌ను సందర్శించి నిర్ణీత రోజున పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుందని..ఆ తేదీల్లో హాజరుకానట్లయితే వేరొక తేదీలో, సెషన్ లో నైపుణ్య పరీక్షకు హజరుకావడానికి వీలులేదని స్పష్టం చేశారు.

కోడి కత్తి కాదు.. నారా వారి కత్తి డ్రామా

- ఎన్‌ఐఏ విచారణలో ఈ విషయం బయటపడుతుంది
- వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ మిథున్‌రెడ్డి
- కేసు నీరుగార్చేందుకు చంద్రబాబు విశ్వప్రయత్నాలు చేశారు
- తెరవెనుక ఉన్నవారి గుట్టురట్టు కోసమే థర్డ్ పార్టీ విచారణ కోరాం



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం కేసును జాతీయ పరిశోధన సంస్థ (ఎన్‌ఐఏ)కు అప్పగించడం శుభపరిణామమని, దీంతో వాస్తవాలు బయటకొస్తాయని ఆశిస్తున్నామని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. ఇది కోడి కత్తి డ్రామా కాదని, నారా వారి కత్తి డ్రామా అనే విషయం విచారణలో బయటపడుతుందని భావిస్తున్నామని చెప్పారు. ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్‌ను చంపించడానికి కుట్ర పన్నిందెవరో బయటకు రాకుండా కేసును నీరుగార్చేందుకు చంద్రబాబు విశ్వప్రయత్నాలు చేశారని విమర్శించారు. ''విపక్ష నేతపై హత్యాయత్నం జరిగిన అరగంటలోపే ఈ కేసు ఏవిధంగా దర్యాప్తు జరపాలో డీజీపీ డిక్టేట్ చేశారు. డీజీపీ ఆదేశాలకు విరుద్ధంగా ఆయన కింద పనిచేసేవారు ఎలా దర్యాప్తు చేస్తారు? ఈ హత్యాయత్నం వెనుక ఎవరూ లేరని, శ్రీనివాస్ అనే వ్యక్తి మాత్రమే ఉన్నారని కోర్టుకు పోలీసులు తెలిపారు. ఇలా చేస్తారని మేం ఊహించే థర్డ్‌పార్టీ విచారణకు డిమాండ్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాం. ఈ నేపథ్యంలో ఈ కేసును కేంద్రం ఎన్‌ఐఏకి అప్పగించింది'' అని చెప్పారు. సీబీఐ, ఆదాయపన్ను శాఖలు ఏపీలో విచారణ జరపడానికి వీల్లేదని అడ్డుకుంటూ చంద్రబాబు ఇప్పటికే జీవోలిచ్చారని, రేపు ఎన్‌ఐఏను కూడా ఆయన సామ్రాజ్యం(రాష్ట్రం)లో విచారణ జరపడానికి వీల్లేదంటూ అడ్డుకునే ప్రయత్నం చేస్తారేమోనని సందేహం వెలిబుచ్చారు.

చిల్లర రాజకీయాలకు నిదర్శనం..

మదనపల్లిలో ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి పంపిణీ చేస్తున్న గడియారాలపై చంద్రబాబు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మిథున్ మండిపడ్డారు. తిప్పారెడ్డి తన సొంత డబ్బుతో గత ఆగస్టు నుంచి తన నియోజకవర్గంలోని ప్రజలకు గడియారాలు పంపిణీ చేస్తున్నారని, అందులో ఒకదాంట్లో తమ పార్టీ బొమ్మ వెనకాల టీఆర్‌ఎస్ బొమ్మ ఉందని, ఇది తయారీదారు వద్ద జరిగిన చిన్న పొరపాటని, అయితే ప్రభుత్వ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టి దీన్ని వీడియో ప్లేచేసి చూపించడం, టీఆర్‌ఎస్‌తో లింకుపెట్టడం చంద్రబాబు చిల్లర రాజకీయాలకు, నీచపు రాజకీయాలకు నిదర్శనమని దుయ్యబట్టారు. ''తిప్పారెడ్డి గుజరాత్‌లో గడియారాల తయారీకి ఆర్డరిచ్చారు. అక్కడ 150 గడియారాల వెనుక పొరపాటున టీఆర్‌ఎస్ గుర్తుపేపర్ పెట్టామని తయారీదారు తెలియజేశారు. దీన్నెలా రాజకీయం చేస్తారు? పరిటాల శ్రీరామ్ వివాహమప్పుడు టీడీపీ నేతలు తెలంగాణ సీఎం ఫ్లెక్సీలు, స్వాగతద్వారాలు ఏర్పాటు చేయడం చంద్రబాబుకు కనిపించలేదా? రాజధాని శంకుస్థాపనకు మీరు (చంద్రబాబు) స్వయంగా కేసీఆర్‌ను ఆహ్వానించలేదా? మీరు కేసీఆర్ యాగానికి వెళ్లలేదా? మరిలాంటప్పుడు తయారీదారు ఒక గడియారంలో చిన్న పొరపాటు చేస్తే రాజకీయం చేయడం నీచం కాదా?'' అని విమర్శించారు. ''ఆంధ్రాలో లూటీ చేసిన డబ్బుతో రేవంత్‌రెడ్డిని బలిపశువును చేయలేదా? హరికృష్ణ చనిపోయిన సందర్భంగా టీఆర్‌ఎస్‌తో పొత్తుకోసం కేటీఆర్‌తో ప్రయత్నించడం నిజంకాదా? మీతో పొత్తుకు ఒప్పుకుంటే టీఆర్‌ఎస్ మంచిది.. లేదంటే చెడ్డదా? ఇదేనా బాబు మార్కు నీతి'' అని నిలదీశారు.

ఒకట్రెండు కులాలతో అధికారం రాదు

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్

సాక్షి, అమరావతి: ఒకట్రెండు కులాలను అడ్డం పెట్టుకొని రాజకీయాల్లో విజయం సాధించలేమని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అన్నారు. కులాల ప్రభావం అధికంగా ఉండే ఉత్తరప్రదేశ్‌లో కూడా కుల రాజకీయాలు విఫలమయ్యాయని చెప్పారు. విజయవాడలోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం తూర్పు గోదావరి, నెల్లూరు జిల్లాల పార్టీ కార్యకర్తలతో పవన్ వేర్వేరుగా సమావేశమయ్యారు. తూర్పుగోదావరి జిల్లా అభిమానుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మనది కులాలతో ముడిపడిన సమాజమని, అయితే, కులాల పేర్లు చెప్పి వ్యక్తులు లాభపడుతున్నారేగానీ, కులాలు బాగుపడట్లేదన్నారు. ప్రజారాజ్యం పార్టీ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జనసేనను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యేలు, ఎంపీలు అయిపోదాం అనుకుంటే సాధ్యమయ్యే పనికాదని, తనను నమ్మి పార్టీలోకి రావాలని సూచించారు. నెల్లూరు జిల్లా అభిమానుల సమావేశంలో.. ఈనెల 9 తర్వాత స్వల్పకాలిక కాలానికి పనిచేసే జనసేన జిల్లా కమిటీని ప్రకటిస్తానన్నారు.

అలిగిన మంత్రి అఖిలప్రియ

తన అనుచరుల ఇళ్లల్లో తనిఖీలు చేయడంపై గుస్సా



చాగలమర్రి మండలంలో భద్రత లేకుండా తిరుగుతున్న అఖిలప్రియ

ఆళ్లగడ్డ: మంత్రి అఖిలప్రియ అలక బూనారు. తన అనుచరుల ఇళ్లల్లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేశారన్న కోపంతో గన్‌మెన్‌లను వెనక్కి పంపించి, నిరసన వ్యక్తం చేస్తున్నారు. తనకు రక్షణగా వస్తున్న స్థానిక పోలీసులను సైతం వెంట రావద్దని పంపించేశారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత ఆళ్లగడ్డలోని వివిధ పార్టీల ద్వితీయ శ్రేణి నేతల ఇళ్లల్లో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. మంత్రి అఖిలప్రియ అనుచరుల ఇళ్లల్లోనూ సోదాలు జరిపారు. దీంతో సదరు వ్యక్తులు మంత్రికి ఫిర్యాదు చేశారు. ఆమె స్థానిక పోలీసులను అడగ్గా.. పై అధికారుల ఆదేశాల మేరకు అనుమానమున్న అందరి ఇళ్లల్లోనూ సోదాలు చేశామని చెప్పారు. తన వర్గీయుల ఇళ్లపైనే ఆకస్మిక దాడులు నిర్వహిస్తారా? అంటూ గురువారం రాత్రి గన్‌మెన్‌లను పిలిచి.. వెళ్లిపోవాలని అఖిలప్రియ ఆదేశించారు. గన్‌మెన్‌లు ఉన్నతాధికారులకు చెప్పగా, వారు మంత్రితో మాట్లాడి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. అయినప్పటికీ శాంతించని మంత్రి ముందు గన్‌మెన్‌లు బయటకు వెళ్లాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. జన్మభూమి–మా ఊరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తోడెండ్లపల్లి, రుద్రవరం మండలం నరసాపురం గ్రామాల్లో సభల్లో మంత్రి అఖిలప్రియ పాల్గొన్నారు. అనంతరం ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న మంత్రికి భద్రత కల్పించేందుకు స్థానిక ఎస్‌ఐలు, పోలీసులు వెంట రావడంతో మంత్రి మరోసారి మండిపడ్డారు. అన్ని పార్టీలకు చెందిన అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో సాధారణ తనిఖీలు నిర్వహించారు. అధికార పార్టీ నేతలు మాత్రమే అసంతృప్తితో ఉండడం గమనార్హం.

సూట్ కేసు కంపెనీలకు వేల ఎకరాలు దారాదత్తం

- హైకోర్టులో తొలి పిల్
- దీనిపై దర్యాప్తునకు ఆదేశించండి
- హైకోర్టులో మాజీ న్యాయాధికారి శ్రావణ్‌కుమార్ పిల్
- విచారణ జరిపిన సీజే ధర్మాసనం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) అర్హత లేని పలు సూట్‌కేసు కంపెనీలకు వేల ఎకరాల భూములను దారాదత్తం చేసిందని, దీనిపై దర్యాప్తునకు ఆదేశించాలని మాజీ న్యాయాధికారి జాడా శ్రావణ్‌కుమార్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటైన తరువాత దాఖలైన తొలి ప్రజా ప్రయోజన వ్యాజ్యం ఇదే. ఈ వ్యాజ్యంపై శుక్రవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి మల్లవోలు సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ శ్రావణ్‌కుమార్ స్వయంగా వాదనలు వినిపిస్తూ, 14,900 ఎకరాల భూమిని ఏపీఐఐసీ పలు సూట్‌కేసు కంపెనీలకు కట్టబెట్టిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దశల వారీగా ఈ భూ పందేరాలు జరిగాయన్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే భూములను నామమాత్రపు ధరలకు అర్హతలు లేని కంపెనీలకు కట్టబెట్టేశారని, దీనివల్ల ఖజానాకు పెద్ద మొత్తం నష్టం వాటిల్లిందని శ్రావణ్ వివరించారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ ఆ కంపెనీలకు అర్హతలు లేవనేందుకు ఆధారాలు ఏమిటని ప్రశ్నించింది. ఈ విషయాలను తన పిటిషన్‌లో పేర్కొన్నానని శ్రావణ్ చెప్పారు. భూములు పొందాలంటే ఏ కంపెనీ అయినా ఉనికిలో ఉండాలన్నారు. అలాగే మూడేళ్ల ఆస్తి, అప్పుల పట్టీలను సమర్పించాల్సి ఉందని వివరించారు. ధర్మాసనం వాటిని పరిశీలించగా, శ్రావణ్ చెబుతున్న పేజీ నంబర్లకు, ధర్మాసనం ముందు వ్యాజ్యాల్లోని పేజీ నంబర్లకు పొంతన కుదరలేదు. పేజీ నంబర్లలో తేడాలు ఉండటంతో వాటిని సరిచూసుకోవాలని శ్రావణ్‌కుమార్‌కు సూచించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేస్తూ ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు పచ్చ జెండా

- మున్సిపల్‌శాఖ నిబంధనలు విడుదల
- ఆగస్టు 2018లోపు అక్రమ కట్టడాలకు అనుమతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు పచ్చజెండా ఊపుతూ రాష్ట్ర మున్సిపల్‌శాఖ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. 1.1.1985 నుంచి 31.08.2018 లోపు నిర్మించిన అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు నిబంధనలతో కూడిన నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి సంబంధించిన గెజిట్ ఈ నెల 7న విడుదల కానుంది. నగరపాలక సంస్థలు, మున్సిపాల్టీలు, పట్టణాభివృద్ధి సంస్థలు, నగరపంచాయతీల పరిధిలోని అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. రూ.10 వేలను ఆన్‌లైన్‌లో అడ్వాన్సుగా చెల్లించి www.bps.ap.gov.inకు దరఖాస్తు చేసుకోవాలి. నోటిఫికేషన్ జారీ తేదీ నుంచి (04.01.2019) 90 రోజుల్లోపు అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి. 1.8.2018 నాటి మార్కెట్ విలువను ఆధారంగా చేసుకుని దరఖాస్తుదారులకు ప్రభుత్వం పెనాల్టీ విధించనుంది. గతంలో బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌లకు దరఖాస్తు చేసిన అభ్యర్థులను ఈ క్రమబద్ధీకరణకు అనర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. మురికివాడల్లోని అక్రమ కట్టడాలను నిర్మించిన వారికి కొంత వెసులుబాటు కల్పించింది. పెనాల్టీ మొత్తంలో 50 శాతం వీరు చెల్లిస్తే సరిపోతుంది. ప్రభుత్వ భూములు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, సీఆర్‌డీఏ, మున్సిపాల్టీలు, వక్ఫ్‌బోర్డు స్థలాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించే అవకాశం లేదన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి దరఖాస్తుల పరిశీలన ప్రారంభం అవుతుందన్నారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైతే ముందుగా కట్టిన రూ.10 వేలల్లో వెరిఫికేషన్ ఫీజు కింద 10 శాతం తగ్గించి మిగిలిన సొమ్ము తిరిగి ఇస్తారు. క్రమబద్ధీకరణ సమస్యల పరిష్కారం కోసం కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ చైర్మన్‌గా ముగ్గురు సభ్యులతో కూడిన అప్పిలేట్ కమిటీని ఏర్పాటు చేసింది.

స్వల్పంగా తగ్గిన చలి

దిశమారిన గాలులు ● పెరగనున్న ఉష్ణోగ్రతలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో చలి ప్రభావం ఒకింత తగ్గనుంది. రానున్న రెండు రోజులు కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు ఒకట్రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది. దీంతో ఇప్పుడున్న శీతల ప్రభావం కాస్త తగ్గుముఖం పట్టనుంది. కొన్నాళ్ల నుంచి కోస్తాంధ్ర, రాయలసీమల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2–4 డిగ్రీలు తక్కువగా రికార్డవుతున్నాయి. దీంతో చలి వణికిస్తోంది. ఇన్నాళ్లూ ఉత్తర గాలులు వీయడం వల్ల చలి తీవ్రత అధికంగా ఉంటోంది. శుక్రవారం నుంచి గాలుల దిశ మారింది. ప్రస్తుతం ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయి. ఇవి స్వల్పంగా ఉష్ణోగ్రతలు పెరగడానికి దోహదపడుతున్నాయి. అలాగే పగటి ఉష్ణోగ్రతలు కూడా ఒకింత పెరగనున్నాయి. ఫలితంగా పగటి పూట ఎండ ప్రభావం పెరగనుంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు రాష్ట్రంలో అత్యల్పంగా ఆరోగ్యవరంలో 11 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

మయన్మార్ వైపు తుపాను: థాయ్‌లాండ్‌లో కొనసాగుతున్న తుపాను 'పబక్' పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తోంది. పోర్టుబ్లెయిర్‌కు 820 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. శనివారం నాటికి అండమాన్ సముద్రంలో విలీనమై ఆదివారం రాత్రికి తీరం దాటనుంది. అనంతరం ఉత్తర వాయవ్య దిశగా మయన్మార్ వైపు పయనిస్తూ వెనక్కి మళ్లి ఈనెల 7,8 తేదీల్లో బలహీనపడుతుందని ఐఎండీ తెలిపింది. ఈ తుపాను ప్రభావం మన దేశంపై ఉండబోదని శుక్రవారం రాత్రి విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.

బీజేపీ, వైఎస్సార్‌సీపీ మధ్య ఒప్పందంలో భాగమే

జగన్‌పై హత్యాయత్నం కేసును ఎన్‌ఐఏకు అప్పగించడంపై టీడీపీ ఎంపీ కనకమేడల ఆరోపణ

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ, వైఎస్సార్‌సీపీ మధ్య ఒప్పందంలో భాగంగానే ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన హత్యాయత్నం కేసును ఎన్‌ఐఏకు అప్పగించారని టీడీపీ ఎంపీ టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ శుక్రవారమిక్కడ మాట్లాడుతూ ఆరోపించారు. ఎన్‌ఐఏకు అప్పగించమని హైకోర్టు ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేదన్నారు. కేంద్రమే జగన్ కోడి కత్తి కేసును ఎన్‌ఐఏకు అప్పగించిందని, ఈ మేరకు డిసెంబర్ 31న ఉత్తర్వులు ఇచ్చిందని ఆరోపించారు. ఇలాంటి నేరాలు ఎన్‌ఐఏ కిందకు రావన్నారు. అయినా కేంద్రం ఇచ్చిందంటే బీజేపీ, వైఎస్సార్‌సీపీ మధ్య ఒప్పందం కనిపిస్తున్నదన్నారు. ఈ కేసును రాష్ట్రప్రభుత్వం విచారణ జరుపుతుండగా.. కేంద్రం ఎన్‌ఐఏకి అప్పగించడం రాష్ట్ర హక్కుల్ని హరించడమేనన్నారు. రాష్ట్రానికి నరేగా నిధులను కేంద్రం ఇవ్వకుండానే ఇచ్చినట్టుగా బీజేపీ ఎంపీ జీవీఎల్ మాట్లాడుతున్నారని ఆయన తప్పుపట్టారు. అమరావతిలో ఒక్క బిల్డింగ్ కూడా కట్టలేదంటున్నారని, జీవీఎల్ అమరావతి వచ్చి చూస్తే నిర్మాణాలు, జరిగే పనులు కనపడతాయన్నారు.

అటవీశాఖలో పోస్టుల భర్తీకి పరీక్షల విధానం ఖరారు

సాక్షి, అమరావతి: అటవీశాఖలో 480 పోస్టుల భర్తీకి పరీక్షల (ఎంపిక) విధానాన్ని ప్రభుత్వం ఖరారు చేసింది. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పంపిన ఎంపిక విధానాన్ని ఆమోదిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ 50, ఫారెస్టు బీట్ ఆఫీసర్ 330, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ 100 పోస్టులు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి రాత పరీక్ష, శరీర దారుఢ్య పరీక్షలు ఉంటాయి. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టు ఎంపికకు నాలుగు పేపర్లకు సంబంధించి రాత పరీక్ష ఉంటుంది. జనరల్ ఇంగ్లిష్ (50) జనరల్ తెలుగు (50) కలిపి మొత్తం వంద మార్కులకు మొదటి పేపర్ ఉంటుంది. జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ కింద 150 మార్కులకు ఒక పేపర్ ఉంటుంది. పదో తరగతి స్టాండర్డ్‌లో మ్యాథమెటిక్స్ పేపర్ 150 మార్కులకు ఉంటుంది. జనరల్ ఫారెస్ట్రీకి సంబంధించి 150 మార్కులకు మరో పేపర్ ఉంటుంది. ఒక్కో మార్కు ప్రశ్నకు ఒక నిమిషం సమయం ఇస్తారు. రాతపరీక్షతో పాటు నడక, శరీర దారుఢ్య పరీక్షలు ఉంటాయి. రాతపరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు మెడికల్ బోర్డు పరీక్షలో ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పొందాల్సి ఉంటుంది.

టీడీపీతో పొత్తు ఉంటేనే ప్రయోజనం

రాహుల్ గాంధీకి పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి నివేదిక!

సాక్షి, అమరావతి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీతో పొత్తు ఉంటేనే ప్రయోజనం ఉంటుందని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి నివేదిక ఇచ్చారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో రాష్ట్రంలో పొత్తు విషయమై ఒక స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర నేతలు కొంతకాలంగా అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. ఇందులో భాగంగానే చర్చించేందుకు రాహుల్‌గాంధీ నుంచి పిలుపు రావడంతో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఊమెన్‌చాందీ, రఘువీరారెడ్డితో పలువురు ముఖ్య నేతలు గురువారం ఢిల్లీలో సమావేశమై చర్చించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జులతో పొత్తు విషయమై ఇదివరకే లిఖిత పూర్వకంగా తీసుకున్న అభిప్రాయాలకు సంబంధించి ఒక నివేదిక అందజేశారు.



ఈయన పేరు.. తెలికి నాగశేఖర్. గత 50 ఏళ్లుగా వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలం దత్తాపురంలో నివాసం ఉంటున్నారు. గండికోట జలాశయంలో వీరి గ్రామం ముంపునకు గురవడంతో.. ఇంటిని ఖాళీ చేసి కె.సుగమంచుపల్లె కాలనీలో ఉంటున్నారు. పునరావాస లబ్ధిదారుల జాబితాలో ఈయన పేరును తప్పించారు. స్థానికతకు సంబంధించిన ఆధారాలు చూపించినా అధికారులు స్పందించలేదు. నాగశేఖర్‌కే కాకుండా ఈయన కుమారుడు నరేంద్ర (26)కు కూడా పరిహారం మంజూరు చేయలేదు.



ఈయన పేరు.. మేకల బాలిరెడ్డి. వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలం దత్తాపురం గ్రామానికి చెందిన ఈయన గండికోట ప్రాజెక్టు నిర్వాసితుడు. పునరావాస ప్యాకేజీ కింద పరిహారం మంజూరు చేయకుండా రెండేళ్ల క్రితం ఈయన కుటుంబాన్ని ఊరు నుంచి ఖాళీ చేయించారు. దాంతో కె.సుగమంచుపల్లె ఆర్ అండ్ ఆర్ కాలనీలో తన తండ్రి సుబ్బారెడ్డి ఇంట్లో ఆయన కుటుంబం తలదాచుకుంటోంది. ఊరును ఖాళీ చేయించి రెండేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు పరిహారం అందలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదని బాలిరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



ఈయన పేరు.. ధూళిపాల కాంతారావు. ఊరు.. పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం అమరవరం. ఇతనికి గ్రామంలో 2.38 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి పోలవరం ముంపులో ఉంది. అయితే ఈ భూమి చుట్టూ ఉన్న సర్వే నెంబర్లు 106, 107, 55లలో ఉన్న పొలాలను ముంపు కింద సేకరించిన అధికారులు కాంతారావు భూమి మాత్రం ముంపులో లేదంటూ వదిలేశారు. అధికారులు సర్వే చేసి ఇచ్చిన మ్యాప్‌లోనూ, ఇరిగేషన్ డీఈ వద్ద ఉన్న నివేదికలోనూ కాంతారావు భూమి ముంపులో ఉందని పేర్కొన్నారు. తుది జాబితాలో మాత్రం ఆయన భూమి ముంపులో లేదంటూ సేకరించలేదు. ముంపులో ఉన్న భూమిని సేకరించకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తోందని కాంతారావు వాపోతున్నాడు.

- సాగునీటి ప్రాజెక్టుల వల్ల ముంపునకు గురవుతున్న 499 గ్రామాలు
- నిర్వాసితులుగా మారిన 1.62 లక్షల కుటుంబాల్లోని ఏడు లక్షల మంది ప్రజలు
- భూసేకరణ చట్టం–2013ను తుంగలో తొక్కిన వైనం
- నిర్వాసితులను దోపిడీ చేస్తున్న టీడీపీ ప్రజాప్రతినిధులు, దళారీలు
- పరిహారం ఇవ్వకుండానే పోలీసులను ప్రయోగించి గ్రామాల్ని ఖాళీ చేయిస్తున్న సర్కారు

ఇన్‌డెప్త్

త్యాగానికి బహుమానం అవమానం



సాక్షి, అమరావతి

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సర్వస్వాన్ని త్యాగం చేసిన నిర్వాసితులకు మెరుగైన రీతిలో పునరావాసం కల్పించాల్సిన ప్రభుత్వం భిన్నంగా వ్యవహరిస్తోంది. సాగునీటి ప్రాజెక్టుల ముంపు గ్రామాలకు చెందిన వేలాది నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించకుండా ఖాళీ చేయించింది. తద్వారా ఈ కుటుంబాల్లోని దాదాపు లక్షలాదిమంది నిర్వాసితులను రోడ్డున పడేసింది. పోలవరం, వంశధార ప్రాజెక్టు రెండో దశలో భాగమైన హిరమండలం రిజర్వాయర్, గాలేరు–నగరి సుజల స్రవంతి పథకం తొలి దశలో భాగమైన గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీని అమలు చేయకుండానే పోలీసులను ప్రయోగించి, బలవంతంగా ఉన్న ఊళ్ల నుంచి ఖాళీ చేయించింది.

భూసేకరణ చట్టాన్ని అపహాస్యం చేసి..

భూసేకరణ చట్టం–2013 ప్రకారం.. నిర్వాసితులకు సహాయ, పునరావాస ప్యాకేజీని అమలు చేయాలి. మార్కెట్ విలువకు రెండున్నర రెట్లు అధికంగా పరిహారాన్ని చెల్లించి భూములను సేకరించాలి. భూసేకరణలో నిర్వాసితులను దోచేస్తున్న టీడీపీ ప్రజాప్రతినిధులు.. వారికి పునరావాసం కల్పించే విషయంలోనూ లూటీ చేస్తున్నారు. భూసేకరణ చట్టం ప్రకారం.. నిర్వాసితులకు జీవనోపాధి, ఇంటి సామగ్రి రవాణా, ఏడాది పనిదినాల కల్పనతో కలిపి ఒక్కో నిర్వాసిత కుటుంబానికి రూ.6.36 లక్షలు, గిరిజన కుటుంబాలకు రూ.6.86 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలి. పునరావాస కాలనీని నిర్మించి, అన్ని మౌలిక సదుపాయాలతో వారికి ఆశ్రయం కల్పించాలి. ఇళ్లు నిర్మించుకోవడానికి నిధులు ఇవ్వాలని కోరితే.. నిర్మాణానికయ్యే మొత్తాన్ని నిర్వాసితులకు అందజేయాలి. ముంపు గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఉంటే వారిని ప్రత్యేక కుటుంబంగా గుర్తించి.. ఇదే రీతిలో ప్యాకేజీని వర్తింపజేయాలి.

పోలవరం ప్రాజెక్టులోనే 371 గ్రామాలు

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం వల్ల 499 గ్రామాలు ముంపునకు గురవుతాయి. ఇందులో పోలవరం ప్రాజెక్టులోనే 371 గ్రామాలు ఉండటం గమనార్హం. ప్రాజెక్టుల వల్ల 1,62,870 కుటుంబాలకు చెందిన ఏడు లక్షల మంది ప్రజలు నిర్వాసితులుగా మారుతున్నారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. లబ్ధిదారులను ఎంపిక చేయడానికి గ్రామసభలు నిర్వహించాలి. తర్వాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారుల జాబితాను అందుబాటులో ఉంచాలి. కానీ.. టీడీపీ కీలక నేతలతో కుమ్మక్కైన ఉన్నతాధికారులు గ్రామసభలకు మోకాలడ్డారు. తాము నియమించుకున్న దళారీల ద్వారా ముడుపులు ఇచ్చేందుకు అంగీకరించినవారు నిర్వాసితులైనా, కాకున్నా లబ్ధిదారుల జాబితాలో చోటు కల్పిస్తున్నారు. ఆ జాబితా మేరకే పరిహారం చెల్లిస్తూ నిలువుదోపిడీ చేస్తున్నారు.

నిర్వాసితుల జీవితాలతో చెలగాటం

ప్రభుత్వం పునరావాస కాలనీల్లో ఐదు సెంట్ల భూమిని కేటాయించి పక్కా గృహాన్ని నిర్మించి ఇవ్వాలి. పోలవరం నిర్వాసితులకు మాత్రమే ఇళ్లను నిర్మిస్తున్న సర్కార్.. మిగిలిన ప్రాజెక్టుల నిర్వాసితులకు ఇళ్ల స్థలాలను కేటాయించి.. నిర్మాణానికి రూ.60 వేల నుంచి రూ.70 వేలను మాత్రమే ఇస్తోంది. కానీ.. సర్కార్ నిర్మిస్తోన్న ఇళ్లు పిచ్చుక గూళ్లను తలపిస్తున్నాయి. కేవలం సెంటు సెంటున్నర భూమిలో ఇరుకైన ఒకే గది, దానికి అనుబంధంగా చిన్న వంట గది, మరుగుదొడ్డి నిర్మించి ఇస్తున్నారు. వాస్తవంగా ఈ ఇంటి నిర్మాణానికి రూ.లక్షకు మించి వ్యయం కాదు. కానీ.. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.3.9 లక్షల నుంచి రూ.4.25 లక్షల వరకూ అంచనా అవుతుందని లెక్కలు వేసి ఆ పనులను గంపగుత్తగా టీడీపీ ఎమ్మెల్యేలకు అనుకూలురైన కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. ఇందులో రూ.వందలాది కోట్ల కమీషన్‌లు చేతులు మారుతున్నాయి.

ఒక్కో చోట.. ఒక్కో రీతిలో పరిహారం

ప్రభుత్వం నిర్వాసితులకు ఒక్కో ప్రాజెక్టులో ఒక్కో రీతిలో పరిహారం అందజేస్తోంది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గిరిజనులకు రూ.6.86 లక్షల చొప్పున పరిహారం ఇస్తుంటే.. గిరిజనేతరులకు రూ.6.36 లక్షల చొప్పున అందజేస్తోంది. గండికోట నిర్వాసితులకు కొందరికి రూ.3.75 లక్షల చొప్పున, మరికొందరికి రూ.4.89 లక్షల చొప్పున పరిహారాన్ని మంజూరు చేసింది. ఇక హిరమండలం రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాల్లో ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇచ్చింది.

భూమి ఒక చోట.. ఇళ్లు మరో చోట

పోలవరం, హిరమండలం పునరావాస కాలనీలకు సమీపంలోనే గిరిజనులకు ఒక్కో కుటుంబానికి కనీసం 2.5 హెక్టార్ల సాగు భూమికి బదులుగా అంతే స్థాయిలో సాగు భూమి కేటాయించాలి. కానీ.. సర్కార్ తద్భిన్నంగా వ్యవహరిస్తోంది. నిర్వాసితులను బస్సుల్లో తీసుకొస్తున్న అధికారులు పునరావాస కాలనీల సమీపంలోని భూములను చూపించి.. వాటినే మీకు ఇస్తున్నామని చెప్పి నమ్మబలుకుతున్నారు. ఆ తర్వాత పునరావాస కాలనీకి 25 కి.మీ.ల దూరంలో కొండలు, గుట్టల్లోని భూములను కేటాయిస్తున్నారు. ఒక్కో గిరిజనుడికి గరిష్టంగా ఐదు ఎకరాల భూమిని ఒకే చోట చూపించాలి. కానీ.. ఎకరం, అరెకరం చొప్పున సర్కార్ ఐదారు చోట్ల భూమిని కేటాయిస్తుండటంతో వాటిని తామెలా సాగు చేసుకోగలుగుతామని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ట్రిబ్యునల్ విచారణలో ఉన్న భూములను సర్కార్ సేకరించకూడదు. కానీ.. కోర్టుల్లో విచారణలో ఉన్న భూములను కూడా సేకరించిన అధికారులు.. నిర్వాసితులకు కేటాయిస్తున్నారు. భూములను స్వాధీనం చేసుకోవడానికి వచ్చిన గిరిజనులను స్థానికులు అడ్డుకుంటున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల నిర్వాసితులకు ప్రభుత్వం కల్పించిన పునరావాసం తీరు ఇదీ..

జిల్లా	ప్రాజెక్టు	ముంపు గ్రామాలు	చేపట్టాల్సిన నిర్వాసిత కాలనీలు	పూర్తయిన నిర్వాసిత కాలనీలు	నిర్వాసిత కుటుంబాలు	పునరావాసం కల్పించిన కుటుంబాలు
శ్రీకాకుళం	హిరమండలం రిజర్వాయర్	20	18	18	7104	7104
శ్రీకాకుళం	మహేంద్రతనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్	5	4	--	1059	--
విజయనగరం	తోటపల్లి	20	21	10	5915	3396
విజయనగరం	తారకరామతీర్థ సాగరం	03	02	--	799	00
తూర్పుగోదావరి	పోలవరం	234	160	07	70929	1338
పశ్చిమగోదావరి	పోలవరం	137	51	19	34672	2484
గుంటూరు	పులిచింతల	15	13	12	6804	6293
ప్రకాశం	గుండ్లకమ్మ	12	26	07	6584	3558
ప్రకాశం	వెలిగొండ	11	10	--	7250	0
వైఎస్సార్	గండికోట	17	16	14	10123	8874
వైఎస్సార్	గాలేరు–నగరి	08	00	00	9605	0
వైఎస్సార్	హంద్రీ–నీవా రెండో దశ	03	01	00	138	0
అనంతపురం	హంద్రీ–నీవా రెండో దశ	02	01	01	115	115
అనంతపురం	పీఏబీఆర్ రెండో దశ	06	08	6	1392	1327
చిత్తూరు	మల్లెమడుగు రిజర్వాయర్	03	01	0	126	90
చిత్తూరు	హంద్రీ–నీవా రెండో దశ	02	02	0	142	26
చిత్తూరు	చిన్నేరు	01	01	0	113	33
మొత్తం		499	335	94	162870	35852

చంద్రబాబుకు మోదీ ఫోబియా

- డ్రామానాయుడి అవతారమెత్తి మోదీ జపం చేస్తున్నారు
- హామీలు అమలు చేయకుండా ప్రజల నుంచి తప్పించుకు తిరుగుతున్నారు
- బీజేపీ ఎంపీలు జీవీఎల్, హరిబాబు ధ్వజం



సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోదీ అంటే భయం పట్టుకుందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు ధ్వజమెత్తారు. డ్రామానాయుడి అవతారమెత్తిన చంద్రబాబు ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి మోదీ జపం చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో ఎంపీ హరిబాబుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఇటీవల ప్రధాని మోదీ బీజేపీ కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్సులో పలు అంశాలను ప్రస్తావిస్తే చంద్రబాబు భయపడిపోతున్నారన్నారు. చంద్రబాబు, తన మంత్రులు ఇన్నాళ్లు చేస్తున్న మోదీ జపంతో రాసుకొని ఉంటే ఈపాటికి 'మోదీకోటి' పూర్తయ్యేదన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉన్న చంద్రబాబు అబద్ధాలు, అవాస్తవాలు ప్రచారం చేసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. నరేగా కింద కేంద్రం నిధుల్విడం లేదంటూ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని, కేంద్రం పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కే అత్యధిక నిధులు ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన పనులు కాకుండా టీడీపీ సొంతంగా చేసిన ఐదు పనులను చెప్పే ధైర్యం చంద్రబాబుకు ఉందా? అని జీవీఎల్ సవాల్ విసిరారు. కేంద్రం ఇచ్చే పనులను రాష్ట్రం అమలు చేయడం తప్పితే ఏం చేశారని ప్రశ్నించారు. రూ.లక్షన్నర కోట్లు అప్పులు చేయడం తప్ప ఏమీ చేయలేదన్నారు. కనీసం రెండంతస్తుల హైకోర్టు బిల్డింగ్‌ను నిర్మించలేని అసమర్థుడు చంద్రబాబు అని మండిపడ్డారు. యూసీలు అడిగితే తాము ఏమైనా గుమాస్తాలమా అంటున్న టీడీపీ నేతలకు ప్రభుత్వ అధికారులంటే అంత చులకనగా కనబడుతున్నారా? అని ప్రశ్నించారు. 600 హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజల నుంచి తప్పించుకు తిరుగుతున్నారని మండిపడ్డారు.

నిధులివ్వడం లేదన్నది అవాస్తవం: హరిబాబు

కేంద్రం ఉపాధి హామీ నిధులు ఇవ్వడం లేదంటూ టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ఎంపీ హరిబాబు ఖండించారు. 2018–19 ఏడాదికిగానూ ఏపీకి రూ.6,243 కోట్ల నిధులు విడుదలయ్యాయని తెలిపారు. గతేడాది కంటే రూ.1,115 కోట్లు అదనంగా నిధులు విడుదల చేసినట్టు పేర్కొన్నారు. ఉపాధి హామీ పనిదినాలను పెంచిందన్నారు. కేంద్రం చేస్తున్న సహాయాన్ని టీడీపీ చిన్నదిగా చూపే ప్రయత్నం చేయడం మంచిది కాదన్నారు. కేంద్రం నుంచి అత్యధిక నిధులు సాధించగలిగామని గత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బహిరంగంగా చెప్పిన విషయాన్ని హరిబాబు గుర్తు చేశారు. ఇక నరేగా కింద తామే నిధులిస్తామన్న ప్రతిపాదన ఏదీ రాష్ట్ర ప్రభుత్వం చేయలేదని, ఇదే విషయాన్ని కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ స్పష్టం చేశారన్నారు.

బాబే ప్యాకేజీకి అంగీకరించారు

- రూ.3,500 కోట్లు ఇస్తే ఏం చేశారు?: అరుణ్ జైట్లీ వ్యాఖ్య
- ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరిన హోదా సాధన సమితి నేతలు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామంటే ముఖ్యమంత్రి చంద్రబాబే అంగీకరించారు కదా అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలన్న డిమాండ్‌తో కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో రెండో రోజు ధర్నా కొనసాగింది. ధర్నా అనంతరం ఎంపీ డి.రాజా ఆధ్వర్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ పలు విద్యార్థి సంఘాల నేతలు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని ఆయన కార్యాలయంలో కలిశారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేమని.. ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామంటే ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారన్నారు. అలాగే రాజధాని నిర్మాణానికి రూ. 3,500 కోట్లు ఇస్తే అక్కడ ఏమీ నిర్మించలేకపోయారని అన్నారు. విభజన చట్టం ప్రకారం ఏపీ నూతన రాజధాని నిర్మాణంలో కేవలం ఐదు ప్రధాన భవనాల నిర్మాణానికి మాత్రమే నిధులు ఇవ్వాలని ఉందన్నారు. ఇక వెనుకబడిన జిల్లాలకు ఇవ్వాల్సిన రూ. 350 కోట్ల నిధులను త్వరలో విడుదల చేస్తామని జైట్లీ పేర్కొన్నారు. దీనిపై నేతలు స్పందిస్తూ.. ఏపీకి ప్యాకేజీ నిధులు సరిపోవని, ప్రత్యేక హోదా ఇవ్వాలని జైట్లీని కోరారు. మౌలిక సదుపాయాల కల్పనకే 90 శాతం నిధులు ఖర్చవుతాయని గుర్తు చేశారు. వీలైనంత త్వరగా విభజన హామీలు అమలు చేయాలని కోరారు.

రాజకీయ మార్పుతో హామీల సాధన: ఏచూరి

అంతకుముందు ధర్నాలో పాల్గొన్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ.. కేంద్రంలో రాజకీయ మార్పు వస్తేనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీకి ఇచ్చిన హామీల అమలు సాధ్యమవుతుందని అన్నారు. ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన హామీని ఇప్పుడెందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఏపీకి ఇచ్చిన హామీలు అమలు కావాలంటే రాజకీయ మార్పు అవసరమని, దాని కోసం అందరం కలసి పోరాడుదామని పేర్కొన్నారు. ధర్నాలో సీపీఐ నారాయణ, రామకృష్ణ, సీపీఎం మధు, చలసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలతో ప్రశ్నించేతత్వం పెరుగుతుంది

- ప్రజలు ప్రశ్నించకపోతే ప్రభుత్వాలు సమాజాన్ని నాశనం చేస్తాయి
- లైబ్రరీ సెస్‌పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి
- విజయవాడ 30వ పుస్తక మహోత్సవ సభలో సాక్షి ఈడీ కె. రామచంద్రమూర్తి

సాక్షి, అమరావతి బ్యూరో: ప్రతి ఒక్కరూ ప్రశ్నించడం అలవరుచుకోవాలని, పుస్తకాలు చదవటం వల్ల ప్రశ్నించేతత్వం పెరుగుతుందని సాక్షి మీడియా గ్రూప్ ఎడిటోరియల్ డైరెక్టర్ కె .రామచంద్రమూర్తి అన్నారు. శుక్రవారం విజయవాడలోని స్వరాజ్ మైదానంలో జరుగుతున్న 30వ విజయవాడ పుస్తక మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ప్రశ్నించకపోతే ప్రభుత్వాలు ఇష్టానుసారం వ్యవహరిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రశ్నించేతత్వం కనిపించటం లేదని, ఇలా ఉండటం వల్ల ప్రభుత్వాలు బరితెగించి సంపదను కొల్లగొడతాయన్నారు. ఏపీలో లైబ్రరీ సెస్ పేరిట సేకరించిన మొత్తం ఎక్కడికి పోతోందో తెలియటం లేదని, ప్రభుత్వం లైబ్రరీ సెస్‌పై కూడా శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. మట్టి, ఇసుక బాధ్యతను జన్మభూమి కమిటీలకు అప్పగించినట్టే గ్రంథాలయాల బాధ్యతను కూడా అప్పగించాలని సూచించారు.

అజ్ఞానం అధికారంలో ఉంటే ఎలా ఉంటుందో అనుభవిస్తున్నాం: అజ్ఞానం అధికారంలో ఉంటే రాజ్యం ఎలా ఉంటుందో ఆ ఫలాలు ఇప్పుడు మనం అనుభవిస్తున్నామని పద్మ భూషణ్ అవార్డు గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ప్రభుత్వం ప్రజలకు పోలవరం, అమరావతిలో మొండి గోడలు చూపించటానికి బదులు పుస్తక మహోత్సవాలకు తీసుకెళ్లడం వల్ల ఉపయోగముంటుందని వ్యాఖ్యానించారు. చంద్రన్న కానుకలతో మభ్యపెడుతున్న ప్రభుత్వ పెద్దలకు ప్రింటింగ్ రాయితీలు ఇచ్చి సాహిత్యాన్ని కాపాడటానికి చేతులు రావటం లేన్నారు. కొంత మంది కులపతులు, మానసిక రోగుల వల్ల మధ్యలో కాస్త ఇబ్బందులు ఎదురైనా 30 ఏళ్లుగా ఏమాత్రం వన్నె తగ్గకుండా పుస్తక మహోత్సవం నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎమెస్కో పబ్లిషర్స్ అధినేత ఎమెస్కో ప్రసాద్, బుక్ ఫెస్టివల్ అధ్యక్షుడు వెంకట నారాయణ, గౌరవాధ్యక్షుడు బాబ్జీ, పాత్రికేయుడు కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్ నుంచి స్వరాజ్ మైదాన్ వరకు సాగిన పుస్తక ప్రియుల పాదయాత్రను కృష్ణా జిల్లా కలెక్టర్ బి లక్ష్మీకాంతం జెండా ఊపి ప్రారంభించారు.



మాట్లాడుతున్న కె.రామచంద్రమూర్తి

వైఎస్ హయాంలో బీసీలకు పెద్దపీట

- బీసీ కులాల అధ్యయన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి
- అనకాపల్లిలో బీసీ కులాల కమిటీ సమావేశం



అనకాపల్లి టౌన్/మద్దిలపాలెం (విశాఖ తూర్పు): దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో బీసీలకు పెద్దపీట వేశారని బీసీ కులాల అధ్యయన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేసి అభివృద్ధి చేస్తారని వెల్లడించారు. గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో శుక్రవారం అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీసీ కులాల కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీ కులస్తులకు రూ.11 వేల కోట్లు మంజూరు చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగా మలుచుకోవడమే తప్ప ఆయా కులాల అభివృద్ధికి ఏ పథకాలూ అమలు చేయలేదన్నారు. మాడుగుల ఎమ్మెల్యే, అసెంబ్లీలో ప్రతిపక్ష ఉపనేత బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ బీసీ కులస్తుల సమస్యలపై అధ్యయనం చేసి నివేదికను జగన్‌మోహన్‌రెడ్డికి అందజేస్తామన్నారు. అనకాపల్లి పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వివిధ కేటగిరీల బీసీలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి తద్వారా రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. వరుదు కల్యాణి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు తొండపల్లి పుల్లయ్య, మీసాల రంగన్న, కరణం ధర్మశ్రీ, మళ్ల బుల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు. కాగా, జగన్‌పై హత్యాయత్నం కేసును ఎన్‌ఐఏకు అప్పగించడాన్ని జంగా కృష్ణమూర్తి, బీసీ అధ్యయన కమిటీ ప్రతినిధి, మాజీ మంత్రి హెచ్.బి.నర్సేగౌడ్ స్వాగతించారు. ఈ కుట్రలో పాత్రధారులు, సూత్రధారులెవరో నిగ్గు తేలనుందన్నారు.

వారు రిజర్వ్‌డ్ కేటగిరీకే అర్హులు

ప్రత్యేక మినహాయింపు అభ్యర్థుల విషయంలో ఏపీపీఎస్సీ స్పష్టీకరణ

త్వరలో 1,521 పోస్టులకు 14 నోటిఫికేషన్లు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వివిధ పోస్టుల భర్తీకి నిర్వహించే స్క్రీనింగ్ టెస్టు/ప్రిలిమ్స్‌లో ప్రత్యేక మినహాయింపుతో ఎంపికయ్యే రిజర్వ్‌డ్ అభ్యర్థులు వారి రిజర్వ్‌డ్ కేటగిరీ పోస్టులకు మాత్రమే అర్హులవుతారని ఏపీపీఎస్సీ చైర్మన్ పి.ఉదయభాస్కర్ పేర్కొన్నారు. ఈ అభ్యర్థులు మెయిన్స్‌లో అత్యధిక మార్కులతో మెరిట్‌లో ఉన్నా ఓపెన్ కేటగిరీ పోస్టులకు వెళ్లడానికి వీల్లేదని స్పష్టంచేశారు. శుక్రవారం ఏపీపీఎస్సీ కార్యాలయంలో కమిషన్ సభ్యులు జి.రంగజనార్దన, కె.విజయకుమార్, గుర్రం సుజాత, కె.పద్మరాజు, సేవారూప, కార్యదర్శి ఏకే మౌర్యలతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'ఇంతకు ముందు స్క్రీనింగ్ టెస్టు/ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు 1:50 చొప్పున అభ్యర్థులను ఎంపికచేసే వారం. కటాఫ్‌లో ఎలాంటి మినహాయింపులు లేకుండా ఎంపికయ్యే వీరిలో కొన్ని రిజర్వ్‌డ్ కేటగిరీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేనప్పుడు అవి భర్తీకాకుండా మిగిలిపోతున్నాయి. దీనిని నివారించేందుకు ఈసారి స్క్రీనింగ్ టెస్టులో నుంచి మెయిన్స్‌కు ఎంపిక చేసే ప్రక్రియలో కొన్ని మార్పులు చేశాం. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి స్క్రీనింగ్ టెస్టు అనంతరం ఒక కటాఫ్ మార్కుతో నిర్ణీత నిష్పత్తిలో అన్ని పోస్టులకు కలిపి మొత్తం అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపికచేస్తాం. వారిలో ఏ రిజర్వ్‌డ్ కేటగిరీకి అయినా నిష్పత్తికి తగినంత మంది అభ్యర్థులు ఎంపిక కాకుంటే మిగిలిన వారిని కటాఫ్ మార్కులు తగ్గించి ఎంపికచేస్తాం. ఇలా కటాఫ్ మార్కుల తగ్గింపు ద్వారా ప్రత్యేక మినహాయింపుతో ఎంపికైన వారు ఆతరువాత వారి రిజర్వ్‌డ్ కేటగిరీ పోస్టులకు మాత్రమే అర్హులవుతారు. మెయిన్స్‌లో మెరిట్ సాధించినా ఓపెన్ కేటగిరీకి కాకుండా రిజర్వ్‌డ్ కేటగిరీకే పరిమితమవుతారు' అని ఉదయ భాస్కర్ వివరించారు. స్క్రీనింగ్ టెస్టులో జనరల్ కటాఫ్‌తో కాకుండా కేటగిరీల వారీగా కటాఫ్ నిర్ణయించి మెయిన్స్‌కు ఎంపికలు చేయాలని, ఆ తరువాత మెయిన్స్ ఇంటర్వ్యూల్లో మెరిట్ ఆధారంగా అందరికీ ఓపెన్ కేటగిరీ పోస్టులకు అవకాశాలు కల్పించాలని అభ్యర్థులు కోరుతున్న విషయాన్ని మీడియా ప్రస్తావించగా చైర్మన్ స్పందిస్తూ తాము యూపీఎస్సీ విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే టెట్, డీఎస్సీ, వంటి ఇతర నియామక పరీక్షల్లో స్క్రీనింగ్ టెస్టులో మినహాయింపులతో ఎంపికైనా ఆతదుపరి పరీక్షలో మెరిట్ సాధిస్తే ఓపెన్ కేటగిరీకి అర్హులవుతున్నారని గుర్తుచేయగా టెట్, డీఎస్సీలతో తమకు సంబంధం లేదని చైర్మన్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో లేని నిబంధనను నోటిఫికేషన్లలో పెట్టి రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అన్యాయం చేస్తున్నారంటూ వస్తున్న విమర్శల గురించి ప్రస్తావించగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే చేస్తున్నామని చైర్మన్ వివరించారు.

త్వరలోనే మరికొన్ని నోటిఫికేషన్లు

ఇదిలా ఉండగా డిసెంబర్ ఆఖరు వరకు ఏపీపీఎస్సీ ద్వారా వివిధ విభాగాలకు చెందిన 3,255 పోస్టులకు 21 నోటిఫికేషన్లు జారీచేశామని చైర్మన్ తెలిపారు. ఇందులో ఏఈఈ పోస్టులకు 97వేల వరకు, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పోస్టులకు 16130, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు 5,411, హార్టికల్చర్ అధికారుల పోస్టులకు 1,307, పంచాయతీ కార్యదర్శుల పోస్టులకు ఇప్పటివరకు 56,612 దరఖాస్తులు వచ్చాయన్నారు. త్వరలో మరో 1521 పోస్టులకు సంబంధించి 14 నోటిఫికేషన్లు జారీచేయనున్నామన్నారు.

ప్రజల విజయానికి శ్రీకారం

ప్రజా సంకల్పయాత్ర టూర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం



ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్న ప్రజాసంకల్ప యాత్ర 5కోట్ల మంది ప్రజల విజయానికి శ్రీకారమని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యాత్ర టూర్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం చెప్పారు. ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి వద్ద నిర్మిస్తున్న విజయ స్థూపాన్ని(పైలాన్) ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. 2017 నవంబర్ 6న ఇడుపులపాయ నుంచి ప్రారంభమైన జగన్ పాదయాత్ర 2018, 2019లో 341 రోజులుగా 3,648 కిలోమీటర్ల మేర.. మూడు క్యాలెండర్ సంవత్సరాలుగా ప్రపంచ చరిత్రలోనే ఏ రాజకీయ నాయకుడికీ సాధ్యం కాని రీతిలో సాగుతోందని పేర్కొన్నారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన పాదయాత్ర చంద్రబాబు తొమ్మిదేళ్ల ప్రజా కంటక పరిపాలన నుంచి ఎలా విముక్తిని ప్రసాదించిందో, మళ్లీ అదే చంద్రబాబు ప్రజావ్యతిరేక పాలన నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర విముక్తి కలిగిస్తుందని ప్రజలు నమ్ముతున్నారని తలశిల రఘురాం తెలిపారు. ప్రజాసంకల్ప యాత్రలో జగన్ వేసిన ప్రతి అడుగు రాష్ట్ర చరిత్రలో చిరస్మణీయంగా నిలిచిపోనుందన్నారు. మీకు మేమున్నామంటూ ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చూపిస్తున్న అభిమానం, జన కెరటాల్లో టీడీపీ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని తేల్చిచెప్పారు. ప్రారంభంలో జగన్ పాదయాత్రను తేలిగ్గా తీసుకున్న సీఎం చంద్రబాబు 140 స్థానాల్లో టీడీపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారని, ఇప్పుడు 30 స్థానాల్లో గెలిచే అవకాశం మాత్రమే ఉందంటూ పార్టీ నేతల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా (లల్లూ), వైఎస్సార్‌సీపీ నేతలు కాయల వెంకటరెడ్డి, పిరియా విజయ, తాడి ఆదిరెడ్డి, సత్తిరెడ్డి, పిట్ట ఆనంద్,కారంగి మోహనరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

సాక్షి
శనివారం, జనవరి, 5

సంయమనం అవసరం

పురాతన కాలం నుంచీ మన దేశం వేదభూమి, కర్మభూమి గనుక మత విశ్వాసాలను ప్రోత్సహించడంలో తప్పులేదని వాదించేవారికీ...ఈ సెక్యులర్ దేశంలో రాజ్యాంగం చెబుతున్నట్టు ప్రభుత్వాలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలనేవారికీ మధ్య ఎప్పటిదాకానో సాగుతున్న వివాదాలు మామూలే. ఇప్పుడు 'ప్రార్థించే హక్కు' చుట్టూ గొడవ రాజుకుంది. శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో 10–50 ఏళ్ల మధ్య ఉన్న ఆడవాళ్లకు ప్రవేశాన్ని నిరాకరిస్తున్న నిబంధన చెల్లదని, అది రాజ్యాంగ విరుద్ధమని గత సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన మెజారిటీ తీర్పు ఈ గొడవకంతకూ మూలం. దానికి అనుకూలంగా, వ్యతిరేకంగా వేలాదిమంది మహిళలతో ర్యాలీలు జరిగాయి. ప్రభుత్వం నుంచి ఏదైనా విధాన నిర్ణయం వెలువడినప్పుడో, న్యాయస్థానాలిచ్చిన తీర్పుల విషయంలోనో వాగ్యుద్ధాలు నడవటం వింతేమీ కాదు. అవి మన ప్రజాస్వామ్య వ్యవస్థ చలనశీలతకు నిదర్శనం. కానీ ఆ వాగ్యుద్ధాలు కాస్తా ముదిరి నడిరోడ్లపై పరస్పరం దాడులు చేసుకునే వరకూ వెళ్లడం అవాంఛనీయం. నిజానికి సంక్రాంతి ఆగమిస్తున్న ఈ సమయంలో భక్తుల శరణుఘోషతో శబరిమల మార్మోగుతుండాలి. కానీ దానికి విరుద్ధంగా అది రణఘోషతో అట్టుడుకుతోంది. ఆలయంలోకి నూతన సంవత్సర ఆరంభవేళ వేకువజామున ఇద్దరు మహిళలు ప్రవేశించి పూజలు నిర్వహించారన్న వార్త తెల్లారేసరికి గుప్పుమనడంతో కేరళ అంతటా ఉద్రిక్తతలు అలుముకున్నాయి. మహిళల రాకతో అపచారం జరిగిందంటూ ఆలయ పూజారులు గర్భగుడిని శుద్ధి చేశారు. మూడో తేదీన శ్రీలంక మహిళ ఒకరు దర్శనం చేసుకున్నారని తాజాగా వెల్లడైంది.

గురువారంనాడు 12 గంటల హర్తాళ్ పాటించాలన్న హిందూ సంస్థలు ఇచ్చిన పిలుపుతో అక్కడ హింస చెలరేగడం, సీపీఎం కార్యాలయాలపై దాడులు, బీడీ తయారీ కేంద్రంపైనా నాటుబాంబు విసరడం, ఆఖరికి మీడియా ప్రతినిధులపైనా దాడులకు తెగబడటం అందరినీ దిగ్భ్రాంతిపరిచింది. ఒక బీజేపీ కార్యకర్త ప్రాణాలు కోల్పోయాడు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సక్రమంగా అమలు కావాలన్న అభిప్రాయం ఉండటంలో తప్పులేదు. దాన్ని మార్చాల్సిందేనని డిమాండు చేయడమూ సబబే. కానీ తమకు దర్శనభాగ్యం కలిగించాలని ఆలయం వద్దకు చేరిన మహిళలపై దాడులు చేయడం, అలా వచ్చేవారికి రక్షణ కల్పిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వానిది మహాపరాధమన్నట్టు చిత్రించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కేరళలో బీజేపీ ప్రభుత్వం ఉన్నా, కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా ఆ పనే చేయాలి. మహారాష్ట్రలోని శనిసింగణాపూర్ శనీశ్వరాలయం ప్రధాన వేదికపైకి మహిళలను అనుమతించకూడదన్న ఆచారం రాజ్యాంగ విరుద్ధమని నిరుడు బొంబాయి హైకోర్టు తేల్చి చెప్పాక అక్కడున్న బీజేపీ–శివసేన సర్కారు దాన్ని శిరసావహించింది. రాజ్యాంగబద్ధంగా నడుచుకునే ఏ ప్రభుత్వమైనా ఆ పని చేయాల్సిందే.

స్వామి సన్నిధిలో అమలవుతున్న విధినిషేధాల సారాంశాన్ని గ్రహించకుండా వెలువరించిన తీర్పు వల్ల అక్కడ తీరని అపచారం జరుగుతుందని అయ్యప్పభక్తుల ఆందోళన పడుతున్న మాట వాస్తవం. అదే సమయంలో తాము ఎందుకు అనర్హులమని ప్రశ్నించే మహిళా భక్తులు కూడా అంతటా ఉన్నారు. వారి సంగతలా ఉంచి సీనియర్ బీజేపీ నాయకుడు సుబ్రహ్మణ్యస్వామి, కేరళ బీజేపీ ప్రధాన కార్యదర్శి కె. సురేంద్రన్ తీర్పు వెలువడిన వెంటనే దాన్ని సమర్థిస్తూ ప్రకటనలు చేశారు. ఆరెస్సెస్ సైతం ఆ పనే చేసింది. అయ్యప్ప భక్తుల మనోభావాలను గుర్తించి తమ వైఖరి మార్చుకున్నామని ఆ రెండు సంస్థలూ చెప్పినా సుబ్రహ్మణ్యస్వామి తీర్పును సమర్థిస్తూనే ఉన్నారు. ఇంతకూ సుప్రీంకోర్టు చెప్పిందేమిటి? శరీర ధర్మాల ఆధారంగా మహిళలను అడ్డుకోవటం రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనంలోని మెజారిటీ న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. మరో న్యాయమూర్తి జస్టిస్ ఇందూ మల్హోత్రా మాత్రం సెక్యులర్ దేశంలో ప్రజలు తమ విశ్వాసాలను అవి హేతుబద్ధమైనవైనా, కాకున్నా ఆచరిస్తారని...వాటిని కోర్టులు ప్రశ్నించజాలవని తీర్పునిచ్చారు. మెజారిటీ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్‌పై ఈ నెల 22న వాదనలు వింటానని ఇప్పటికే సుప్రీంకోర్టు చెప్పింది. ఆలయంలోకి మహిళలు వస్తే ప్రధాన ద్వారాలు మూసేస్తానని హెచ్చరించిన ఆలయ తంత్రిపై ఆమధ్య దాఖలైన కోర్టు ధిక్కార పిటిషన్‌నూ, ఇప్పుడు గర్భగుడిని శుద్ధిచేసిన పూజారులపై తీసుకొచ్చిన ధిక్కార పిటిషన్‌నూ అత్యవసరంగా వినేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

అయితే ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా సరిగా వ్యవహరించలేదనే చెప్పాలి. భక్తుల ప్రతినిధులతో అది చర్చలు జరిపి ఉంటే పరిస్థితి ఇంత ఉద్రిక్తంగా మారేది కాదు. తీర్పు అమలు చేయడం తమ రాజ్యాంగ విధ్యుక్తధర్మమని, ఆ తీర్పుతో విభేదిస్తున్నవారు శాంతియుతంగా ఉద్యమం చేస్తే అభ్యంతరం లేదని వారికి తెలియజేసి ఉండాల్సింది. శనిసింగణాపూర్‌లో సైతం అక్కడి గ్రామస్తులు, ఆలయ ట్రస్టు సభ్యులు మహిళల ప్రవేశంససేమిరా కుదరదని భీష్మించుకున్నప్పుడు చర్చలే సామరస్య పరిష్కారానికి దోహదపడ్డాయి. ఆ చర్చలకు శ్రీశ్రీ రవిశంకర్ మధ్యవర్తిత్వం వహించారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఎలాంటి అభిప్రాయమున్నా శబరిమల ఆందోళనలో రాజకీయ జోక్యం తగదని భావిస్తున్న హిందూ మతాచార్యులు అనేకులున్నారు. భక్తులతో మాట్లాడటానికి వారి సహాయసహకారాలు తీసుకోవాల్సింది. ఏ ఆందోళనైనా హద్దులు దాటనంతవరకూ ఆహ్వానించదగ్గదే. కానీ కేరళలో సాగిన హింస, ముఖ్యంగా అక్కడి బీజేపీ అధికార పత్రికలో ముఖ్యమంత్రి పినరాయి విజయన్ పదవినుంచి తప్పుకుని కులవృత్తి చేసుకు బతకాలంటూ వేసిన కార్టూన్ ఆందోళనలు హద్దు మీరిన తీరును సూచిస్తున్నాయి. ఇది ఎవరికీ మేలు చేయదు. సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యవహారంలో ఏం చెబుతుందన్న సంగతలా ఉంచి, ఈలోగా చర్చల ప్రక్రియ కొనసాగించటం అవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబినామ సంవత్సరం దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిరమాసం తిథి అమావాస్య తె.5.58 వరకు(తెల్లవారితే ఆదివారం) నక్షత్రం మూల ప.3.11 వరకు తదుపరి పూర్వాషాఢ వర్జ్యం రా.1.32 నుంచి3.16 వరకు దుర్ముహూర్తం ఉ.6.35 నుంచి 8.04 వరకు అమృతఘడియలు...ఉ.8.20 నుంచి 9.45 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.36
రాహుకాలం : ఉ. 9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

గ్రామాల్లో కనీస వసతులు గల్లంతు

గాలి, నీరు, కూడు అనేవి మనిషిని బతికించే కనీస అవసరాలు. గాలిని ప్రకృతి ఉచితంగానే అందజేస్తోంది. మనిషి తన ఆహారాన్ని అతడే సమకూర్చుకుంటున్నాడు. ఇకపోతే తాగునీరు ఉచితంగా దొరికేదే అయినా అది కలుషితమవ్వడంతో మంచినీటి పథకాల ద్వారా కలుషిత నీటిని రక్షిత నీరుగా మార్చి ప్రజలకు అందించడం ప్రభుత్వ విధిగా మారిపోయింది. కానీ చంద్రబాబు ప్రభుత్వంలో గ్రామాల్లో పెరగాల్సిన కనీస వసతులు కూడా తరిగిపోయినా, తమ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చినట్టు చెప్పుకుంటూ శ్వేతపత్రాలలో అంకెల గారడీ చేస్తూ గొప్పగా ప్రచారం చేసుకుంటోంది.

శ్వేతపత్రం - 8
గ్రామీణ మౌలిక వసతులపై విశ్లేషణ



ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ప్రకటించిన శ్వేతపత్రంలో 'అన్ని గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు ఇచ్చేశాం. సిమెంట్ రోడ్లు అయిపోతాయి. ఎల్‌ఈడీ బల్బులు వచ్చాయి. గ్రామీణ మౌలిక వసతులు మొత్తం గేటెడ్ కమ్యూనిటీ మాదిరిగా పెద్దఎత్తున పెట్టాం' అని ప్రకటించారు. ఒకవైపు శ్వేతపత్రాల్లో వసతులను అద్భుతంగా చిత్రిస్తుండగా, వాస్తవంలో పరిస్థితులు అధమంగా కనిపిస్తుండటం విశేషం. గ్రామీణ వసతుల కల్పనకు ఐదేళ్లలో రాష్ట్రానికి రూ.35 వేల కోట్ల కేంద్ర నిధులను కేటాయించగా, ఈ నిధుల్లో ఎక్కువ భాగం అధికార పార్టీ కాంట్రాక్టరు జేబులోకే వెళ్లిపోయాయి. పైగా ఏపీలో గ్రామీణ ఆస్తులు తాకట్టు పెట్టేశారు. పంచాయతీలపై అప్పుల బండ అదనంగా పడింది. ఇక గ్రామాల్లో సమస్యలు ఎక్కడివక్కడే పేరుకుపోయాయి. చెత్త సమస్యతో గ్రామీణులు రోగాల బారిన పడుతున్నారు. నాలుగున్నరేళ్లలో గ్రామాల్లో మంచినీటి సరఫరా ప్రాంతాలు తగ్గిపోయాయని ప్రభుత్వమే అంగీకరించిన నేపథ్యంలో శ్వేతపత్రంలో తప్పుల తడక లెక్కలను పరిశీలించాల్సిందే.

వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి పథకాల ద్వారా పూర్తి స్థాయిలో రక్షిత నీరు అందే ప్రాంతాలు 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో 2012 నాటికి 30,239 నివాసిత ప్రాంతాలు ఉండగా, 2017 డిసెంబర్ నాటికి ఆ సంఖ్య 22,685కు తగ్గిపోయింది. అంటే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో 7,554 నివాసిత ప్రాంతాలు మంచినీటి వసతికి దూరమయ్యాయి.

మంచినీటి పథకాల ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో నీరు అందే ప్రాంతాలు 17 శాతం మేర తగ్గిపోయాయని ఈ ఏడాది రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కాగ్ నివేదికలోనే స్పష్టంగా పేర్కొంది. కాగ్ 5వ నివేదిక పేజీ నంబరు 18లో గ్రాఫ్ రూపంలో పూర్తి వివరాలతో వివరించింది. పథకాల నీరు సరఫరా అయ్యే గ్రామాల సంఖ్య తగ్గిపోయిన మాట వాస్తవమేనని తెలుపుతూ 2017 డిసెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం తమకు తెలియజేసినట్టు కాగ్ తన నివేదికలో వివరించింది. వాస్తవం అది..

గాలి, నీరు, కూడు అన్నవే మనిషి కనీస అవసరాలు. గాలిని ప్రకృతి ఉచితంగానే అందజేస్తోంది. మనిషి తన ఆదాయం ద్వారా తిండిని తనే సమకూర్చుకుంటున్నాడు. తాగునీరు ఉచితంగా దొరికేదే అయినా అవి కలుషితమవ్వడంతో మంచినీటి పథకాల ద్వారా కలుషిత నీటిని రక్షిత నీరుగా మార్చి ప్రజలకు అందించడం ప్రభుత్వ విధిగా మారిపోయింది. చంద్రబాబు ప్రభుత్వంలో గ్రామాల్లో కనీస వసతులు పెరగాల్సింది పోయి తరిగిపోయినా, తమ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చినట్టు చెప్పుకుంటూ శ్వేతపత్రాలలో అంకెల గారడీ చేస్తూ గొప్పగా ప్రచారం చేసుకుంటుంది.

గ్రామాల్లో మురుగు కాల్వలు ఉన్నాయా?

రాష్ట్రంలో 12,918 గ్రామ పంచాయతీల పరిధిలో 16 వేల వరకు గ్రామాలు ఉండగా, అందులో 68 వేల కిలోమీటర్ల పొడవున అంతర్గత రోడ్లు ఉన్నాయి. ఆ రోడ్లకు రెండు వైపుల మురుగు కాల్వలు 1.36 లక్షల కిలోమీటర్ల పొడవున ఉండాలి. కానీ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు 22,565 కిలోమీటర్ల పొడవున మాత్రమే సిమెంట్ మురుగు కాల్వలు గానీ, మట్టి మురుగు కాల్వలు గానీ ఉన్నాయి. అందులో ఈ ఐదేళ్ల కాలంలో నిర్మించినవి వెయ్యి కిలోమీటర్లు కూడా లేవు. మండల కేంద్రాలతో సహా చాలా గ్రామాల్లో మురుగు కాల్వలు లేక ఇళ్ల నుంచి బయటకు వచ్చే మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. ఫలితంగా గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ జర్వాల బారిన పడేవారి సంఖ్య ప్రతి నెలా పెరుగుతోంది. 2018 ఏడాదిలో దోమల కారణంగా రాష్ట్రంలో 25 వేల మంది తీవ్ర మలేరియా వ్యాధిన పడగా, మరో 4,500 మంది డెంగ్యూ జ్వరం బారిన పడ్డారు.

గ్రామీణ వసతుల కల్పనకు రూ.35 వేల కోట్ల పైన కేంద్ర నిధులు

శ్వేతపత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అంకెల గారడీతో గొప్పలు చెప్పుకుంటూనే మాటల మధ్యలోనే కొన్ని వాస్తవాలను బయట పెట్టేశారు. రాష్ట్రంలోని 110 పట్టణ, నగర ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ ఐదేళ్లలో అనుమతులు తెలిపిన పనుల విలువ రూ. 72,707 కోట్లు అయితే, నాలుగేళ్ల ఎనిమిది నెలల్లో పూర్తి చేసినవి కేవలం రూ.5 వేల కోట్ల పనులేనని చంద్రబాబే చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఐదేళ్లలో రూ.55 వేల కోట్ల విలువ చేసే పనులకు అనుమతి తెలిపితే అందులో రూ.30 వేల కోట్ల విలువ చేసే పనులు పూర్తయ్యాయని చెప్పారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సు అమలులోకి వచ్చిన తర్వాత ఈ ఐదేళ్లలో గ్రామాలకు కేంద్రం నేరుగా విడుదల చేసే నిధుల మొత్తం బాగా పెరిగిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో వసతులకు ప్రభుత్వం ఖర్చు పెట్టిన నిధులలో ఉపాధి హామీ పథకం, గ్రామాలకు కేంద్రమిచ్చే ఆర్థిక సంఘం నిధులు, స్వచ్ఛభారత్ పథకంలో మరుగుదొడ్ల నిర్మాణానికి, జాతీయ గ్రామీణ మంచినీటి సరఫరా పథకంలో కొత్త మంచినీటి పథకాలకు కేంద్రమిచ్చిన నిధులు ఉన్నాయి. ఈ పథకాలకుగాను గత ఐదేళ్లలో కేంద్రం రాష్ట్రానికి మంజూరు చేసిన నిధులే రూ.35 వేల కోట్ల దాకా ఉన్నాయన్న అంచనా ఉంది. ఉపాధి హామీ పథకం అమలుకే రాష్ట్ర ప్రభుత్వం రూ.25,275 కోట్లు ఖర్చు పెట్టినట్లయితే, అందులో రూ.20,741 కోట్లు రాష్ట్రానికి కేంద్రమిచ్చిన నిధులే. స్వచ్ఛభారత్ పథకంలో మరుగుదొడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.4,200 కోట్లు ఖర్చు పెడితే, అందులో రూ.3,100 కోట్లను కేంద్రమే ఇచ్చింది. కేంద్ర ఆర్థిక సంఘ సిఫార్సులకు అనుగుణంగా గత ఐదేళ్లలో రూ.6,400 కోట్ల దాకా రాష్ట్రానికి విడుదల అయ్యాయి. ఎన్‌ఆర్‌డబ్ల్యూపీ, ఆర్‌జీపీఎస్, రాబనైజేషన్ (గ్రామాల పట్టణీకరణ) పథకాల ద్వారా ఐదేళ్లలో దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయలు కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చాయి. రాష్ట్రంలో ప్రతి గ్రామ పంచాయతీకి సగటున మూడు కోట్ల వరకు కేంద్ర నిధులు అందాయి. దానికి రాష్ట్ర వాటా కలిపి అభివృద్ధి పనులకు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ఆ మేరకు గ్రామాల్లో అభివృద్ధి జరిగిందా అంటే ఏ ప్రాంతంలోనూ కాలేదనే చెప్పాల్సివస్తోంది.

అవినీతి మాత్రం కొండంత

ఉపాధి హామీ పథకంలో కాంట్రాక్టర్లు అనుకున్నదానికే తావు ఉండదు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఆ పనులు జరగాలి. పథకంలో యంత్రాలు అసలు వాడకూడదు. కానీ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం నిధులన్నింటినీ అనధికారికంగా నామినేషన్ల పద్ధతిలో తెలుగుదేశం పార్టీ కింది స్థాయి నాయకులకు కాంట్రాక్టు రూపంలో అప్పగిస్తున్నారు. యంత్రాలు ఉపయోగించి బిల్లులు పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో రూ.5,694 కోట్ల ఉపాధి నిధులను గ్రామాల్లో సిమెంట్ రోడ్లకు ప్రభుత్వం ఖర్చు పెట్టినట్టు చెబుతోంది. ఆ పనులన్నింటికీ గ్రామాల్లో అధికార టీడీపీ నేతలే కాంట్రాక్టు దక్కించుకొని నాలుగో వంతు డబ్బులు తమ జేబుల్లోనే వేసుకున్నారు. ఉన్న మట్టి రోడ్లపైన మరికాస్త మట్టి వేసి కొత్త రోడ్లు వేసినట్టు చూపి ఖర్చు చూపించిన రూ.718 కోట్లలో ఎక్కువ భాగం టీడీపీ నేతల జేబుల్లోకే మళ్లాయి. రూ. 4,200 కోట్లను మరుగుదొడ్ల నిర్మాణానికి ఖర్చు పెట్టినట్లు లెక్క చెబుతున్నా, పాత వాటిని కొత్తగా నిర్మించినట్టు చూపి సగం డబ్బులు గ్రామాల్లో టీడీపీ నేతలే జేబుల్లో వేసుకున్నారు. ప్రొక్లెయిన్లు వంటి యంత్రాలు ఉపయోగించి చేసిన పనులకు ఉపాధి నిధులు చెల్లించకూడదన్న నిబంధనలు ఉండగా.. పంట కుంటల నిర్మాణంలో ప్రొక్లెయిన్లతో గుంతలు తవ్వి, వాటిని కూలీలతో తవ్వించినట్టు చూపి ఎక్కువ మొత్తంలో బిల్లులు పెట్టుకుంటూ ఉండటంతో రూ. 1,646 కోట్లలో మూడు వంతులు అక్రమార్కుల జేబులకే చేరాయి. ఈ ఐదేళ్లలో గ్రామాల్లో రూ.30 వేల కోట్ల పనులు పూర్తయితే, అందులో రూ.15 వేల కోట్లకు పైనే అవినీతి జరిగి ఉంటుందన్న అంచనా ఉంది.

ఆస్తుల తాకట్టు, అప్పుల బండ

కేంద్రం నుంచే వేల కోట్లు నిధులు వచ్చినా అంత మొత్తానికి సరిపడా గ్రామాల్లో అభివృద్ధి జరగకపోవడం ఒక ఎత్తు అయితే, మరో పక్క గ్రామాల్లో ఎన్నో సంవత్సరాల పాటు ప్రభుత్వం ఖర్చు పెట్టి నిర్మించిన ఆస్తులను ఒక్కొక్కటిగా తాకట్టు పెట్టడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైంది. కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలో మంచి నీటి పథకాల కోసం బ్యాంకులకు గ్రామాల్లోని ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి ఇప్పటికే రూ.2,500 కోట్ల రుణం తీసుకున్నారు. మిగిలిన జిల్లాల్లోని మంచినీటి పథకాలకోసం మరో రూ.13 వేల కోట్ల ఆస్తులను తాకట్టు పెట్టాలని ఆలోచన చేస్తున్నారు. దీనికి తోడు గ్రామాల్లో వీధిదీపాలకు ఉచితంగా ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పి గ్రామ పంచాయతీల వద్ద తీర్మానాలు తీసుకొని, ఇప్పుడు ఒక్కో ఎల్‌ఈడీ లైటుకు ఏడాదికి రూ.450 చొప్పున పదేళ్లలో రూ.4,500 చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామాల్లో స్తంభాలకు ఉన్న పాత ట్యూబ్‌లైట్‌ను మార్చి కొత్త ఎల్‌ఈడీలు ఏర్పాటు చేసినందుకు తెలుగుదేశం పార్టీకి సంబంధించిన కాంట్రాక్టర్‌కి ఒక్కొక్క పంచాయతీ రూ.లక్ష నుంచి నాలుగు లక్షల దాకా పదేళ్ల పాటు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

శీతాకాల మంచు తెరలు పోకముందే మంచినీటి ఎద్దడి:

పట్టణాల్లో రక్షిత మంచినీటి సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ ఏడాది శీతాకాలంలోనే తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఏర్పడింది. అనేక పట్టణాలు, నగరాల్లో ఇప్పుడే రెండు రోజులకు ఒకసారి రక్షిత మంచినీటిని సరఫరా చేస్తున్నారు. రాజధానిలో భాగమైన గుంటూరు నగరంలో రాత్రి సమయాల్లో కుళాయిలకు మంచినీటిని విడుదల చేస్తున్నారు. ఈ కారణంగా అక్కడి ప్రజలకు రాత్రి సమయంలో కంటిమీద కునుకు లేకుండా పోతోంది. చిలకలూరిపేట, గిద్దలూరు, హిందూపూర్, మార్కాపూర్, నగరి, నూజివీడు, ఒంగోలు, పలమనేరు, తిరువూరు వంటి 11 మున్సిపాల్టీల్లో రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతోంది. జాతీయ ప్రమాణాల ప్రకారం ఒక మనిషికి రోజుకు 135 లీటర్ల రక్షిత మంచినీటిని సరఫరా చేయాలి. అయితే 89 మున్సిపాల్టీల్లో ఆ మేరకు నీటి సరఫరా జరగడం లేదు. 110 మున్సిపాల్టీల్లో రోజుకు 2,025 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాల్సి ఉంటే ప్రస్తుతం 1,722 ఎంఎల్‌డీని సరఫరా చేస్తున్నారు. వేసవికాలంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం సర్వసాధారమైతే, శీతాకాలంలోనూ రోజుకు 3,709 ట్యాంకర్ల నీటిని రవాణా చేస్తున్నారు. నగరాల్లోని ప్రజలకు రక్షిత మంచినీటి ఎద్దడి లేకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం 'అమృత్ ' పథకాన్ని అందుబాటులోకి తీసుకువస్తే, ఆ పథకాన్ని తనకు కావాల్సిన నిర్మాణ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది.

హౌస్ ఫర్ ఆల్‌ను హౌస్ ఫర్ సేల్‌గా మార్చేసిన ప్రభుత్వం :

రాష్ట్రంలోని పట్టణాలు, నగరాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 5.24 లక్షల ఇళ్లను (ఫ్లాట్లు) నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే దానినీ రాష్ట్ర ప్రభుత్వం అవినీతిమయం చేసేసింది. ఇళ్ల సిఫారసుకు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు లబ్ధిదారుల నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు మామూళ్లు తీసుకున్నారు. వివాదాస్పద స్థలాలల్లో నిర్మాణాలు చేపట్టడంతో ఇళ్లు పూర్తయినా లబ్ధిదారులు గృహప్రవేశం చేయలేకపోతున్నారు. గుంటూరు రూరల్‌లోని అడవి తక్కెళ్లపాడులో ట్రిడ్‌కో 4 వేల ఇళ్లను నిర్మించింది. అయితే ఆ స్థలంపై న్యాయస్థానంలో కేసు నడుస్తుండటంతో ఇళ్ల నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులు గృహ ప్రవేశం చేయలేకపోయారు. వివాదాస్పద భూమిలో ఇళ్లు నిర్మించడంతో బ్యాంకర్లు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాలేదు. కోర్టులో కేసు తేలేవరకు లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు రావు. గృహ ప్రవేశం చేయలేరు.. మొత్తం 5.24 లక్షల లబ్ధిదారుల్లో 3.36 లక్షల మందికి రుణాలు ఇవ్వాలని జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నప్పటికీ ఇప్పటి వరకు 2,534 లబ్ధిదారులకు మాత్రమే రుణాలు మంజూరు అయ్యాయి. ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే కొన్ని నిర్మాణ సంస్థలు టెండర్ల సమయంలో సిండికేటు కావడంతో అంచనాల వ్యయం పెరిగింది. ఆ సంస్థలకు రెండేసి నగరాల్లోని ఇళ్లను నిర్మించే టెండర్లు రావడంతో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. నాగార్జున, షాపూర్‌జీ పల్లోంజీ, లార్సెన్ అండ్ టుబ్రో, వీఎన్సీ, సింప్లెక్సు సంస్థలు ప్రతీ జిల్లా టెండరులో కుమ్మక్కై, ఒక్కరికే ఆ పనులు దక్కేలా చేశాయి. నాగార్జున నిర్మాణ సంస్థకు నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లా, షాపూర్‌జీ పల్లోంజీకి కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని ఇళ్ల నిర్మాణ టెండర్లు లభించాయి. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సెంట్రింగ్ ఇతర యాంత్రిక పరికరాలు ఈ సంస్థలకు పూర్తిగా లేకపోవడంతో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం మంజూరు చేసిన 5.24 లక్షల ఇళ్లలో ఇప్పటివరకు 64,370 మాత్రమే పూర్తయ్యాయి.ప్రకాశం, చిత్తూరు, వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల్లో ఇప్పటి వరకు ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తికాలేదు.

–మేడికొండ కోటిరెడ్డి, సాక్షి ప్రతినిధి

మౌలిక వసతులు దిగదుడుపే

నగరాలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ సౌకర్యాలు మెరుగుపడాలి. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలి. సంవత్సరం క్రితం గుంటూరులో పాత కాలపు పైపులైన్ల కారణంగా కలుషిత నీటిని తాగి 12 మంది చనిపోయారు. ఈ సంఘటన నుంచి ప్రభుత్వం పాఠాలు నేర్వకపోవడంతో ప్రస్తుతం నగరాల్లోని భూగర్భ డ్రైనేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడు సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఈ పనులు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ఈ పథకాలకు సంబంధించిన పనులను ప్రారంభించే పనిలో సీఎం ఉన్నారు. గుంటూరులో రూ.930 కోట్లతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తికాకున్నా ఎన్నికల దృష్ట్యా కొన్ని ప్రాంతాలకు డ్రైనేజీ కనెక్షన్లు ఇవ్వాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రాజధాని నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి విజయవాడకు వలస వచ్చే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ప్రస్తుత జనాభా 16 లక్షలకుపైగానే ఉన్నప్పటికీ డ్రైనేజీ వ్యవస్థ మాత్రం ఆధునికీకరణకు నోచుకోలేదు. నగరంలో ప్రస్తుతం 83 కిలోమీటర్ల నిడివిలో ప్రధాన మురుగు కాల్వలు డ్రయిన్లు ఉన్నాయి. 258 కిలోమీటర్ల నిడివిలో మీడియం, 982 కిలోమీటర్ల నిడివిలో మైనర్ డ్రయిన్లు ఉన్నాయి. ఈ డ్రయిన్లు ప్రారంభంలో 12 నుంచి 18 అడుగుల వెడల్పు ఉండి ముందుకు వెళ్లే కొద్దీ నాలుగు అడుగుల వెడల్పుకు తగ్గిపోయాయి. దీనివలన వర్షం కురిసినప్పడల్లా విజయవాడ కొల్లేరులా తయారవుతోంది. దీని పరిష్కారానికి రూ.600 కోట్ల వ్యయంతో స్ట్రాం వాటర్ డ్రైనేజీ పనులు చేపట్టారు. కేవలం 50 కిలోమీటర్ల నిడివిలోనే పనులు పూర్తయ్యాయి.

అజోవిభో సాంస్కృతిక సంబరాలు

పెద్ద పండుగకి పది రోజులు ముందరే, తెనాలికి సాహిత్య నాటక సంక్రాంతి తీసుకువచ్చింది అజోవిభో ఫౌండేషన్. ఈ నెల 3న ప్రారంభమైన సభలు, ప్రదర్శనలు 6వ తేదీ వరకు కొనసాగుతాయి. ఇరవై ఆరేళ్లుగా ఏక బిగిన, కొత్త కథలను నాటికలుగా మార్చి ప్రదర్శించే కళను ప్రోత్సహిస్తూ, అటు కథల నాటికీకరణను, అలాగే, వాటిని రంగస్థలానికి ప్రదర్శన యోగ్యంగా మలుచుకునే ప్రజ్ఞను గుర్తిస్తూ, అజోవిభో ఫౌండేషన్ ఔత్సాహిక నాటక సమాజాలకు ఆలంబనగా నిలుస్తున్నది. ఈ ఏడాది డాక్టర్ మొదలి నాగభూషణ శర్మను జీవన సాఫల్య పురస్కారానికీ, ప్రముఖ కవి నగ్నముని విశిష్ట సాహితీవేత్త పురస్కారానికీ, ప్రముఖ చిత్రకారుడు గిరిధర్‌గౌడ్‌ను 'సరిలేరు నీకెవ్వరూ' పురస్కారానికి ఎంపిక చేశారు. నాలుగు రోజులపాటు పర్వదినాలుగా తెనాలిలో ఈ సమావేశాలను అజోవిభో నిర్వహిస్తున్నది. ఈ సంబరాల వార్షిక నిర్వహణను ఒక సంప్రదాయంగా కొనసాగించడం అందరికీ అనుసరణీయం.


–రామతీర్థ, విశాఖపట్టణం

తెలుగు సంగతి ఏం తేల్చారు?

ఇంటర్మీడియట్ వరకు తెలుగును ఒక తప్పనిసరి పాఠ్యాంశంగా చేసి తీరుతామని ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వాగ్దానం చేసిన విషయం తెలుగు భాషాభిమానులందరికీ గుర్తుండే ఉంటుంది. అయితే చంద్రబాబును తక్కువ మంది, కేసీఆర్‌ను ఎక్కువ మంది నమ్మారు. కేసీఆర్ కూడా ఆ వాగ్దానం అమలు చేయలేదని నేను మిత్రులతో వాదించాను. విద్యా వ్యాపారుల లాభాలకు కించిత్తు కుదుపును కూడా ఇవ్వగలిగే పరిస్థితి ఈ ప్రభుత్వాలకు లేదని నా అభిప్రాయం. హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు (డిసెంబర్ 2017) సందర్భంగా తన వాగ్దానాన్ని కేసీఆర్ గట్టిగా పునరుద్ఘాటించి అందరికీ నమ్మకం కలిగించగలిగాడు. పై వాగ్దానం తెలుగు మాధ్యమంలో చదువుల గురించి కాదు. కేవలం ఒక పాఠ్యాంశంగా తెలుగును అమలులోకి తేవడం గురించి మాత్రమే. పార్టీలకు ఇలాంటి సమస్యలు గుర్తుకు రావు. సాహిత్య, సాంస్కృతిక సంస్థలన్నా, కవులు, రచయితలన్నా ఈ విషయాన్ని చర్చనీయాంశం చేయాలి కదా!

–దివికుమార్, రేపల్లె, గుంటూరు జిల్లా.

దూరదృష్టి



శ్రీరమణ

అక్షర తూణీరం



''దేశమంటే మట్టికాదోయ్! దేశమంటే వోటర్లోయ్'' అని గురజాడని మార్చి రాసుకోవాలంటూ పార్క్ బెంచీ మీద కూర్చున్న ఓ పెద్దాయన ప్రారంభించాడు. మాట తీరులో వుపన్యాస ధోరణి కనిపిస్తోంది. చేతికర్రకి మించిన పెద్దరికం కనిపిస్తోంది. ముఖం నిండా కట్టుడివి పెట్టుడివి కనిపిస్తున్నా ఆయనలో ఆత్మవిశ్వాసం ఏమాత్రం సడల్లేదు. ''ఎందుకన్నానంటే, మనం నాలుగేళ్లుగా చూస్తున్నాం. ఎన్నికలు, గెలిచే మాయోపాయాలు, ఎన్నికలు పండించుకోడానికి కావల్సిన ఎరువు పోగేసుకోడం మీడియాల్ని కట్టుకోవడం, కుల సమీకరణాలను జాగ్రత్త చేసుకోడం, వ్యూహరచనలతో బాటు మేనిఫెస్టో రచనలు వీటితోనే నేతలకు పొద్దు గడిచి పోతోంది''. పెద్దాయన తీవ్ర కంఠంతో వక్కాణిస్తుంటే, తలపండిన నలుగురు చుట్టూ కూర్చుని ఔనన్నట్టు తలలూపుతున్నారు. ఒకరిద్దరికి వాటంతటవే తలలూగుతున్నాయి. ''ఆలికి అన్నం పెట్టడం వూరికి వుపకారమా చెప్పండి. ఎక్కడో చిన్న రోడ్డువేస్తే అత్యవసరమైన చిన్న వంతెన కడితే, కూలిపోడానికి సిద్ధంగా వున్న పాఠశాల భవనానికి కాసిని పూతలు పెడితే నేతలు బోలెడు సందడి చేస్తున్నారు. అన్నిరకాల మాధ్యమాల్లోనూ యిక ఆ వార్తలే వూదరగొట్టి వదుల్తున్నారు''. ప్రసంగానికి స్పందన బావుంది. మరి ఎందుకు ఆపుతాడు?

సాయంత్రం యింకా దోమల మేళ, చలివేళ కాలేదేమో ఆయన ధోరణి నిరాఘాటంగా సాగుతోంది.

మునుపు ఒక పార్టీ అంటే కొంతమంది నాయకులు అందులో వుండేవారు. ఇప్పుడు ''పార్టీ'' అంటే ''ఏకో నారాయణ''! ఒక్కడే వుంటాడు. ఆయనే మాట్లాడతాడు. ఆయనే విని ఆనందిస్తాడు. ఆయనే నిర్ణయాలు తీసుకుంటాడు. అందరూ చచ్చినట్టు ఆమోదిస్తారు. తెలంగాణలో కేసీఆర్ అయినా, ఏపీలో చంద్రబాబు అయినా, ఢిల్లీలో మోదీ అయినా యిదే వరస. నాలుగేళ్లనాడు మోదీ వస్తున్నాడు...యింకేవుంది పొడిచేస్తాడని అంతా కలలు కన్నారు. ఆఖరికి మహావ్యవస్థలన్నిటినీ పొడిచేసి వదిలేశాడంటున్నారు. ఆయన చాలా అద్భుతాలు చేశానని డోలక్ వాయించి మరీ అరుస్తున్నాడు. ప్రజలకు ఏ ఒక్క అద్భుతం ద్యోతకం కావడం లేదు. ఈ నిరాశామయ వాతావరణం యిట్లా వుండగా, ఒక ర్నోకరు నోటికొచ్చిన విధంగా దూషించుకోడం, వాటినీ వీటినీ పొద్దస్తమానం వింటూ కూర్చోడం రోతగా లేదూ...'' పెద్దాయన స్వరం గద్గదమైంది.

నెహ్రూల పాలన అడుగంటడానికి యిదిగో అదిగో అని యాభై ఏళ్లు పట్టింది. న.మో. గ్రాఫ్ పడిపోడానికి యాభై నెలలే ఎక్కువైంది. తపస్సంతా పదే పదే వృథా చేసుకున్న విశ్వామిత్రుడిలా మోదీ మిగిలిపోనున్నాడని నాకు అనుమానంగా వుంది. విశ్వామిత్రుడు భ్రష్టుపట్టిన వైనాలు చెప్పండని శ్రోతలు అభ్యర్థించారు. ఇవ్వాళ పొద్దులేదు. మరో రోజు చెప్పుకుందామని పెద్దాయన సమాధాన పరిచాడు. మన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులిద్దరూ ఒక ర్నొకరు ఎందుకు వుతికి ఆరేసుకుంటున్నారో మనకి అర్థం కాదు. అయితే అదంతా రాజకీయమేనని మాత్రం అస్పష్టంగా స్పష్టం అవుతోంది. చంద్రబాబు జన్మ నక్షత్రంలో చిన్న దోషం వుందిట! అందుకని అప్పట్నించి అంటే పదవి సంగ్రహించిన పట్నించి, యిప్పటిదాకా ఆయన ఏది తలపెట్టినా నీలాపనిందలైపోతున్నాయిట! ఇట్లాగని నాకో జ్యోతిషవేత్త చెప్పారు. ''అయితే దానికేం విరుగుడు లేదా'' అని ఒక శ్రోత వుత్కంఠతో అడిగాడు. పెద్దాయన ప్రశాంతంగా నవ్వి, ''లేకేం వుంది. చాలా పెద్ద పండితులు విరుగుడు చేస్తామని వచ్చారట. అయితే ఆ క్రతువు చేయడానికి పన్నెండు గంటలు పడుతుంది. చాలా దీక్షగా వుండాలి. ఆ కాసేపు పదవి తీసి పక్కన పెట్టన్నారు. అబ్బో! పన్నెండు గంటలా, ఇంకా తక్కువలో కుదర్దా అన్నాడాయన. ఏవుంది, పన్నెండు మందితో పన్నెండు కుండాల్లో పన్నెండుమంది రుత్విక్కులతో చేయిస్తే గంటచాలు అనగానే అయితే ఇరవై నలుగుర్ని రప్పించండన్నారట చంద్రబాబు. లేదండీ యీ క్రతువు తెల్సినవారు పన్నెండుగురే వున్నారని చెప్పార్ట. ఆయన నిట్టూర్చి అయితే వద్దులెండి(మనసులో రిస్కెందుకు అనుకుని) నేనీ విధంగానే ముందుకు పోతానన్నారట!'' అని ముగించి లేచాడు.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

నిన్ను నువ్వు కాపాడుకోగలవు

జ్యోతిర్మయం

అదొక అడవి. ఆ అడవిలో ఒకడు నడుచుకుంటూ పోతున్నాడు. అతనికి ఉన్నట్టుండి ఆకలి వేసింది. ఓ చెట్టుకి అనేక పళ్ళుండడం చూశాడు. అంతే అమాంతం ఆ చెట్టు ఎక్కాడు. కొన్ని పళ్ళు కోశాడు. తిన్నాడు. బాగా పండి సువాసనతో కూడిన మరి కొన్ని పళ్ళు ఓ కొమ్మ చివర్లో ఉండటం చూశాడు. వాటిని కోయడం కోసం ఓ కొమ్మ మీద ముందుకు కదిలాడు. అయితే అలా కదులుతున్నప్పుడు ఆ కొమ్మ అతని బరువు మోయలేక కాస్త వంగి విరిగింది. అయితే ఈలోపే ప్రమాదం గమనించిన అతను మరొక కొమ్మను తెలివిగా పట్టుకున్నాడు కిందకు పడిపోకుండా. అలా పట్టుకున్న తీరునే అతను కిందకు వంగి చూశాడు. అలా చూసినప్పుడు నేల చాలా కిందకు కనిపించింది. దాంతో అప్పటికే భయంతో ఉన్న అతనిలో మరింత భయం పెరిగింది. తననెవరైనా కాపాడితే బాగుంటుందని "రక్షించండి రక్షించండి" అని అరిచాడు.

ఇంతలో అటువైపుగా వచ్చిన ఓ పెద్దాయన కుర్రాడిని చూశాడు. అతని మీద ఓ చిన్న రాయి విసిరాడు. అది తగిలి నొప్పెట్టడంతో రాయి విసిరిన పెద్దాయనపై కోపమొచ్చింది. "ఓ పెద్దాయనా, సాయం చెయ్య మంటే రాయితో కొడతావా" అని కోపంగా అరుస్తాడు. పెద్దాయన జవాబేమీ చెప్పకుండా మరొక చిన్నరాయి తీసి అతనిపై విసురుతాడు. దాంతో కుర్రాడు మరింత కోపంతో అతి కష్టంమీద ప్రయత్నించి పైనున్న కొమ్మను పట్టుకుంటాడు. "కిందకు వచ్చానంటే నీ పని పడతా" అంటాడు. పెద్దాయన అప్పటికీ ఆగకుండా మరొక చిన్న రాయి విసురుతాడు. ఆ కుర్రాడు మరొక కొమ్మ పట్టుకుని వేగంగా కిందకు దిగి వస్తాడు. ఆ పెద్దాయనను తిట్టిన తిట్టు తిట్టకుండా తిడతాడు. అప్పుడు పెద్దాయన ప్రశాంతంగా ఓ నవ్వు నవ్వి "ఇదిగో నీకు నేను చేసిన సాయాన్ని నువ్వు గుర్తించలేదు" అన్నాడు.

అయోమయంగా చూస్తున్న కుర్రాడ్ని చూస్తూ.."నేను నిన్ను మొదటిసారి చూసినప్పుడు నీ ముఖాన ఉన్న భయాన్ని చూశాను. ఆ భయంతో నీ బుర్ర పని చేయలేదు. నేను రాళ్లు విసరడంతోనే నీలో క్రమంగా భయం చాటుమాటవుతూ వచ్చింది. ఎలాగైనా చెట్టు మీద నుంచి కిందకు దిగి నా పని పడదామనుకున్నావు. ఈ ఆలోచన ఎప్పుడైతే నీలో మొదలైందో నిన్ను నువ్వు కాపాడుకోవడం మొదలుపెట్టావు. అలాగే కిందకు దిగావు కూడా. నిన్ను నువ్వు కాపాడుకోగలనన్న శక్తి నీలో ఉందన్న విషయం నీకు మొదట్లో తెలీలేదు."అని చెప్తూ ఆయన నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. ఏదీ తోచని స్థితిలో ఉన్నప్పుడు మనలో గూడుకట్టుకునే భయం నుంచి బయటపడాలంటే నెమ్మదిగా ఆలోచిస్తే నిన్ను నువ్వు కాపాడుకోగలవని చెప్పడానికే ఓషో ఈ కథ చెప్పారు.

– యామిజాల జగదీశ్

ఏటా 20 ఈఎల్స్ వాడాల్సిందే!

త్వరలో కేంద్రం ఉత్తర్వులు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై ఏడాదిలో 20 ఎర్న్డ్ లీవులు(ఈఎల్స్–ఆర్జిత సెలవులు) తప్పనిసరిగా వాడుకోవలసి ఉంటుంది. పదవీ విరమణ సమయంలో అదనపు భత్యం కింద వీటిని దాచుకోవడానికి ఇకపై వీలుండదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది. కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు ఏడాదికి 30 ఈఎల్సు ఉంటాయి. ఇకపై ఏడాదికి పది ఈఎల్స్ మాత్రమే తర్వాతి సంవత్సరం సెలవుల్లో కలుస్తాయని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేయనుంది. అంటే మిగతా 20 సెలవులను వాడుకోకుంటే వృథా అవుతాయి. ప్రభుత్వ బ్యాంకులు గత ఏడాది చివరి నుంచే ఈ పద్ధతిని అమలు చేస్తున్నాయి. తమ సిబ్బందిని కచ్చితంగా పది రోజుల సెలవుపై పంపుతున్నాయి. 2019–20 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో 3.5 కోట్ల ప్రభుత్వ ఉద్యోగుల భత్యాల చెల్లింపు కోసం దాదాపు రూ.63,232 కోట్లు కేటాయించింది.

సింహానికి చిరుత దత్తత!



అహ్మదాబాద్: సాధారణంగా చిరుతపులులను చూస్తే సింహాలు వేటాడతాయి. అయితే గుజరాత్లో ఓ ఆడ సింహం చిరుత పులి పసికూనను కంటికి రెప్పలా చూసుకుంటూ దానికి పాలు కూడా ఇస్తోంది. ఇలా జరగడం చాలా అసాధారణమని అటవీ అధికారులు చెబుతున్నారు. నెలన్నర వయసున్న చిరుతకూన గిర్ అడవిలో ఎలాగో తన తల్లి నుంచి వేరుపడింది. దీనిని సింహం అక్కున చేర్చుకుంది. తన పిల్లలతోపాటే దీనికీ పాలిస్తూ, మగ సింహాల దాడి నుంచి కాపాడుతోంది. వారం క్రితం ఈ వింతను అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను కూడా విడుదల చేశారు. 'చిరుతపులి పిల్లపై ఈ సింహం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మరీ కాపాడుతోంది. అలాగే సింహం సంకేతాలు, శబ్దాలను పులి పిల్ల ఎలా అర్థం చేసుకుంటుందోనని మేం ఆశ్చర్యపోతున్నాం. ఏదేమైనా ఇది చాలా అరుదైన ఘటన' అని గిర్ అడవి పశ్చిమ విభాగ కన్జర్వేటర్ ధీరజ్ మిత్తల్ చెప్పారు.

రైల్వేలో 13,847 పోస్టులు

న్యూఢిల్లీ: రైల్వే శాఖ 13వేలకు పైగా భర్తీకి శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దేశవ్యాప్తంగా వివిధ జోన్లలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజనీర్(జేఈ), జూనియర్ ఇంజనీర్స్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), డిపో మెటీరియల్ సూపరింటెండెంట్(డీఎంఎస్), కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్(సీఎంఏ) పోస్టులు ఇందులో ఉన్నాయి. ఈ పోస్టుల వేతన స్కేలు రూ.35,400 నుంచి రూ.1,12,400గా ఉంది. '13,847 పోస్టులకు ఆర్ఆర్బీ సైట్లో నోటిఫికేషన్ ఇచ్చింది. జూనియర్ ఇంజనీర్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో మూడేళ్ల డిప్లొమా లేదా గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఇంజనీరింగ్ చేసి ఉండాలి. డిపో సూపరింటెండెంట్ పోస్టులకు గుర్తింపు పొందిన వర్సిటీ/సంస్థ నుంచి ఇంజనీరింగ్లో మూడేళ్ల డిప్లొమా చేసిన వారు అర్హులు లేదా సంబంధిత సబ్జెక్టులో ఇంజనీరింగ్ డిగ్రీ చేసిన వారు అర్హులే. జూనియర్ ఇంజనీర్(ఐటీ)పోస్టులకు పీజీడీసీఏ/బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్)/ బీటెక్(కంప్యూటర్ సైన్స్)/ డీవోఈఏసీసీ 'బీ'లెవెల్ మూడేళ్ల కోర్సు లేదా గుర్తింపు పొందిన వర్సిటీ/సంస్థ నుంచి తత్సమాన కోర్సు చేసిన వారు అర్హులు. కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టుకు ఫిజిక్స్, కెమిస్ట్రీతో బ్యాచిలర్ డిగ్రీ చేసిన 45 శాతం మార్కులు పొందిన వారు అర్హులు. ఈ 2వ దశ రిక్రూట్మెంట్ ఆన్లైన్ దరఖాస్తుకు ఆఖరి తేదీ జనవరి 31' అని పేర్కొంది. ఈ పోస్టులకు జనవరి 1, 2019 నాటికి 18–33 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు అర్హులని నోటిఫికేషన్లో తెలిపింది.



సెప్టెంబర్లో ప్రారంభంకానున్న బీజింగ్లోని అధునాతన డాక్సింగ్ ఎయిర్పోర్ట్ ఇది. ప్రపంచంలోని పెద్ద ఎయిర్పోర్టుల్లో ఒకటికానుంది.

రైళ్లలో బిల్లు ఇవ్వకుంటే భోజనం ఫ్రీ

న్యూఢిల్లీ: రైళ్లలో ఇకపై ఆహారపదార్థాల జాబితాను ధరలతో సహా రైళ్లలో ప్రదర్శించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. 'బిల్లు ఇవ్వకుంటే మీ భోజనం ఉచితమే. దయచేసి టిప్ ఇవ్వకండి' అనే సందేశాన్ని టీసీ ప్లేట్లపై ముద్రించనున్నారు. రైల్వేమంత్రి గోయల్ అధ్యక్షతన రైల్వేబోర్డు, జోనల్ మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లతో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రైళ్లలో అన్ని సాధారణ ఫిర్యాదుల కోసం ఒకే హెల్ప్లైన్ నంబర్ను అందుబాటులోకి తీసుకొస్తామని గోయల్ అన్నారు. ప్రస్తుతం 723 స్టేషన్లకు ఉచిత వైఫై సౌకర్యాన్ని 2వేల స్టేషన్లకు విస్తరించాలని ఆదేశించారు. ఈ ఏడాది మార్చికల్లా రైళ్లలో కేటరింగ్ సిబ్బందికి పాయింట్ ఆఫ్ సేల్(పీవోఎస్)యంత్రాలను అందిస్తామని వెల్లడించారు.

యూపీలో ఎస్పీ–బీఎస్పీ సీట్ల ఖరారు!

న్యూఢిల్లీ: వచ్చే లోక్సభ ఎన్నికల్లో సీట్ల పంపకం ఒప్పందంపై బీఎస్పీ అధినేత్రి మాయావతి, ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్ మరింత చేరువయ్యారు. ప్రతిపాదిత కూటమిపై తుది చర్చలు జరిపేందుకు మాయావతితో అఖిలేశ్ శుక్రవారం ఢిల్లీలో సమావేశమైనట్లు ఎస్పీ వర్గాలు చెప్పాయి. దీనిపై ఇరు పార్టీల నుంచీ అధికారిక ప్రకటనేదీ రాలేదు. ఉత్తరప్రదేశ్లో మొత్తం 80 లోక్సభ సీట్లుండగా ఈ ఇరు పార్టీలు చెరో 37 స్థానాల్లో పోటీ చేసి, మిగిలిన 6 సీట్లను కాంగ్రెస్, రాష్ట్రీయ లోక్దళ్ వంటి పార్టీలకు వదిలేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కాంగ్రెస్కు అమేథీ, రాయ్బరేలీ సీట్లు ఇచ్చే చాన్సుంది.

10న 'అయోధ్య' విచారణ తేదీ ఖరారు



న్యూఢిల్లీ: అయోధ్య భూ వివాదం కేసుల విచారణ తేదీని తాము ఏర్పాటు చేయబోయే ధర్మాసనం ఈ నెల 10వ తేదీన నిర్ణయిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్కే కౌల్ల ధర్మాసనం ఈ అంశంపై శుక్రవారం విచారణ చేపట్టింది. వివిధ పక్షాల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, రాజీవ్ ధన్వాన్ తమ వాదనలు వినిపించకుండానే కేవలం 30 సెకన్లలోనే ధర్మాసనం ఈ నిర్ణయం వెలువరించింది.

సీబీఐ జేడీ బదిలీ.. వెంటనే నిలిపివేత

న్యూఢిల్లీ: ఉన్నతాధికారుల అవినీతి ఆరోపణలతో పరువు పోగొట్టుకున్న సీబీఐ..శుక్రవారం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్తానాపై తీవ్ర అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న జాయింట్ డైరెక్టర్ వి.మురుగేశన్ను మరో కేసు దర్యాప్తునకు బదిలీ చేస్తూ శుక్రవారం సీబీఐ అంతర్గత ఉత్తర్వు జారీ చేసింది. అనంతరం కొన్ని నిమిషాల్లోనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. మురుగేశన్ను అవినీతి వ్యతిరేక విభాగం నుంచి ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేస్తున్నట్లు సీబీఐ ఇన్చార్జి డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు వెలువరించిన ఉత్తర్వు మీడియాకు లీకైంది. బొగ్గు కుంభకోణం కేసుల దర్యాప్తును వేగవంత చేయటానికి గాను ఆయన్ను ఆ విభాగానికి మార్చుతున్నట్లు అందులో పేర్కొన్నారు.

అమెరికాలో 3 లక్షల ఉద్యోగాల సృష్టి



వాషింగ్టన్: అమెరికాలో గత డిసెంబర్లో కొత్తగా సుమారు 3 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించినట్లు అధికారిక నివేదిక ఒకటి వెల్లడించింది. దేశంలో నిరుద్యోగిత రేటు 3.9 శాతంగా నమోదైందని, వ్యవసాయేతర రంగాల్లో కొత్తగా 3.12 లక్షల ఉద్యోగాలు వచ్చాయని బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ తన నెలవారీ నివేదికలో పేర్కొంది. అమెరికా తొలిసారిగా 150 మిలియన్ జాబ్ మార్కును అందుకుందని కార్మిక శాఖ మంత్రి అలెగ్జాండర్ పేర్కొన్నారు.

ట్రంప్కు గట్టి ఎదురుదెబ్బ: సీనియర్ డెమొక్రాట్, భారత్ అనుకూల నేతగా పేరున్న నాన్సీ పెలోసీ(78) అమెరికా ప్రతినిధుల సభ(హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) స్పీకర్గా రెండోసారి ఎన్నికయ్యారు. దీంతోపాటు ట్రంప్ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే పెలోసీ నేతృత్వంలో సమావేశమైన సభ 'షట్డౌన్'కు ముగింపు పలుకుతూ మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి నిధుల కేటాయింపు లేకుండానే బిల్లును ఆమోదించింది.

13 'జూ'ల గుర్తింపు రద్దు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ..

న్యూఢిల్లీ: రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు సహా వివిధ రాష్ట్రాల్లోని మొత్తం 13 జంతు ప్రదర్శన శాల (జూ)ల గుర్తింపు రద్దయ్యింది. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఈ జంతు ప్రదర్శన శాలలు పనిచేయకపోవడం, అక్కడి జంతువుల ఆరోగ్యం కోసం కేంద్ర జూ సంస్థ (సీజెడ్ఏ) వాటి గుర్తింపును రద్దు చేసిందని పర్యావరణ శాఖ సహాయ మంత్రి మహేశ్ శర్మ శుక్రవారం లోక్సభకు చెప్పారు. గుర్తింపు రద్దయిన వాటిలో ఆంధ్రప్రదేశ్లోని కాకినాడలో ఉన్న డీర్ పార్క్ ఎన్సీఎఫ్ఎల్, తెలంగాణలోని డీర్ పార్క్ కేశోరాం సిమెంట్, సంఘీ మినీ జూ, కర్ణాటకలోని తుంగభద్ర మినీ జూ, శ్రీ క్షేత్ర సాగల్ సౌండట్టి, తమిళనాడులోని కోయంబత్తూరులో ఉన్న వీఓసీ పార్క్ మినీ జూ మొదలగునవి ఉన్నాయి.

కేజ్రీవాల్కు ఆదరణ పెరుగుతోంది: సర్వే

న్యూఢిల్లీ: ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వంపై ప్రజాదరణ పెరుగుతున్నట్లు 'ఇండియా టుడే' చేపట్టిన పొలిటికల్ స్టాక్ ఎక్స్ఛేంజి సర్వేలో వెల్లడైంది. గత అక్టోబర్లో చేపట్టినప్పటి కంటే తాజా సర్వేలో 2 శాతం వరకు ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత పెరిగిందని తేలింది. సుమారు 49% మంది ప్రజలు కేజ్రీవాల్ పాలన సంతృప్తికరంగా ఉన్నట్లు వెల్లడించారు. తదుపరి సీఎం ఎవరన్న ప్రశ్నకు కేజ్రీవాల్ వైపే అత్యధికులు మొగ్గు చూపగా, ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు మనోజ్ తివారీ, మాజీ సీఎం షీలా దీక్షిత్ ఉన్నారు. ప్రధాని పదవికి మోదీకి 49% మంది, రాహుల్ 40% మంది అనుకూలంగా సమాధానమిచ్చారు. ఈ సర్వేను యాక్సిస్ మై ఇండియా సంస్థ 2018 డిసెంబర్ 27– 2019 జనవరి 3 మధ్య చేసింది.

రఫేల్పై మళ్లీ వాగ్యుద్ధం

- ప్రధాని నోరు విప్పాలి: కాంగ్రెస్
- ముడుపులు ముట్టనందుకే ఒప్పందానికి అడ్డుపడ్డ యూపీయే: సీతారామన్
- బోఫోర్స్తో మునిగిన కాంగ్రెస్.. రఫేల్తో మోదీకి తిరిగి అధికారమని వ్యాఖ్య




రఫేల్పై చర్చ సందర్భంగా రాహుల్, ఖర్గే, కాంగ్రెస్ సభ్యులు. ప్రసంగిస్తున్న సీతారామన్

న్యూఢిల్లీ: రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై శుక్రవారం లోక్సభలో అధికార, విపక్షాల మధ్య మరోసారి వాడివేడి చర్చ జరిగింది. ఈ ఒప్పంద విషయమై కేంద్రం సుప్రీంకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చిందని, ప్రధాని స్పందించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ముడుపులు అందని కారణంగా కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ప్రభుత్వం రఫేల్ ఒప్పందాన్ని అడ్డుకుందని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఆరోపించారు. ఎన్డీయే హయాంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే రక్షణ శాఖ పనిచేస్తోందని పరోక్షంగా యూపీయే నాటి బోఫోర్స్, అగస్టా వెస్ట్ల్యాండ్ కుంభకోణాల్ని ప్రస్తావించారు. బోఫోర్స్తో కాంగ్రెస్ అధికారం కోల్పోయిందని, కానీ రఫేల్తో మోదీ మళ్లీ ప్రధాని అవుతారని పేర్కొన్నారు.

1.30 లక్షల కోట్ల కుంభకోణం: కాంగ్రెస్

కల్పిత కాగ్ నివేదికను ఉటంకించి సుప్రీంకోర్టును కేంద్ర ప్రభుత్వం తప్పుదోవపట్టించిందని కాంగ్రెస్ మండిపడింది. లోక్సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ..ప్రధాని మోదీ తన సన్నిహితుడికి ఆఫ్సెట్ కాంట్రాక్టును కట్టబెట్టారని, ఈ మొత్తం వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. 'రఫేల్ ఒప్పందంలో రూ.1.30 లక్షల కోట్ల కుంభకోణం ఇమిడి ఉంది. ఈ ఒప్పందంపై చర్చించేందుకు మోదీ..ఏఏ(అనిల్ అంబానీ)ని తన విమానంలోనే తీసుకెళ్లారు. పార్లమెంట్ కోర్టులోనే నిజాన్ని నిగ్గు తేల్చాలి. ప్రధాని పార్లమెంట్కు వచ్చి సమాధానం చెప్పే వరకు సమస్య పరిష్కారం కాదు. అవసరం లేని చోట మాట్లాడే మోదీ..దేశం ఆయన మాటలు వినాలనుకున్నప్పుడు మౌనం వహిస్తున్నారు' అని ఖర్గే అన్నారు.

బోఫోర్స్ కుంభకోణం..రఫేల్ డీల్..

రఫేల్లో ఎలాంటి స్కాం లేదని, జాతీయ భద్రత కోసం కుదుర్చుకున్న ఆ ఒప్పందంపై అసత్య ప్రచారం చేస్తూ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. యూపీయే నాటి రక్షణ ఒప్పందం బోఫోర్స్ ఒక కుంభకోణమని, కానీ రఫేల్ ఒక ఒప్పందమని వ్యాఖ్యానించారు. యూపీయే హయాంలో రఫేల్పై జరిగిన బేరసారాలను ప్రస్తావిస్తూ..'రఫేల్ ఒప్పందం మీకు నచ్చలేదు. దాని నుంచి మీకు ఎలాంటి ముడుపులు రాలేదు. అందుకే, ఓ వైపు వైమానిక దళం ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కీలకమైన రఫేల్ ఒప్పందాన్ని చాలా రోజుల పాటు అడ్డుకున్నారు. కాంగ్రెస్ ఒప్పందాల్లో క్యూ(ఖత్రోచి), ఆర్వీ(రాబర్ట్ వాద్రా) ఉన్నారు' అని మండిపడ్డారు. బోఫోర్స్తో కాంగ్రెస్ ఓటమిపాలవగా, రఫేల్తో బీజేపీ మళ్లీ అధికారంలోకి వచ్చి సరికొత్త భారత్ను నిర్మిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్లైఅవే(ఎగరడానికి సిద్ధంగా ఉన్న) విధానంలో 36 యుద్ధ విమానాల్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి వైమానిక దళమే సూచించిందని గుర్తు చేశారు. యూపీయే హయాంలో ఫ్లైఅవే విధానంలో కేవలం 18 విమానాలే కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. 126 యుద్ధ విమానాల కొనుగోలు విషయంలో సొంత పార్టీ ఖజానా ప్రయోజనాల కోసం కాంగ్రెస్ దేశ భద్రతపై రాజీపడిందని ఆరోపించారు.

2019 లోక్సభ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తే రఫేల్ ఒప్పందంపై విచారణ చేపడతామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. దోషుల్ని శిక్షించకుండా వదిలిపెట్టమని హెచ్చరించారు. పార్లమెంట్ బయట ఆయన మీడియాతో మాట్లాడుతూ...రఫేల్పై చర్చకు రాకుండా ప్రధాని మోదీ పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. రఫేల్ ఒప్పందంపై విచారణ జరపడం తమ పరిధిలో లేదని మాత్రమే సుప్రీంకోర్టు చెప్పిందని, కానీ అసలు విచారణే వద్దని ఆదేశించలేదని అన్నారు. కొనుగోలు

మేమొస్తే రఫేల్పై దర్యాప్తు: రాహుల్

చేయాల్సిన విమానాల్ని 126 నుంచి 32కు ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. లోక్సభలో సీతారామన్ వివరణ ఇచ్చిన తరువాత రాహుల్ స్పందిస్తూ..రఫేల్ ఒప్పందంపై తాను సంధించిన ప్రశ్నలకు ఆమె బదులివ్వలేదని తెలిపారు. 'ప్రధాని పార్లమెంట్కు రారు. గోవా ముఖ్యమంత్రేమో రఫేల్ ఫైల్స్ తన వద్ద ఉన్నాయని అంటున్నారు. రక్షణ మంత్రి రెండు గంటలు ప్రసంగించినా నేను అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం చెప్పలేదు' అని రాహుల్ అన్నారు.

ఎన్ఆర్సీపై ప్రధాని భరోసా

- నిజమైన పౌరులందరికీ ఎన్ఆర్సీలో చోటు
- అస్సాం ప్రజలకు ప్రధాని హామీ



ఇంఫాల్లో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

ఇంఫాల్/సిల్చార్: నిజమైన పౌరులందరికీ జాతీయ పౌర రిజిస్టర్(ఎన్ఆర్సీ)లో చోటు దక్కుతుందనిఅస్సాం ప్రజలకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. పౌరసత్వ బిల్లుకు త్వరలోనే పార్లమెంటు ఆమోదం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న లోక్సభ ఎన్నికల కోసం ఈశాన్య భారతంలో ప్రచారానికి మోదీ శుక్రవారం అస్సాంలో శంఖారావం పూరించారు. మణిపూర్లోనూ ఆయన పర్యటించి పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. అస్సాంలోని సిల్చార్ సమీపంలో నిర్వహించిన 'విజయ సంకల్ప సమావేశం'లో మోదీ మాట్లాడారు. 'ఎన్ఆర్సీని రూపొందిస్తున్నప్పుడు అనేకులు ఎదుర్కొన్న ఇబ్బందులు నాకు తెలుసు. కానీ నిజమైన పౌరులెవ్వరికీ అన్యాయం జరగదని నేను మీకు హామీనిస్తున్నా. ఇటీవలి పంచాయతీ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లేసినందుకుగాను నేను ఈ రాష్ట్ర ప్రజలకు రుణపడి ఉన్నా' అని అన్నారు. లోక్సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ మొత్తం 100 రోజుల్లో 20 రాష్ట్రాల్లో ప్రచారం నిర్వహించనున్నారు.

పనితీరును మార్చేశాం..

2014లో తాము అధికారంలోకి వచ్చాక దేశంలో ప్రభుత్వ సంస్థలు, ఉద్యోగుల పనితీరును మార్చేశామని మోదీ మణిపూర్లో చెప్పారు. ఈ ఈశాన్య రాష్ట్రంలో మోదీ ఎనిమిది కీలక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి మరో నాలుగింటికి శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వాలు శంకుస్థాపనలు చేసి వదిలేసిన రూ. 12 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను మేం ముందుకు తీసుకెళ్లాం. గత 4 దశాబ్దాల్లో మణిపూర్కు అభివృద్ధి ఫలాలను నాటి ప్రభుత్వాలు దక్కనివ్వలేదన్నారు. త్వరలో ఈశాన్య రాష్ట్రాల రాజధానుల మధ్య రైల్వే అనుసంధానత కల్పిస్తామని మోదీ చెప్పారు.

దరఖాస్తు చేసినా అటెంప్టే!

సివిల్స్పై యూపీఎస్సీ ప్రతిపాదన



న్యూఢిల్లీ: ఇకపై సివిల్ సర్వీసెస్ పరీక్షలకు దరఖాస్తు చేసినా దానిని ఒక ప్రయత్నం (అటెంప్ట్)గానే పరిగణించాలని యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) తాజాగా ప్రతిపాదించింది. నిబంధనల ప్రకారం ఏ కులపరమైన రిజర్వేషన్లూ లేని అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసేందుకు ఆరుసార్లు మాత్రమే ప్రయత్నించొచ్చు (ఆరు అటెంప్టులు). నిర్దేశిత వయసు నిబంధనలకు లోబడి ఓబీసీలు అయితే 9 సార్లు, ఎస్సీ, ఎస్టీలు ఎన్నిసారైనా సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసుకోవచ్చు. అయితే ప్రస్తుతం దరఖాస్తు చేశాక, అభ్యర్థి కనీసం ప్రాథమిక పరీక్షలోని ఒక్క పేపర్కైనా హాజరైతేనే దానిని ప్రయత్నం (అటెంప్ట్)గా పరిగణిస్తున్నారు. మరోవైపు పరీక్ష ఫీజు తక్కువగా ఉండటం, అందరు మహిళా అభ్యర్థులతోపాటు ఎస్సీ, ఎస్టీలు, వికలాంగులు తదితరులకు అస్సలు ఒక్క రూపాయి కూడా ఫీజు లేకపోవడంతో లక్షల సంఖ్యలో యూపీఎస్సీకి దరఖాస్తులు వస్తున్నా పరీక్షకు మాత్రం వారిలో సగం మందే హాజరవుతున్నారు. యూపీఎస్సీ మాత్రం దరఖాస్తు చేసిన వారందరికీ ప్రశ్నపత్రాలను ముద్రించడం, పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం కోసం ఖర్చు భారీగా అవుతోంది.దరఖాస్తును కూడా ప్రయత్నంగానే పరిగణిస్తే అభ్యర్థులకు అవకాశాలు తగ్గిపోతాయి కాబట్టి నిజంగా పరీక్ష రాయాలనుకునే వారే దరఖాస్తు చేస్తారనేది యూపీఎస్సీ వాదన. 2016లో 11.35 లక్షల దరఖాస్తులు రాగా 4.59 లక్షల మంది మాత్రమే ప్రాథమిక పరీక్షలు రాశారు.

'ఆధార్' సవరణకు లోక్సభ ఆమోదం

న్యూఢిల్లీ: ఆధార్, రెండు అనుబంధ చట్టాల సవరణ బిల్లుకు లోక్సభ శుక్రవారం ఆమోదం తెలిపింది. దీని ప్రకారం బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు, మొబైల్ కనెక్షన్ పొందేందుకు పౌరులు ఆధార్ వివరాలు సమర్పించాల్సిన అవసరం లేదు. మొబైల్, బ్యాంకు సేవలకు ఆధార్ తప్పనిసరి కాదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా చట్టంలో ఈ సవరణ చేశారు. ఆధార్తో పాటు టెలిగ్రాఫ్, మనీ ల్యాండరింగ్ నిరోధక చట్టాల్లో సవరణలు చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తన ఆధార్ కార్డు చూపుతూ 'నా ఆధార్ కార్డులో నా పేరు, చిరునామా, నా తండ్రి పేరు మాత్రమే ఉన్నాయి. నా కులం, మతం, ఆరోగ్య పరిస్థితి ఇందులో లేవు. భారతీయులందరి ఆధార్ సురక్షితం. కోర్టు ఆదేశాలను పాటిస్తున్నాం' అని భావోద్వేగంతో మాట్లాడారు.

సవరణ చట్టంలో ఏముందంటే..

- 18 ఏళ్లు నిండిన తరువాత ఆధార్ను రద్దుచేసుకునేందుకు మైనర్లకు అవకాశం.
- ఆధార్ వినియోగంలో నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు
- పౌరులు స్వచ్ఛందంగా సమకూర్చిన బయోమెట్రిక్ వివరాలు, ఆధార్ సంఖ్యను సర్వీస్ ప్రొవైడర్లు భద్రపరచరాదు
- ఆధార్ లేని కారణంగా బ్యాంక్, మొబైల్ సేవల్ని నిరాకరించరాదు
- వినియోగదారుల ఐడీ ధ్రువీకరణ కోసం మొబైల్ కంపెనీలు ఆధార్తో పాటు పాస్పోర్ట్ లేదా కేంద్రం జారీచేసే ఇతర పత్రాల్ని కూడా పరిశీలించొచ్చు

సైన్స్ కాంగ్రెస్లో టైమ్ క్యాప్సూల్

జలంధర్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వేదిక లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ(ఎల్పీయూ)లో శుక్రవారం ఒక చారిత్రక ఘట్టం నమోదు అయింది. ప్రస్తుతం మనుషులు రోజూ వాడుతున్న పరికరాలను టైమ్ క్యాప్సూల్(కాలనాళిక)లో ఉంచి భూగర్భంలో నిక్షిప్తం చేశారు. నోబెల్ అవార్డు గ్రహీతలు డంకన్ హాల్డెన్, అవ్ రామ్ హెర్ష్కోవ్, థామస్ సుడాఫ్ ఒక మీట నొక్కగానే ప్రత్యేకంగా తయారైన ఉక్కు అల్మారా భూమికి పది అడుగుల లోతైన గుంతలోకి వెళ్లింది. ఎల్పీయూలోని యునిపోలిస్ ఆడిటోరియంలో నిక్షిప్తమైన క్యాప్సూల్ను 100 సంవత్సరాల తర్వాత తెరుస్తారు. స్మార్ట్ఫోన్, ల్యాప్ టాప్, డ్రోన్, వీఆర్ గ్లాస్, ఎలక్ట్రిక్ కుక్ టాప్లతో పాటు భారత శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన పురోగతికి గుర్తుగా మంగళ్యాన్, తేజస్ యుద్ధ విమానం, బ్రహ్మోస్ క్షిపణి నమూనాలను అందులో దాచినట్లు ఎల్పీయూ చాన్స్లర్ అశోక్ మిట్టల్ తెలిపారు.

మెచ్చినట్లుగా ముత్యాల తయారీ!

ముత్యపు చిప్పలోకి ప్రత్యేక పద్ధతిలో ముత్యపు కేంద్రకాన్ని చొప్పించడం ద్వారా మనకు నచ్చిన ఆకారంలో ముత్యాలను తయారు చేసుకోవచ్చునని భారత వ్యవసాయ పరిశోధన సమాఖ్య (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జేకే జెన్నా తెలిపారు. వినాయకుడి విగ్రహం మొదలుకొని వేర్వేరు ఆకారాల్లో వీటిని తయారు చేయవచ్చని తెలిపారు. పరిజ్ఞానం 15 ఏళ్లుగా ఉన్నా మానవవనరుల కొరత కారణంగా ప్రాచుర్యం పొందలేదన్నారు.



మంచు మహానగరం

చైనాలోని హర్బిన్ పట్టణంలో జరుగుతున్న స్నో ఫెస్టివల్లో ప్రదర్శనకు ఉంచిన మంచు కళాఖండాలు. చారిత్రక ప్రదేశాలు, పక్షులు తదితర నిర్మాణాల్ని చూసేందుకు సందర్శకులు తరలివచ్చారు.

సన్నిధానంలో శ్రీలంక మహిళ

- గురువారం అర్ధరాత్రి అయ్యప్పకు పూజలు
- దీనిపై సీఎం ఆఫీసు, భక్తురాలి భిన్న వాదనలు
- బోర్డు సభ్యుడి ఇంటిపై పెట్రోల్ బాంబు దాడి



ఇరుముడితో శశికళ

శబరిమల: శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలోకి ఇద్దరు మహిళల ప్రవేశంతో కేరళలో రాజుకున్న ఉద్రిక్తత శుక్రవారం కూడా కొనసాగింది. దేవస్థానం బోర్డు సభ్యుడి ఇంటితో పాటు మరికొన్నిచోట్ల ఆందోళనకారులు పెట్రోల్ బాంబులు విసిరి అలజడి సృష్టించారు. ఈ సందర్భంగా శబరిమల అయ్యప్పస్వామిని శ్రీలంకకు చెందిన శశికళ(47) అనే మహిళ దర్శించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని కూడా విడుదల చేశారు. గురువారం అర్ధరాత్రి శశికళ గుడిలోకి చేరుకుని పూజలు నిర్వహించినట్లు కేరళ సీఎం కార్యాలయం తెలిపింది. భర్త శరవణ్, కుమారుడు దర్శన్తో కలిసి ఆమె ఆలయానికి వచ్చారని వెల్లడించింది. మరోవైపు అయ్యప్పస్వామిని దర్శించుకున్నారన్న వాదనల్ని శశికళ ఖండించారు. తాను స్వామివారి దర్శనానికి వెళ్లేందుకు యత్నించినప్పటికీ పోలీసులు అనుమతించలేదని అన్నారు. ఆలయానికి రాక ముందు తాను 41 రోజుల వ్రతం పాటించానని వెల్లడించారు. స్వామి దర్శనానికి వెళ్లినప్పుడు భక్తుల నుంచి ఎలాంటి నిరసనలు ఎదురుకాలేదని పేర్కొన్నారు. 'పోలీస్ అధికారులు నన్ను ఎందుకు అనుమతించలేదు? మీరంతా(మీడియా) నా చుట్టూ ఎందుకు నిలబడ్డారు? నేను ఎవరికీ భయపడను' అని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో కుమారుడితో కలిసి తాను మాత్రమే అయ్యప్ప స్వామిని దర్శించుకున్నానని శశికళ భర్త శరవణ్ స్పష్టం చేశారు. మరోవైపు భద్రతా కారణాలతోనే శశికళ అలా చెప్పి ఉంటారని అధికార వర్గాలు తెలిపాయి. అయ్యప్పస్వామి దర్శనానికి శుక్రవారం శబరిమల వచ్చిన కయాల్ అనే ట్రాన్స్జెండర్ను భక్తుల ఆందోళనల నేపథ్యంలో పోలీసులు వెనక్కి పంపారు. బిందు, కనకదుర్గ అనే మహిళలు అయ్యప్పస్వామిని దర్శించుకోవడానికి నిరసనగా కొందరు దుండగులు శుక్రవారం తెల్లవారుజామున మలబార్ దేవస్థానం బోర్డు సభ్యులు కె.శశికుమార్ ఇంటిపై పెట్రోల్ బాంబు విసిరి పరారయ్యారు. అలాగే పతనంతిట్ట ప్రాంతంలోని ఓ మొబైల్ షాపుపై పెట్రోల్ బాంబు దాడి జరిగింది.

200 మంది అరెస్ట్!

సీపీఎం, బీజేపీ కార్యకర్తల మధ్య హింస తీవ్రంగా చెలరేగుతున్న కన్నూర్లో 200 మంది ఆందోళనకారుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ అల్లర్లు, గొడవల నేపథ్యంలో 801 కేసులు నమోదు చేసిన పోలీసులు.. 1,369 మంది ఆందోళనకారులను అరెస్ట్ చేశారు. పాలక్కడ్తో పాటు కసర్గోడ్ జిల్లా మంజేశ్వరమ్లో నిషేధాజ్ఞలు విధించారు. శబరిమల ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్లలోపు వయసున్న మహిళలు ప్రవేశించరాదని ఉన్న నిషేధాన్ని సుప్రీంకోర్టు 2018, సెప్టెంబర్లో కొట్టివేసిన సంగతి తెలిసిందే.

ప్రతిపక్ష నేత హత్యకు కుట్ర కేసులో... 10 అంకాలు

అక్టోబరు 25, 2018..

మ.12.45 గం.-12.48 గం. : విశాఖపట్నం విమానాశ్రయంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావు హత్యాయత్నానికి పాల్పడ్డాడు.

మ.1.30గం. : డీజీపీ ఆర్పీ ఠాకూర్ విజయవాడలో మీడియాతో మాట్లాడారు. నిందితుడు పేరు, ఊరు వెల్లడించి అతను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు, జగన్ అభిమాని అని ప్రకటించారు. ప్రచారం కోసమే హత్యాయత్నం చేశాడని వెల్లడించారు.

మ.2గం. : వైఎస్‌జగన్ బొమ్మతో ఉన్న ఫ్లెక్సీని ముగ్గురు మంత్రులు మొబైల్‌లో చూపించారు.

(సా.4 గంటలు దాటిన తర్వాత సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 4.30 గంటలకు ఎఫ్ఐఆర్ నమోదైంది. సీఆర్‌పీసీ-156 ప్రకారం.. ఎఫ్ఐఆర్ రిజిస్టర్ అయిన తర్వాత విచారణకు అవకాశం ఉంటుంది. సా.4.30 వరకు నిందితుడిని తమ కస్టడీకి ఇవ్వలేదని సీఎం చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. స్వయంగా సీఎంయే నిందితుడిని 4.30 తర్వాత కస్టడీలోకి తీసుకున్నామని చెబితే... అంతకు 3 గంటల ముందే డీజీపీ, మంత్రులు అన్ని వివరాలు ఎలా చెప్పగలిగారు?)

మ.3.30గం. : తూర్పుగోదావరి జిల్లా ఠాణేలంకలోని నిందితుడు శ్రీనివాసరావు నివాసానికి చేరుకున్న స్థానిక టీడీపీ నేతలు. శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ అభిమాని అని ప్రకటన. మారుమూల ఉన్న ఆ ఇంటికి అంత తక్కువ సమయంలో ఎలా చేరుకోగలిగారు?

రాత్రి 7గం. : సీఎం చంద్రబాబు తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. సానుభూతి కోసమే వైఎస్ జగన్‌పై హత్యాయత్నం నాటకం ఆడారని ప్రకటించారు.



1 ఏడాదిన్నర క్రితమే హత్యకు కుట్ర..



...యాన్ని చెప్పకనే చెబుతోంది. ఆ ఇంటి నిర్మాణానికి అధికార పార్టీ నుంచి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడం.. ఠానేలంకలోని నిందితుడి కుటుంబం నిర్మిస్తున్న ఇంటిని చూస్తే స్పష్టంగా కనిపిస్తుంది. సాధారణంగా రోజువారీ కూలీ మీద జీవనం సాగిస్తున్న కుటుంబం ఉన్నట్లుండి ఇంటి నిర్మాణానికి రూ.20 లక్షలు వ్యయం చేయడానికి సిద్ధపడటం అనుమానాలను రేకెత్తిస్తోంది. నిందితుడి కుటుంబం ఠానేలంక గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం చేపట్టి 60 శాతానికి పైగా పూర్తిచేసింది. ఇప్పటివరకు రూ.12 లక్షలు ఖర్చు చేశామని నిందితుడి తల్లి సావిత్రమ్మ చెప్పారు. ప్రభుత్వం నుంచి గృహ నిర్మాణ పథకం కింద అందింది రూ.2 లక్షల లోపే. మిగతా రూ.10 లక్షలు వారి చేతి నుంచే పెట్టారు.

Q **విపక్ష నేతను హత్య చేయడానికి రూపొందించిన ప్రణాళికలో నిందితుడు శ్రీనివాసరావును 'ఇన్‌స్ట్రుమెంట్'గా వాడటానికి అప్పుడే ఎంపిక చేసుకున్నారని 'ఇంటిగుట్టు' చెప్పకనే చెబుతోంది. నిందితుడి కుటుంబానికి ఉన్నట్లుండి అంత సొమ్ము ఎలా వచ్చిందనే దిశగా 'సిట్' దర్యాప్తు ఎందుకు చేయలేదు?**

2 నిందితుడి కుటుంబం పక్కా టీడీపీ..

పీఎంఏవై-ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద ఠానేలంకలో 143 ఇళ్ల నిర్మాణానికి అనుమతిస్తే.. అవన్నీ టీడీపీ కార్యకర్తలకు, ఆ పార్టీ సానుభూతిపరులకే దక్కాయి. ఈ పథ...

వైఎస్సార్‌సీపీ అయితే రెండు ఇళ్లు ఇస్తారా?

...కుంటున్నాడు. మరి సుబ్బరాజుకు రెండు ఎలా ఇచ్చారు? ముందేమో టీడీపీ, తర్వాత ఎవరికి పడితే వారికి వేస్తాం. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ అంటున్నారు. ప్రజలకు అంతా అర్థం అవుతోంది. వాళ్లలో పశ్చాత్తాపంలేదు. మేం హడలిపోతున్నాం. వాళ్లేమో డేర్‌గా మాట్లాడుతున్నారు. మాకేమీ అర్థం కావడంలేదు.

ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ అని ఇల్లు ఇవ్వలేదు

...లేదు. నా మరిది రాంబాబు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్‌గా ఉన్నారని నాకు ఇల్లు ఇవ్వబోమంటున్నారు. అదేమని అడిగితే మీ పార్టీ వాళ్లకు ఇళ్లు ఇవ్వబోమని చెబుతున్నారు.

– నక్కా అమృతవల్లి, బలుసుల్లంక, ముమ్మిడివరం

Q **ఠానేలంకలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరుల్లో ఒక్కరికి కూడా ఇల్లు మంజూరు చేయలేదు. ఇల్లు మంజూరైన నిందితుడు శ్రీనివాసరావు మాత్రం వైఎస్సార్‌సీపీ అని టీడీపీ ప్రచారం చేస్తోంది. దీనివెనక ఉన్న అంతరార్థం ఏమిటి?**

3 తర్వాత అంకం ఫ్లెక్సీ నాటకం..

...అంకంలో.. నిందితుడిని జగన్ అభిమానిగా చిత్రీకరించడానికి చేసిన ప్రయత్నంలో 'ఫ్లెక్సీ నాటకం' మొదలుపెట్టారు. కుట్రను అమలుచేయడానికి ఎంపిక చేసుకున్న జనుపల్లి శ్రీనివాసరావును జగన్ అభిమానిగా చిత్రీకరించడానికి వీలుగా 2018 జనవరి 1న నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ ఫ్లెక్సీని.. సూత్రధారుల సూచనలకు అనుగుణంగా ఠానేలంకలో ఏర్పాటుచేశారు. హత్యాయత్నం జరిగిన గంట వ్యవధిలోనే.. ఎక్కడో మారుమూల గ్రామంలో దాదాపు 10 నెలల క్రితం ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ సమాచారాన్ని పోలీసులు వెల్లడించడం వెనక.. 'సూత్రధారుల ప్రణాళిక' ఉందనేది స్పష్టం.

Q **జగన్ మీద హత్యాయత్నం జరిగిన గంట వ్యవధిలోనే నిందితుడు జగన్ అభిమాని అని, నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ (2018 జనవరి 1న) ఫ్లెక్సీ కూడా వేయించారని పోలీసులు ప్రకటించారు. ఈ మేరకు ఫ్లెక్సీ పీడీఎఫ్ కాపీని పోలీసులు విడుదల చేశారు. హత్యాయత్నం జరిగిన గంట వ్యవధిలోనే.. 10 నెలల క్రితం వేయించిన ఫ్లెక్సీ గురించి పోలీసులకు ఎవరు చెప్పారు? పోలీసులకు సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలు ఎందుకు బయటపెట్టడం లేదు?**

దొంగలను పట్టించిన 'రోజాపూలు'


- హత్యాయత్నం జరిగిన గంట వ్యవధిలోనే పోలీసులు విడుదల చేసిన ఫ్లెక్సీలో రోజాపూలు లేవు.

'రోజాపూలు లేకుండా ఫ్లెక్సీ పీడీఎఫ్‌ను జనుపల్లి శ్రీనివాసరావు ఆమోదం కోసం...

పొంతనలేని మాటలు చెప్పకనే చెబుతున్నాయి కుట్ర కోణాలను..

ఫ్లెక్సీ చిరిగిపోతే రోజాపూలు అంటించారు

అయ్యప్ప మాటలపైనా అనుమానాలు..



'ఎస్ఆర్‌టీ ప్రింటర్స్' కథ ఏమిటి?

పోలీసులు బయటపెట్టిన ఫ్లెక్సీ.. ఎస్ఆర్‌టీ ప్రింటర్స్‌లో ప్రింట్ చేయించినట్లు ఫ్లెక్సీ కింద ముద్రించారు. ఎస్ఆర్‌టీ ప్రింటర్స్ అనేది ఎక్కడా లేదు. ఆ ప్రింటర్స్ పేరిట ఫ్లెక్సీలో ఇచ్చిన ఫోన్ నంబర్ లేపాక్షి ప్రింటర్స్ యజమాని అయ్యప్పది. ఇదే విషయాన్ని అయ్యప్పను అడిగితే.. 'నా దగ్గర పనిచేసే కుర్రాడు తెచ్చుకునే ఆర్డర్స్ (వ్యాపారం)కు ఎస్ఆర్‌టీ ప్రింటర్స్ అని వేస్తామ'ని సమాధానం ఇచ్చారు. మరి ఫోన్ నంబర్ ఆ కుర్రాడిది కాకుండా.. యజమాని నంబర్ ఎందుకు పెట్టారనే ప్రశ్నకు సమాధానంలేదు.

Q **ఫ్లెక్సీ ప్రింట్ చేసిన లేపాక్షి ప్రింటర్స్ యజమాని.. ఫ్లెక్సీలో రోజాపూలున్నాయని చెప్పారు. నిందితుడు సోదరుడు అందుకు భిన్నంగా.. ఫ్లెక్సీలో రోజాపూలు లేవు.. ఫ్లెక్సీ చినిగిపోతే ప్యాచ్ లాగా రోజాపూలు బొమ్మ అతికించారని చెప్పారు. పోలీసులు విడుదల చేసిన ఫ్లెక్సీ పీడీఎఫ్‌లో రోజాపూల బొమ్మ లేదు. పోలీసులు కనుక్కున్నామని చెబుతున్న ఫ్లెక్సీలో మాత్రం రోజాపూల బొమ్మ ఉంది. నిందితుడు కట్టిన ఫ్లెక్సీ ఒకే ఒకటి. ఈ పొంతనలేని సమాధానాలే చెబుతున్నాయి కదా ఇందులో ఏదో మతలబు దాగి ఉందని? ఈ దిశగా ఎందుకు విచారణ చేయలేదు?**

4 కుట్ర అమల్లో తదుపరి ఘటం.. విమానాశ్రయ ప్రవేశం



ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదైన వి... సులు పట్టించుకోకుండా.. నిందితుడికి ఎన్వోసీ (నో...

ముమ్మిడివరం పీఎస్‌లో కేసు



ముమ్మిడివరం పీఎస్‌లో 2017 ఏప్రిల్ నుంచి ఎస్... నేను శ్రీనివాసరావుకు ఎన్ఓసీ ఇవ్వలేదు. అంతకుముందు ఏం జరిగిందో తెలీదు

– ముమ్మిడివరం ఎస్ఐ పి. ప్రభాకర్

Q **రక్షణ శాఖ ఆధీనంలోని విమానాశ్రయం(విశాఖ విమానాశ్రయం పౌర విమానయాన శాఖ పరిధిలోది కాదు) లోకి ప్రవేశానికి వీలుగా ఎన్వోసీ జారీచేయడంలో నిందితుడి నేర చరిత్రను పోలీసులు దాచి పెట్టడం వెనక ఉన్న సూత్రధారులు ఎవరు? పోలీసులు ఈ దిశగా ఎందుకు విచారణ చేయడంలేదు? సూత్రధారుల బండారం బయటపడుతుందనే ఎన్వోసీ జారీలో నిబంధనలను పాటించలేదనే విషయాన్ని 'సిట్' పట్టించుకోవడంలేదా?**

5 నిందితుడిపై హర్షవర్ధన్ చౌదరికి ఎంత ప్రేమ

...వాసరావుకు ఎలా ఇచ్చారు?

రెస్టారెంట్‌లో పనిచేస్తున్న అందరికంటే శ్రీనివాసరావుకే ఎక్కువ వేతనం ఇచ్చి ప్రత్యేక వసతి సౌకర్యం కల్పించడానికి కారణమేంటి?..

ఈ ప్రశ్నలకు సమాధానం తెలిస్తే కుట్ర కోణం సులభంగానే అర్థమవుతుంది. తమ కుట్రను అమలుచేయడానికి ఎంపిక చేసుకున్న శ్రీనివాసరావుకు సకల సౌకర్యాలు కల్పించడంతో పాటు మిగతా సిబ్బంది కంటే ఫ్యూజన్ రెస్టారెంట్ యజమాని నిందితుడ్ని 'ప్రత్యేకంగా' చూశారు.

Q **అంత ప్రత్యేకంగా చూడటానికి కారణాలను 'సిట్' ఎందుకు అన్వేషించలేదు? అలా అన్వేషిస్తే సూత్రధారులెవరో తేలిపోతుందని పలువురు పోలీసు అధికారులు, విమానశ్రయం ఉన్నతాధికారులు 'సాక్షి' బృందానికి చెప్పారు.**

6 మట్టుబెట్టేందుకే మాటేశారు..

అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే విమానాశ్రయంలో అనధికారికంగా ఓ వ్యక్తి ఒక్కరోజైనా ఉండగలడా?.. ఏమాత్రం సాధ్యం కాదు. కానీ, ప్రతిపక్ష నేత...

విమానాశ్రయంలో ఏడాదిగా అనధికారికంగా పాగా...



7 తాత్కాలిక ఏఈపీ కట్టుకథేనా!?

...లిక ఏఈపీ కూడా సందేహాస్పదమే. ఏఈపీ జారీకి కేంద్ర విమానయాన సంస్థ మార్గదర్శకాలను నిర్దేశించింది. ప్రైవేటు వ్యక్తులకు ఒక రోజు నుంచి 3 రోజులకు ఒక కేటగిరీ, 4 రోజుల నుంచి 90 రోజులకు మరో కేటగిరీ కింద ఏఈపీలు కేటాయిస్తారు. నెల రోజులకు తాత్కాలిక ఏఈపీ అన్నది ఏఏఐ మార్గదర్శకాల్లో లేదు. మరి నిందితుడికి అక్టోబరు నెల రోజులకు తాత్కాలిక ఏఈపీ ఎలా జారీచేశారు? అంటే.. వైఎస్ జగన్‌పై హత్యాయత్నం చేసిన తరువాత కేసును తప్పుదారి పట్టించేందుకే అప్పటికప్పుడు తాత్కాలిక ఏఈపీ అన్నది సృష్టించారని తేటతెల్లమవుతోంది. అనామకుడైన శ్రీనివాసరావుకు అంతటి పరపతి ఉండదు కదా. మరి దీని వెనుక ఉన్న ప్రభుత్వ పెద్దలు ఎవరు?

మొదటి నుంచి శ్రీనివాసరావుది రెస్టారెంట్‌లో సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉండే బీ షిఫ్ట్ డ్యూటీ. జగన్‌గారిపై దాడి చేసిన రోజు మాత్రం ఉదయమే విధుల్లోకి వచ్చినా.. రెస్టారెంట్‌లోనే ఉన్న హర్షవర్ధన్ చౌదరి నిందితుడు శ్రీనివాస్‌ను ఎందుకు ప్రశ్నించలేదు? శ్రీనివాసరావు ఉద్యోగం అసిస్టెంట్ కుక్ అయితే సర్వీస్ అసిస్టెంట్ చేసే పని అతను చేస్తుంటే ఎందుకు అడ్డుకోలేదు? వీఐపీ లాంజ్‌లోకి సర్వీస్ అసిస్టెంట్‌గా వెళ్లడానికి ఎవరు అనుమతించారు?

జగన్‌తో సెల్ఫీ కోసం అని శ్రీనివాసరావు చెప్పాడనుకున్నా.. అతని వద్ద కెమెరా ఫోన్ లేదని రెస్టారెంట్‌లో ఉన్న వారందరికీ తెలుసు. అప్పుడైనా కెమెరా ఫోన్ లేకుండా సెల్ఫీ ఏమిటని అడగాలి? కనీసం అప్పటివరకు అక్కడే ఉన్న హర్షవర్ధన్ చౌదరిని అయినా ప్రశ్నించాలి. కానీ, సిట్ ప్రశ్నించలేదు? ఎందుకు?

గత రెండున్నర నెలలుగా జగన్‌గారు ఎయిర్‌పోర్ట్‌కు ఎప్పుడొచ్చినా వైఎస్సార్‌సీపీ స్థానిక వార్డు అధ్యక్షుడు శ్రీధర్ ఇంటి నుంచి కాఫీ వచ్చేది. హైదరాబాద్ నుంచి వచ్చేటప్పుడు ఆయన నేరుగా విమానం దిగి బయటకు వచ్చి పాదయాత్ర జరిగే ప్రాంతానికి వెళ్లిపోతారు. హైదరాబాద్‌కు వెళ్లేటప్పుడు కాస్త సమయముంటే వీవీఐపీ లాంజ్‌కు వెళ్లి పార్టీ నేతలతో భేటీ అవుతారు. అయితే, ఘటన జరిగే వారం ముందే జగన్‌గారికి బయటి నుంచి కాఫీ తీసుకురావడం కుదరదని ఎయిర్‌పోర్ట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) వేణుగోపాల్ అడ్డుకున్నారు. కాఫీ ఫ్లాస్క్ స్వాధీనం చేసుకుని సీరియస్ అయ్యారు. పక్కనే ఉన్న రెస్టారెంట్ నుంచే తీసుకోవాలని పార్టీ నేతలను ఆదేశించారు. ఇలా అన్న రెండో వారమే ఆ రెస్టారెంట్ నుంచి శ్రీనివాసరావు వచ్చి కత్తి దూశాడు. రెస్టారెంట్ కేంద్రంగానే కుట్ర జరిగిందని తెలుస్తున్నా ఈ దిశగా కనీస విచారణ ఎందుకు జరగలేదు?

అక్టోబరు 25న వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగే సమయానికి సరిగ్గా పది నిమి...

సీఎస్‌వో వేణుగోపాల్ మొదటి నుంచి టీడీపీ తొత్తుగా ఉంటూ వైఎస్సార్‌సీపీ నేతలపై వ్యతిరేకత ప్రదర్శిస్తుంటాడనేది ఎయిర్‌పోర్ట్‌లో అందరికీ తెలుసు. గతంలో ఓసారి ఎంపీ విజయసాయిరెడ్డి పట్ల కూడా ఒకింత దురుసుగా ప్రవర్తించిన దాఖలాలున్నాయి. టీడీపీ నేతలతో అంటకాగే వేణుగోపాల్.. హర్షవర్ధన్ ప్రసాద్...

8 ఎన్వోసీ పోలీసుల సృష్టేనా?

...మహేష్‌చంద్ర లడ్హా చెప్పారు. కాగా, ఢిల్లీలోని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ డీజీ కుమార్ రాజేష్ చంద్ర వెల్లడించిన సమాచారంతో అసలు వాస్తవం బట్టబయలైంది. ఎంపీ విజయసాయిరెడ్డికి ఇచ్చిన లిఖితపూర్వక వివరణలో.. అసలు శ్రీనివాసరావు పేరిట తమకు ఎన్వోసీ రాలేదని ఆయన వెల్లడించడం గమనార్హం. విమానాశ్రయంలో ప్రవేశానికి అవసరమైన ఏరోడ్రోమ్ ఎంట్రీ పర్మిట్ కోసం శ్రీనివాసరావుగానీ, రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ చౌదరిగానీ దరఖాస్తు చేయనేలేదని తెలిపారు. ఏఈపీ కోసం దరఖాస్తు చేయనప్పుడు ఎన్వోసీ సమర్పించాల్సిన అవసరమే ఉత్పన్నం కాదని కుండబద్దలు కొట్టారు. అంటే శ్రీనివాసరావు పేరిట (బీసీఏఎస్)కి ఎలాంటి ఎన్వోసీ సమర్పించలేదని స్పష్టమవుతోంది.

Q **మరి శ్రీనివాసరావు పేరిట విశాఖ పోలీసులు ఎన్వోసీ ఇచ్చారని పోలీస్ కమిషనర్ చెప్పడం వెనుక లోగుట్టు ఏమిటి? ఈ హత్యాయత్నం వెనుక ఎవరి పాత్రను కప్పిపుచ్చేందుకు పోలీసులు ఈ కట్టుకథ వినిపించారు? ఈ ప్రశ్నలకు పోలీసులు సమాధానం చెప్పకపోవడం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం వెనుక ప్రభుత్వ పెద్దల పాత్రను చెప్పకనే చెబుతోంది.**

9 సీసీ కెమెరాలు ఆఫ్.. కుట్ర ఆన్..

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పాదయాత్ర ఉత్తరాంధ్రలోకి ప్రవేశించగానే సూత్రధారులు, పాత్రధారులు తమ కుట్ర కార్యాచరణను వేగవంతం చేశారు. ఆయన హత్యకు...

...లో భాగంగానే సీసీ కెమెరాలు ఆఫ్ చేశారు. సీసీ కెమెరాలు పనిచేసి ఉంటే జగన్‌పై హత్యాయత్నం కుట్ర ఆధారసహితంగా బట్టబయలయ్యేదని ఓ పోలీసు ఉన్నతాధికారి చెప్పారు. హత్యాయత్నం చేసిన అక్టోబరు 25న నిందితుడు శ్రీనివాసరావు విమానాశ్రయంలో ప్రవేశం, అతనికి సహకరించిన మరికొందరి చర్యలు, వీఐపీ లాంజ్ వద్ద నిందితుడి ప్రవర్తన.. అదను చూసి కత్తిదూయడం, ఆ వెంటనే అతనికి సహకరించిన వారి స్పందన మొదలైన దృశ్యాలన్నీ కూడా సీసీ కెమెరాల్లో రికార్డయ్యేవి. ఈ కుట్రకు సహకరించిన వారెవరో తెలిసేది. వారిని విచారిస్తే ప్రభుత్వ పెద్దల బండారం బహిర్గతమయ్యేది. ఇది ఊహించే ప్రభుత్వ పెద్దలు సీసీ కెమెరాలు పనిచేయకుండా చేశారని పోలీసు ఉన్నతాధికారి చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది.

Q **పక్కా పన్నాగంతో సీసీ కెమెరాలు ఆఫ్ చేయడం ఎవరికి సాధ్యం? సీసీ కెమెరాలు 3 నెలలుగా పనిచేయకున్నా భద్రతా అధికారులు ఎందుకు పట్టించుకోలేదు? దీని వెనుకున్న పెద్దలెవరు? సహకరించిన అధికారులెవరు? రెస్టారెంట్ యజమాని, టీడీపీ నేత హర్షవర్ధన్‌తో విమానాశ్రయ భద్రతా అధికారి వేణుగోపాల్‌కు ఉన్న సాన్నిహిత్యం ప్రభావమెంత?**

హత్యాయత్నం గురితప్పింది.. 'సిట్' విచారణ దారి తప్పింది

10 కుట్ర పన్ని ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. ఎప్పటి లాగే ఆ గురువారం (అక్టోబరు 25న) కూడా విశాఖ విమానాశ్రయానికి వచ్చిన జగన్.. వీఐపీ లాంజ్‌లో ఉన్నప్పుడు శ్రీనివాసరావు వచ్చి పదునైన కత్తిని జగన్ గొంతులోకి దించే లక్ష్యంతో పాశవిక దాడికి పాల్పడ్డారు. కత్తి గొంతులో దిగి ఉంటే.. ప్రాణం దక్కడం అనుమానమే. అదృష్టవశాత్తూ..జగన్ పక్కకు వంగడంతో గొంతులో దిగాల్సిన కత్తి గురి తప్పి భుజంలో దిగింది. దీంతో జగన్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. కత్తి పోటు గురితప్పడంతో.. కుట్ర సూత్రధారుల బండారం బయటకు రాకుండా 'సిట్' దర్యాప్తును ప్రభుత్వ పెద్దలు దారి తప్పించారు. ఈ విచారణ దారి తప్పడంతో ఎన్నో అనుమానాలు ప్రజల్లో నెలకొన్నాయి.

పోలీసు ఉన్నతాధికారులు, విమానాశ్రయ అధికారులకూ ఎన్నో సందేహాలు ఏర్పడ్డాయి. వారికి ఉన్న అనుమానాలను 'సాక్షి' బృందంతో పంచుకున్నారు. వారి అనుమానాలు ఇవీ..

డీజీపీ, మంత్రులు, సీఎం మాటలకు అర్థాలే వేరులే..



ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద విశాఖపట్నం విమానాశ్రయంలో అక్టోబరు 25 గురువారం మధ్యాహ్నం 12.45–12.48 మధ్య హత్యాయత్నం జరిగింది. ప్రతిపక్ష నేతను హతమార్చడానికి పాశవిక దాడి జరిగితే తక్షణ విచారణ చేపట్టి నిగ్గుతేల్చాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించింది. హత్యాయత్నం జరిగిన తర్వాత నిందితుడిని సీఐఎస్ఎఫ్ తన కస్టడీలోకి తీసుకుంది...

హత్యాయత్నంపై టీడీపీ నేతలకు ముందే సమాచారం?



ప్రతిపక్ష నేతపై హత్యాయత్నం జరిగిన వెంటనే నిందితుడు శ్రీనివాసరావు ఇంటి వద్దకు చేరిన టీడీపీ నాయకులు (ఫైల్)

వాళ్ల కుటుంబం టీడీపీ అని అంటుంటారు



కేస్ క్లోజ్ అంటున్నారు

వాడివల్ల మూడు జీవితాలు నాశనమవుతున్నాయి

నిందితుడు స్నేహితుడు ఉన్నట్లుండి ధనవంతుడయ్యారు

నిందితుడు శ్రీనివాసరావు నాలుగో అన్నకు తోడల్లుడు, తనకు స్నేహితుడు...

శ్రీనివాస్ అన్న సుబ్బరాజుది టీడీపీ అంటారు



పిల్లల్ని వీధిలో పెట్టాడు.. అభిమానైతే పొడిచేస్తాడా?

ఇంట్లో పిల్లలందరినీ వీధిలో...



శ్రీనివాస్ ఫోన్‌లో నెంబర్లున్న యువకులను విచారించారు

భారత ప్రభుత్వము

ఉపరితల రవాణా మరియు రాజ మార్గాల మంత్రిత్వ శాఖ

జాయింట్ కలెక్టర్ మరియు కాంపిటెంట్ అథారిటీ (భూ సేకరణ)

జాతీయ రహదారులు, అనంతపురము జిల్లా

బహిరంగ ప్రకటన

ఆర్.సి.నెం. జి1/8614/2015 **తేది : 02-01-2019**

జాతీయ రహదారుల చట్టము 1956 సెక్షన్ 3-జి (3) క్రింద జారీ చేయడమైనది.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని అనంతపురం జిల్లా, నల్లచెరువు మండలం, **అల్లుగుండు మరియు జోగన్నపేట** గ్రామాలలో జాతీయ రహదారి సంఖ్య.205 **కి.మీ. 96.800** వద్ద సెక్షన్లో ఉన్న రోడ్డు విస్తరణ, నిర్మాణము, నిర్వహణ, **మేనేజ్‌మెంట్, అల్లుగుండు మరియు జోగన్నపేట** గ్రామముల దగ్గర రైల్వే ఓవర్ బ్రిడ్జి **(ROB)** నిర్మాణం (విస్తరణ) నిమిత్తము ఈ దిగువ షెడ్యూలు నందు నిర్దిష్టపరచిన భూములు, నిర్మాణములు, చెట్లు తదితరములతో సహా భారత ప్రభుత్వపు రాజమార్గాల మంత్రిత్వశాఖ వారి యస్.ఓ.నెం.6070(ఇ) ద్వారా ప్రచురింపబడిన విశేష రాజపత్రము సంఖ్య.4839 యొక్క భాగము-II, సెక్షన్ 3, సబ్ సెక్షన్-II, తేది:08-12-2018 ద్వారా జాతీయ రహదారుల చట్టం 1956 (48/1956), సెక్షన్-3-డి (1) మరియు (2) క్రింద భారత ప్రభుత్వానికి అన్ని విధాలుగా రుణ విముక్తమై దారాదత్తమైనది. పరిహారంగా చెల్లించవలసిన మొత్తమును నిర్ధారించుటకుగాను, అట్టి భూములతో సంబంధం, ఆసక్తి గల వ్యక్తులు తమ భూములకు చెందిన ఒరిజినల్ డాక్యుమెంట్లు, వాటి నకలు, 13 సంవత్సరాల ఈ.సి. పట్టాదారు పాసుపుస్తకములు, టైటిల్ డీడ్స్, అడంగలు, 1-బి రికార్డు ధృవీకృత కాపీలు మరియు కట్టడములు ఏమైనా ఉన్నచో వాటి ఆమోదిత ప్లానులు, పన్ను అసెస్మెంట్, భూమి అనుభవ పత్రాలు మరియు పన్ను రశీదు వగైరాలతో స్వయంగా కానీ లేక ప్రతినిధి ద్వారా లేక న్యాయవాది ద్వారా కానీ కాంపిటెంట్ అథారిటీ భూ సేకరణ మరియు సంయుక్త కలెక్టర్, అనంతపురము వారి సమక్షములో ఈ క్రింద కనపరచిన స్థలము, తేది, సమయమున హాజరై ఆయా భూములతో వారికి గల హక్కులను ప్రకటించవలసినదిగా / నిరుపించుకోవలసినదిగా కోరడమైనది. అట్లు హాజరు కాని యెడల ఉన్న రికార్డుల మేరకు పరిహారము నిర్ధరించబడును.

క్రమ సంఖ్య	గ్రామము పేరు	మండలం పేరు	విచారణ జరుగు స్థలము	తేది మరియు సమయము
1	అల్లుగుండు	నల్లచెరువు	తహసీల్దారు వారి కార్యాలయము, నల్లచెరువు, అనంతపురం జిల్లా.	18-01-2019 మధ్యాహ్నం 2.00 గం.లకు
2	జోగన్నపేట			

షెడ్యూలు

క్రమ సంఖ్య	రెవిన్యూ సర్వే నెం.	భూమి వివరములు	భూమి స్వభావము	ప్రతిపాదిత విస్తీర్ణము ఎకరములు	యాజమాని మరియు ఇతర ఆసక్తి గల వ్యక్తుల పేర్లు	రిమార్కులు (భూమిలో గల చెట్లు / నిర్మాణముల వివరాలు)
1	2	3	4	5	6	7
మండలం: నల్లచెరువు						గ్రామం: అల్లుగుండు
1	208B-2B	పట్టా	మెట్ట	0.30	పి.యస్. సైదా పర్వీన్ భర్త పి.యస్. బాబాజాన్ అల్లాబకాష్ తండ్రి మహమ్మద్ అలీ	
2	227-2	పట్టా	మెట్ట	1.35	జి.జనార్ధన తండ్రి నాగన్న జి. చిన్న రెడ్డప్ప తండ్రి నాగన్న జి.పి.రెడ్డప్ప తండ్రి నాగన్న జి క్రిష్ణ మూర్తి తండ్రి వేమన్న	 వేప చెట్టు -1 వేప చెట్టు -2
3	228-2	పట్టా	మెట్ట	1.02	షఫీ తండ్రి హుస్సేన్ పీరా	కొబ్బరి చెట్లు 6 ఇండ్ల స్థలాలు
4	231-3	డి. పట్టా	మెట్ట	0.15	ప్రభుత్వ భూమి	
5	231-8	డి. పట్టా	మెట్ట	0.22	ప్రభుత్వ భూమి	
6	232-1	పట్టా	మెట్ట	0.41	బాబా జాన్ తండ్రి బాష ఖాన్ తాటం అరవిందబాబు తండ్రి ఉత్తన్న	
7	233-2	పట్టా	మెట్ట	2.16	కే ప్రభాకర్ తండ్రి చిన్నప్ప షఫీ తండ్రి హుస్సేన్ పీరా తాటం అరవిందబాబు తండ్రి ఉత్తన్న	
8	234-1	ఇనాం	మెట్ట	0.85	అలీ అహమ్మద్ తండ్రి ఖాజా మైనుద్దీన్ షాహీమ్ తండ్రి షైక్ హాలీముద్దీన్ (As per Sale Deed)	కరెంటు స్తంభాలు 2
9	235-1	ప్రభుత్వ	వాగు	0.28	ప్రభుత్వ భూమి	
10	242B-2B	ప్రభుత్వ	వాగు	0.30	ఆసాది రామప్ప తండ్రి ఉప్పన్న ఆసాది కదిరప్ప తండ్రి గురజాలప్ప తంగేడుకుంట శ్రీనివాసులు తండ్రి గంగన్న నరసింహులు తండ్రి గంగన్న తంగేడుకుంట రామప్ప తండ్రి గంగన్న ఆసాది గంగప్ప తండ్రి గురజాలప్ప	
	మొత్తం			**7.04**		
మండలం: నల్లచెరువు						గ్రామం: జోగన్నపేట
11	4A-2B	పట్టా	మెట్ట	0.34	పర్వీన్ భాను భర్త హబీబ్ ఖాన్	కొబ్బరి చెట్లు 3 సుంకేశాల చెట్లు 2 అశోక చెట్లు 1 దానిమ్మ చెట్లు 2
12	4B-2B	పట్టా	మెట్ట	0.18	యస్.మహమ్మద్ షఫీ తండ్రి హుస్సేన్ పీరా	
13	5-2	ప్రభుత్వ	చెరువు	0.23	కుంట (హౌసెస్)	
14	6-2	పట్టా	మెట్ట	0.11	కే.మాబు అలీఖాన్ తండ్రి కరీం సాబ్	
15	18-3B	పట్టా	మెట్ట	0.41	తాటం రవీంద్రబాబు తండ్రి ఉత్తన్న	
16	18-5B	పట్టా	మెట్ట	0.09	బి.వెంకట రమణప్ప తండ్రి వెంకట శివయ్య	
17	18-6B	పట్టా	మెట్ట	0.63	1. జి. శ్రీనివాసులు 2. జి. కొండారెడ్డి 3. జి. రామచంద్ర 4. జి. సదాశివ నాయుడు తండ్రి సిద్దారెడ్డి 1. జి. వెంకటరమణ 2. జి. కొండారెడ్డి 3. జి. నారాయణ స్వామి 4. జి. శ్రీరాములు 5. జి. శ్రీనివాసులు తండ్రి చెన్నారెడ్డి	
18	18-7A	పట్టా	మెట్ట	0.58	బి. వెంకట రమణప్ప తండ్రి వెంకట శివయ్య	
19	18-8A	డి. పట్టా	మెట్ట	0.12	ఆదెమ్మ భర్త భీమ్లా నాయక్ జె అరుణమ్మ భర్త ప్రసాద్ నాయక్	
20	22-1A	పట్టా	మెట్ట	0.31	బి. వెంకట రమణప్ప తండ్రి వెంకట శివయ్య	
21	24A-2	ప్రభుత్వ	దారి	0.10	రోడ్	
22	25-3B	పట్టా	మెట్ట	0.45	బి. వెంకట రమణప్ప తండ్రి వెంకట శివయ్య	
23	26-2	పట్టా	మెట్ట	0.95	డి. రెడ్డప్ప తండ్రి ఓబన్న	కరెంటు స్తంభాలు 2
24	27-2	ప్రభుత్వ	దారి	0.08	రోడ్	
25	38-2	ఇనాం	తరి	0.34	యస్.వెంకటరమణ తండ్రి రమణప్ప	
26	39-1	ప్రభుత్వ	దాబిడ్	0.09	ప్రభుత్వ భూమి	
27	40-1	ఇనాం	తరి	0.32	1. షైక్ అబ్దుల్‌రసూల్ తండ్రి హుసన్ సాబ్ 2. కరీంసాబ్ తండ్రి దస్తగిరి 3. బాదూర్‌సాబ్ తండ్రి యాసీన్ సాబ్	
28	45-1A	పట్టా	తరి	0.47	జి.రామచంద్ర తండ్రి సిద్దారెడ్డి జి.వెంకటరమణ తండ్రి సిద్దారెడ్డి	
29	48-1	ప్రభుత్వ	దారి	0.05	ప్రభుత్వ దారి	
30	49-1	పట్టా	మెట్ట	0.36	1. వెంకటరమణరెడ్డి తండ్రి నారాయణరెడ్డి 2. నారాయణరెడ్డి తండ్రి లక్ష్మిరెడ్డి	
31	50-2	పట్టా	మెట్ట	0.29	జి.రామచంద్ర నాయుడు తండ్రి సిద్దారెడ్డి	బోర్ వెల్ -1 & వెల్ -1
32	69A-1	ప్రభుత్వ	వాగు	0.02	వాగు	
33	70-2	పట్టా	మెట్ట	0.77	1. వెంకటరమణరెడ్డి తండ్రి నారాయణరెడ్డి 2.నారాయణరెడ్డి తండ్రి లక్ష్మన్న	
34	71-1	పట్టా	మెట్ట	0.21	1. పి నారాయణస్వామి తండ్రి కుల్లాయప్ప 2. జి.వెంకటరమణరెడ్డి తండ్రి నాగన్న	
35	75-1A	పట్టా	మెట్ట	0.45	1. పి నారాయణస్వామి తండ్రి కుల్లాయప్ప జి. వెంకటరమణరెడ్డి తండ్రి నాగన్న	
36	76-1B	పట్టా	మెట్ట	0.32	జి. వెంకటరమణరెడ్డి తండ్రి నారాయణరెడ్డి	
37	76-2B	పట్టా	మెట్ట	0.81	రామచంద్ర తండ్రి గంగప్ప మురళి తండ్రి గంగప్ప బి. నరసింహులు తండ్రి గంగప్ప వెంకట రామయ్య తండ్రి వెంకటరమణ వెంకట రామయ్య తండ్రి వెంకటరమణ బి. నరసింహులు తండ్రి గంగప్ప మురళి తండ్రి గంగప్ప రామచంద్ర తండ్రి గంగప్ప బి.నరసిరెడ్డి తండ్రి నారపరెడ్డి	 చెట్టు 1 వేప చెట్టు 1
38	77-1B	పట్టా	మెట్ట	0.06	1. వెంకటరమణ 2. శ్రీరాములు 3. కొండారెడ్డి 4. శ్రీనివాసులు 5. నారాయణస్వామి తండ్రి చెన్నారెడ్డి	వేప చెట్టు 1
39	77-1C	పట్టా	మెట్ట	0.01	1. రామచంద్ర రెడ్డి తండ్రి శివరామిరెడ్డి 2. గాలివేటా చెన్నారెడ్డి 3. గాలివేటా నారపరెడ్డి 4. బెల్లలా గంగప్ప	ఉమ్మడి భావి
40	77-2A	పట్టా	మెట్ట	0.10	1. గాలివేటా చెన్నారెడ్డి 2. గాలివేటా నారపరెడ్డి 3. బెల్లలా గంగప్ప 4. రామచంద్రరెడ్డి తండ్రి శివరామిరెడ్డి	భావి మరియు బోరు ఉమ్మడి భావి
41	78-1	పట్టా	మెట్ట	0.47	1. ఏ.నారాయణ తండ్రి నరసింహులు 2. నరసింహారెడ్డి తండ్రి రామచంద్రరెడ్డి 3. వెంకటరమణ తండ్రి చెన్నారెడ్డి శ్రీరాములు తండ్రి చెన్నారెడ్డి శ్రీనివాసులు తండ్రి చెన్నారెడ్డి కొండారెడ్డి తండ్రి చెన్నారెడ్డి నారాయణస్వామి తండ్రి చెన్నారెడ్డి	
42	79A-2	పట్టా	మెట్ట	0.51	నర్పిరెడ్డి తండ్రి నారప్పరెడ్డి నారాయణ తండ్రి నరసింహులు ఈశ్వరరెడ్డి తండ్రి నారపరెడ్డి ఆర్. రామచంద్రరెడ్డి తండ్రి శివరామిరెడ్డి జి. వెంకటరమణ తండ్రి చెన్నారెడ్డి బి .నరసింహారెడ్డి తండ్రి రామచంద్రరెడ్డి శ్రీనివాసులు తండ్రి చెన్నారెడ్డి బి. నరసింహారెడ్డి తండ్రి రామచంద్రరెడ్డి	 కొబ్బరి చెట్లు 7 కొబ్బరి చెట్లు 3, నేరేడు చెట్లు 2, కంపౌండ్ గోడ ఉన్న RCC ఇల్లు RCC ఇల్లు, జింక్ షీట్ షెడ్
43	79B-2	పట్టా	మెట్ట	0.49	జి. రామచంద్రనాయుడు తండ్రి సిద్దారెడ్డి జి. నారాయణస్వామి తండ్రి చెన్నారెడ్డి ఆర్. రాజారెడ్డి తండ్రి శివారెడ్డి ఆక్కుల రెడ్డి తండ్రి నరసింహారెడ్డి ఆర్. రామచంద్రరెడ్డి తండ్రి శివరామిరెడ్డి	 నేరేడు -1, మామిడి -3, RCC ఇల్లు (47x37), RCC బాత్‌రూమ్ (11x15), RCC బాత్‌రూమ్ (13x10), కడప స్లాబ్ (36x22), జింక్‌షీట్ షెడ్ (25x15) (50x44) జింక్ షీట్ షెడ్ రైస్ మిల్లు, చింత చెట్టు -1, కరెంటు స్తంభాలు -2
44	81-2	ప్రభుత్వ	దారి	0.13	ప్రభుత్వము	
45	83-2	పట్టా	మెట్ట	0.65	గుమ్మరాల సుబ్బిరెడ్డి తండ్రి సంజప్ప గుమ్మరాల పార్వతమ్మ భర్త రామిరెడ్డి	
46	84-1	పట్టా	మెట్ట	0.38	గుమ్మరాల సుబ్బిరెడ్డి తండ్రి సంజప్ప గుమ్మరాల పార్వతమ్మ భర్త రామిరెడ్డి	కరెంటు స్తంభాలు 2
47	85-2	పట్టా	మెట్ట	0.20	రామచంద్రనాయుడు తండ్రి సిద్దారెడ్డి	కానుగ చెట్లు 3
48	86-1B	పట్టా	మెట్ట	0.15	రామచంద్రనాయుడు తండ్రి సిద్దారెడ్డి	కానుగ చెట్లు 1
49	100-1B	డి. పట్టా	మెట్ట	0.44	గొడ్డువెలగల రామ్‌మోహన్ తండ్రి నరసప్ప	వేప చెట్లు 3
50	102-1B	పట్టా	మెట్ట	1.07	గొడ్డువెలగల రామ్‌మోహన్ తండ్రి నరసప్ప	వేప చెట్లు 2
51	103-2	పట్టా	మెట్ట	1.19	బి. వెంకటరమణ బి. శ్రీనివాసులు బి. శ్రీరాములు బి. రాములు తండ్రి వెంకటనారప్ప	కొబ్బరి చెట్లు 6 చింత చెట్టు 1 వేప చెట్టు 1 బోర్ భావి 1 కరెంటు స్తంభం 1
52	104-1A	పట్టా	మెట్ట	0.11	బెల్లలా మురళి తండ్రి గంగప్ప సూర్యనారాయణ తండ్రి గంగప్ప	
	మొత్తం			**15.04**		
	వెరసి మొత్తం			**22.08 ఎకరాలు**		

సం/- జాయింట్ కలెక్టర్ మరియు కాంపిటెంట్ అథారిటీ,
(భూ సముపార్జన) జాతీయ రహదారులు, అనంతపురము.

8న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు విడుదల

తిరుమల: ఏప్రిల్ నెలకు సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను జనవరి 8వ తేదీన టీటీడీ విడుదల చేయనుంది. ఐటీ అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టారు. ఆన్‌లైన్ ఈ-దర్శన్ కౌంటర్లు, పోస్టాఫీసుల్లో ఈ టికెట్లను భక్తులు బుక్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో ముందస్తుగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ ఒక ప్రకటనలో సూచించింది.

మహివర్ధన్ హత్యకు రాజకీయ రంగు

టీడీపీ నాయకుల కనుసన్నల్లో పోలీసుల హైడ్రామా

గుంటూరు/నిజాంపట్నం (రేపల్లె): గుంటూరు జిల్లా నిజాంపట్నంలో గురువారం జరిగిన మహివర్ధన్ హత్యకు రాజకీయ రంగు పులిమి లబ్ధి పొందాలనే లక్ష్యంతో టీడీపీ నేతలు క్షణక్షణం తాపత్రయపడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హత్యలో టీడీపీ నాయకుడు బొమ్మిడి రామకృష్ణకు ముఖ్య అనుచరుడైన ప్రథమ ముద్దాయికి, మహివర్ధన్‌కు మధ్య కొంతకాలంగా భూవివాదాలు, ఆర్థిక వివాదాలు ఉన్నాయని గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు. హత్య అనంతరం తెరపైన టీడీపీ నాయకుల డ్రామాలు ఒకపక్క, తెరవెనుక హత్యలో పాల్గొన్న టీడీపీ వ్యక్తిని ఎమ్మెల్యే సోదరుడు పోలీసులకు అప్పగించటం మరోపక్క చకచకా జరిగిపోయాయి. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ హత్య కేసును మోపిదేవి కుటుంబసభ్యులు, బంధువులపై మోపే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నేరుగా టీడీపీ అధినేత నుంచి సిఫారసులు చేయించటంతో పోలీసులు మోపిదేవి సోదరుడు, పార్టీ నాయకుల పేర్లు నమోదు చేసేందుకు ఒప్పుకొన్నట్లు సమాచారం. హత్య కేసులో నిందితులు ఉదయం ముగ్గురుగా, మధ్యాహ్నం తొమ్మిది మందిగా, సాయంత్రానికి 11 మందిగా, తెల్లవారుజామకు 17 మందిగా ఎమ్మెల్యే కన్నుసన్నల్లో రూపకల్పన చేసినట్లు తెలుస్తోంది.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి: మేరుగ నాగార్జున

దళిత నాయకుడు శీలం మహివర్ధన్ హత్య దారుణమని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరుగ నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మహివర్ధన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నిజాంపట్నం మండలం మీదుళ్లపర్రలోని దళితుల భూములు దళితులకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ మూడేళ్లుగా భూపోరాటం చేస్తుంటే కనీసం ఉద్యమాల వైపు స్థానిక ప్రజాప్రతినిధి కన్నెత్తయినా చూడకపోవటం దారుణమన్నారు.

హత్యలు చేయించి..సెటిల్‌మెంట్ చేస్తారా?

వైఎస్సార్ సీపీ బాపట్ల పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు మోపిదేవి



రేపల్లె(నగరం): 'హత్యలు చేయించేది మీరే.. లక్షల్లో సెటిల్‌మెంట్లు చేసేది మీరే.. నిందలు మాత్రం మాపైన మోపి కుట్రలు చేయటం పరిపాటిగా మారిందని' ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌ను ఉద్దేశించి వైఎస్సార్ సీపీ బాపట్ల పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజాంపట్నంలో గురువారం జరిగిన మహివర్ధన్ హత్య దురదృష్టకరమని, ఆ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. మహివర్ధన్ హత్యకేసులో నిందితులుగా ఉన్న ఏ1, ఏ2కు.. తనకు, తన కుటుంబానికి ఎటువంటి సంబంధాలూ లేవని స్పష్టం చేశారు. నిజాంపట్నంలోని టీడీపీకి చెందిన ఓ చోటా నాయకుడైన ఎమ్మెల్యే బినామీ ముఖ్య అనుచరులే ఏ1, ఏ2 నిందితులన్నారు. హత్య జరిగిన వెంటనే ఎమ్మెల్యే సోదరుడు నిందితులతో బేరసారాలు చేసుకుని రూ.25 లక్షలు తీసుకుని పోలీసులకు అప్పగించిన సంగతి నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. 'నా రాజకీయ జీవితంలో ఏనాడైనా భూ ఆక్రమణకు పాల్పడినట్లు ఒక్క సంఘటనైనా రుజువు చేయగలవా' అంటూ ఎమ్మెల్యేనుద్దేశించి ప్రశ్నించారు. మాచర్లలో ఓ దళితుడిని హత్యకేసు నిందితులు టీడీపీ కార్యకర్తలేనని తెలిపారు.


నిష్పక్షపాతంగా విచారణ చేయాలి: బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త నందిగం సురేష్ మాట్లాడుతూ మహివర్ధన్ హత్యపై రాజకీయం చేయకుండా నిష్పక్షపాతంగా విచారించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేసుకు సంబంధం లేని వారిని ఇబ్బందులకు గురిచేస్తూ రాజకీయ లబ్ధిపొందాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

సాక్షి స్పోర్ట్స్

శనివారం
5-1-2019

‘ఎ’ ప్లస్ కాంట్రాక్టులోకి పుజారా!

ఆస్ట్రేలియా సిరీస్‌లో మూడు సెంచరీలతో సహా 521 పరుగులు సాధించిన చతేశ్వర్ పుజారాకు తగిన బహుమతి లభించనుంది. ప్రస్తుతం సెంట్రల్ కాంట్రాక్టుల్లో ‘ఎ’ కేటగిరీలో ఉన్న అతడిని ‘ఎ’ ప్లస్‌లోకి తీసుకునేందుకు బీసీసీఐ ఆలోచిస్తోంది.



రిషభ్ పంత్

పుజారా

జడేజా

కొండంత స్కోరు... సిరీస్ ఖరారు!



స్టార్క్

అనుమానమేమీ లేదు! ఓటమి అన్న ప్రశ్నేలేదు! విజయానికీ ఢోకా లేదు! అదీ కాకపోతే... ‘డ్రా’! అంతే...! కంగారూల గడ్డపై టీమిండియా తొలి ‘చారిత్రక సిరీస్’ విజయానికి రాచబాట పడింది. అద్భుతం ఆవిష్కృతం కానుండటమే ఇక మిగిలింది. కోహ్లి సేన రికార్డులకెక్కడం వంద శాతం ఖాయమైంది. ఇది 2-1తోనా... 3-1తోనా అనేదే తేలాల్సి ఉంది. భారత్ సగర్వంగా నిలవనుండటమే మనం చూడాల్సి ఉంది.

చతేశ్వర్ పుజారా వేసిన పటిష్ట పునాదిపై చెలరేగిన రిషభ్ పంత్, రవీంద్ర జడేజా భారత్‌కు కొండంత స్కోరును సాధించి పెట్టారు. బౌండరీల మీద బౌండరీలు బాదుతూ దూకుడైన ఆటతో పరుగుల వరద పారించి ప్రత్యర్థిని పిప్పి చేశారు. ఏడో వికెట్‌కు రికార్డు స్థాయిలో ఏకంగా ద్విశతక భాగస్వామ్యం నమోదు చేశారు.

ఇప్పటికే ఆధిక్యం కోల్పోయి మానసికంగానూ దెబ్బతిన్న కంగారూలు... ఎంత పోరాడినా, మరెంత శ్రమించినా కోహ్లి సేనను అందుకోవడం అసాధ్యం. వారు చేయాల్సిందల్లా ఓటమిని తప్పించుకోవడమే. తద్వారా కొంతలో కొంతైనా గౌరవాన్ని కాపాడుకోవడమే.

తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా భారీ స్కోరు • 622/7 డిక్లేర్డ్

- పుజారా డబుల్ సెంచరీ మిస్
- రిషభ్ పంత్ అజేయ శతకం
- బ్యాట్‌తో రాణించిన జడేజా
- ఆస్ట్రేలియాతో నాలుగో టెస్టు

సిడ్నీ: మెరుగైన స్కోరుతో తొలి రోజే సిడ్నీ టెస్టును తమవైపు తిప్పుకొన్న టీమిండియా... రెండో రోజు దానికి రెట్టింపు పైగా పరుగులు చేసి మ్యాచ్‌నే శాసించే స్థితిలో నిలిచింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారా (373 బంతుల్లో 193; 22 ఫోర్లు) త్రుటిలో డబుల్ సెంచరీ కోల్పోయినా, యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ (189 బంతుల్లో 159 నాటౌట్; 15 ఫోర్లు, 1 సిక్స్) అజేయ శతకం... ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా (114 బంతుల్లో 81; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో అదరగొట్టారు. ఫలితంగా ఆస్ట్రేలియాతో ఇక్కడ జరుగుతున్న నాలుగో టెస్టులో శుక్రవారం తొలి ఇన్నింగ్స్‌ను టీమిండియా 622/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. నాథన్ లయన్ (4/178) నాలుగు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఆట ముగిసే సమయానికి ఆసీస్ 10 ఓవర్లలో వికెట్లేమీ నష్టపోకుండా 24 పరుగులు చేసింది. ఓపెనర్లు మార్కస్ హారిస్ (19 బ్యాటింగ్), ఉస్మాన్ ఖాజా (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. కంగారూలు మన తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 598 పరుగులు వెనుకబడి ఉన్నారు.

ఆ లోటు తప్ప... అంతా ఏకపక్షమే!

ఓవర్‌నైట్ స్కోరు 303/4తో శుక్రవారం ఆట కొనసాగించిన భారత్... హనుమ విహారి (96 బంతుల్లో 42; 5 ఫోర్లు) వికెట్‌ను త్వరగానే కోల్పోయింది. క్రితం రోజు స్కోరుకు 3 పరుగులు మాత్రమే జోడించిన అతడు... లయన్ బౌలింగ్‌లో స్వీప్‌నకు యత్నించి షార్ట్‌లెగ్‌లో లబ్‌షేన్‌కు క్యాచ్ ఇచ్చాడు. అంపైర్ ఔటివ్వగా, సమీక్ష కోరినా వ్యతిరేకంగానే రావడంతో విహారి వెనుదిరిగాడు. ఇదే ఓవర్లో 150 మైలురాయిని దాటిన పుజారాకు పంత్ జత కలిశాడు. స్టార్క్ వాడివేడి యార్కర్లను కాచుకుంటూ, గతి తప్పిన లయన్ బంతులను బౌండరీకి పంపిస్తూ ఈ జోడీ లంచ్ విరామం వరకు వికెట్ పడకుండా చూసుకుంది. ఈ సెషన్‌లో భారత్ 86 పరుగులు చేయగా, ఇందులో పుజారావే 51 ఉండటం గమనార్హం. అలసిపోవడంతో పాటు డబుల్ సెంచరీకి దగ్గరగా ఉండటంతో విరామం తర్వాత పుజారా జోరు తగ్గించాడు. అప్పటికీ 192 పరుగుల వద్ద లయన్ బౌలింగ్‌లో స్లిప్‌లో ఖాజా క్యాచ్ వదిలేయడంతో అతడికి లైఫ్ దక్కింది. మరో 16 బంతులు ఎదుర్కొన్నా ఒక్క పరుగే చేయగలిగాడు. లయన్ ఓవర్లో బంతిని లెగ్‌సైడ్ పంపబోయి అతడికే క్యాచ్ ఇచ్చాడు. దీంతో పుజారా మారథాన్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. అప్పటికి స్కోరు 418/6.

పంత్–జడేజా జోడీ జోరు...

పుజారా వెనుదిరిగిన కాసేపటికే పంత్ అర్ధశతకం (85 బంతుల్లో) పూర్తయింది. ఈ దశలో మహా అయితే భారత్ 500కు అటుఇటుగా చేస్తుందని అంతా భావించారు. కానీ పంత్, జడేజా జోరుతో అది అమాంతం పెరిగిపోయింది. వారిద్దరి ధాటికి 500, 550, 600 ఇలా ఒక్కో గణాంకం చెదిరిపోయింది. పంత్ ఎప్పటిలానే దూకుడుగా కనిపించగా మరో ఎండ్‌లో కమిన్స్ బౌలింగ్‌లో అద్భుతమైన కట్ షాట్‌తో బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా ఫోర్, ఫుల్ డెలివరినీ లాంగాన్‌లోకి సిక్స్‌గా పంపి జడేజా వేగం పెంచాడు. టీమిండియా 491/6తో ‘టీ’కి వెళ్లింది. ఇక్కడి నుంచే కథ పూర్తిగా మారింది. అప్పటివరకు 16 ఓవర్లలో 73 పరుగులు జత చేసిన ఈ జోడీ... తర్వాత ఎదుర్కొన్న 21.2 ఓవర్లలో ఏకంగా 131 పరుగులు పిండుకుంది. బ్రేక్ తర్వాత లబ్‌షేన్ బౌలింగ్‌లో మిడ్ వికెట్ దిశగా ఫోర్ కొట్టి పంత్ 137 బంతుల్లో సెంచరీని అందుకున్నాడు. 89 బంతుల్లో జడేజా అర్ధ శతకం పూర్తయింది. ఆసీస్ మూడో కొత్త బంతి తీసుకున్నాక స్టార్క్, హాజల్‌వుడ్ ఓవర్లలో ఒక్కో ఫోర్ బాదిన జడేజా... కమిన్స్‌కైతే నాలుగు ఫోర్లతో చుక్కలు చూపాడు. దీంతో జట్టు స్కోరు 600 దాటింది. అటు హాజల్‌వుడ్ బౌలింగ్‌లో మూడు బౌండరీలు కొట్టిన పంత్ 150 (185 బంతుల్లో) మార్క్‌ను అందుకున్నాడు. సెంచరీ చేస్తాడనిపించిన జడేజా... లయన్ బంతిని భారీ షాట్ ఆడేందుకు క్రీజు వదిలి ముందుకొచ్చి బౌల్డ్ కావడంతో కోహ్లి భారత ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. అనంతరం ఆసీస్ ఇన్నింగ్స్ పది ఓవర్లు సాగింది. పంత్ ఒకింత తేలికైన క్యాచ్ వదిలేయడంతో షమీ వేసిన మూడో ఓవర్లోనే ఖాజాకు లైఫ్ దక్కింది. మరో ఓపెనర్ హారిస్ పెద్దగా ఇబ్బంది పడకుండానే రోజును ముగించాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: మయాంక్ అగర్వాల్ (సి) స్టార్క్ (బి) లయన్ 77; రాహుల్ (సి) షాన్ మార్ష్ (బి) హాజల్‌వుడ్ 9; పుజారా (సి అండ్ బి) లయన్ 193; కోహ్లి (సి) పైన్ (బి) హాజల్‌వుడ్ 23; రహానే (సి) పైన్ (బి) స్టార్క్ 18; విహారి (సి) లబ్‌షేన్ (బి) లయన్ 42; పంత్ (నాటౌట్) 159; జడేజా (బి) లయన్ 81; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం:** (167.2 ఓవర్లలో 7 వికెట్లకు డిక్లేర్డ్) 622.
వికెట్ల పతనం: 1–10, 2–126, 3–180, 4–228, 5–329, 6–418, 7–622. **బౌలింగ్:** స్టార్క్ 26–0–123–1; హాజల్‌వుడ్ 35–11–105–2; కమిన్స్ 28–5–101–0; లయన్ 57.2–8–178–4; లబ్‌షేన్ 16–0–76–0; హెడ్ 4–0–20–0; ఖాజా 1–0–4–0.
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హారిస్ (బ్యాటింగ్) 19; ఖాజా (బ్యాటింగ్) 5; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం:** (10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 24.
బౌలింగ్: షమీ 3–0–9–0; బుమ్రా 3–0–12–0; జడేజా 2–1–1–0; కుల్దీప్ 2–1–2–0.

నా ఆట మారలేదు.. భాగస్వామి తప్ప!

గతంలో నేను బ్యాటింగ్‌కు దిగిన సందర్భాల్లో టెయిలెండర్లతో కలిసి ఆడాల్సి వచ్చేది. పరుగులు చేయాల్సిన బాధ్యత నాపై ఉండేది. ఇప్పుడు మాత్రం అవతలి ఎండ్‌లో బ్యాట్స్‌మన్ (జడేజా) ఉన్నాడు. దీంతో నా ఆటనేమీ మార్చుకోవాల్సి రాలేదు. ఈ విషయంలో జట్టు నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. అందుకని క్రీజులో దిగినప్పుడల్లా బ్యాటింగ్‌ను ఆస్వాదిస్తున్నా. భారత్‌లో వెస్టిండీస్‌పై రెండుసార్లు 92 వద్ద ఔటవడంతో నిరుత్సాహపడ్డా. కానీ, వెంటనే తేరుకున్నా. ఇంకా అంతర్జాతీయ కెరీర్ ప్రారంభంలోనే ఉన్నా. అందుకని ప్రతి శతకం ప్రత్యేకమైనదే. వీటికంటే, జట్టుకు ఏది కావాలో అది చేయడం నా దృష్టిలో అత్యంత ముఖ్యం. *- రిషభ్ పంత్, భారత వికెట్ కీపర్*

హలో... నేను పైన్‌ను! అటు ఎవరు?



శుక్రవారం ఆట ముగిశాక, ఆస్ట్రేలియా కెప్టెన్ టిమ్ పైన్ మీడియా సమావేశంలో ఉండగా ఓ సరదా ఘటన చోటు చేసుకుంది. అదేంటంటే... పైన్ మాటలను రికార్డు చేసేందుకు జర్నలిస్టు ఒకరు తన ఫోన్‌ను అతడి ముందు పెట్టాడు. ఈలోగా ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. పైన్ ఏమాత్రం సంకోచించకుండా ఆ కాల్ లిఫ్ట్ చేశాడు. ‘నేను టిమ్ పైన్ మాట్లాడుతున్నా. అటు ఎవరు’? అని ప్రశ్నించాడు. దీనికి ‘హాంకాంగ్ నుంచి క్యాసీని మాట్లాడుతున్నా. మీరెవరంటూ?’ సమాధానం వచ్చింది. అనంతరం ‘మీకు మార్టిన్ కావాలా? అతడు మీడియా సమావేశంలో ఉన్నాడు. నేను అతడితో మీకు కాల్ చేయించవచ్చా?’ అని పైన్ అడగ్గా... ‘మెయిల్స్ చెక్ చేసుకోమనండి’ అని జవాబిచ్చాడు. ఈ విషయం మార్టిన్‌కు చెబుతానని పైన్ నవ్వుతూ సంభాషణను ముగించాడు.

8 — 190ల్లో ఔటైన 8వ భారత బ్యాట్స్‌మన్ పుజారా. అజహర్, ద్రవిడ్, సచిన్ రెండేసి సార్లు, బుధీ కుందరన్, సెహ్వాగ్, కేఎల్ రాహుల్, ధావన్ ఒక్కోసారి ఔటయ్యారు.

1 — ఆస్ట్రేలియాలో సెంచరీ చేసిన తొలి భారత, ఆసియా వికెట్ కీపర్ రిషభ్ పంత్. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లలో శతకం చేసిన తొలి భారత కీపర్ కూడా అతడే.

1258 — ఈ సిరీస్‌లో పుజారా ఎదుర్కొన్న బంతులు. ఆస్ట్రేలియా సిరీస్‌లో ఓ భారత బ్యాట్స్‌మన్‌కు ఇదే అత్యధికం. 2003-04లో ద్రవిడ్ 1203 బంతులు ఆడాడు.

2 — ఆస్ట్రేలియా గడ్డపై భారత్‌కు ఇది రెండో అత్యధిక స్కోరు. 2003-04 సిరీస్‌లో 705/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.

204 — ఏడో వికెట్‌కు పంత్-జడేజా జోడించిన పరుగులు. ఏ దేశంపైనైనా భారత్ తరఫున ఇదే అత్యధికం. 2017లో పుజారా-సాహా ఆసీస్‌పై 199 పరుగులు చేశారు.

1 — చిన్న వయసు (21 ఏళ్ల 91 రోజులు)లో 150 పరుగులు చేసిన తొలి కీపర్ పంత్. ధోని (21 ఏళ్ల 245 రోజులు; 2005లో బంగ్లాదేశ్‌పై) రికార్డును పంత్ సవరించాడు.

2 — గావస్కర్ తర్వాత ఓ సిరీస్‌లో అత్యధిక నిమిషాలపాటు క్రీజులో నిలిచిన రెండో భారత బ్యాట్స్‌మన్ పుజారా. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు పుజారా 1868 నిమిషాలు క్రీజులో గడిపాడు. గతంలో గావస్కర్ (1978 నిమిషాలు; 1971లో వెస్టిండీస్‌పై, 1976 నిమిషాలు; 1981/82లో ఇంగ్లండ్‌పై) ఈ ఘనత సాధించాడు.

డు ప్లెసిస్ సెంచరీ

దక్షిణాఫ్రికా 382/6

కేప్‌టౌన్: కెప్టెన్ డు ప్లెసిస్ (103; 13 ఫోర్లు) సెంచరీకి తోడు బవుమా (75; 10 ఫోర్లు) డికాక్ (55 బ్యాటింగ్; 7 ఫోర్లు) అర్ధశతకాలు సాధించడంతో పాకిస్తాన్‌తో జరుగుతోన్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 382 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 123/2తో శుక్రవారం రెండో రోజు ఆట కొనసాగించిన సఫారీ జట్టు ఆరంభంలోనే ఆమ్లా (24), డిబ్రుయిన్ (13) వికెట్లు కోల్పోయి 149/4తో నిలిచింది. ఈ దశలో డు ప్లెసిస్, బవుమా పాక్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందించారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 156 పరుగులు జతచేశాక బవుమా వెనుదిరిగాడు. చివర్లో డికాక్ ధాటిగా ఆడటంతో దక్షిణాఫ్రికా 205 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. పాక్ బౌలర్లలో షాహీన్ అఫ్రిది 3 వికెట్లు పడగొట్టాడు.

అవధ్ వారియర్స్ జోరు



అశ్విని

అహ్మదాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో అవధ్ వారియర్స్ 6–(–1)తో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌ను చిత్తుచేసింది. అవధ్ ‘ట్రంప్’ అయిన మహిళల సింగిల్స్‌లో బీవెన్ జాంగ్ 10–15, 15–11, 15–11తో కిర్‌స్టీ గిల్మోర్ (అహ్మదాబాద్)పై గెలుపొందగా, పురుషుల డబుల్స్‌లో లీ యంగ్–క్రిస్టియాన్సన్ (అవధ్) జంట 15–12, 10–15, 15–6తో నందగోపాల్–సాత్విక్ సాయిరాజ్ ద్వయంపై నెగ్గింది. పురుషుల సింగిల్స్‌లో సన్ వాన్ హో (అవధ్) 15–7, 8–15, 15–10తో అక్సెల్‌సన్‌ను ఓడించడంతో 4–0తో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే వారియర్స్ విజయం ఖాయమైంది. రెండో పురుషుల సింగిల్స్‌ను అహ్మదాబాద్ ‘ట్రంప్’గా ఎంచుకోగా... సౌరభ్ వర్మ 8–15, 12–15తో లీ డాంగ్ క్యున్ (అవధ్) చేతిలో చిత్తుగా ఓడాడు. చివరగా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–సిక్కి రెడ్డి జోడీ 15–13, 10–15, 12–15తో క్రిస్టియాన్సన్–అశ్విని పొన్నప్ప జంట చేతిలో ఓడింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో ముంబై రాకెట్స్‌తో చెన్నై స్మాషర్స్, బెంగళూరు రాప్టర్స్‌తో నార్త్ ఈస్టర్న్ వారియర్స్ తలపడతాయి.

నేటి నుంచి ఆసియా కప్ ఫుట్‌బాల్

అబుదాబి: ఆసియా కప్ సాకర్ సమరానికి రంగం సిద్ధమైంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 1న ముగిసే ఈ మెగా ఈవెంట్‌లో తొలిసారి అత్యధికంగా 24 దేశాలు పాల్గొంటున్నాయి. మొత్తం జట్లను ఆరు గ్రూపులుగా విభజించారు. భారత్‌తో పాటు ఆతిథ్య యూఏఈ, బహ్రెయిన్, థాయ్‌లాండ్ జట్లు గ్రూప్ ‘ఎ’లో ఉన్నాయి. శనివారం ఈ గ్రూప్‌లో జరిగే మొదటి మ్యాచ్‌లో యూఏఈతో బహ్రెయిన్ తలపడుతుంది. ఆదివారం జరిగే మ్యాచ్‌లో ఆసియా 15వ ర్యాంకర్ భారత్... థాయ్‌లాండ్‌తో పోటీపడుతుంది. అనంతరం 10న యూఏఈతో, 14న బహ్రెయిన్‌తో టీమిండియా ఆడుతుంది. ఈసారి టైటిల్ వేటలో తమ సత్తా చాటాలని సునీల్ ఛెత్రి సేన గట్టి పట్టుదలతో ఉంది. ఆసియా కప్‌లో భారత్ 1964లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత ఎప్పుడూ ఆ స్థాయి ఆటతీరు కనబరచలేదు.



సెమీస్‌లో నిఖత్

సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ (51 కేజీలు) సెమీఫైనల్‌కు చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. కర్ణాటకలోని విజయనగరలో జరుగుతోన్న ఈ పోటీల్లో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో నిఖత్ జరీన్ 5–0తో మాన్సీ శర్మ (ఉత్తరప్రదేశ్)పై గెలుపొందింది. 81 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్లో తెలంగాణకే చెందిన సారా ఖురేషి మహారాష్ట్ర బాక్సర్ మోహిని చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

టాటా ఓపెన్ ఫైనల్లో దివిజ్-బోపన్న జంట



పుణే: ఈ ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించేందుకు భారత టెన్నిస్ జంట దివిజ్ శరణ్–రోహన్ బోపన్న విజయం దూరంలో నిలిచింది. టాటా ఓపెన్ ఏటీపీ–250 టోర్నమెంట్‌లో దివిజ్–బోపన్న ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో టాప్ సీడ్ దివిజ్–బోపన్న జంట 6–3, 3–6, 15–13తో ‘సూపర్ టైబ్రేక్’లో సిమోన్ బొలెలీ (ఇటలీ)–ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జోడీపై గెలిచింది. 93 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జంట మూడు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. నేడు జరిగే ఫైనల్లో ల్యూక్ బాంబ్రిడ్జ్–జానీ ఒమారా (బ్రిటన్)లతో దివిజ్–బోపన్న తలపడతారు.

టైటిల్ కూత ఎవరిదో?

- ప్రో కబడ్డీ లీగ్ సీజన్–6 ఫైనల్ నేడే
- గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌తో బెంగళూరు బుల్స్ ఢీ
- రాత్రి గం.8 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: ఎన్నో ఉత్కంఠ పోరాటాలు... మరెన్నో అనూహ్య ఫలితాలు. మేటి జట్లు ముందే బరిలో నుంచి తప్పుకుంటే... అనామక జట్లు మెరుపులు మెరిపించాయి. డిఫెండింగ్ చాంపియన్ పట్నా పైరేట్స్ గ్రూప్ దశలోనే వెనుదిరగ్గా... గతేడాది రన్నరప్‌తో సరిపెట్టుకున్న గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ మరోసారి టైటిల్ పోరుకు సిద్ధమైంది. మూడు నెలల పాటు ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ప్రో కబడ్డీ లీగ్ చివరి దశకు చేరింది. బెంగళూరు బుల్స్, గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ మధ్య నేడు జరిగే ఫైనల్‌తో లీగ్ ఆరో సీజన్‌కు తెర పడనుంది. రైడింగ్‌లో బలంగా ఉన్న బెంగళూరు బుల్స్... దుర్భేద్యమైన డిఫెన్స్‌తో ఆకట్టుకున్న గుజరాత్ మధ్య రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. రెండు జట్లలో ఎవరు గెలిచినా... తొలిసారి టైటిల్ హస్తగతమవుతుంది. 2015లో బెంగళూరు బుల్స్ ఫైనల్‌కు చేరి రన్నరప్‌గా నిలిచింది. విజేతకు రూ.3 కోట్లు... రన్నరప్ జట్టుకు రూ.1.80 కోట్లు ప్రైజ్‌మనీగా లభించనుంది. ఇరుజట్ల మధ్య చివరగా జరిగిన తొలి క్వాలిఫయర్ మ్యాచ్‌లో బెంగళూరు గెలిచింది. ఈ సీజన్‌లో బెంగళూరు రైడర్స్ 521 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... 460 పాయింట్లతో గుజరాత్ రైడర్లు నాలుగో స్థానంలో ఉన్నారు. ఇక ట్యాక్లింగ్ విషయానికొస్తే 266 పాయింట్లతో గుజరాత్ రెండో స్థానంలో నిలవగా... 223 పాయింట్లతో బుల్స్ ఆరోస్థానంలో ఉంది. గుజరాత్‌కు సచిన్, ప్రపంజన్, సునీల్... బెంగళూరుకు కెప్టెన్ రోహిత్, పవన్ కీలకం.



సాక్షి బిజినెస్
శనివారం 5-1-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
181 ▲	55 ▲
35,695	10,727

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30గం.లకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	6,722	▲ 260
డోజోన్స్	23,393	▲ 706
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,837	▲ 144
డాక్స్	10,767	▲ 351
షాంఘై	2,515	▲ 51
నికాయ్	19,562	▼ 453

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	69.2	70.84
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.02	90.14
€	యూరో	ఎస్‌బీఐ	78.37	81.29
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63.4	65.84
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	48.09	50.3
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.51	52.28
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.3	20.3
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.15	10.8

కొత్త నిబంధనలకు గడువు పొడిగించండి..

కేంద్రాన్ని కోరనున్న ఈ కామర్స్ సంస్థలు



న్యూఢిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) సంబంధించి కొత్త నిబంధనల అమలుకు గడువును పొడిగించాలంటూ బడా ఈ కామర్స్ సంస్థలు.. కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిసింది. మార్పులు అమలు చేసేందుకు కనీసం 4– 5 నెలలు పడుతుందని, కాబట్టి అంత వరకూ సమయం ఇవ్వాలని అభ్యర్థించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. వాస్తవానికి ఫిబ్రవరి 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయి. కొత్త నిబంధనల అమలుకు తగ్గట్లుగా వ్యాపార విధానాలు మార్చుకునేందుకు, ప్రస్తుతం వివిధ సంస్థలతో ఉన్న భాగస్వామ్య ఒప్పందాలను సవరించుకునేందుకు కొంత సమయం కావాల్సి ఉంటుందని.. కానీ డిసెంబర్ 26న చేసిన ప్రకటనతో తమకు కేవలం నెల రోజుల వ్యవధి మాత్రమే ఇచ్చినట్లయిందని ఈ– కామర్స్ కంపెనీకి చెందిన ఓ సీనియర్ ఎగ్జిక్యూటివ్ పేర్కొన్నారు. అందుకే గడువు పొడిగించాలంటూ కేంద్రాన్ని కోరాలని ఈ–కామర్స్ సంస్థలు భావిస్తున్నట్లు చెప్పారు. ఇటీవలి సవరణలను కంపెనీలు అధ్యయనం చేస్తున్నాయని, వీటిపై రాబోయే వారాల్లో కేంద్రాన్ని సంప్రదించే అవకాశం ఉందని మరో అధికారి పేర్కొన్నారు.

కొత్త నిబంధనల ప్రకారం విదేశీ పెట్టుబడులు గల ఈ కామర్స్ సంస్థలు.. తమకు వాటాలున్న ఇతర సంస్థల ఉత్పత్తులను సొంత పోర్టల్‌లో విక్రయించడానికి లేదు. అలాగే, ఏ విక్రేత కూడా తన వద్దనున్న మొత్తం నిల్వల్లో 25 శాతానికి మించి .. ఈ కామర్స్ పోర్టల్‌లో విక్రయించకూడదు. ఒకవేళ నిర్దేశిత స్థాయిని మించిన పక్షంలో ఈ కామర్స్ సంస్థే వాటిని కొనుగోలు చేసి, నిల్వ చేస్తోందని భావించాల్సి ఉంటుంది. ఫలితంగా ఇన్వెంటరీ ఆధారిత రిటైల్ సంస్థల్లో ఎఫ్‌డీఐలకు అనుమతి లేదన్న నిబంధనను ఉల్లంఘించినట్లవుతుంది. అయితే, 25 శాతం నిబంధనపై మరింత స్పష్టత అవసరమని ఈ–కామర్స్ వర్గాలు అంటున్నాయి. విక్రేతలు తమ ఖాతాల వివరాలను ఈ–కామర్స్ సంస్థలతో పంచుకునేందుకు ఇష్టపడని పక్షంలో వారు కచ్చితంగా నిబంధనలు పాటిస్తున్నారో లేదో తెలుసుకోవడం సాధ్యం కాదని చెబుతున్నాయి.

రూపాయి... తీవ్ర ఒడిదుడుకులు!

48 పైసలు లాభంతో 69.72కు రికవరీ



ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ తీవ్ర ఒడిదుడుకులకు గురవుతోంది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి విలువ శుక్రవారం 48 పైసలు బలపడి 69.72 వద్ద ముగిసింది. బుధ, గురు వారాల్లో రూపాయి విలువ 77 పైసలు బలహీనపడి 69.43 నుంచి 70.20కి పడిపోయింది. శుక్రవారం మళ్లీ 48 పైసలు రికవరీతో 70.20 నుంచి 69.72కు చేరింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ల రికవరీ, ఆరు ప్రధాన దేశాల కరెన్సీలతో డాలర్ ఇండెక్స్ బలహీనధోరణి, ఎగుమతిదారులు, బ్యాంకర్ల డాలర్ అమ్మకాల ఒత్తిడి వంటివి శుక్రవారం రూపాయి సెంటిమెంట్‌ను బలపరిచాయి. శుక్రవారం రూపాయి ట్రేడింగ్ పటిష్టంగా 69.95 వద్ద ప్రారంభమైంది. తరువాత 69.66 వరకూ బలపడినా, కొంత వెనక్కుతగ్గి ట్రేడింగ్ చివరకు 69.72 వద్ద ముగిసింది. అమెరికా ఫెడ్ ఫండ్ రేటు (ప్రస్తుత శ్రేణి 2.25 శాతం నుంచి 2.5 శాతం శ్రేణి) పెంపు ప్రక్రియ చివరి దశకు వచ్చిందన్న ఊహాగానాలు, అమెరికా వృద్ధి అవకాశాలు మందగమనంలోకి జారుకుంటాయన్న విశ్లేషణలు డాలర్ ఇండెక్స్ బలహీనతకూ, రూపాయి సానుకూల సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. అక్టోబర్ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది.

ముడి చమురు(క్రూడ్) ధరలు అంతర్జాతీయంగా అనూహ్యంగా 30 డాలర్ల వరకూ పడిపోతూ వచ్చిన నేపథ్యంలో... క్రమంగా కోలుకుంటోంది. ఈ వార్త రాసే సమయం రాత్రి 9 గంటలకు అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో రూపాయి విలువ 69.90 వద్ద ట్రేడవుతుండగా, డాలర్ ఇండెక్స్ 96.17 వద్ద ట్రేడవుతోంది.

రూ. 2వేల నోట్ల ముద్రణ నిలిచింది

సూచన ప్రాయంగా వెల్లడించిన కేంద్రం



న్యూఢిల్లీ: డీమోనిటైజేషన్ అనంతరం ప్రవేశపెట్టిన రూ.2,000 నోట్ల ముద్రణను ప్రస్తుతానికి నిలిపివేసినట్లు కేంద్ర ప్రభుత్వం సూచనప్రాయంగా వెల్లడించింది. అవసరాలకు అనుగుణంగానే నోట్ల ముద్రణ ఉంటుందని, ప్రస్తుతానికి తగినంత స్థాయిలో రూ.2,000 నోట్లు ఉన్నాయని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గర్గ్ తెలిపారు. 'ప్రస్తుతం వ్యవస్థలో రూ.2,000 నోట్లు అవసరమైన దానికన్నా ఎక్కువగానే ఉన్నాయి. మొత్తం నోట్ల విలువలో ఇవి 35 శాతంగా ఉంటాయి. రూ. 2,000 నోట్ల ముద్రణకు సంబంధించి ఇటీవల ప్రత్యేకంగా నిర్ణయమేమీ తీసుకోలేదు' అని మైక్రో బ్లాగింగ్ సైట్ ట్విట్టర్‌లో ఆయన పేర్కొన్నారు. రూ.2,000 నోట్ల ముద్రణ నిల్చిపోయిందంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో గర్గ్ సూచనప్రాయ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

అనిల్ అంబానీని జైల్లో పెట్టండి!!

- విదేశాలకు వెళ్లకుండా ఆదేశాలివ్వండి
- మా బాకీల చెల్లింపులో మళ్లీ మళ్లీ డిఫాల్టవుతున్నారు
- సుప్రీం కోర్టును ఆశ్రయించిన ఎరిక్సన్





న్యూఢిల్లీ: దాదాపు 550 కోట్ల రూపాయల బకాయిలను చెల్లించడంలో పలుమార్లు విఫలమైన రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) చీఫ్ అనిల్ అంబానీపై స్వీడన్ టెలికం పరికరాల దిగ్గజం ఎరిక్సన్.. సుప్రీం కోర్టును ఆశ్రయించింది. తమ బాకీలు చెల్లించడంలో డిఫాల్ట్ అవుతున్న ఆయన్ను కోర్టు ధిక్కరణ నేరం కింద జైలుకు పంపాలని, బాకీలు చెల్లించేదాకా దేశం విడిచి వెళ్లకుండా ఆదేశాలివ్వాలని అభ్యర్థించింది. ఈ మేరకు ఒక ఆంగ్ల ఫైనాన్షియల్ డెయిలీ ఒక కథనాన్ని ప్రచురించింది. ఆర్‌కామ్ జరపాల్సిన చెల్లింపులకు సంబంధించి అనిల్ అంబానీ వ్యక్తిగత పూచీకత్తు ఇవ్వడంతో దీని ఆధారంగానే ఎరిక్సన్ కోర్టును ఆశ్రయించింది. మరోవైపు, స్పెక్ట్రం విక్రయాన్ని జాప్యం చేయడంపై టెలికం శాఖపై (డాట్) ఆర్‌కామ్ కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేసింది. స్పెక్ట్రం విక్రయంలో డాట్ జాప్యం చేయకుండా ఉండి ఉంటే ఎరికన్స్, ఇతర రుణదాతల బకాయిలు తీర్చేసేందుకు ఉపయోగకరంగా ఉండేదని పేర్కొంది. ఈ రెండు పిటీషన్లపై సుప్రీం కోర్టు సోమవారం విచారణ జరపనుంది. 'ఆర్‌కామ్‌తో పాటు తత్సంబంధిత వర్గాలు సుప్రీం కోర్టు ఆదేశాలను పాటించకపోవడంతో తాజాగా మరో పిటిషన్ వేయాల్సి వచ్చింది. మేం చాలా కాలంగా బాకీల చెల్లింపు కోసం ఎదురుచూస్తున్నాం. కానీ వారు చెల్లించకుండా కోర్టు ఆదేశాలను ధిక్కరించారు. కోర్టు ఆదేశాల ధిక్కరణ రుజువైన పక్షంలో ఆరు నెలల దాకా జైలు శిక్ష పడే అవకాశం ఉంది' అని ఎరిక్సన్ తరఫు న్యాయవాది అనిల్ ఖేర్ తెలిపారు.

స్పెక్ట్రం విక్రయంపై ఆర్‌కామ్ ఆశలు..

ఎరిక్సన్‌కు రూ.550 కోట్ల బకాయిలు చెల్లించడంలో ఆర్‌కామ్ విఫలం కావడం ఇది రెండోసారి. తొలిసారి డిఫాల్ట్ అయిన తర్వాత ఆర్‌కామ్‌కు సుప్రీం కోర్టు మరో అవకాశం ఇచ్చింది. డిసెంబర్ 15లోగా ఏటా 12 శాతం వడ్డీ రేటుతో బాకీలు చెల్లించాలని ఆదేశించింది. కానీ ఆర్‌కామ్ రెండోసారి కూడా విఫలమైంది. మరో టెలికం సంస్థ రిలయన్స్ జియోకు వైర్‌లెస్ స్పెక్ట్రంను విక్రయించడం ద్వారా వచ్చే నిధులతో రుణదాతలకు బకాయిలు చెల్లించేయాలని ఆర్‌కామ్ ఆశిస్తోంది. అయితే, ఆర్‌కామ్ బాకీలకు బాధ్యత వహించడానికి జియో సిద్ధంగా లేనందున కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ స్పెక్ట్రం డీల్‌కు అనుమతించలేమంటూ డిసెంబర్ నెలలో టెలికం శాఖ తోసిపుచ్చింది. ఈ పరిణామాల దరిమిలా ఆర్‌కామ్, ఎరిక్సన్ వివాదం మరో మారు కోర్టుకెక్కింది.

మరోవైపు, ఇరు కంపెనీల మధ్య స్పెక్ట్రం డీల్‌కు సంబంధించిన ప్రక్రియపై స్పష్టతనివ్వాలంటూ రిలయన్స్ జియో, రిలయన్స్ కమ్యూనికేషన్స్ కలిసి కేంద్ర టెలికం శాఖకు లేఖ రాసినట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. స్పెక్ట్రంనకు సంబంధించిన బకాయిలను తీర్చే బాధ్యత ఆర్‌కామే తీసుకుంటోందని జియో తెలిపినట్లు వివరించాయి. ఈ నేపథ్యంలో ఆర్‌కామ్‌తో స్పెక్ట్రం ట్రేడింగ్ ఒప్పందం కుదుర్చుకోవడానికి తాము సిద్ధమేనని జియో స్పష్టం చేసినట్లు పేర్కొన్నాయి. స్పెక్ట్రం విక్రయం ద్వారా రిలయన్స్ జియో నుంచి వచ్చే రూ. 975 కోట్లలో ఎరిక్సన్‌కు రూ. 550 కోట్లు, మైనారిటీ వాటాదారైన రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్‌కు రూ. 230 కోట్ల బకాయిలు చెల్లించాలని ఆర్‌కామ్ యోచిస్తోంది.

వివాదమిదీ..

దేశవ్యాప్తంగా ఆర్‌కామ్ టెలికం నెట్‌వర్క్ నిర్వహణకు సంబంధించి 2014లో ఎరిక్సన్ ఏడేళ్ల కాంట్రాక్టు దక్కించుకుంది. అయితే, 2016 నుంచి చెల్లింపులు నిల్చిపోవడంతో సెప్టెంబర్ 2017లో ఆర్‌కామ్‌తో పాటు ఆ గ్రూప్‌లో భాగమైన రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్, రిలయన్స్ టెలికంలపై ఎరిక్సన్.. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను (ఎన్‌సీఎల్‌టీ)లో దివాలా పిటిషన్ వేసింది. ఆర్‌కామ్ నుంచి తమకు రూ. 978 కోట్లు రావాలని, నోటీసులిచ్చినా చెల్లింపులు జరపకపోవడంతో ఇది రూ.1,600 కోట్లకు పెరిగిందని ఎరిక్సన్ పేర్కొంది. అయితే, దీనిపై నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ ఎన్‌సీఎల్‌ఏటీని ఆర్‌కామ్ ఆశ్రయించగా.. దివాలా చర్యలపై స్టే విధించింది. సెటిల్మెంట్ ఒప్పందం ప్రకారం సెప్టెంబర్ ఆఖరు నాటికి ఎరిక్సన్‌కు రూ.550 కోట్లు కట్టాలని ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశించింది. కానీ, గడువులోగా ఆర్‌కామ్ కట్టకపోవడంతో ఎరిక్సన్ మళ్లీ కోర్టుకెళ్లింది. దీంతో ఈసారి న్యాయస్థానం డిసెంబర్ 15 దాకా గడువిచ్చింది. ఆర్‌కామ్ ఈసారి కూడా డిఫాల్ట్ కావడంతో ఎరిక్సన్ మళ్లీ కోర్టునాశ్రయించింది. ప్రస్తుతం ఆర్‌కామ్ రుణ భారం రూ. 46,000 కోట్ల పైచిలుకు ఉంది. అనిల్ అంబానీ ప్రణాళిక ప్రకారం రిలయన్స్ జియో తదితర సంస్థలకు ఆర్‌కామ్ అసెట్స్ విక్రయానంతరం ఇది సుమారు రూ.6,000 కోట్లకు తగ్గవచ్చని అంచనా. అయితే, స్పెక్ట్రం ట్రేడింగ్‌కు సంబంధించి టెలికం శాఖ నుంచి అనుమతులు వీటికి కీలకం. ఆర్‌కామ్ ప్రభుత్వానికి కట్టాల్సిన స్పెక్ట్రం బకాయిలకు రిలయన్స్ జియో బాధ్యత వహించడానికి ఇష్టపడకపోవడంతో.. డాట్ నుంచి అనుమతులు రావడం లేదు. న్యాయస్థానం ఆదేశాలున్నా డాట్ కావాలనే జాప్యం చేస్తోందని, దీనివల్ల తాము రుణదాతలకు సకాలంలో చెల్లింపులు జరపలేకపోవడం వల్ల అన్ని వర్గాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆర్‌కామ్ వాదిస్తోంది.

గీతాంజలి గ్రూప్ విదేశీ ఫ్యాక్టరీ జప్తు

పీఎన్‌బీ కుంభకోణం కేసులో ఈడీ చర్యలు



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం కేసులో గీతాంజలి గ్రూప్ కంపెనీకి థాయ్‌లాండ్‌లో ఉన్న ఫ్యాక్టరీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. దీని విలువ దాదాపు రూ.13.14 కోట్లు ఉంటుందని వెల్లడించింది. తాజా అటాచ్‌మెంట్‌తో ఇప్పటి దాకా ఈ కేసులో జప్తు చేసుకున్న ఆస్తుల విలువ సుమారు రూ.4,765 కోట్లకు చేరిందని, విచారణ కొనసాగుతోందని ఈడీ వివరించింది. పీఎన్‌బీ నుంచి మోసపూరితంగా తీసుకున్న ఎల్‌ఓఏల ద్వారా లబ్ధి పొందిన సంస్థల్లో గీతాంజలి గ్రూప్‌లోని అబీక్రెస్ట్ (థాయ్‌లాండ్) కూడా ఉన్నట్లు వెల్లడైందని పేర్కొంది. దీంతో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద జప్తుకు సంబంధించి అబీక్రెస్ట్‌కి ప్రొవిజనల్ ఆర్డరు జారీ చేసినట్లు ఈడీ తెలిపింది. ఈ నేపథ్యంలో సదరు విదేశీ ప్రాపర్టీని గుర్తించామని, యాజమాన్య హక్కులను ధృవీకరించుకున్నాక అటాచ్‌మెంట్ ఆర్డరు జారీ చేశామని ఒక ప్రకటనలో తెలియజేసింది. గీతాంజలి గ్రూప్ అధినేత మెహుల్ చోక్సీ, ఆయన మేనల్లుడు నీరవ్ మోదీతో పాటు మరికొందరు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను రూ.13,000 కోట్ల మేర మోసం చేసిన సంగతి తెలిసిందే. విదేశాలకు పారిపోయిన చోక్సీ, మోదీలను ప్రస్తుతం భారత్ రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

రీడ్ అండ్ టేలర్ లిక్విడేషన్ నిలిపివేత

ఉద్యోగుల సంఘానికి ఒక అవకాశం • ఎన్‌సీఎల్‌టీ నిర్ణయం

ముంబై: ఖరీదైన సూట్లు, జాకెట్లు విక్రయించే రీడ్ అండ్ టేలర్ కంపెనీ లిక్విడేషన్‌ను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) నిలిపేసింది. రీడ్ అండ్ టేలర్ ఇండియా కంపెనీని నిర్వహిస్తామని, దానిని తమకు అప్పగించాలని ఉద్యోగుల సంఘం చేసిన అభ్యర్థనను ఎన్‌సీఎల్‌టీ ముంబై ధర్మాసనం మన్నించింది. దీనికి సంబంధించిన తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. ఈ కంపెనీ బకాయిలు రూ.4,100 కోట్ల మేర ఉన్నాయని, కానీ కంపెనీ విలువ ప్రస్తుతం రూ.300 కోట్లు మాత్రమేనని, లిక్విడేషన్ చేపడితే రుణ దాతలకేమీ రాదని, ఉద్యోగులు ఉపాధి కోల్పోతారని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ కంపెనీ ఉత్పత్తుల నాణ్యత, అధిక ధరలను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగుల సంఘానికి ఒక అవకాశం ఇవ్వాలని నిర్ణయించామని పేర్కొంది. కంపెనీలో మొత్తం 1,200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మైసూర్‌లో ప్లాంట్ ఉంది. ఈ కంపెనీ ఉచ్ఛ స్థితిలో ఉన్నప్పుడు జేమ్స్‌బాండ్ పాత్రధారి పియర్స్ బ్రాస్నన్, అమితాబ్ బచ్చన్‌లు బ్రాండ్ అంబాసిడర్‌లుగా వ్యవహరించారు.

ఎడెల్‌వీస్ వ్యాజ్యంతో ఎన్‌సీఎల్‌టీకి

కస్లివాల్ కుటుంబానికి చెందిన ఎస్ .కుమార్ గ్రూప్ రీడ్ అండ్ టేలర్ ఇండియా కంపెనీని నిర్వహిస్తోంది. ఈ కంపెనీ ఖరీదైన సూట్లు, జాకెట్లు, ట్రౌజర్లు, షర్ట్‌లు, టి–షర్ట్‌లను విక్రయిస్తోంది. ఈ కంపెనీ బ్యాంక్‌లకు, ఇతర ఆర్థిక సంస్థలకు రూ.4,100 కోట్ల మేర బకాయిలు పడటంతో వీటి వసూళ్లకు గాను ఈ కంపెనీకి వ్యతిరేకంగా ఎడెల్‌వీజ్ ఏఆర్‌సీ ఎన్‌సీఎల్‌టీలో ఒక కేసు వేసింది. ఎనిమిది కంపెనీలు రిజల్యూషన్ ప్రణాళికలను సమర్పించినప్పటికీ, అవేవీ సంతృప్తికరంగా లేకపోవడంతో రుణదాతల కమిటీ లిక్విడేషన్‌కు సిఫార్సు చేసింది.



ఫైన్‌క్వెస్ట్‌కే అధిక భారం...

రీడ్ అండ్ టేలర్ కంపెనీ నుంచి ఫైన్‌క్వెస్ట్ ఫైనాన్షియల్ సొల్యూషన్ కంపెనీకి అధికంగా రూ.800 కోట్ల మేర రావలసి ఉంది. యూనియన్ బ్యాంక్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఐఎల్అండ్‌ఎఫ్‌ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐడీబీఐ బ్యాంక్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్ తదితర సంస్థలకు ఈ సంస్థ భారీగా బకాయిలు చెల్లించాల్సి ఉంది.

150 కోట్ల డాలర్లు సమీకరించనున్న ఐఓసీ

అంతర్జాతీయ బాండ్ మార్కెట్ ద్వారా..



ముంబై: దేశీయ అతి పెద్ద ఆయిల్ మార్కెటింగ్, రిఫైనింగ్ కంపెనీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) అంతర్జాతీయ బాండ్ మార్కెట్ నుంచి 150 కోట్ల డాలర్ల మేర నిధులు సమీకరించనుంది. ఈ కంపెనీ అమెరికా డాలర్ డినామినేషన్ నోట్ల ద్వారా 75 కోట్ల డాలర్ల నుంచి 150 కోట్ల డాలర్ల మేర నిధులు సమీకరించనున్నదని సంబంధిత వర్గాలు చెప్పాయి. ఈ బాండ్ల కాలపరిమితి వెల్లడి కాలేదు. అయితే ఈ బాండ్లకు మూడీస్ సంస్థ బీఏఏ2 రేటింగ్‌ను, ఫిచ్ రేటింగ్స్ సంస్థ ట్రిపుల్ బి మైనస్ రేటింగ్‌ను ఇచ్చాయి. వాటాదారుల రాబడులు, మూలధన పెట్టుబడులు అధికంగా ఉన్నా, ఫ్రీ క్యాష్ ఫ్లోస్ రుణాత్మకంగా ఉన్నప్పటికీ, ఐఓసీకి మంచి రేటింగే ఇచ్చామని మూడీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వికాస్ హలన్ చెప్పారు. ఇటీవలే ఈ కంపెనీ రూ.12,300 కోట్ల షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించిందని, నికర రుణాలను మరింతగా పెంచిందని ఆయన గుర్తు చేశారు. ఐఓసీకి ప్రభుత్వం నుంచి సబ్సిడీల రూపంలో తోడ్పాటు అందుతోందని ఫిచ్ రేటింగ్స్ సంస్థ పేర్కొంది.

బ్యాంకుల విలీనంతో ఉద్యోగాల కోత ఉండదు

కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనంతో ఉద్యోగాలకు నష్టం వాటిల్లదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభకు తెలిపారు. ప్రభుత్వ రంగంలోని విజయా బ్యాంకు, దేనా బ్యాంకులను బ్యాంకు ఆఫ్ బరోడాలో విలీనం చేసేందుకు కేంద్ర కేబినెట్ ఈ వారం మొదట్లో ఆమోదం తెలిపింది. ఈ మూడు బ్యాంకుల విలీనంతో ఎస్‌బీఐ మాదిరిగా పెద్ద బ్యాంకు అవతరిస్తుందని జైట్లీ చెప్పారు. రుణాలపై వ్యయాలు కూడా తగ్గుతాయన్నారు. ప్రభుత్వ రంగంలోని 21 బ్యాంకులకు గాను 11 బ్యాంకులు ఆర్‌బీఐ కచ్చితమైన దిద్దుబాటు కార్యాచరణ పరిధిలో (పీసీఏ) ఉన్నట్టు లోక్‌సభ ప్రశ్నోత్తరాల సందర్భంగా జైట్లీ చెప్పారు. అధిక ఎన్‌పీఏలతో ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను గాడిలో పెట్టేందుకు ఆర్‌బీఐ పీసీఏను అమల్లోకి తెచ్చింది. రూ.3 లక్షల కోట్లను వ్యవస్థలోకి తిరిగి తీసుకొచ్చేందుకు దివాలా చట్టం సాయపడినట్టు మంత్రి తెలిపారు. ఎస్‌బీఐ, ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులు నిర్వహణ పరంగా లాభాల్లోనే ఉన్నప్పటికీ, మొండి బకాయిలకు కేటాయింపులు చేయడం వల్లే నష్టాలను చవిచూస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వరంగ బ్యాంకుల కోసం రూ.65,000 కోట్లను బడ్జెట్‌లో కేటాయించగా, ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నాటికి రూ. 51,533 కోట్ల నిధుల సాయం చేసినట్టు తెలిపారు.

భారత ఫారెక్స్ నిల్వలు @ 393 బిలియన్ డాలర్లు

ముంబై: భారత్ విదేశీ మారకద్రవ్య నిల్వలు డిసెంబర్ 28తో ముగిసిన వారంలో 116.4 మిలియన్ డాలర్లు ఎగశాయి. దీనితో నిల్వలు మొత్తం విలువ 393.40 బిలియన్ డాలర్లకు చేరింది. విలువను డాలర్ రూపంలో పేర్కొనే విదేశీ కరెన్సీ (యూరో, పౌండ్, యన్ వంటివి) అసెట్స్ పెరగడం దీనికి ప్రధాన కారణమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాలు పేర్కొన్నాయి. 2018 ఏప్రిల్ 13న రికార్డు స్థాయి 426.028 బిలియన్ డాలర్లకు చేరిన విదేశీ మారకనిల్వలు అటు తర్వాత క్రమంగా తగ్గాయి. తాజాగా విడుదలైన గణాంకాల్లో ముఖ్యాంశాలు చూస్తే...

- ఫారిన్ కరెన్సీ అసెట్స్: మొత్తం నిల్వల్లో ప్రధాన భాగమైన ఈ విభాగం పరిమాణం 106.30 మిలియన్ డాలర్లు పెరిగి 368.077 బిలియన్ డాలర్లకు చేరింది.
- పసిడి నిల్వల విలువ స్థిరంగా 21.224 బిలియన్ డాలర్లుగా ఉంది.
- అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) వద్ద స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ పరిమాణం 3.6 మిలియన్ డాలర్లు పెరిగి 1.462 బిలియన్లకు చేరింది.
- ఇక ఐఎంఎఫ్‌కు సంబంధించిన దేశీ నగదు నిల్వలు కూడా 6.5 మిలియన్ డాలర్లు పెరిగి 2.640 బిలియన్ డాలర్లకు ఎగసింది.



కొత్త పేటెంట్ ఔషధ ధరలపై ఐదేళ్లు కంపెనీలకు స్వేచ్ఛ




న్యూఢిల్లీ: మేధో సంపత్తి హక్కులు కలిగిన (పేటెంటెడ్) నూతన ఔషధాలకు ధరల పరంగా కేంద్రం స్వేచ్ఛనిచ్చింది. భారతీయ పేటెంట్ చట్టం 1970 కింద పేటెంట్ హక్కులను కలిగి, వాణిజ్యపరంగా మార్కెట్లోకి వచ్చిన దగ్గర్నుంచి ఐదు సంవత్సరాలపాటు సంబంధిత ఔషధానికి ధరల నియంత్రణ వర్తించదని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. షెడ్యూల్డ్ ఫార్ములేషన్లు, నాన్ షెడ్యూల్డ్ ఫార్ములేషన్ల ధరలను ఔషధ ధరల నియంత్రణ మండలి ఎప్పటికప్పుడు ఖరారు చేయడంతోపాటు, పర్యవేక్షిస్తుంటుందని తెలిసిందే.

మెడికల్ ఉత్పత్తుల అడ్డా 'ఆర్కే'

- ఏటా రూ.6 కోట్ల వ్యాపారం
- ఈ ఏడాది లక్ష్యం రూ.20 కోట్లు
- స్టార్టప్ డైరీతో ఫౌండర్ రవికిరణ్







హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్కానింగ్, ఈసీజీ వంటి వైద్య ఉత్పత్తులను సమీకరించుకోవటం కార్పొరేట్ ఆసుపత్రులకు పెద్ద కష్టమేమీ కాదు. కానీ, గ్రామాల్లోని ఆసుపత్రులకు కాస్త ఇబ్బందే. దీన్నే వ్యాపార వేదికగా ఎంచుకుంది ఆర్కే ఎంటర్‌ప్రైజెస్. బహుళ జాతి కంపెనీలతో ఒప్పందం చేసుకొని ద్వితీయ శ్రేణి పట్టణాల్లో మెడికల్ ఉత్పత్తులను విక్రయించడమే దీని ప్రత్యేకత. మరిన్ని వివరాలు సంస్థ ఫౌండర్ రవి కిరణ్ 'స్టార్టప్ డైరీ'తో పంచుకున్నారు.

''మాది నెల్లూరు. బీ–ఫార్మసీ పూర్తయ్యాక.. విప్రో జీఈలో ఆంధ్రప్రదేశ్ బిజినెస్ మేనేజర్‌గా చేరా. తర్వాత శామ్‌సంగ్ మెడికల్ ఎక్విప్‌మెంట్‌లో సేల్స్ మేనేజర్‌గా పనిచేశా. అప్పుడు గమనించింది ఏంటంటే? గ్రామాల్లోని ఆసుపత్రుల్లో మెడికల్, డయాగ్నస్టిక్ ఉత్పత్తులు అందుబాటులో లేకపోవటంతో దగ్గర్లోని నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో వైద్య సేవలు ఆలస్యమవుతున్నాయని! దీనికి పరిష్కారం చూపించేందుకు 2017 డిసెంబర్‌లో నెల్లూరు కేంద్రంగా ఆర్కే ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రారంభించాం. అందుబాటు ధరల్లో మెడికల్ ఉత్పత్తులు, మెడి కన్జ్యూమబుల్స్‌ని విక్రయించడం మా ప్రత్యేకత.

40కి పైగా వైద్య ఉత్పత్తులు..

స్కానింగ్ మిషన్స్, ఈసీజీ, ఫెటల్ మానిటర్స్, కార్డియో కేర్ వంటి 40 రకాలకు పైగా వైద్య ఉత్పత్తులను విక్రయిస్తున్నాం. కేబుల్స్, ప్రింటర్స్, పేపర్స్ వంటి మెడి కన్జ్యూమబుల్స్ కూడా ఉంటాయి. ఉత్పత్తుల కోసం బయోనెట్, ఫెటల్, వాటెక్ ఇండియా, డాల్ఫిన్, ఫిలిప్స్, క్రాన్‌డెంట్, ఆట్రియం వంటి 12 కంపెనీలతో ఒప్పందం చేసుకున్నాం. త్వరలోనే సోనీ, సియామ్స్, సీమెన్స్‌తోనూ ఒప్పందం చేసుకోనున్నాం.

నెలకు రూ.50 లక్షలు..

వైద్య ఉత్పత్తుల విక్రయంతో పాటూ ఇన్‌స్టలేషన్, సర్వీసింగ్ కూడా కంపెనీయే చూసుకుంటుంది. ప్రస్తుతం నెలకు రూ.50 లక్షల వ్యాపారం చేస్తున్నాం. ఇప్పటివరకు వందకు పైగా ఇన్‌స్టలేషన్ చేశాం. కర్నూల్, నెల్లూరులోని 6 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో ఒప్పందం చేసుకున్నాం. ప్రస్తుతం మా సంస్థలో 14 మంది ఉద్యోగులున్నారు. మార్చి నాటికి ఆర్కేమెడిసాల్స్.కామ్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తాం. ఈ ఏడాదిలో రూ.20 కోట్ల ఆదాయాన్ని లక్ష్యించాం. మెడికల్ ఉత్పత్తుల నిల్వ కోసం నెల్లూరులో గిడ్డంగి ఏర్పాటు చేశాం. రూ.5 లక్షల లోపు ధర ఉంటే వైద్య ఉత్పత్తులను నిల్వ చేస్తాం'' అని రవి కిరణ్ తెలిపారు.

అద్భుతమైన స్టార్టప్‌ల గురించి అందరికీ తెలియజేయాలనుకుంటే **startups@sakshi.com** కు మెయిల్ చేయండి...

డిసెంబర్‌లో 'సేవలు' తగ్గాయ్

న్యూఢిల్లీ: సేవల రంగం డిసెంబర్‌లో మందగించిందని నికాయ్ ఇండియా బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ పేర్కొంది. నవంబర్‌లో 53.7గా ఉన్న ఈ సూచీ.. డిసెంబర్లో 53.2కు పడిపోయింది. అయితే సూచీ 50 దిగువనకు పడితేనే క్షీణతగా పరిగణిస్తారు. లేదంటే వృద్ధి ధోరణిగానే భావిస్తారు. కాగా, ఉపాధి అవకాశాలు మాత్రం డిసెంబర్‌లో పెరిగాయని నికాయ్ నివేదిక పేర్కొంది. నికాయ్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్– డిసెంబర్‌లో 53.6కు తగ్గింది. నవంబర్‌లో 54.5గా నమోదైంది.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- సెంట్రమ్ టాప్ పిక్స్
- యూఎస్ మార్కెట్ సద్దుమణగాలి!
- ఫార్మా ఫలితాలపై క్రెడిట్ సూసీ అంచనాలు
- ఒడిదుడుకులకు సిద్ధంకండి!
- రూపాయి జోరు... ఐటీ షేర్ల బేజారు..!
- ఐదు ఐటీ కంపెనీలు... 4.8 శాతం వృద్ధి

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం..

WWW.SAKSHIBUSINESS.COM
SAKSHIBUSINESS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

పార్లమెంటులో బిజినెస్



హువావే పరికరాలను నిషేధించం

చైనా టెలికాం సంస్థ హువావే ఉత్పత్తి చేస్తున్న పరికరాలపై నిషేధం విధించే ప్రతిపాదనేమీ లేదని టెలికం మంత్రి మనోజ్ సిన్హా స్పష్టంచేశారు. ఈ సంస్థ ఉత్పత్తి చేస్తున్న టెలికమ్ గేర్, పరికరాలపై నిషేధం లేదనే విషయాన్ని రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. చైనా కంపెనీలు ఉత్పత్తి చేస్తున్న పరికరాల వల్ల గూఢచర్య ముప్పు తలెత్తే అవకాశం ఉందని ఇప్పటికే పలుదేశ ప్రభుత్వాలు నిషేధించటం తెలిసిందే.

పరోక్ష పన్నుల వసూళ్లు @ రూ.6.12 లక్షల కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఏప్రిల్– నవంబర్ కాలానికి రూ.6,12,653.47 కోట్ల పరోక్ష పన్నుల వసూళ్లు జరిగినట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోక్‌సభకు వెల్లడించారు. '2018–19 బడ్జెట్ లక్ష్యం రూ.11.16 లక్షల కోట్లు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ప్రభుత్వం పలు పరిపాలనా పరమైన చర్యలను చేపట్టింది. ఇందులో భాగంగానే కచ్చిత ఆన్‌లైన్– ఫైలింగ్ వంటి నిర్ణయాలను ప్రకటించింది' అని మంత్రి చెప్పారు.

రోజువారీ పసిడి ధరల నిర్ణయ యంత్రాంగం లేదు..



ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు వినిమయ దేశమైన భారత్‌లో.. ఏ రోజు ధరను ఆరోజు నిర్ణయించే కచ్చితమైన యంత్రాంగమేమీ లేదని వినియోగదారుల వ్యవహారాల శాఖ సహాయ మంత్రి సీ.ఆర్. చౌదరి రాజ్యసభకు చెప్పారు. 'సాధారణంగా బంగారం ధరలు.. స్వచ్ఛత, దిగుమతి రేటు, బేసిక్ కస్టమ్స్ సుంకం, లాజిస్టిక్స్ వ్యయం, ఇతర పన్నుల వంటి ప్రాథమిక అంశాల ఆధారంగా నిర్ణయం అవుతాయి. అయితే, భారత్‌లో ఈ అంశానికి సంబంధించి రోజువారీ ధరలు నిర్ణయించడానికి ఒక కచ్చిత యంత్రాంగమేమీ లేదు. ఇంతే కాక ఒక్కో ప్రాంతంలో ఒక్కో ధర ఉంటుంది. బీఐఎస్ చట్టం ప్రకారం హాల్‌మార్క్ తప్పనిసరి కాగా, ఈ ముద్ర లేకపోయినా చలామణి జరుగుతోంది.' అని వివరించారు.

22% తగ్గిన టెలికం ఆదాయం




కేంద్రానికి టెలికం రంగ ఆదాయం 2017–18 ఆర్థిక సంవత్సరంలో 22 శాతం తగ్గుదలను నమోదు చేసిందని.. టెలికం శాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా రాజ్యసభకు చెప్పారు. సర్వీస్ ప్రొవైడర్లు పొందే ఆదాయంపై ప్రభుత్వం లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రం చార్జీలను వసూలు చేస్తుండగా.. వీరికి వచ్చే ఆదాయం గణనీయంగా తగ్గడమే దీనికి కారణమన్నారు. ''2017–2018లో టెలికాం సంస్థల స్థూల ఆదాయం (ఏజీఆర్) 1,30,844.9 కోట్లు. అంతకుముందు ఏడాదితో పోల్చితే 18.62 శాతం తగ్గింది. దీంతో కేంద్ర ఆదాయం కూడా 18.12 శాతం తగ్గి రూ.10,670.6 కోట్లకు పరిమితమైంది. 2016–17లో రూ.13,032.9 కోట్ల ఆదాయం సమకూరింది.'' అని తెలియజేశారు.

బ్యాంకింగ్, యాప్‌ల మోసాలపై చట్టం

సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్ల ద్వారా మోసాలకు పాల్పడే వారిని శిక్షించడం.. సమాచార దోపిడిని అరికట్టడం, రూ.లక్షలోపు నష్టపోయిన వారికి సైతం న్యాయం జరిగేలా చూడడం కోసం కేంద్రం ఆర్‌బీఐతో కలిసి పనిచేస్తుందని కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ రాజ్యసభకు తెలిపారు. ఇందుకోసం ఫైనాన్షియల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు ముసాయిదాను రూపొందించినట్లు చెప్పారాయన. 'ఆర్‌బీఐ బ్యాంకులతో కలిసి.. క్రెడిట్, డెబిట్, ఏటీఎం కార్డుల్లో జరిగిన మోసాలతో పాటు ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ ద్వారా జరిగిన రూ.లక్షలోపు మోసాలకు సంబంధించిన కేసులను పరిశీలిస్తోంది. డేటా హ్యాకింగ్‌పై నిఘా పెంచి, కట్టుదిట్టమైన వ్యవస్థను మెరుగుపరుస్తున్నాం. సాంకేతిక అభివృద్ధి పరంగా భారత్ మరింత ముందుకు వెళ్లాలనే నిర్ణయాల్లో భాగంగా చట్టాలను మరింత కఠినతరం చేస్తున్నాం' అని వివరించారు.

సెన్సెక్స్ 181 పాయింట్లు అప్



- వచ్చే వారం చైనా–అమెరికా చర్చలు
- ప్రపంచ మార్కెట్లలో రిలీఫ్ ర్యాలీ
- మన మార్కెట్లో కొన్ని షేర్లలో వేల్యూ బయింగ్
- రెండు రోజుల నష్టాలకు బ్రేక్
- 181 పాయింట్లు పెరిగి 35,695కు సెన్సెక్స్
- 55 పాయింట్ల లాభంతో 10,727కు నిఫ్టీ

ఇటీవలి నష్టాల కారణంగా పతనమైన బ్యాంక్, లోహ, వాహన. టెలికం షేర్లలో వేల్యూ బయింగ్ చోటు చేసుకోవడంతో శుక్రవారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. మరోవైపు అమెరికా– చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నివారణకు చర్చలు జరగనున్నాయన్న వార్తల నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లలో రిలీఫ్ ర్యాలీ చోటు చేసుకోవడం సానుకూల ప్రభావం చూపించింది. రూపాయి బలపడటం వల్ల ఒకింత ఒడిదుడుకుల చోటు చేసుకున్నాయి. ఇంట్రాడేలో 132 పాయింట్లు నష్టపోయినప్పటికీ, చివరకు సెన్సెక్స్ 181 పాయింట్ల లాభంతో 35,695 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 55 పాయింట్ల లాభంతో 10,727 పాయింట్ల వద్దకు చేరింది. దీంతో రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. వారం పరంగా చూస్తే, సెన్సెక్స్ 382 పాయింట్లు, నిఫ్టీ 133 పాయింట్లు చొప్పున పతనమయ్యాయి. టెలికం, లోహ, యుటిలిటీస్, ఆర్థిక రంగ షేర్లు లాభపడ్డాయి. రూపాయి పుంజుకోవడంతో ఐటీ షేర్లు నష్టపోయాయి.

ప్రపంచ మార్కెట్లలో రిలీఫ్ ర్యాలీ..

వాణిజ్య ఉద్రిక్తతల నివారణకు చర్చల నిమిత్తం అమెరికా అధికారుల బృందం వచ్చే వారం చైనాలో పర్యటించనున్నదని చైనా వాణిజ్య శాఖ వెల్లడించింది. వచ్చే సోమ, మంగళ వారాల్లో చర్చలు జరగనున్నాయని పేర్కొంది. ఈ వార్తలు ప్రపంచ మార్కెట్లలో రిలీఫ్ ర్యాలీకి కారణమయ్యాయి. జపాన్ మినహా మిగిలిన అన్ని ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లన్నీ లాభాల్లోనే ముగిశాయి.

362 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...

ఆసియా మార్కెట్ల సానుకూలతతో సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. ఆరంభ కొనుగోళ్ల జోరుతో ఈ లాభాలు మరింతగా కొనసాగాయి. ఆ తర్వాత గంటసేపు నష్టాల్లో కదలాడిన సెన్సెక్స్ మళ్లీ లాభాల బాట పట్టింది. చివరి గంటన్నర వరకూ పరిమిత శ్రేణిలో కదలాడి, ఆ తర్వాత పుంజుకొని లాభాల జోరును కొనసాగించింది. సెన్సెక్స్ ఒక దశలో 132 పాయింట్లు నష్టపోగా, మరో దశలో 230 పాయింట్ల వరకూ లాభపడింది. మొత్తం మీద రోజంతా 362 పాయింట్ల రేంజ్లో కదలాడింది. ఇక నిఫ్టీ ఒక దశలో 43 పాయింట్లు పతనం కాగా, మరో దశలో 69 పాయింట్లు లాభపడింది.

- ప్రభుత్వ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. పీఎన్‌బీ, యూనియన్ బ్యాంక్, బీఓఐ, ఆంధ్రా బ్యాంక్, ఎస్‌బీఐలు 4 శాతం వరకూ పెరిగాయి.
- అమెరికాలో జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) అమ్మకాలు 24 శాతం పెరగడంతో టాటా మోటార్స్‌షేర్ 2. శాతం లాభంతో రూ.171 వద్ద ముగిసింది.

స్టాక్ మార్కెట్ డేటా

టర్నోవర్ (రూ. కోట్లలో)	
బీఎస్ఈ	2,251
ఎన్ఎస్ఈ	28,007
ఎన్ఎస్ఈ (డెరి.)	6,87,036
ఎఫ్ఐఐ	- 157
డీఐఐ	241

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
INFRATEL	287	5.67
YESBANK	190	3.2
VEDL	193.9	3.17
TATAMOTORS	171.15	3.07
BHARTIARTL	322	2.71
ONGC	146.05	2.56
JSWSTEEL	289.4	2.39
TATASTEEL	492.7	2.38
SBIN	297.3	2.13
AXISBANK	620	1.98

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
HCLTECH	932	-1.72
TECHM	681.4	-1.42
INFY	660.25	-1.33
HEROMOTOCO	2,985.00	-0.98
INDUSINDBK	1,545.30	-0.95
TCS	1,882.00	-0.94
SUNPHARMA	433.4	-0.62
LT	1,386.90	-0.58
HINDUNILVR	1,780.00	-0.47
WIPRO	324	-0.46

నోకియా నుంచి మరో ఫోన్



హెచ్‌ఎండీ గ్లోబల్ కంపెనీ నోకియా 106 మోడల్ ఫీచర్ ఫోన్‌ను భారత వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. మంచి బ్యాటరీ లైఫ్, చూడ్డానికి సింపుల్‌గా, మన్నికగా ఉంటుందని కంపెనీ తెలిపింది. 17.7 గంటల టాక్‌టైమ్, 21 రోజుల స్టాండ్‌బై టైమ్‌తో ఈ ఫోన్ లభిస్తుంది. మైక్రో యూఎస్‌బీ చార్జర్ ద్వారా చార్జ్ చేసుకోవచ్చు. డార్క్ గ్రే రంగులో లభించే ఈ ఫోన్ ధర రూ.1,299.

విమానాల్లో మొబైల్ సేవలపై కమిటీ..

న్యూఢిల్లీ: విమానాల్లోనూ, నౌకల్లోనూ మొబైల్ సేవలను (ఐఎఫ్‌ఎంసీ) మూడు నెలల వ్యవధిలోగా అందుబాటులోకి తెచ్చే అంశంపై అంతర్–మంత్రిత్వ శాఖల కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం నిర్ణయించింది. వీటి అమల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై ఈ కమిటీ ప్రతి 15 రోజులకొకసారి సమావేశం అవుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 'ఎయిర్‌లైన్స్, షిప్పింగ్ కంపెనీలు, టెలికం ఆపరేటర్లు, ప్రభుత్వంలోని వివిధ శాఖల వర్గాలతో శుక్రవారం సమావేశం జరిగింది. ఐఎఫ్‌ఎంసీ సర్వీసులను సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తెచ్చే దిశగా అంతర్–మంత్రిత్వ శాఖల గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సర్వీసులు సజావుగా అమలయ్యే క్రమంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ఈ కమిటీ ప్రతి 15 రోజులకోసారి సమావేశం అవుతుంది' అని వివరించాయి. మూడు నెలల్లోగా సర్వీసులు అందుబాటులోకి తేవొచ్చని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైనట్లు పేర్కొన్నాయి. పది ఎయిర్‌క్రాఫ్ట్‌లలో ఈ సేవలు ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేసుకున్నామని స్పైస్‌జెట్ తెలిపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు, ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో శాటిలైట్ బ్యాండ్‌విడ్త్ చార్జీలు 7–8 రెట్లు అధికంగా ఉంటున్నాయని, దీంతో రెండు గంటల విమాన ప్రయాణంలో కాల్ చార్జీలు 30–50 రెట్లు అధికంగా ఉండే (సుమారు రూ. 700–1000 దాకా) అవకాశముందని బ్రాడ్‌బ్యాండ్ టెక్నాలజీ సంస్థ హ్యూస్ ఇండియా పేర్కొంది.



ఎంఎస్‌ఎంఈలకు రుణాలపై ఐసీఐసీఐ బ్యాంకు దృష్టి...

ఎస్‌బీఎఫ్‌సీ సంస్థతో ఒప్పందం

న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) రూ.కోటి వరకు రుణాలిచ్చేందుకు గాను స్మాల్ బిజినెస్ ఫిన్ క్రెడిట్ (ఎస్‌బీఎఫ్‌సీ) సంస్థతో ఐసీఐసీఐ బ్యాంకు వ్యాపార ఒప్పందం చేసుకుంది. ఎంఎస్‌ఎంఈలకు ఈ రెండు సంస్థలు సంయుక్తంగా రుణాలను మంజూరు చేస్తాయి. ఆర్థిక వ్యవస్థలో ప్రాధాన్య రంగాలకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలతో (ఎన్‌బీఎఫ్‌సీ) భాగస్వామ్యానికి బ్యాంకులను ఆర్‌బీఐ అనుమతించిన విషయం తెలిసిందే. ఒక బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ మధ్య ఈ తరహా ఒప్పందం ఇదే మొదటిసారి అని ఐసీఐసీఐ బ్యాంకు తెలిపింది. ఒక సంస్థకు గరిష్టంగా రూ.కోటి వరకు రుణాన్ని 15 ఏళ్ల కాల వ్యవధితో జారీ చేయనున్నట్టు పేర్కొంది.



ఈసీఎల్ ఫైనాన్స్ ఎన్‌సీడీ ఇష్యూ పూర్తి

రూ.1,000 కోట్ల సమీకరణ

హైదరాబాద్: ఎడెల్‌వీజ్ గ్రూపునకు చెందిన ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ ఈసీఎల్ ఫైనాన్స్... సెక్యూర్డ్ ఎన్‌సీడీల ఇష్యూ ద్వారా రూ.1,000 కోట్లకు పైగా నిధులను సమీకరించింది. రిటైల్ విభాగంలో అధిక స్పందన లభించింది. ఈ విభాగం నుంచే రూ.500 కోట్లు లభించాయి. 1.78 రెట్లు అధికంగా సబ్‌స్క్రిప్షన్ లభించింది. హై నెట్‌వర్త్ ఇన్వెస్టర్ల విభాగం నుంచి రూ.230 కోట్లు సమకూరాయి. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో తమ ఎన్‌సీడీ ఇష్యూకు వచ్చిన స్పందన అద్భుతంగా ఉందని, 73 శాతం చందాలు 5–10 ఏళ్ల కాలానికి వచ్చినవేనని ఎడెల్‌వీజ్ గ్రూపు సీవోవో హిమాన్షు కాజి తెలిపారు.

టెంట్ ఏసీని అభివృద్ధి చేసిన అవెన్స్



మీడియా సమావేశంలో వెంకటేశ్వర్, ప్రభు (కుడి)

భారీ సభలు జరిగినప్పుడు ఏసీల ఏర్పాటు పెద్ద ప్రహసనమే. ఈ సమస్యకు పరిష్కారంగా హైదరాబాద్‌కు చెందిన ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫ్రా కంపెనీ అవెన్స్ ఎక్స్‌పోజిషన్స్ 'ఎయిర్‌వింగ్' పేరుతో టెంట్ ఏసీలను అభివృద్ధి చేసింది. బహిరంగ ప్రదేశాల్లో జరిగే కార్యక్రమాల్లో ఈ ఏసీలను సులభంగా ఏర్పాటు చేయొచ్చని అవెన్స్ సీఎండీ వెంకటేశ్వర్ తెలిపారు. డిజైన్ ఇంజనీర్ టి.ఎం.ప్రభుతో కలిసి శుక్రవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. టెంట్ ఏసీ పేటెంటుకు దరఖాస్తు చేశామని తెలిపారు. కంపెనీలో ఇప్పటి వరకు రూ.7 కోట్లు పెట్టుబడి పెట్టామన్నారు.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	32,840		0
బంగారం (99.5, 10గ్రా)	31,280		0
వెండి (కిలో)	42,400	▲	400
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	32,200	▼	50
బంగారం (22 క్యారెట్లు)	30,480	▼	40
వెండి (కిలో)	42,600	▲	400
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	32,200	▼	50
బంగారం (22 క్యారెట్లు)	30,480	▼	40
వెండి (కిలో)	42,600	▲	400
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	32,600		0
బంగారం (22 క్యారెట్లు)	30,170		0
వెండి (కిలో)	40,100		0
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	32,820	▼	70
బంగారం (22 క్యారెట్లు)	30,530	▼	60
వెండి (కిలో)	40,500	▲	800
విజయవాడ			
బంగారం(24 క్యారెట్లు)	33,000	▲	50
బంగారం (22 క్యారెట్లు)	30,400	▲	100
వెండి (కిలో)	40,000	▼	100
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	32,950	▼	50
బంగారం (22 క్యారెట్లు)	30,480	▼	40
వెండి (కిలో)	40,200	▲	200

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	47.88 (రాత్రి 11.30కు)	$47.09 (గురువారం ముగింపు)
బ్రెంట్	57.01 (రాత్రి 11.30కు)	$55.95 (గురువారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 05-01-2019

విశాఖ	458–00
చిత్తూరు	438–00
వరంగల్	444–00
చెన్నై	445–00
ముంబై	497–00
విజయవాడ	453–00
నమక్కల్	430–00
గోదావరి	453–00
4-1-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	442–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	5.00
బెంగళూరు	445–00
కోల్‌కత్త	492–00
ఢిల్లీ	470–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	382.15	378.1
ASIAN PAINT	1385.85	1388.3
AXIS BANK L	619.6	607.95
BAJAJ AUTO	2734.2	2701.35
BAJAJ FINSE	6410.45	6383.3
BAJAJ FINAN	2576.05	2586.2
BHARTI AIRT	322.45	313.5
BPCL	359.45	352.5
CIPLA LTD	512.8	512.4
COAL INDIA	236.5	235
EICHER MOTO	20103.6	20211.45
GAIL (INDIA	353.15	349.95
GRASIM INDU	806.15	799.7
HCL TECHNOL	932.35	948.35
HDFC LTD	1972.6	1936.85
HDFC BANK L	2117.45	2111.8
HERO MOTOCO	2987.85	3014.65
HINDALCO I	210.9	209.2
HPCL	248.2	248.3
HUL	1781.7	1788.4
INDIABULLS	829.8	816.65
ICICI BANK	365.2	363.25
INDUSIND BA	1548.2	1560.1
BHARTI INFR	285.05	271.6
INFOSYS LIM	661.05	669.15
INDIAN OIL	133.95	132.65
ITC LTD	280.95	278.85
JSW STEEL L	287.95	282.65
KOTAK MAHIN	1247.95	1235.25
LARSEN & TO	1388.05	1395
MAHINDRA &M	725.6	718.3
MARUTI SUZU	7234.5	7203.95
NTPC LTD	145.75	143.4
OIL AND NAT	145.7	142.4
POWER GRID	195.9	193.05
RIL	1098.65	1092.75
STATE BANK	297.65	291.1
SUN PHARMAC	433.8	436.1
TATA MOTORS	170.95	166.05
TATA STEEL	487.65	481.25
TCS	1876.85	1899.95
TECH MAHIND	681.1	691.25
TITAN COMPA	928.45	931.2
ULTRATECH C	3914.55	3900.05
UPL LIMITED	756.4	746.65
VEDANTA LIM	192.9	187.95
WIPRO LTD	324.45	325.5
YES BANK LI	189.65	184.1
ZEE ENTERTA	463.95	461.45
నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ		
ABB INDIA L	1303.65	1308.95
ADITYA BIRL	98	98.25
ACC LIMITED	1469.1	1452.25
AMBUJA CEME	216.55	213.85
ASHOK LEYLA	96.8	98.15
BANDHAN BAN	528.9	533.8
BANK OF BAR	121.7	119.3
BHARAT ELEC	91.85	88.8
BHEL	71.4	70.75
BIOCON LIMI	618.55	612
BOSCH LIMIT	19438.75	19299.85
BRITANNIA I	3122.7	3135.9
CADILA HEAL	344.2	343.65
COLGATE PAL	1310.1	1314.25
CONTAINER C	678.05	670
DABUR INDIA	419.25	422
DLF LIMITED	175.15	172.45
AVENUE SUPE	1577.75	1575.9
GENERAL INS	263	261.15
GODREJ CONS	803.4	814.9
HAVELLS IND	678.55	681.4
HDFC STAND	393.5	391.3
HINDUSTAN Z	271.7	269.5
ICICI LOMBA	866.9	868.2
ICICI PRU L	324.7	316.25
VODAFONE ID	36.2	36.1
INTERGLOBE	1143.2	1156.55
L&T FINANCE	144.4	145.4
LIC HOUSING	488.1	470.2
LUPIN LIMIT	828.9	821.05
MARICO LIMI	378.85	378.05
UNITED SPIR	604.6	620.1
MOTHERSON S	158.65	161.25
MRF LTD	66603.15	66818.25
NHPC LTD	25.55	25.55
THE NEW IND	179.85	180.35
NMDC LTD.	93.95	93.9
ORACLE FIN	3598.2	3594.65
OIL INDIA L	174.55	172
PIRAMAL ENT	2358.65	2286.6
PETRONET LN	220.9	228.8
P&G HYGIENE	9784.95	9850
PIDILITE IN	1105.7	1109.25
STEEL AUTHO	53.15	52.45
SBI LIFE IN	602.85	600.05
SHREE CEMEN	16737.1	16948.4
SIEMENS LTD	1062.7	1044.9
SHRIRAM TRA	1162.65	1152.9
SUN TV NETW	592.2	585.1

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
Alphageo	465	468
Alu Flouride	122	121.15
Amar Raja Bat	722.05	713.55
And Bank	29.75	28.95
And Cemen	5.8	5.84
And Paper	451.1	451.75
And Petro	63.6	61.35
Anjani Portl	131.3	136
Aries Agro Ltd	100.85	100.45
Aurobindo Ph	725.4	715.9
Avantel Soft	226.1	226

A B C D

3M INDIA LI	20357.4	19990.25
5PAISA CAPI	298.45	284.25
63 MOONS TE	95.25	96.45
8K MILES SO	131.25	133.9
A AND M JUM	59	51.25
AARTI DRUGS	572.4	575.2
AARTI INDUS	1463.35	1429.15
AAVAS FINAN	840.85	837.65
BANNARI AMM	1493.95	1501.4
BANSWARA SY	80.1	80.5
BASF INDIA	1543.8	1556.95
BATA INDIA	1116.5	1113
BAYER CROPS	4245.25	4214.1
BEML LIMITE	880.6	886.65
BERGER PAIN	323.1	325.1
BETA DRUGS	75.45	78
BF INVESTME	247.55	249.15
BF UTILITIE	220.55	223
BGR ENERGY	59.95	59.85
DISHMAN CAR	235.7	231.9
DIXON TECHN	2044.2	2036.25
DOLLAR INDU	313.15	324.4
DOLPHIN OFF	50.7	51
DR. LAL PAT	940.1	913.05
DYNAMATIC T	1458.95	1496
DYNEMIC PRO	129.5	131.35

E F G H

ECE INDUSTR	235	235
GUJ NAR VAL	342.55	342.35
GUJ STATE F	112.6	110.5
GUJ. APOLLO	162	159.2
GUJARAT ALK	534.8	535.65
GUJARAT AMB	237.8	243.15
GUJARAT FLU	907.75	912.45
GUJARAT GAS	661.15	667.8
GUJARAT MIN	89.45	88.15
GUJARAT PIP	100.45	101.7
GUJARAT STA	170	170.45
GULF OIL LU	827.95	838.95

I J K L

JAY BHARAT	305.25	303.65
JAYANT AGRO	226.85	228.35
JAYSHREE TE	85.45	85.25
JBM AUTO LI	306	305
JET AIRWAYS	245.2	247.2
JINDAL DRIL	111.05	110.45
JINDAL POLY	237.75	233.6
JINDAL SAW	82.4	81.9
JINDAL STAI	85	84.9
JINDAL STEE	152.35	146.5
JINDAL WORL	68.2	67.05

M N O P

MANGALAM DR	72.95	72.6
MANPASAND B	85.7	86.1
MARATHON NX	112.05	112.55
MAS FINANCI	555.05	564.95
MASTEK LTD	433.2	438.75
MATRIMONY.C	469.1	471.6
MAX FINANCI	441.35	424
MAX INDIA L	83.5	82.65
MAX VENTURE	52.5	51.9
MAYUR UNIQU	394.15	395.7
MAZDA LIMIT	291.25	291.75
PODDAR PIGM	183.25	183.95
POKARNA LIM	155.45	155.9
POLY MEDICU	222.55	221.35
POLYPLEX CO	512.95	505.05
PONNIE SUGA	138.4	139.85
POWER FIN C	106.95	105.95
POWER MECH	931.45	943.35
PPAP AUTOMO	363.5	371.95
PRABHAT DAI	93.3	95.3
PRAJ INDUST	120.6	122.6
PRAKASH IND	80.4	77.5

R S T U

SHARDA MOTO	1485.25	1476.5
SHEELA FOAM	1400.65	1440.1
SHEMAROO EN	433.55	432.55
SHILPA MEDI	381.2	386.25
SHIRPUR GOL	83.8	84.1
SHIVA MILLS	56.75	58.45
SHIVA TEXYA	203.55	210.5
SHOPPERS ST	519.85	517.2
SHRE PUSH C	164.9	163
SHREE VASU	69.6	67.6
SHRENIK LIM	91.35	96.15
THE INDIAN	143	144.5
THE INVEST	163.15	160.1
THE PHOENIX	583.45	577.7
THE RAMCO C	627.1	628.15
THE RUBY MI	263.95	271.55
THE STATE T	134.95	137.6
THE TINPLAT	145.8	144.9
THEJO ENGIN	589	590
THEMIS MEDI	339.7	339.7
THERMAX LTD	1140.3	1136.4
THIRUMALAI	106.4	109.85

V W Z

పోలీసు ఉన్నతాధికారుల తీరుపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం

ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి



అనంతపురం సప్తగిరి సర్కిల్: పోలీసుల ఆత్మీయ సమావేశంలో కొందరు పోలీసు ఉన్నతాధికారులు అనుసరించిన తీరుపై రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్, కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర హోంశాఖ మంత్రికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 31న గుంటూరులోని ఐజీఎంసీ క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీసుల సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు 'నవ్యాంధ్ర నిర్మాత', 'ఉత్తమ ముఖ్యమంత్రి' అని కొనియాడుతూ సీఎం చంద్రబాబునాయుడును పొగడటం సరికాదన్నారు. ఇలాంటి వారి వల్ల ప్రతిపక్ష పార్టీల్లో అభద్రతా భావం ఏర్పడుతుందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా వ్యవహరించాల్సిన పోలీసులు ప్రభుత్వానికి వత్తాసు పలకడమేంటని ఆయన మండిపడ్డారు. ఇలాంటి వాళ్లు ఎన్నికల్లో ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరించి రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తారని పేర్కొన్నారు. వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. ఇలాంటి దుస్థితి గతంలో ఎన్నడూ నెలకొనలేదని పేర్కొన్నారు.

ఖర్చు లేని సాగుకు రూ.వేల కోట్ల అప్పు!

- కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు నుంచి భారీ అప్పు కోసం సర్కారు సిద్ధం
- కేంద్రానికి ప్రతిపాదనలను పంపేందుకు అనుమతిస్తూ జీవో
- జీరో బడ్జెట్ సాగు పేరుతో శిక్షణ కోసం భారీ వ్యయం సరికాదన్న ఆర్థిక శాఖ

సాక్షి, అమరావతి

పెట్టుబడి లేని వ్యవసాయం (జీరో బడ్జెట్ ప్రకృతి సాగు) ముసుగులో అప్పులు చేస్తూ రైతులకు శిక్షణలు, సదస్సులు, ఈవెంట్ల పేరుతో ప్రభుత్వ పెద్దలు భారీగా కమీషన్లు కాజేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు ప్రకృతి సాగు కోసం శిక్షణలు, భోజనాలు, సామర్థ్యం పెంపు పేరుతో కేంద్రం నుంచి వివిధ పథకాల కింద అందే రూ.100 కోట్లను వ్యయం చేసినా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని వ్యవసాయ శాఖ అధికారులు పెదవి విరుస్తున్నారు.

కేంద్రం అనుమతి కోసం ప్రతిపాదనలు

రాష్ట్రంలో వచ్చే ఆరేళ్లలో పెట్టుబడి లేని ప్రకృతి సాగు కోసం రూ.16,000 కోట్లు అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అంచనా వేశారు. వివిధ సంస్థల నుంచి ఈమేరకు అప్పులు చేయనున్నారు. చంద్రబాబు గతంలో అమెరికాలో పర్యటించిన సందర్భంగా ప్రకృతి సాగు కోసం కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి అప్పు చేసేందుకు అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా తొలిదశలో రూ.2,046 కోట్ల అప్పు కోసం వ్యవసాయశాఖ ప్రతిపాదనలు పంపడంపై ఆర్థికశాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయం అంటూ శిక్షణలు, సదస్సుల కోసం రూ.వేల కోట్ల అప్పులు చేయడం తగదని సూచించింది. ఈ అప్పుల వల్ల ఎలాంటి ఉత్పాదకత, సంపద సమకూరడం లేదని పేర్కొంది. ప్రాజెక్టులో దేనికి ఎంత వ్యయం చేస్తారు? ఎన్ని ఎకరాల్లో ప్రకృతి సాగు చేపడతారు? తదితర వివరాలను పేర్కొనక పోవడంపై అభ్యంతరం తెలిపింది. అసలు ఈ కార్యక్రమం అమలుకు ఏదైనా వ్యవస్థ ఉందా? లేక అదనపు పోస్టులు కావాలంటారా? అని ఆర్థిక శాఖ ప్రశ్నించింది. అయితే బ్యాంకు నుంచి అప్పు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఒత్తిడి తేవడంతో గత్యంతరం లేక తొలిదశలో రూ.2,046 కోట్ల రుణానికి అనుమతిస్తూ గత బుధవారం జీవో జారీ చేసింది. అప్పు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపాలని జీవోలో పేర్కొన్నారు. మొత్తం రూ.2,046 కోట్ల విలువైన ప్రాజెక్టులో కేఎఫ్‌డబ్ల్యూ రూ.1,650 కోట్లను రుణంగా ఇవ్వనుంది. రూ.85 కోట్లను గ్రాంటుగా మంజూరు చేయనుంది. మిగతా రూ. 311 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద భరించనుంది. ఈ ప్రాజెక్టు కాల వ్యవధిని 2024 వరకు ప్రతిపాదించారు.



మరి రసాయన ఎరువుల అవసరం ఏముంది?

ఏపీలో లక్షల ఎకరాల్లో జీరో బడ్జెట్‌తో ప్రకృతి వ్యవసాయం చేపడుతున్నామని, రైతులు పెద్ద ఎత్తున ఈ పథకంలో చేరుతున్నారంటూ ప్రతిపాదనలను పంపుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎరువులు, పురుగుమందుల కోటాను తగ్గించే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యవసాయశాఖ అధికారుల్లో వ్యక్తమవుతోంది. లక్షల ఎకరాలను ప్రకృతి వ్యవసాయంలోకి మారిస్తే రసాయన ఎరువులు అవసరం ఏముందని కేంద్రం ప్రశ్నిస్తే ఏం చేయాలని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం పేరుతో రైతులను బస్సుల్లో తరలిస్తూ శిక్షణ కింద రూ.వందల కోట్లను స్వచ్ఛంద సంస్థలకు దోచి పెడుతూ కమీషన్లు కాజేస్తున్నారని వ్యవసాయ శాఖ ఉద్యోగులే వ్యాఖ్యానించడం గమనార్హం.

ఉల్లి కొనుగోలుకు అభ్యర్థనేదీ రాలేదు

వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు



ఎంపీ వేమిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ నుంచి ఉల్లిగడ్డల సేకరణ (కొనుగోలు) విషయంలో ఎలాంటి ప్రతిపాదన రాలేదని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం రాజ్యసభలో ఆయన రాతపూర్వక ప్రశ్న సంధించగా.. మంత్రి పైవిధంగా సమాధానమిచ్చారు. 'తాడేపల్లిగూడెం మార్కెట్లో ఇటీవల ఉల్లి గడ్డ కిలోకు రూ. 1 మాత్రమే పలికిందన్న సంగతి మీకు తెలుసా? కనీసం రూ. 10 నుంచి రూ. 18 వస్తే తప్ప ఉల్లి రైతులకు గిట్టుబాటు కాదన్నది నిజమేనా? కేంద్ర ప్రభుత్వం ఏపీలో ఉల్లి గడ్డలు కొనేందుకు మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ అమలు చేస్తుందా?' అని ఎంపీ ప్రశ్నించారు. దీనికి మంత్రి సమాధానం ఇస్తూ 'తాడేపల్లిగూడెంలోని బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో ఉల్లిగడ్డలు 2018 డిసెంబరులో రోజుకు క్వింటాల్‌కు హోల్ సేల్ ధర రూ. 300 నుంచి గరిష్ట ధర రూ. 950 వరకు పలికింది. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్‌ను వ్యవసాయ, ఉద్యానవన పంటలకు, పాడైపోయే స్వభావమున్న పంటలకు, మద్దతు ధర జాబితాలో లేని పంటలకు కేంద్రం అమలు చేస్తోంది. రాష్ట్రం అభ్యర్థన మేరకు ఈ స్కీమ్ అమలు చేస్తాం. కానీ ఏపీ నుంచి ఉల్లిగడ్డల సేకరణ (కొనుగోలు) విషయంలో ఎలాంటి ప్రతిపాదన రాలేదు ' అని మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు.

పంటల బీమా పథకం అమలులో రాష్ట్రాలదే ప్రధాన పాత్ర



విజయసాయిరెడ్డి

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలులో రాష్ట్ర ప్రభుత్వాలదే ప్రధాన పాత్ర అని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి పర్షోత్తమ్ రుపాల తెలిపారు. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు శుక్రవారం ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు. బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా బీమా కంపెనీల ఎంపిక, క్లస్టర్ జిల్లాల ఎంపిక, ప్రీమియం రేట్ల నిర్ధారణ, పంట దిగుబడి అంచనా, ప్రీమియం సబ్సిడీ కింద తమ వాటా చెల్లింపు ఇలాంటి కార్యక్రమాలన్నీ రాష్ట్ర ప్రభుత్వాలు చేయాల్సి ఉంటుందని మంత్రి రుపాల వివరించారు.

సంక్రాంతికి 4,049 ఆర్టీసీ బస్సులు

హైదరాబాద్ నుంచి 2,029.. ఏపీ నుంచి హైదరాబాద్‌కు 2 వేల బస్సులు తిప్పేందుకు నిర్ణయం



సాక్షి, అమరావతి : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని స్వస్థలాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం.. ఈ సీజన్‌లో హైదరాబాద్ నుంచి ఏపీలోని ప్రధాన నగరాలు, పట్టణాలు.. అలాగే, రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు రెగ్యులర్ సర్వీసులతో కలిపి మొత్తం 4,029 బస్సుల్ని తిప్పేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ నిర్ణయించింది. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు వీటిని తిప్పనుంది. హైదరాబాద్ నుంచి ఏపీలోని ప్రధాన నగరాలు, పట్టణాలకు 2,029 ప్రత్యేక బస్సులు.. అలాగే, ఏపీలోని అన్ని జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు 2 వేల ప్రత్యేక బస్సుల్ని తిప్పనున్నారు. అయితే, హైదరాబాద్‌లో బస్సుల్ని నిలిపి ఉంచేందుకు ఏపీఎస్ ఆర్టీసీకి స్థల సమస్య ఉండటంతో టీఎస్ ఆర్టీసీ అధికారులతో ఏపీ అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. టీఎస్‌ఆర్టీసీ స్టాప్ పక్కనే ప్రత్యేకంగా బస్సుల్ని నిలిపి ఉంచుకునేలా ఏర్పాట్లుచేశారు. కర్నూలు, కడప, తిరుపతి, చెన్నై వైపు వెళ్లే బస్సుల కోసం ఎంజీబీఎస్ వద్ద స్థలం కేటాయించాలని రాష్ట్ర వినతికి టీఎస్‌ఆర్టీసీ అధికారులు అంగీకరించి సీబీఎస్ వద్ద స్టాప్ కేటాయించారు. ఇదిలా ఉంటే.. సంక్రాంతి సీజన్ సందర్భంగా ప్రత్యేక బస్సుల్లో 150 శాతం మేర టికెట్ల ధరలు పెంచుతున్నారు. అయితే, రద్దీని బట్టి ఫ్లెక్సీ ఫేర్ విధానం (విమానం ప్రయాణానికి పెంచినట్లు) అమలుచేయాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు.

నిరసనలు.. నిలదీతలు...

- మూడో రోజూ 'జన్మభూమి'లో మిన్నంటిన నిరసనలు
- సమస్యలు పరిష్కరించని సభలెందుకంటూ నిలదీత
- అధికారపార్టీ నేతలు, అధికారులపై మండిపడుతున్న జనం
- పలుచోట్ల గ్రామసభల బహిష్కరణ
- వివిధ ప్రాంతాల్లో టీడీపీ కార్యక్రమంలా జన్మభూమి సభలు
- ప్రజల నుంచి టీడీపీ నేతలే వినతులు స్వీకరిస్తున్న వైనం
- సమస్యలపై ప్రశ్నించిన వారిమీద దౌర్జన్యం



సింహాచలం దేవస్థానం భూసమస్యపై ఎమ్మెల్యే బండారును నిలదీస్తున్న రైతు సంఘం నాయకులు



విజయనగరం మండలం ద్వారపూడిలో మాజీ సర్పంచ్‌పై చేయెత్తిన టీడీపీ నేత



పురుగుమందు తాగి స్పృహ తప్పి పడిపోయిన రైతు గొల్ల నరాల జలపతి

సాక్షి, నెట్‌వర్క్: గతంలో విన్నవించిన సమస్యలనే ఇంతవరకు పరిష్కరించలేదు.. ఇప్పుడు మళ్లీ నిర్వహించడం వల్ల ఉపయోగం ఏంటి?..ఆరో విడత జన్మభూమి–మావూరు కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహిస్తున్న అధికారులకు ప్రజల నుంచి ఎదురవుతున్న ప్రశ్న ఇదీ.. ప్రభుత్వ ప్రచారార్భాటం తప్ప గ్రామసభల వల్ల ఎటువంటి ఉపయోగం లేదంటూ నిరసనలు, నిలదీతలు మిన్నంటుతున్నాయి. మూడో రోజైన శుక్రవారమూ ఇదే పరిస్థితి రాష్ట్రమంతటా కనిపించింది. తమ కష్టాలు ఎప్పుడు తీరుస్తారంటూ ఎక్కడికక్కడ మంత్రులు, టీడీపీ ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీశారు. దీంతో సమాధానం చెప్పలేక టీడీపీ నేతలు.. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. ప్రశ్నించకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. మరోవైపు ప్రజలనుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో అధికారులు కొన్నిచోట్ల సభలను తూతూమంత్రంగా ముగించేసి జారుకుంటున్నారు. అదే సమయంలో జన్మభూమి–మావూరు నిర్వహిస్తున్న తీరును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల గ్రామసభలను ప్రజలు బహిష్కరించారు.

టీడీపీ కార్యక్రమంలా జన్మభూమి సభలు

- కర్నూలు జిల్లాలో జన్మభూమి–మాఊరు కార్యక్రమం టీడీపీ కార్యక్రమంగా మారింది. జన్మభూమి కార్యక్రమంలో ప్రజలనుంచి వినతుల్ని అధికారులు స్వీకరించాల్సి ఉండగా.. ఏకంగా టీడీపీ నాయకులే స్వీకరిస్తుండటం పట్ల నిరసన వ్యక్తమైంది. కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లిలో టీడీపీ నాయకుడు గ్రామసభలో పాల్గొనడమేగాక ఏకంగా ప్రభుత్వ విజయాలను ఏకరువు పెట్టడం విమర్శలకు దారితీసింది. మరోవైపు ఈ కార్యక్రమంపై జిల్లావ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి.
- అనంతపురం జిల్లా రాయదుర్గం రూరల్ మండలం టి.వీరాపురంలో సీసీ రోడ్లు మురికి కూపంగా మారాయని, కాలువ నిర్మించాలంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీపీ భారతి, మండల కన్వీనర్ మల్లికార్జున, గ్రామస్తులు జన్మభూమిని బహిష్కరించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. గుంతకల్ పట్టణం 24వ వార్డులో జరిగిన జన్మభూమి సభలో ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ రెచ్చిపోయారు. తాను సిఫారసు చేసిన వాటికి బిల్లులు చేయకపోతే తోలు తీస్తానంటూ హౌసింగ్‌శాఖ ఏఈ షౌకత్‌ను హెచ్చరించారు.
- కృష్ణా జిల్లాలోని కృత్తివెన్ను మండలం పల్లెపాలెంలో గ్రామస్తులు.. ఐదేళ్ల పాలనలో తమ గ్రామానికి చేసిందేమీ లేదని, అలాంటప్పుడు మాకెందుకీ సభలంటూ జన్మభూమి సభను అడ్డుకున్నారు. పెడన 6వ వార్డులో నిర్వహించిన గ్రామసభలో సమస్యలు ప్రస్తావించేందుకు వచ్చిన మున్సిపల్ చైర్మన్ బండారు ఆనంద్‌ప్రసాద్‌పై టీడీపీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. మున్సిపాలిటీలో నెలకొన్న పరిస్థితిని వివరించకుండా అడ్డుకున్నారు.
- సమస్యలు పరిష్కారం కావట్లేదని తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రూరల్ మండలం పండూరులో, పెద్దాపురం మండలం కట్టమూరులో జన్మభూమి గ్రామసభను ప్రజలు అడ్డుకున్నారు. రాజవొమ్మంగి మండలం కింద్ర పంచాయతీలో జన్మభూమి నిర్వహించేందుకు వెళుతున్న అధికారులను, ప్రజాప్రతినిధులను అడ్డగించారు.

ఎమ్మెల్యే బండారుకు నిరసన సెగ

- విశాఖపట్నం జిల్లా అడవివరంలోని గోశాల కూడలి వద్ద జరిగిన జన్మభూమిలో సమైక్య రైతు సంక్షేమసంఘం ఆధ్వర్యంలో.. పంచగ్రామాల భూసమస్యను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని నాలుగున్నరేళ్లు దాటినా ఎందుకు నెరవేర్చలేదంటూ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని నిలదీశారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్.. మంత్రి గంటా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో ఈ సమస్యకు కారణమే కమ్యూనిస్టులని, సమస్య పరిష్కారమవకుండా శారదాపీఠం స్వామీజీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ సీఎం కేసీఆర్ అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే ఆరోపించడంతో బాధితులు మండిపడ్డారు. ఇచ్చిన హామీని పట్టించుకోకుండా నెపం ఎవరిమీదో పెడతావా అని ప్రశ్నించారు. ఆగ్రహోదగ్రుడైన బండారు తిట్ల దండకం అందుకుంటూ వీళ్లను ఈడ్చేయండని ఆదేశించడంతో పోలీసులు రంగంలోకి దిగి రైతుసంఘం నాయకులు, బాధితులను ఈడ్చుకుంటూ బయటకు లాక్కెళ్లిపోయారు.

విజయనగరంలో తమ్ముళ్ల బాహాబాహీ

- విజయనగరం జిల్లాలో జరుగుతున్న జన్మభూమి సభల్లో తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. ద్వారపూడి సభలో గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయంటూ టీడీపీ నేత కొయ్యాన రామానుజులు నిలదీశారు. స్వపార్టీ వ్యక్తే తమను ప్రశ్నించడాన్ని తట్టుకోలేని టీడీపీ కార్యకర్త పాకలపాటి శ్రీనివాసరాజు అతనిపై దాడి చేశారు. ఇద్దరూ కొట్లాటకు దిగడంతో విడదీయడానికి ప్రయత్నించిన ద్వారపూడి మాజీ సర్పంచ్ వెన్ను శ్రీనివాసరావుపై రామానుజులు చేయెత్తారు. పోలీసులు రంగప్రవేశం చేయడంతో గొడవ సద్దుమణిగింది. నెల్లిమర్లలో సమస్యలు ప్రస్తావించిన గ్రామస్తులపై టీడీపీ నేతలు దూషణలకు దిగారు. బొబ్బిలిలోని 12వ వార్డుకు చెందిన ప్రజలు, కురుపాం మండలం నీలకంఠాపురం పంచాయతీ కేంద్రంలో గిరిజన ప్రజాప్రతినిధులు గ్రామసభలను బహిష్కరించారు.
- శ్రీకాకుళం జిల్లాలో జన్మభూమి గ్రామసభలు ఉద్రిక్తత మధ్య కొనసాగుతున్నాయి. టెక్కలి మండలం బూరగాంలో తిత్లీ తుపాను పరిహారం అర్హులకు ఇవ్వలేదని స్థానికులు అధికారుల్ని నిలదీశారు. ఎల్.ఎన్.పేట మండలం దబ్బపాడులో అర్హులకు ఇళ్లు ఇవ్వలేదని, టీడీపీ కార్యకర్తలకే ఇచ్చి పేదలకు అన్యాయం చేశారంటూ జనం మండిపడ్డారు.

'జన్మభూమి' ఒత్తిడితో నగరి కమిషనర్‌కు పక్షవాతం

ఒకవైపు పథకాలు అందట్లేదని గ్రామసభల్లో ప్రజలు నిలదీస్తుండడం.. మరోవైపు జన్మభూమి కార్యక్రమ నిర్వహణలో అధికారపార్టీ నేతల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తుండడం.. వీటికితోడు సమావేశాల్లో ఉన్నతాధికారుల నుంచి వస్తున్న హెచ్చరికలు అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తీవ్ర ఒత్తిడిని తట్టుకోలేకపోయిన చిత్తూరు జిల్లా నగరి మున్సిపల్ కమిషనర్ అనారోగ్యం పాలయ్యారు. గురువారం 3, 4, 5 వార్డుల్లో జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్సీ, చైర్‌పర్సన్ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశాల్ని ముగించుకున్నాక మళ్లీ ఆయన రాత్రి ఉన్నతాధికారులతో భేటీ కావాల్సి వచ్చింది. దీంతో తీవ్ర అలసటకు గురైన ఆయన అనారోగ్యం పాలయ్యారు. శుక్రవారం ఉదయం పక్షవాతం రావడంతో ఆయన్ను తిరుపతిలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా.. చికిత్స పొందుతున్నారు. జన్మభూమి కార్యక్రమాల కారణంగా వరుస ఒత్తిళ్లవల్లే ఆయన అనారోగ్యం పాలైనట్టు కుటుంబీకులు అంటున్నారు.

గ్రామసభలో రైతు ఆత్మహత్యాయత్నం

హౌసింగ్ పథకం కింద నాలుగేళ్లనుంచి దరఖాస్తు చేసుకుంటున్నా ఇల్లు మంజూరు కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కర్నూలు జిల్లా ఆస్పరి మండలం హలిగేర గ్రామానికి చెందిన రైతు గొల్ల నరాల జలపతి అధికారులముందే పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గొల్ల నరాల జలపతి, సుజాతమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. రెండో కుమార్తె శ్రుతి మూగ, చెవిటి కావడంతో పింఛన్ కోసం పలుమార్లు దరఖాస్తు ఇచ్చినా ఫలితం లేకపోయింది. శుక్రవారం హలిగేరలో గ్రామసభ నిర్వహించగా.. తనకు ఇల్లు మంజూరు చేయాలని, దివ్యాంగురాలైన తన కూతురు శ్రుతికి పింఛన్ ఇవ్వాలని దరఖాస్తులతో వచ్చాడు. అయితే అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో మనస్తాపం చెందిన జలపతి.. నేను చచ్చిన తరువాతైనా ఇల్లు, పింఛన్ ఇస్తారా? అంటూ వెంట తెచ్చుకున్న పురుగుమందు తాగి పడిపోయాడు. గ్రామస్తులు జలపతిని ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

ఎన్‌ఎంసీ ఏర్పాటుపై ఐఎంఏ నిరసన

లబ్బీపేట(విజయవాడతూర్పు): మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ)ను రద్దు చేసి దాని స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఏర్పాటును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఏపీ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ డి.శ్రీహరిరావు, డాక్టర్ పోలవరపు ఫణిధర్ తెలిపారు. ఎన్‌ఎంసీ బిల్లులో పొందుపరిచిన అంశాలు దుర్మార్గంగా ఉన్నాయన్నారు. అది ఒక రాక్షస బిల్లుగా అభివర్ణించారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్‌ఎంసీ బిల్లు ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొంది, రాజ్యసభలో ప్రవేశపెట్టారన్నారు. ఆ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఐఎంఏ వైద్యులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించినట్లు తెలిపారు.

బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా వెంకటేశ్వరి

సూర్యారావుపేట(విజయవాడ సెంట్రల్): జాతీయ బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎ.వెంకటేశ్వరి, సెక్రటరీగా తమ్మిశెట్టి సుబ్బులు, ఉపాధ్యక్షురాలిగా ఎస్.వెంకటకుమారి నియమితులయ్యారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఓ హోటల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు డేరంగుల ఉదయకిరణ్ వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డేరంగుల ఉదయ్‌కిరణ్ విలేకరులతో మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీ మహిళలకు 30 ఎమ్మెల్యే, 5 ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ మహిళలకు రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

కీచక టీచర్

- మూడేళ్లుగా చిన్నారులపై లైంగిక దాడులు
- విషయం తెలుసుకుని టీచర్‌ను చితకబాదిన గ్రామస్తులు
- చిత్తూరు జిల్లాలో ఘటన





చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడిన టీచర్‌కు దేహశుద్ధి చేస్తున్న మహిళలు. (ఇన్‌సెట్‌లో) నిందితుడు ప్రతాప్ కుమార్

గుర్రంకొండ(పీలేరు): చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి.. ఆ వృత్తికే కళంకం తెచ్చేలా వ్యవహరించాడు ఓ నీచుడు. ముక్కుపచ్చలారని చిన్నారులపై మూడేళ్లుగా లైంగిక దాడులు సాగించాడు. చిన్నారులను పాఠశాల బాత్‌రూంలోకి తీసుకెళ్లి వారిపై లైంగిక దాడికి పాల్పడేవాడు. సెల్‌ఫోన్‌లో అశ్లీల చిత్రాలు చిన్నారులకు చూపించి పైశాచిక ఆనందం పొందేవాడు. ఎట్టకేలకు విషయం తెలుసుకున్న గ్రామంలోని మహిళలు తమ పిల్లలపై జరుగుతున్న అకృత్యాన్ని భరించలేక ఆ ఉపాధ్యాయుడిని చితకబాదారు. ఈ ఘటన చిత్తూరు జిల్లా పీలేరు మండలంలోని భూమక్కవారిపల్లెలో శుక్రవారం జరిగింది.గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కె. ప్రతాప్‌కుమార్ (35) అనే ఉపాధ్యాయుడు మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 10 మంది విద్యార్థులుండగా వీరిలో ఏడుగురు ఆడపిల్లలు. ప్రతాప్‌కుమార్ మొదటి భార్య అతని నుంచి విడాకులు తీసుకోవడంతో రెండో పెళ్లి చేసుకున్నాడు. కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆమె అతని శాడిజాన్ని భరించలేకే విడాకులు తీసుకున్నట్లు తెలిసింది. కాగా మూడో తరగతికి చెందిన ఓ విద్యార్థిని గురువారం నీరసంగా ఉండడాన్ని గమనించిన తండ్రి ఆరాతీయడంతో విషయం బయటపడింది. పాఠశాలలోని మిగతా పిల్లలను విచారించగా ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులను వారు ఏకరువు పెట్టారు. శుక్రవారం ఉదయం పాఠశాల ప్రారంభం కాగానే పెద్ద ఎత్తున గ్రామస్తులు, మహిళలు అక్కడికి చేరుకుని ఉపాధ్యాయుడ్ని నిలదీశారు. అతను నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో ఆగ్రహించిన మహిళలు చెప్పులతో చితకబాదారు. ఉపాధ్యాయుడు తప్పించుకొని పొలాల వెంబడి పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంబడించి పొలాల్లోనే మరోసారి చితకబాది పాఠశాలకు తీసుకొచ్చారు. పాఠశాల గదిలో బంధించి ఎంఈవో సురేంద్రబాబుకు, ఎస్‌ఐ నరేష్‌కు సమాచారం అందించారు. వారు చేరుకొని సంఘటనపై విచారణ జరిపారు. మర్రిపాడు క్లస్టర్ హెడ్మాస్టర్ మాధవి చిన్నారులను విచారించగా వారు తమపై జరిగిన లైంగిక దాడులను వివరించారు. గ్రామానికి చెందిన కొందరు యువకుల్ని పాఠశాల సమయంలో రప్పించుకొని సెల్‌ఫోన్లో క్రికెట్ బెట్టింగ్‌లతోపాటు బూతు సినిమాలు చూపించేవాడని కొందరు గ్రామస్తులు పేర్కొన్నారు. వేధింపులు భరించలేక గతేడాది ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని చిన్నారులు ఫిర్యాదుచేశారు. తాజాగా రెండు రోజుల క్రితం ముగ్గురు చిన్నారుల శరీరంపై గాయాలున్నట్లు తల్లిదండ్రులు ఆవేదన చెందాడు. చిన్నారుల తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ నరేష్ ఉపాధ్యాయుడ్ని అరెస్ట్ చేశారు. విచారణ నివేదికను డీఈవోకు పంపించి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకొంటామని ఎంఈవో సురేంద్రబాబు తెలిపారు.

అగ్రిగోల్డ్ ఆస్తుల కైవసానికి బాబు కుట్ర

బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

- సదావర్తి సత్రం భూములు కొట్టేసే యత్నాలను అడ్డుకున్నాం
- జగన్ హత్యాయత్నం కేసు ఎన్‌ఐఏకు అప్పగించడం శుభపరిణామం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత బొత్స



సాక్షి, హైదరాబాద్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. అగ్రిగోల్డ్ కేసు పరిష్కారం కాకుండా వైఎస్సార్‌సీపీ అడ్డుపడుతోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు చేసిన ఆరోపణలను బొత్స తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అగ్రిగోల్డ్ ఆస్తులను కారుచౌకగా కొట్టేసి బాధితులకు అన్యాయం చేయాలని చూస్తున్న ప్రభుత్వ పెద్దలు వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. గతంలో సదావర్తి సత్రం భూములను కొట్టేయాలని చూస్తే.. వైఎస్సార్‌సీపీ అడ్డుకట్ట వేసిందని గుర్తు చేశారు. అగ్రిగోల్డ్ ఆస్తులను కొనుగోలు చేయడానికి ఎస్సెల్ గ్రూపు ప్రతినిధులు ముందుకు రాకుండా.. ఢిల్లీలో చంద్రబాబు అర్ధరాత్రి రహస్య చర్చలు సాగించిన విషయం వాస్తవం కాదా? అని నిలదీశారు.

కేబినెట్ మంత్రులు వివరణ ఇవ్వరా?

ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై తీవ్ర ఆరోపణలు వచ్చినా కేబినెట్ మంత్రులు వివరణ ఇచ్చేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని బొత్స ప్రశ్నించారు. 'అగ్రిగోల్డ్ వ్యవహారం ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు పరిధిలోకి వస్తుంది. ఆయన మాత్రం పెదవి విప్పకుండా కుటుంబరావుతో మాట్లాడిస్తున్నారని' తెలిపారు. గతంలో సత్యం కుంభకోణం వెలుగు చూసిన వెంటనే అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి స్పందించి.. ఆ సంస్థను స్వాధీనం చేసుకుని ఉద్యోగులను ఆదుకోవాలని, వాటాదారులకు సాయంగా ఉండాలని, విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారని బొత్స గుర్తు చేశారు. నాలుగన్నరేళ్ల రాష్ట్ర సమస్యలను గాలికొదిలి.. ఓట్ల కోసం కడప స్టీల్ ప్లాంట్, ఎయిర్‌పోర్టు, పోర్టులకు శంకుస్థాపన చేసి మభ్యపెట్టాలని చూస్తే నమ్మే స్థితిలో ప్రజలు లేరని చెప్పారు. కాగా, ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసును జాతీయ విచారణ పరిశోధన సంస్థ (ఎన్‌ఐఏ)కి అప్పగించడం శుభపరిణామమని బొత్స అన్నారు. హైకోర్టు విభజనను కూడా తాను ఇచ్చిన లేఖకు భిన్నంగా రాజకీయం చేయడం బాబుకే చెల్లిందని బొత్స దుయ్యబట్టారు. టీడీపీ, జనసేన పార్టీలు ఒకే పక్షమని..బయటకు మాత్రం అప్పుడప్పుడూ తిట్టుకుంటూ విడిపోయామని కలరింగ్ ఇస్తున్నారనే విషయాన్ని గుర్తించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జన్మభూమి కార్యక్రమంలో ప్రజలు టీడీపీ నేతలను ప్రతిచోటా నిలదీస్తున్నారని గుర్తుచేశారు.

చుక్కల భూముల పేరుతో అతి పెద్ద స్కాం

చుక్కల భూముల పేరుతో రాష్ట్రంలో అతి పెద్ద స్కామ్ జరుగుతోందని బొత్స అన్నారు. ఈ భూములను ఒకే సామాజికవర్గం వారికి చెందేలా చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసును ఎన్‌ఐఏకి అప్పగిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను చంద్రబాబు సర్కారు సుప్రీంకోర్టులో సవాల్ చేస్తుందట కదా? అని మీడియా అడిగిన ప్రశ్నకు ' ఎందుకు సుప్రీంకోర్టుకు వెళుతున్నారు. హత్యాయత్నం వారి కుట్ర కాదా? చంద్రబాబు, నారా లోకేష్, డీజీపీ భాగస్వామ్యం ఇందులో లేదా? నిజంగా వారి ప్రమేయం లేకపోతే ఎందుకు ఎన్‌ఐఏ విచారణను అడ్డుకోవాలి?' అని బొత్స ప్రశ్నించారు. రాజధాని నిర్మించకుండానే గ్రాఫిక్స్‌లో అద్దాల కలలు చూపిస్తున్నారని, ప్రజా సమస్యలను వదిలేసి విదేశీ పర్యటనలు, సభలకు ప్రజాధనం వృథా చేస్తున్నారని దుయ్యబట్టారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

స్త్రీలోక సంచారం

☛ ఇంత మంచి గుడ్ వరల్డ్‌లో ఉన్నాం కదా.. 'కన్యత్వ పరీక్ష' అనే బ్యాడ్ వర్డ్ ఇంకా వినిపిస్తూనే ఉంది! ఒక ఆడపిల్ల కన్యా, కాదా? అని తెలుసుకోడానికి చేసే అనాగరికమైన పరీక్ష ఇది. ఇందులోనే ఇంకా అనాగరికం.. కొందరు డాక్టర్లు చేసే 'టూ–ఫింగర్ టెస్ట్'. సాధారణంగా.. ఒక యువతి, లేదా బాలికపై అత్యాచారం జరిగిందన్న ఆరోపణల్లో నిజముందా



● అనాగరికం : టూ–ఫింగర్ టెస్ట్

లేదా నిర్ధారించడానికి చేసే పరీక్షల్లో టూ–ఫింగర్ టెస్ట్ ఒకటి. బాధితురాలి జననావయవంలోకి రెండు వేళ్లు చొప్పించి, ఆ వేళ్లు సులువుగా లోపలికి ప్రవేశించగలిగితే ఆమె కన్య కాదనీ, వేళ్ల ప్రవేశం కష్టం అయితే ఆమె కన్య అని ఒక కంక్లూజన్‌కి వస్తారు! ఈ టెస్ట్‌లోనే వేళ్లకు కన్నెపొర (జననావయవ అంతర్ ముఖద్వారంలో ఉండే పొర) అడ్డపడితే ఆమె కన్య అయినట్లు, పొర అడ్డపడకపోతే ఆమె కన్య కానట్లు భావిస్తారు. ఇదొక అర్థం లేని పరీక్ష అని నికార్సైన వైద్య నిపుణులు ఏనాడో తేల్చి పారేసినప్పటికీ.. ఇప్పటికీ చాలాచోట్ల అత్యాచారం కేసులలో అధికారికంగా, నూతన వరుడు సందేహపడిన సందర్భంలో అనధికారికంగా ఈ 'టూ–ఫింగర్ టెస్ట్' చేస్తున్నారు. కన్నెపొర లేకపోవడానికి, జననాంగ గోడలు వదులుగా ఉండడానికి కన్యత్వాన్ని కోల్పోవడమే కారణమవక్కర్లేదు. పొర, వదులు అన్నవి ఆటల్లో పోవచ్చు. ఇప్పుడీ బ్యాడ్ టాపిక్ ఎందుకొచ్చిందంటే.. ఓ గుడ్ డాక్టర్ ఈ 'టూ–ఫింగర్ టెస్ట్'ను వైద్య పాఠ్యాంశాలలోనే లేకుండా తొలగించాలని కేంద్ర ఆరోగ్య శాఖకు లేఖ రాశారు. ఆ డాక్టరు గారి పేరు ఇంద్రజిత్ ఖండేకర్. మహారాష్ట్రలోని సేవాగ్రామ్‌లో ఉన్న 'మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' లో ఫోరెన్సిక్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. అయినా 'టూ–ఫింగర్ టెస్ట్' అనే ఈ పరీక్ష.. వైద్యపుస్తకాల్లో ఎందుకు ఉన్నట్లు? మొదట ఎవరో చేర్చారు. తర్వాత ఎవరూ మార్చలేదు. డాక్టర్ ఖండేకర్ ఆరోగ్య శాఖకు మాత్రమే రాయలేదు. భారత వైద్య మండలికి, కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖకు, మహారాష్ట్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కూ.. ఈ టూ–ఫింగర్ టెస్ట్ ప్రస్తావనను పుస్తకాల్లోంచి తొలగించాలని విజ్ఞప్తులు పంపారు. 'ఇదొక బుద్ధిలేని, అసంబద్ధమైన పరీక్ష' అని ఆయన 'టూ–ఫింగర్ టెస్ట్'ను వర్ణించారు. ఆడపిల్లను ఫిజికల్‌గా బాధపెట్టి, అవమానించే ఈ పరీక్ష మహిళపై జరిగే హింస కంటే కూడా ఎక్కువే అని అంటారు ఖండేకర్. 2018 అక్టోబర్‌లో ఐక్యరాజ్యసమితి విభాగం అయిన 'యు.ఎన్. ఉమెన్' కూడా ఇదే మాట చెప్పింది. అయితే మొత్తం అన్ని రకాలైన కన్యత్వ పరీక్షల గురించి చెప్పింది. ఇలాంటి పరీక్షలకు ముగింపు పలకాలని సభ్య దేశాలకు పిలుపునిచ్చింది.

☛ 'ది క్వింట్' భారతదేశంలో పేరున్న న్యూస్ వెబ్‌సైట్. ఇంగ్లిష్, హిందీ భాషల్లో వస్తోంది. క్వింట్ ఇప్పుడు ప్రతిష్ఠాత్మకమైన 'మి, ది ఛేంజ్' క్యాంపెయిన్‌ని ప్రారంభించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి ఓటు వేయబోతున్న 18–23 ఏళ్ల మధ్య వయసు గల యువతులలోంచి 'ఉమన్ అచీవర్'ని ఎంపిక చేయడం కోసం నామినేషన్‌లను ఆహ్వానిస్తోంది. సైట్‌లోకి వెళ్లి, నామినేషన్ ఫారమ్‌లో మీకు తెలిసిన యంగ్ ఉమెన్ అచీవర్ వివరాలను పొందుపరిస్తే చాలు. మీరు నామినేట్ చేస్తున్నప్పుడు మీ పేరును వెల్లడించడం తప్పనిసరేం కాదు. మీ ఇ–మెయిల్, మీ కాంటాక్ట్, మీరు సూచిస్తున్న యువతి పేరు, ఆమె వయసు, ఆమె సాధించిన విజయం, ఆమె వివరాలు ఇస్తే సరిపోతుంది. మీ ఫ్రెండ్స్, మీ సోదరి.. వారెవరైనా సరే మీరు నామినేట్ చెయ్యొచ్చు. 'మి, ది ఛేంజ్' కాంపెయిన్‌కి ప్రముఖ మలయాళీ నటి పార్వతి తన సహకారం అందిస్తున్నారు.



● అనుసంధానకర్త : నటి పార్వతి

పాశుర ప్రభాతం 21వ రోజు

సంసార సాగరంలో అమృతమయ బంధాల నడుమ బంధాన్ని దృఢపరచి భవబంధాలను మెల్లిగా దూరంచేసి ఆత్మతత్వాన్ని తెలియజెప్పే పరబ్రహ్మ స్వరూపానికి నీరాజనం.

"ఏత్త కలఙ్గళ్ ఎదిర్‌పొఙ్గ మీదళిప్ప
మాత్తాదే పాల్‌శొరియుమ్ వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్
ఆత్తప్పడైత్తాన్ మగనే! అరివురాయ్,
ఉత్తముడైయాయ్! పెరియాయ్! ఉలగినిల్
తోత్తమాయ్ నిన్ర శుడరే! తుయిలెళాయ్,
మాత్తారునక్కు వలితులైన్దు ఉన్‌వాశర్కణ్
ఆత్తాదువన్దు ఉన్నడిపణియు మాపోలే
పోత్తియామ్ వన్దోమ్ పుగళ్న్దు ఏలో రెమ్బావాయ్"

భావం: క్షీరధామంలో అనేక వేల గోమాతల నందగోపుడు పరబ్రహ్మ స్వరూపుడు. ఆశ్రిత రక్షణ, ప్రతిజ్ఞాపాలన మహిమలు గల జ్యోతిస్వరూపుడు లోకంలో భక్తులకై ఆవిర్భవించిన మహిమాన్వితుడు శ్రీకృష్ణభగవానుడు. అత్యుత్తముడవైన శ్రీకృష్ణా! మేలుకో, శత్రువులు నీ దాసులై నీ పాదారవిందాలను ఆశ్రయించినట్లు మేమూ నిన్ను ఆశ్రయించినవారము. సదా నీ పాద పద్మాలనే స్తుతించి మంగళకరమైన నీ కీర్తిని ప్రార్థించే అవకాశమివ్వమని వేడుకుందాం.





ప్రధాన పాత్రలు: రాధాకుమార్, మంజునాథ్, మోహన్‌కుమార్

వెబ్ ఫ్లిక్స్

థర్డ్ అంపైర్

బంతి దాదాపు వంద కిలోమీటర్ల వేగంతో వస్తుంది. తెలియకముందే, తెలుసుకునే ముందే సమయాన్ని ఓడగొడుతూ సెకన్‌ల ముల్లు కింది నుంచి జారుకుంటూ వెళ్లిపోతుంది. బంతి ఏం చేసింది, బంతి కొట్టాల్సిన ఆటగాడు ఏం చేశాడూ..కచ్చితంగా తెలియాలి. అందుకే క్రికెట్‌లో థర్డ్ అంపైర్‌ని ఆశ్రయిస్తారు. బంతి వేగాన్ని పది రెట్లు తగ్గించి ఏం జరిగిందీ తెలుసుకుంటారు. జీవితమూ అంతే. ఆ బంతి కంటే వేగంగా ఆవేశాలు, ఉద్వేగాలు జారిపోతాయి.. చొచ్చుకుపోతాయి. మానవ సంబంధాలను అర్థం చేసుకోడానికి కూడా భావావేశాలను పదిరెట్లు తగ్గించి చూసి, అర్థం చేసుకునే థర్డ్ అంపైర్ అవసరం. అలాంటి కథే.. 'సెలక్షన్ డే'. ఈవారం మన స్పెషల్.


మన దేశంలో ఎంటర్‌టైన్‌మెంట్ 'ఫ్లూ'స్ రెండే రెండు. సినిమా, క్రికెట్! మైదానంలోనే కాకుండా నిన్నటి వరకు క్రికెట్.. బయోగ్రఫీస్ క్రీజ్‌లో ఉంది. ఇప్పుడు వెబ్‌సిరీస్ పిచ్‌లోనూ బ్యాటింగ్ చేస్తోంది. వాటికి సబ్జెక్ట్ అవుతూ! అలాంటిదే 'సెలక్షన్ డే'. నెట్‌ఫ్లిక్స్ థర్డ్ ఒరిజినల్. ఈ మధ్యే అప్‌లోడ్ అయింది. వెబ్‌సిరీస్‌గా స్ట్రీమ్ కాకముందు సెలక్షన్ డే ఒక నవల. అదే పేరుతో దీన్ని అరవింద్ అడిగ రాశాడు. మన దగ్గర యూత్‌కు చాలా వరకు రెండే కలలుంటాయి. సినిమాల్లోకి (హీరో, హీరోయిన్, సింగర్, డైరెక్టర్ ఎట్‌సెట్రా) రావాలని, క్రికెటర్ కావాలని. మెడిసిన్, ఇంజనీరింగ్ కాకుండా పిల్లల విషయంలో కాస్త భిన్నంగా ఆలోచించే తల్లిదండ్రులూ తమ పిల్లలను క్రికెటర్స్‌నే చేయాలనుకుంటారు. అలాంటి తండ్రే మోహన్ కుమార్ (రాజేశ్ తెలంగ్). తన ఇద్దరు కొడుకులకు సంబంధించి ఆ నాన్న లక్ష్యమే సెలక్షన్ డే!

చాంపియన్ నం.1, చాంపియన్ నెం.2

మధ్యప్రదేశ్‌లోని బండోనా ఊళ్లో కథ మొదలవుతుంది. మోహన్ కుమార్ అక్కడే ఉంటాడు కాబట్టి. అతను కర్ణాటక హుబ్లీకి చెందిన ఓ హాకీ ప్లేయర్‌ను పెళ్లి చేసుకుంటాడు. అథ్లెట్స్‌కి తండ్రి కావాలనే కోరికతో మాత్రమే. వాళ్లకు ఇద్దరు మగపిల్లలు. రాధాకుమార్, మంజునాథ్. పదహారు, పదిహేనేళ్లుంటాయి. ఉగ్గు పాలతో క్రికెట్‌ను పట్టి పెంచుతాడు పిల్లల్ని. వాళ్లకు ఇల్లే స్కూలు. తండ్రే గురువు. క్రికెట్ తప్ప ఇంకే లోకం లేకుండా చేస్తాడు. కోచింగ్ మెథడ్సన్నిటినీ ఔపోసన పట్టి ఒక ప్రత్యేక శిక్షణా పద్ధతిని తయారు చేస్తాడు. వాళ్లకు కోచ్, డైటీషియన్, న్యూట్రిషనిస్ట్ అన్నీ తనే! పిల్లలను వరల్డ్ నంబర్ వన్ చాంపియన్, నంబర్ టూ చాంపియన్ చేయాలనే తపన, ఆరాటం, ధ్యేయం. పిల్లల్ని అలానే పిలుచుకుంటుంటాడు. ఎవరిమాటా వినడు. అతను చెప్పిందే వినాలి. తనకు అన్నీ తెలుసనే అహంతో ఉంటాడు. ముఖ్యంగా పిల్లలకు సంబంధించి. ఈ విషయంలోనే భార్యతో తగాదా పడి ఆమె మీద చేయి కూడా చేసుకుంటాడు. ఆమె ఇంట్లోంచి వెళ్లిపోతుంది. అయితే ఇదంతా కనిపిస్తున్న దృశ్యాల ఆధారంగా అవగతమవుతుంది తప్ప పిల్లల తల్లి తొమ్మిది ఎపిసోడ్ల ఈ కథనంలో ఎక్కడా కనిపించదు.

అన్నకు తమ్ముడు బలం.. తమ్ముడి స్ట్రెంత్ సైన్స్

ముంబై వెళ్లి అక్కడ మంచి క్రికెట్ క్లబ్‌లో పిల్లలను చేర్పించాలని అనుకుంటాడు మోహన్ కుమార్. వాళ్ల ఆట తీరును ఇంకా మెరుగు పరిచి, అండర్ 16– ముంబై టీమ్‌కి ఆడించాలని ప్లాన్ చేస్తాడు. ముంబై ప్రయాణానికి సిద్ధ పడ్తాడు కొడుకులతో కలిసి. తండ్రితో రాధాకుమార్‌కు ఏ సమస్యా ఉండదు. చిక్కంతా చిన్నోడైన మంజూకే. వాడికి అమ్మంటే ప్రాణం. ముంబై బయలుదేరే ముందు రోజు క్రికెట్ ఆడి ఇంటికొచ్చే సరికి తల్లి కనపడదు. డైనింగ్ టేబుల్ కింద పగిలిన గాజు ముక్కలు, మంచం దగ్గర పడిపోయిన రబ్బర్‌బ్యాండ్, కుర్చీకి అంటుకున్న రక్తం మరకలు కనపడ్తాయి. అమ్మేది అని అడుగుతాడు. హుబ్లీ వెళ్లింది అంటాడు తండ్రి. మనసు మనసులో ఉండదు మంజూకి. రాత్రి నిద్రపోడు. ఏమీ పట్టనట్టు హాయిగా పడుకున్న అన్నను చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. నిజంగానే రాధా ఇవేవీ పట్టించుకోడు. వాడికి క్రికెట్ అంటే పిచ్చి. దాన్నే శ్వాసిస్తుంటాడు. తండ్రి మాట జవదాటడు. మంజు అలా కాదు. క్రికెట్ కన్నా ఇంజనీరింగ్ సైన్స్ అంటే ఇష్టం. సైంటిస్ట్ అవ్వాలనే ఆశయం. ఈ ఇద్దరు అన్నదమ్ములను ఓపెనర్స్‌గా ట్రెన్ చేస్తాడు తండ్రి. జతగా తమ్ముడు లేకపోతే తడబడ్తాడు అన్న. తమ్ముడు అలా కాదు. మొత్తానికి ముంబై వెళ్తారు.



'సెలక్షన్ డే' నవల

ముంబై గ్రౌండ్

ముంబైలో పైసా, ప్రాపకం రెండూ ఉంటేనే జీవితం. కేవలం క్రికెట్ కిట్‌లతో కాలు పెట్టిన ఆ ముగ్గురూ ఆ సిటీ లైఫ్‌లో ఫోర్లు, సిక్సర్లు కొట్టలేక డిఫెన్స్‌కే పరిమితమవుతారు. అతికష్టమ్మీద ఉండటానికి ఓ కోలీ (గది) సంపాదిస్తారు. ఎక్కే మెట్లు, గెంటేసే సెక్యూరిటీలా ముంబైలోని పేరెన్నికగన్న క్రికెట్ క్లబ్‌లన్నీ తిరుగుతారు కోచింగ్ కోసం. ప్రవేశం దొరకదు. ఒకరోజు ఒక గ్రౌండ్‌లో సెలక్షన్స్ జరుగుతుంటే అందులో జొరబడ్తారు ముగ్గురూ. ఒక్క చాన్స్ ఇవ్వమని కోరుతూ ఇద్దరు కొడుకులతో బ్యాటింగ్ చేయిస్తాడు మోహన్. చిరాకుపడ్డ సెలక్షన్ కమిటీ వాళ్లను తరిమేస్తుంది. ఆ పిల్లల బ్యాటింగ్‌చూసి అబ్బురపడ్తాడు ఇండియన్ టీమ్ మాజీ కోచ్ నారాయణ్ సదాశివ్ కులకర్ణి ఉరఫ్ టామీ సర్ (మహేశ్ మంజ్రేకర్). వాళ్లకు తను కోచింగ్ ఇస్తానని విఇన్‌బర్గ్ అనే మంచి స్కూల్‌లో అడ్మిషనూ ఇప్పిస్తానని మోహన్ కుమార్‌తో చెప్తాడు. అప్పటిదాకా క్రికెట్ క్లబ్స్‌లో ఎంట్రీ కోసం ప్రయత్నించి విసిగిపోయి ఉండటం వల్ల, స్కూల్ అనగానే పిల్లల్లో కనపడిన ఉత్సాహంతో ఓకే అంటాడు. కాని పిల్లలను హెచ్చరిస్తుంటాడు ఎవరిమాటా వినొద్దు అంటూ!

స్పోర్ట్స్ అండ్ క్రియేటివిటీనే కరిక్యులమ్

బట్టీ పట్టే పని లేని ఆ స్కూల్ కుమార్ బ్రదర్స్‌కి చాలా నచ్చుతుంది. ఆటలు, సృజనే కరిక్యులమ్‌గా ఉన్న ఆ వాతావరణంలో గుండెల నిండా ఊపిరి పీల్చుకుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే నాన్న దగ్గరి కంటే సంతోషంగా ఉంటారు వాళ్లు ఆ స్కూల్లో. అన్నదమ్ములిద్దరూ ఒకరిమీద ఒకరు ఆధారపడేట్టున్న వాళ్ల ఆటతీరును ఇట్టే పసిగట్టేస్తాడు కోచ్ టామీ సర్. టీమ్ స్పిరిట్ నేర్పుతుంటాడు. వ్యక్తిగత సామర్థ్యాన్ని వెలికితీస్తుంటాడు.ఆ స్కూల్ ప్రిన్సిపల్ నెల్లి విఇన్‌బర్గ్(రత్న పాఠక్ షా) మంచి మ్యాథమెటీషియన్. ఆమె భర్త విఇన్‌బర్గ్ ఒకప్పుడు గ్రేట్ క్రికెటర్. అతను స్థాపించిందే ఆ స్కూల్. విన్‌బర్గ్, టామీ మంచి స్నేహితులు. ఆ అనుబంధంతోనే విన్‌బర్గ్ చనిపోయినా ఆ స్కూల్లో కోచ్‌లా చేరుతాడు టామీ. మంజూకి మ్యాథ్స్, సైన్స్ అంటే ఉన్న జిజ్ఞాస చూసి ప్రోత్సహిస్తుంటుంది నెల్లి విఇన్‌బర్గ్. క్రమంగా క్రికెట్‌కు దూరమవుతుంటాడు మంజు. సైన్స్‌ఫేర్ కోసం తన బ్యాచ్‌మేట్స్‌తో కలిసి ఓ సైకిల్‌ను తయారు చేస్తుంటాడు. రన్స్ చేయందే నిద్రపోనివ్వని తండ్రి ప్రతిరోజూ స్కూల్ నుంచి రాగానే స్కోర్ అడుగుతుంటాడు పిల్లలను. బ్యాటింగ్ చేయకుండా తెలుసుకున్న కొత్త విషయాలను చెప్తుంటే అతనికి కోపమొస్తుంది. టామీ వాళ్లను చెడగొడ్తున్నాడని, విడదీసి బలహీనులను చేస్తున్నాడని ఆవేశపడి అతనితో గొడవకు వెళ్తాడు. తండ్రి ప్రవర్తన పిల్లలకు నచ్చదు. అయినా టామీ సర్ ఓపిగ్గా పిల్లలను చేరదీయడంతో ఆయన మీద వీళ్లకు గౌరవం రెట్టింపవుతుంది. ఆ స్కూల్లో వీళ్లిద్దరికీ ఒక ప్రత్యర్థి తయారవుతాడు. అతనే జావీద్. స్కూల్ క్రికెట్ టీమ్ కెప్టెన్. అప్పటిదాకా ఉన్న రికార్డ్‌ను అన్నదమ్ములిద్దరూ కలిసి బ్రేక్ చేస్తారు. వాళ్లంటే స్కూల్లో క్రేజ్ పెరుగుతుంది. ఇది జావీద్‌కు నచ్చదు. ఇంకోసారి మ్యాచ్‌లో రాధాతో ఓపెనర్‌గా జావీద్ వచ్చి కుమార్ బ్రదర్స్ రికార్డ్‌ను బ్రేక్ చేసేంత దగ్గరగా వస్తాడు. మైండ్‌గేమ్ ఆడి జావీద్‌ను అడ్డుకుంటాడు రాధా. ఆ మ్యాచ్‌లో రాధా తమ్ముడి తోడు లేకపోయినా మంచి స్కోర్ చేస్తాడు. ఆ వీడియో ముంబైలో వైరల్ అవుతుంది. అది ఓ కన్‌స్ట్రక్షన్ బిజినెస్ మ్యాన్ గర్ల్‌ఫ్రెండ్ ఫోన్‌కీ



కోచ్ టామీ సర్, కెప్టెన్ జావీద్, ప్రిన్సిపల్ నెల్లీ

చేరుతుంది. ఆ బిజినెస్ మ్యాన్ నెల్లీ విఇన్‌బర్గ్ స్కూల్‌ను కొనేసుకుని అక్కడ కమర్షియల్ కాంప్లెక్స్ కట్టాలని ప్లాన్ చేస్తుంటాడు. బేరానికి వెళ్తాడు కూడా. విఇన్‌బర్గ్ ఒప్పుకోదు. ఈ స్థలం కావాలంటే ముందు ఆ స్కూల్లో చదువుతున్న ఈ అబ్బాయికి స్పాన్సర్‌షిప్ ఇవ్వు అని ఆ వీడియో చూపిస్తుంది గర్ల్‌ఫ్రెండ్. అతను మోహన్ కుమార్‌ను కలిసి ఒప్పందం చేసుకుంటాడు. ఆ సంగతి నెల్లీకీ చెప్పి.. రాధాకు ఇచ్చే స్పాన్సర్‌షిప్ మీద వచ్చే ఆదాయంతో స్కూల్‌ని స్పోర్ట్స్ అకాడమీగా మార్చేందుకు పెట్టుబడిగా పెడ్తా, భాగస్వామిగా చేర్చుకొమ్మని అడుగుతాడు. నమ్ముతుంది నెల్లీ.

చాంపియన్‌షిప్ కోసం అన్న.. అమ్మ కోసం తమ్ముడు

తమ్ముడు క్రికెట్‌ను పట్టించుకోకుండా సైన్స్‌ఫేర్‌లో మునిగిపోవడం రాధకు నచ్చదు. తన పార్టనర్‌షిప్ లేక అన్న స్వార్థంతో తనను క్రికెట్‌లోకి లాగుతున్నాడని అన్నతో గొడవకు దిగుతాడు తమ్ముడు. ''మనకు క్రికెటే జీవితం మర్చిపోకు. ఆట మీద కాన్‌సన్‌ట్రేట్ చెయ్యి'' అని తమ్ముడిని వార్న్‌చేసి జాగింగ్‌కు బయలుదేరుతాడు రాధా. అన్న ప్రవర్తన, అమ్మ మీద బెంగతో కలత పడ్డ మంజు.. ఎప్పుడో అన్న ఇచ్చిన అమ్మ ఫోన్‌నంబర్‌కు రింగ్ చేస్తాడు. వాళ్ల పిన్ని ఫోన్ లిఫ్ట్ చేస్తుంది. అమ్మ గురించి అడుగుతాడు. ఇక్కడికి రాలేదు అని చెప్తుంది వాళ్ల పిన్ని. మంజు స్థాణువవుతాడు. జాగింగ్‌కి బయలుదేరిన రాధా మీదా దాడి చేస్తారు గుర్తు తెలియని యువకులు.

ఫస్ట్ సీజన్ ఇక్కడికి ఎండ్ అవుతుంది. వ్యక్తిగత స్వేచ్ఛ– తండ్రి పెత్తనం, పల్లెటూరు– నగర జీవనం, హిందీ – ఇంగ్లిష్, మర్యాద – అహంకారం, ఆట– యాంబిషన్, డిపెండెన్స్– ఇండిపెండెన్స్.. వీటన్నిటి సంఘర్షణే సెలక్షన్ డే. ఎండ్ అయిన తీరును చూస్తే త్వరలోనే సెకండ్ సీజన్ కూడా ప్రారంభంకాబోతుందేమో అనిపిస్తుంది. ప్రముఖ బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ నిర్మాత. ఉదయన్ ప్రసాద్ దర్శకుడు.

– సరస్వతి రమ

సరిపోయారు, రియల్లీ!

అతడు జాబ్ చెయ్యడు ఆమె ఇల్లు చూసుకోదు

మంచి సంప్రదాయాన్ని మొక్కలా నాటి, ఆ మొక్కకు రోజూ నీళ్లుపోస్తున్నారు ఈ నవ దంపతులు!

అమ్మాయి, అబ్బాయి పరిచయం కావడం, ఆ పరిచయం స్నేహంగా పరిణమించడం, స్నేహం నుంచి ప్రేమ రెక్కలు విచ్చుకోవడం రొటీన్. అలాంటి రొటీన్ ప్రేమల్లో చాలావరకు పెళ్లి పీటల మీదకు చేరవు. పెళ్లిపీటలను చేరిన ప్రేమల్లోనూ ఆ తర్వాత అంతా రొటీనే. అమ్మాయి పుట్టింటిని వదిలి అత్తవారింట్లో అడుగుపెట్టాలి. అందుకు ఉద్యోగం అడ్డమైతే ఆ ఉద్యోగాన్ని వదిలేయాలి. అంతగా ఆ అమ్మాయికి ఉద్యోగం చేయాలనే కోరిక ఉంటే.. అత్తగారి ఊరిలో లేదా భర్త ఉద్యోగం చేసే ఊరిలో కొత్త ఉద్యోగాన్ని వెతుక్కోవాలి. అప్పటివరకు తాను ఎదిగిన మెట్లను తానే కూలదోసుకుని కొత్త సోపానాల తొలిమెట్టు మీద నిలబడాలి.

అయితే కిషోర్, మినాల్‌ల జీవితమూ అలాంటి మలుపులనే తీసుకుని ఉంటే వారి గురించి చెప్పుకోవడానికి ఏమీ ఉండేది కాదు. వీళ్లు ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాలను బ్రేక్ చేస్తున్నారు. పెళ్లి చేసుకుని భర్త ఇంట్లో అడుగుపెట్టడమే ఎందుకు జరగాలి, భార్య ఇంట్లో భర్త అడుగుపెడితే తప్పేంటి... అని వీరైతే ఎవర్నీ ప్రశ్నించడం లేదు కానీ, తామైతే ఆచరిస్తున్నారు! భర్త ఉద్యోగం చేస్తే భార్య ఇంటిని చక్కబెట్టుకోవడంలో ఏ మాత్రం ఎబ్బెట్టు లేనప్పుడు, భార్య ఉద్యోగం చేస్తుంటే భర్త ఇంటి పనులు చక్కబెట్టుకుంటే అది ఎబ్బెట్టు ఎందుకవుతుంది? అన్నది వీళ్ల ఉద్దేశం. హౌస్ వైఫ్ అనిపించుకోవడం ఏమాత్రం గౌరవాన్ని తగ్గించుకోవడం కానప్పుడు, హౌస్ హజ్బెండ్ అనిపించుకోవడం తక్కువ ఎందుకవుతుంది? అని మినాల్ అంటోంది.



ప్రదర్శన లేని ఆదర్శ దంపతులు : కిశోర్, మినాల్

జైపూర్ అబ్బాయి

ఈ కొత్తతరం భార్యాభర్తల్లో అబ్బాయి నంద కిశోర్ కుమావత్‌ది రాజస్తాన్, జైపూర్‌లో ఉద్యోగం చేసేవాడు. అమ్మాయి పేరు మినాల్ విజయ్ పాండ్యే. ముంబైలోనే పుట్టి పెరిగింది, ముంబైలోనే ఉద్యోగం చేస్తోంది. 2017 నవంబర్ ఎనిమిదవ తేదీన ఆన్‌లైన్ యాప్‌లో పరిచయమయ్యారు. ఆ తర్వాత ఆరు రోజులపాటు రోజుకు పన్నెండు గంటల సేపు ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ చేసుకునేవారు. ఆరో రోజు అతడిని ముఖాముఖి చూడాలనిపించింది మినాల్‌కి. జైపూర్‌కి టికెట్ బుక్ చేసుకుంది. అతడికి అది సర్‌ప్రైజ్. ఉదయం నుంచి సాయంత్రం వరకు కబుర్లు చెప్పుకున్నారు. రాత్రి జైపూర్‌లో ఆమెను ముంబైకి ట్రైన్‌కి ఎక్కిస్తూ ఒకే ఒక్క మాట.. 'ఐ వాంట్ యూ ఇన్ మై లైఫ్, ఇట్ యాజ్ ఎ ఫ్రెండ్, లివ్ ఇన్ పార్టనర్ ఆర్ వైఫ్' అన్నాడతడు. మూడవ ఆప్షన్ ఎంచుకుంది మినాల్. 2018 జూలైలో పెళ్లి చేసుకున్నారు. పెళ్లయ్యాక వాళ్ల సంప్రదాయం ప్రకారం వధువు.. వరుడి ఇంటికి గృహప్రవేశం చేయాలి. ఇక్కడ కిశోర్ మినాల్ ఇంట్లో అడుగుపెట్టాడు. కాలదోషం పట్టిన సంప్రదాయాలను చెరిపేసి కొత్త సంప్రదాయాన్ని అలవాటు చేయడం తమకిష్టం అని చెబుతున్నారు ఈ దంపతులు.

ఉన్నవి రెండే ఆప్షన్లు

మేమిద్దరం చెరొక చోట ఉన్నాం. ఒక దగ్గరకు చేరాలంటే రెండే ఆప్షన్లు. ఒకటి.. నేను ఉద్యోగం మానేసి జైపూర్ వెళ్లడం, లేదా కిశోర్ ముంబైకి రావడం. కిశోర్ కాకుండా మరే మగాడైనా నన్ను కెరీర్ వదులుకోమనే చెప్తాడు. వీలుకాదంటే... ఉద్యోగం మన ప్రేమకంటే ఎక్కువా, పెళ్లి కంటే ముఖ్యమా.. అనే ఎమోషనల్ లాజిక్‌తో ఇరుకున పెట్టేవాడు. నన్ను కెరీర్ వదులుకోమని చెప్పకపోవడం కిశోర్ ఔన్నత్యం.

– మినాల్

ముంబైలో అమ్మాయి

జైపూర్‌లో ఉద్యోగానికి రిజైన్ చేశాడు కిశోర్. ముంబైలో కొత్త ఉద్యోగ ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రతిచోటా 'ఆ ఉద్యోగానికి ఎందుకు రిజైన్ చేశారు' అనే ప్రశ్న ఎదురైంది. 'భార్య ఇక్కడ (ముంబైలో) ఉద్యోగం చేస్తోంది, అందుకే' అనే మాట పూర్తయ్యే లోపు నవ్వేశారు కొందరు. ఇందులో అంత విచిత్రం ఏముంది? అని అడుగుతోంది మినాల్. 'సంపాదించని మగాడిని భర్తగా భరించడం కష్టం, భవిష్యత్తులో అతడు నీకు భారం అవుతాడు. ఈ నిర్ణయం వద్దు' అని చెప్పారామెకి తల్లిదండ్రులు. రొటీన్‌ని బ్రేక్ చేసి చూపిస్తామంటున్నారు ఈ భార్యాభర్తలు. అయితే మినాల్ సంపాదిస్తుంటే హాయిగా కాలం గడిపేయాలనే బద్ధకంతో హౌస్ హజ్బెండ్ కాలేదతడు. ఇంటిని చూసుకుంటూ చేయగలిగిన వ్యాపారానికి ప్రణాళిక వేసుకుంటున్నాడు.

– మంజీర

మీరు కొట్టిన పిండే!

సంక్రాంతిని దాచి పెట్టుకోవాలి. అది అంత మంచి పండుగ. తొందరగా అయిపోతుందేమోనన్న దిగులుగా ఉందా! ఈ రోజు నుంచే పిండి కొట్టండి. వంటకాలు తయారుచేయండి. డబ్బాలలో దాచి పెట్టుకుని కొంచెం కొంచెం ఆస్వాదిస్తూ తినండి. అప్పుడు పండగ ఎన్నాళ్లో ఉంటుంది. ఇంటిల్లిపాదికీ ఇష్టమైన పిండి వంటలు మీకు కొట్టిన పిండే కదా!

నేతి అరిసెలు/ బెల్లం అప్పాలు



కావలసినవి: బియ్యం – ఒక కేజీ; బెల్లం – 700 గ్రా.; నువ్వులు – 100 గ్రా.; నెయ్యి/నూనె – డీప్ ఫ్రైకి సరిపడా; ఏలకుల పొడి – అర టీ స్పూను.

తయారీ: ● బియ్యాన్ని శుభ్రంగా కడిగి, తగినన్ని నీళ్లు జత చేసి, ముందురోజు రాత్రి నానబెట్టాలి ● మరుసటి రోజు పెద్ద జల్లెడలాంటి దానిలో పోసి సుమారు పావుగంట సేపు బియ్యాన్ని వడకట్టాలి ● తడిపోయాక, బియ్యాన్ని మిక్సీలో వేసి మెత్తగా చేయాలి ● ఒక పాత్రలో బెల్లం పొడి, రెండు టేబుల్ స్పూన్ల నీళ్లు పోసి, స్టౌ మీద ఉంచి పాకం పట్టాలి ● ఉండ పాకం వచ్చేవరకు ఉడికించాలి ● బియ్యప్పిండి కొద్దికొద్దిగా పోస్తూ కలపాలి ● అర టీ స్పూను ఏలకుల పొడి, 2 టేబుల్ స్పూన్ల నెయ్యి వేసి బాగా కలియబెట్టాలి ●మిశ్రమం బాగా చిక్కబడేవరకు ఆపకుండా కలుపుతుండాలి ● బాగా ఉడికిందనిఅనిపించాక దింపేయాలి ● స్టౌ మీద బాణలిలో నూనె పోసి కాచాలి ● తయారయిన అరిసెల పిండిని కొద్దికొద్దిగా తీసుకుంటూ, నెయ్యి పూసిన ప్లాస్టిక్ పేపర్ మీద ఒత్తి, కాగిన నూనెలో వేసి బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించి తీసేయాలి ● అరిసెల బల్ల మీద ఉంచి, నూనె పోయేలా గట్టిగా ఒత్తాలి ●బాగా చల్లారాక డబ్బాలో నిల్వ చేసుకోవాలి.



మినప జంతికలు/ మురుకు

కావలసినవి: మినప్పప్పు – 2 గ్లాసులు; బియ్యం – 6 గ్లాసులు; వెన్న – 2 టేబుల్ స్పూన్లు; మిరప కారం – ఒక టేబుల్ స్పూను; వాము – అర టేబుల్ స్పూను; నువ్వులు – ఒక టేబుల్ స్పూను; ఉప్పు – తగినంత; నువ్వుల నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ● రెండిటినీ కలిపి మెత్తగా పిండి పట్టించాలి ● 2 టేబుల్ స్పూన్ల వెన్న జత చేయాలి ● ఒక టేబుల్ స్పూను మిరప కారం, అర టేబుల్ స్పూను వాము, ఒక టేబుల్ స్పూను నువ్వులు, తగినంత ఉప్పు వేసి, కొద్దికొద్దిగా చల్ల నీళ్లు జత చేస్తూ, ఉండలుగా లేకుండా జంతికల పిండి కలుపుకోవాలి ● జంతికల గొట్టం తీసుకుని లోపలి భాగాన్ని కొద్దిగా తడి చేయాలి ● స్టౌ మీద బాణలి ఉంచి వేడయ్యాక నూనె పోసి కాచాలి ● జంతికల గొట్టంలో తగినంత పిండి ఉంచాలి ● కాగిన నూనెలో జంతికల మాదిరిగా చుట్టాలి ● దోరగా వేగిన తరవాత చట్రం సహాయంతో పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి ● ఈ విధంగా అన్నీ తయారుచేసుకోవాలి ● జంతికలు బాగా చల్లారాక డబ్బాలో నిల్వ చేసుకోవాలి.



గులాబీ గుత్తులు



కావలసినవి: మైదా పిండి – 3 కప్పులు; బియ్యప్పిండి – ఒక కప్పు; పంచదార – ఒక కప్పు; ఉప్పు – కొద్దిగా; వంట సోడా – కొద్దిగా, మిఠాయి రంగు – కొద్దిగా

తయారీ: ● ఒక పాత్రలో బియ్యప్పిండి, పంచదార వేసి, తగినన్ని నీళ్లు జత చేస్తూ దోసెల పిండి మాదిరిగా కలుపుకోవాలి ● కొద్దిగా నీళ్లలో మిఠాయి రంగు కలిపి, పిండిలో కలియబెట్టాలి ● స్టౌ మీద బాణలిలో తగినంత నూనె పోసి కాచాలి ● గులాబీ గుత్తులు తయారుచేసే గుత్తిని ముందుగా వేడి వేడి నూనెలో కొద్ది సేపు ఉంచి వేడి చేయాలి ● కలిపి ఉంచుకున్న పిండిలో ఆ గుత్తిని జాగ్రత్తగా ముంచి, అదే గుత్తిని నూనెలో ఉంచాలి ● కొద్దిగా వేగుతుండగా చాకుతో గుత్తి నుంచి గులాబీలను వేరు చేయాలి ● దోరగా వేగిన తరవాత పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి.

సజ్జప్పాలు

కావలసినవి: మైదా పిండి – ఒక కప్పు; వేడి నూనె – అర కప్పు; ఉప్పు – చిటికెడు; నెయ్యి – పావు కప్పు; బొంబాయి రవ్వ.

తయారీ: ● ఒక పాత్రలో మైదా పిండి, వేడి నూనె, ఉప్పు, తగినన్ని నీళ్లు పోసి గట్టిగా చపాతీ పిండిలా కలుపుకోవాలి ● గంటసేపు పక్కన ఉంచాలి ● బాణలిలో నెయ్యి వేసి కరిగాక బొంబాయి రవ్వ వేసి వేయించాలి ● అర కప్పు పంచదార, కప్పుడు నీళ్లు వేసి బాగా కలుపుతూ ఉడికించి దింపేయాలి ● చల్లారాక చిన్న చిన్న ఉండలు చేసి పక్కన ఉంచాలి ● మైదాపిండిని చిన్న సైజు పూరీలా ఒత్తి అందులో కొద్దిగా బొంబాయి రవ్వ ఉండను ఉంచి, అన్నివైపులా మూసేసి, ఉండలా చేయాలి ● అరిటాకుకి కొద్దిగా నూనె పూసి ఈ ఉండలను చేతితో అరిసెల మాదిరిగా ఒత్తాలి ● ఈ విధంగా అన్నీ తయారుచేసుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె పోసి కాగాక, వీటిని అందులో వేసి దోరగా వేయించి, పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి ● చల్లారాక డబ్బాలో నిల్వ ఉంచాలి ● ఇవి పది రోజులపాటు తాజాగా ఉంటాయి.



రాశి ఫలాలు
(సౌరమానం)



జన్మనక్షత్రం తెలియదా? నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా? మీ పుట్టిన తేదీని బట్టి ఈవారం (జనవరి 5 నుంచి 11 వరకు) మీ రాశి ఫలితాలు

డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

మేషం (మార్చి 21 - ఏప్రిల్ 19)

కొన్ని కొన్ని పెళ్లిళ్లలో అందరూ అన్ని పనుల్నీ చూస్తూ ఏదైనా ఓ వస్తువు పోవడం లాంటి తేడాగాని వస్తే ఆ పనిని ఫలానా ఆమె చూసింది ఫలానా వాడు చేశాడు అంటూ ఎవరికి వాళ్లు తమ తప్పుని ఒప్పుకోకుండా మరొకరి మీదికి నెట్టుకుంటూ బంతి ఆట కార్యక్రమాన్ని చేసుకుంటూ కనిపిస్తారు. వస్తువు పోవడం మాట అటుంచి తీవ్ర మనస్పర్థలు మిగిలిపోతుంటాయి. మీరు వృత్తి ఉద్యోగ వ్యాపారాలు గానీ చేస్తూంటే మీకంటూ కేటాయింపబడిన పనిని సక్రమంగా ముగించెయ్యండి. కొద్దిగా మొహమాటం మిమ్మల్ని ఈ వారం ఇబ్బందికి గురిచేసే అవకాశముంది. ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో అని లోలోపల పడే తపన కారణంగా పని ముగిశాక వ్యతిరేకత కారణంగా పడే మనోవేదన అంతా ఇంతా కాదు. నిర్భయంగా ధైర్యంగా చెప్పండి– అడగండి. ముందుకి ముందే తప్ప మొహమాట పడవద్దు. శ్రీమద్రామాయణంలో వాలి అనే వానరయోధునికి అతని భార్య తార చెప్పింది. రామునితో యుద్ధం వద్దని. వినలేదు. ప్రాణాలని కోల్పోయాడు. సీతమ్మని తెచ్చి తీవ్ర మనోవ్యధ పడుతూ రావణుడున్న వేళ అతని భార్య మండోదరి చెప్పింది– సీతమ్మని తిరిగి రామునికి అప్పజెప్పేయవలసిందని. వినలేదు. తన ప్రాణులతోబాటు లంకా రాక్షసజనాన్ని కూడా కోల్పోయేలా చేసుకున్నాడు. మీరూ మీ భాగస్వామికి చెప్పి మాత్రమే ముఖ్యమైన పనుల్ని చేయండి ఈ వారం. ఆ చేసిన పని వల్ల లాభం వస్తే ఆనందం ఇద్దరిదీ అవుతుంది. నష్టమే కలిగితే ఒకరినుండి మరొకరికి ఓదార్పు లభిస్తుంది. అనుకోని జీతం బకాయిలో, ఇచ్చిన రుణాలో లేక మరో తీరులోనో ధనం కొద్ది మొత్తంలో చేతికి అందే సూచనలున్నాయి కాబట్టి ఓ శాశ్వతమైన పనిని ఊహించుకుని దానికి వినియోగించడం మంచిది. మంచి స్థలమో పొలమో ఇల్లో కొందామని అనుకుంటూ చివరి క్షణంలో దాన్ని మానుకునే పరిస్థితి కనిపిస్తుంది.

లౌకిక పరిహారం: దంపతిలో ఎవరే పనిని చేయదలిచినా, ఇద్దరూ అనుకుని చేసుకోండి.

అలౌకిక పరిహారం: గణపతి షోడశనామ పఠనం ఉత్తమం.

వృషభం (ఏప్రిల్ 20 - మే 20)

చేతికి 5 కదా వేళ్లున్నాయి. అన్నిటికంటె బలంగా ఉన్నది బొటనవేలు కదా! అన్ని పనుల్నీ దాంతోనే చేస్తున్నామా? అన్నిటి సమాయాన్నీ తీసుకుంటున్నాం కదా... అదే తీరుగా మీరు కూడా నలుగురు ఆప్తుల సహాయాన్ని తీసుకుంటూ గాని పనిని ప్రారంభిస్తే పనులు వడిగానూ సరైన తీరులోనూ పూర్తవుతాయి. సొంత నిర్ణయంతో పనిని చేయడం వల్ల నింద రావచ్చు. సక్రమంగా పని పూర్తి కాకపోవచ్చు కూడా.

ఏదో ఓ మాటని అని తిరిగి అనిపించుకోవడం లేదా ఒకరేదో ఓ మాటని అంటే తిరిగి మళ్లీ సమాధానాన్ని చెప్పడం కోసం నోరు చేసుకోవడమనే పరిస్థితి రావచ్చు. వీలు చేసుకుని మౌనంగానూ ప్రతిస్పందించ కుండానూ ఉండండి తప్ప బదులు చెప్పే ప్రయత్నాన్ని చేయకండి కొంతకాలంపాటు. ఇంట్లో శుభకార్యం జరిగే అవకాశముంది.

నిచ్చెనని ఎక్కేటప్పుడు ఒక మెట్టు తర్వాత మరో మెట్టుని ఎక్కి పైకి ఎక్కడం సరైన తీరుగా ప్రమాదం జరక్కుండా చేసుకునే విధానమూ కూడా. అలాగే మీరు కూడా ఆర్థిక పరిపుష్టి కోసమంటూ ఒక్కసారే అత్యాశకి వెళ్లడం ధన సంపాదన కోసం ప్రయత్నించడం మంచిది కాదు. సరికదా శనిప్రభావం కారణంగా కొత్త ఇబ్బందిలో పడచ్చు కూడా! చీమ ఎలా తన బరువుకంటె 5 రెట్లు బరువైన వస్తువుని నోట కరుచుకుని నిదానంగా ఈడ్చుకుంటూ తాననుకున్న గమ్యస్థానాన్ని చేరుతుందో అదే తీరుగా మీరు కూడా అసాధ్యమని అందరూ అనుకున్న పనిని ఎంతో ఆలోచనతో చక్కగా సాధిస్తారు. ప్రతిష్ఠని పొందుతారు.

కుటుంబంలో శాంతి సౌఖ్యాలు లభిస్తాయి. కొత్తగా మరో ఇంటిని కొనుక్కునే అవకాశముంది. అయితే ముసుగులో వ్యవహారం కాకుండా ప్రతి విషయాన్నీ విస్పష్టంగా మాట్లాడుకుని మాత్రమే చేసుకోవడం ఎంతైనా మంచిదని గుర్తుంచుకోండి. మొహమాటాలు వద్దు.

లౌకిక పరిహారం: సమైక్యంగా పని చేయండి. అత్యాశకు పోవద్దు.

అలౌకిక పరిహారం: ఆంజనేయ ద్వాదశ నామాలని పఠిస్తూ ఉండండి.

మిథునం (మే 21 - జూన్ 20)

అంత గొప్ప వాళ్ల ఇంట్లో పెళ్లికి ఇంత చిన్న బహుమానమా? అంత గొప్ప దేవాలయానికి వెళ్తూ ఆ పక్కనున్న పుణ్యక్షేత్రాలు చూడకుండా రావడమా? మళ్లీ మళ్లీ రాగలమా ఏమన్నానా? పెద్దదానికి ఇంత నగ తీసుకున్నాక ఇంట్లో కోడలికి తీసుకోకపోతే బాగుంటుందా? మరోలా అనుకోరూ..? అంటూ ఇలాంటి అదనపు ఖర్చుల కారణంగా ప్రధానమైన ప్రణాళికాబద్ధమైన ఖర్చు చేతులు దాటుతుందనేది యథార్థం.

ఉన్న చోటునున్న వ్యాపారానికి ప్రభుత్వం వారు చేయబోయే మార్గాల వెడల్పు లేదా పక్కన సరైన వ్యాపారం కాని మరో వ్యాపారపు అంగడి అకస్మాత్తుగా రావడం లేదా పెద్ద ఆకాశ వారధి (ఫ్లై ఓవర్) రావడం వంటి కారణాల ప్రకారం తప్పనిసరిగా వ్యాపారస్థలం మార్చవలసి రావచ్చు. ఇవన్నీ ఒకెత్తు కాగా అంగడికి చెల్లించాల్సిన బాడుగ పెంపు లేదా మరమ్మతుల అవసరం కారణంగా కూడా మార్పు తథ్యం కావచ్చు. తప్పక మారండి. నష్టం కలగదు. వ్యాపారం దెబ్బతినే అవకాశం లేదే లేదు కూడా. సకాల భోజనం, సకాల నిద్రాలోపం వల్ల ఆరోగ్య వ్యవస్థ కొద్దిగా దెబ్బతినే అవకాశముంది. స్థిరమైన ఆస్తుల్ని విక్రయించి వాటివల్ల వచ్చే అధికమూల్యం కారణంగా వేటినో కొనుక్కుంటే బాగుంటుందనే ఊహ బలంగా రావచ్చు. ఆ ఆలోచన సరికాదు. ఉన్న ఇళ్లనీ లేదా స్థలాలనీ మరమ్మతులు చేయించి సరిహద్దులు చెదిరిపోకుండా ఆక్రమణకి గురికాకుండా ఉండేలా శీఘ్రంగా చేయించుకోండి.

సంఘంలో, ఉద్యోగ స్థానాల్లో మీకు మంచి పేరు లభించే అవకాశముంది. మీ సంస్థ పేరుతో మంచి పరిచయమున్న వ్యక్తులు లేదా సంస్థ మరో రహస్య వ్యాపారాన్ని చేసేందుకు ప్రయత్నించవచ్చు. మీ ఆనుపానులూ వ్యాపార సమాచారానికి సంబంధించిన వ్యవహారాలూ సంఖ్యలూ చెప్పకండి.

లౌకిక పరిహారం: వ్యాపార స్థలం మారే అవకాశముంది. మారినా నష్టం లేదు.

అలౌకిక పరిహారం: గణపతి అష్టోత్తర సహస్ర నామ పఠనం మంచిది.

కర్కాటకం (జూన్ 21 - జూలై 22)

ఎంతోదూరంలో ఉన్నాసరే ఆ సంతకే వెళ్లి, బాగా ఉన్న కూరలని ఒకటికి రెండు మార్లు పరిశీలించి ఎంచుకుని మరీ ఇంటికి తెచ్చి, వంటని చేసి విందుని రుచికరంగా చేయాలని భావించడం ఎవరైనా చేసే పనే. అయితే ఇక్కడే కొద్దిగా లోభించి తక్కువకే వస్తున్నాడనే భావంతో నాసిరకం వంటవాణ్ణి తెచ్చుకుంటే సమయం శ్రమ, ధనం, వస్తువూ నష్టం కావడంతోపాటు అపకీర్తి వస్తుంది. లోభి అనే పేరు కూడా ఓ పని విషయంలో చేసే ఈ పొరపాటు కారణంగా జీవితాంతం నిందని భరించవలసి వస్తుంది. కాబట్టి లోభితనానికి పోకండి– కావాలని అపకీర్తిని తెచ్చుకోకండి. వృత్తి ఉద్యోగాల్లో కొంత ఆసక్తి తగ్గే అవకాశముంది. అది ఎప్పుడూ సరికాదు. నలుగురిలో మాట్లాడుతూ మీ లో భావాన్ని బహిరంగంగా చెప్పేస్తూ ఉండడం వల్ల కొత్త ఇబ్బందులు ఎదురు కావచ్చు. అసలు ఏ మాత్రమూ నోరు తెరవకుండా ఉంటేనే మన మీద చాడీలని మన పైనున్న ధృతరాష్ట్ర మహాశయునికి వివరించి చెప్పే కాలంలో ఇలా సత్తెకాలపు సత్తెయ్యలా మాట్లాడటం సరికాదు. 'నాకేం ఫరవాలేదు' అని మీరు భావిస్తే ఆ ఫలితానికి సిద్ధపడి ఉండాల్సిందే మరి!

కొన్ని కారణాల వల్ల సొమ్ముకోసం అప్పు చేయవలసి రావచ్చు. అడిగే రుణాన్ని రెండు మూడు మార్లు కాకుండా ఒకేసారి పెద్దమొత్తంలో అడగడం మంచిది. ఎంత కావాలో అంత మాత్రమే అడిగి అది చాలని ఇబ్బంది పడడం కంటె ఇలా చేయడం వల్ల రుణదాతకి మరో తీరు ఆలోచన రాకుండా ఉంటుంది. పైగా ఎప్పుడు తిరిగి ఇచ్చే అవకాశముందో దాన్ని మరో నెల పొడిగించి చెప్పి ఈలోగా తీర్చేయడం వల్ల మీ మీద విశ్వాసం పెరుగుతుంది కూడ. మీరు తీసుకోబోయే రుణాన్ని గురించి మీ కుటుంబ సభ్యులకి వివరించి చెప్పి తీరాలి. లేనిపక్షంలో అవసరాల జాబితాని తెరిచి మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అవకాశం ఉంటుంది.

లౌకిక పరిహారం: బహిరంగంగా మాట్లాడేయడం సరైనది కాదు.

అలౌకిక పరిహారం: లక్ష్మీ అష్టోత్తర శతనామ పఠనం ఉత్తమ ఫలితాలనిస్తుంది.

సింహం (జూలై 23 - ఆగస్ట్ 22)

మనస్తాపాన్ని నిష్కారణంగా కల్గించే కుజుడు, గోతిలో పడ్డాక పైకి వచ్చే మార్గాలని ఉపదేశించే శని, మాంస దోషాన్ని నేత్ర రోగాల్ని కల్గించే రాహువూ ఒకేచోట సమావేశమై మీ గురించే ఆలోచిస్తున్న కారణంగా ఆదాయం, అలాగే వ్యయం అనే వాటిలో వ్యయమే ఎక్కువగా ఉండి, మనశ్శాంతిని లేకుండా చేస్తారు. మీరు చేస్తున్న ఉద్యోగం కంటే పని తేలికదనాన్ని గురించి, జీతంలో ఎక్కువదనాన్ని గురించి, మరిన్ని మెరుగైన సౌకర్యాలని గురించి వివరించి మిమ్మల్ని మరో సంస్థకో మరో వ్యాపారానికో వెళ్లాల్సిందిగా ప్రలోభ పెట్టే వ్యక్తులు మీకు తారసపడతారు. అయస్కాంతానికి అతుక్కున్న ఇనుప వస్తువులా మీకు ఆ వ్యక్తే అనుక్షణం కళ్లలో మెదలాడుతూ ఉద్యోగపు మార్పుకి సిద్ధపడిపోతారు మానసికంగా. దైవబలం మీకున్న కారణంగా మీరు వెళ్లదలుచుకుని సిద్ధపడ్డ సంస్థ లోపలి విషయాలని వివరించి చెప్పే ఆప్త బంధువు మీకు లభించి నేతి బీరకాయలో ఉన్న నేతి గురించి అర్థం చేసుకున్నట్టుగా ఆ ప్రయత్నం నుండి విరమించుకునే అవకాశముంది. ఈ తీరు విరమణం మంచికే సుమా!

ఆకాశంలోకి గాలిపటాన్ని ఈ దిక్కుకే ఈవైపుకే ఇంత ఎత్తులోనే ఎగిరేలా వేయాలనుకుంటే అది నూటికి నూరుపాళ్లూ సాధ్యమయ్యే అవకాశం ఉండదు. గాలి వేగానికీ, కిందకీ పైకీ ప్రసరించే గాలి మలుపు మలుపుల ప్రవర్తనకీ, తోక బరువుని బట్టీ... బొమ్మల పటం ఎప్పుడైనా తెగిపడచ్చు. ఏ దిశకైనా ఎగరచ్చు లేదా గిరగిర తలకిందులౌతూ మరో వ్యక్తి గాలిపటానికి తగులుకుని ఆ రెండూ నేల కూలచ్చు. అదే తీరుగా మీరు చేయబోతున్న వ్యాపారం ఎదగచ్చు – మధ్యమంగా ఉండచ్చు – కింద పడిపోవచ్చు. తప్పక సక్రమంగా సాగిపోతూ ఆర్థికాభివృద్ధినిస్తుందనే మాట గగన కుసుమమే.

లౌకిక పరిహారం: ఊహ తలకిందులు కావచ్చు. చాడీలు మరో ఉద్యోగస్థునికి చెప్పరు.

అలౌకిక పరిహారం: శివాభిషేకం చే(యి)స్తూ ఉండడం మంచిది.

కన్య (ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)

సింహమంటూ తన గుహని వీడి అరణ్యంలోకి వచ్చిందా? అంటే తప్పక తన కడుపు నిండేంత మాంసం దొరికేంతవరకూ వేటాడుతూనే ఉంటుంది తప్ప పులిలాగానో నక్కలాగానో కొంత ప్రయాణించి ప్రయత్నించి కొంత మాంసం దొరకగానే – రేపు చూసుకుందాం లే – అనుకుని వెనక్కి వచ్చేయద్దు. అదే తీరుగా మీరు కూడా ఓ పనిలోకంటూ దిగితే అది ఉద్యోగ బాధ్యత కావచ్చు కుటుంబ వ్యవస్థకి చెందిన పని కావచ్చు – ముగించుకునేంత వరకూ – వెనుకడుగు వేయద్దు. మంచి దశ ఉంది కాబట్టి సంతానపు 'అపరిష్కృత సమస్య'ని పరీక్షింపజేసి సంతానం ఉందా? లేదా? అనే అంశాన్ని తెలియజేయవలసిందంటూ మొగమాటం లేకుండా వైద్యుణ్ని అడగండి తప్ప నాన్పుడు వద్దని చెప్పండి. కదులుతున్న నీటిలో ప్రతిబింబాన్ని చూసుకోవడమనేది ఎలా అసాధ్యమో అదే తీరుగా స్థిరమైన నిర్ణయానికంటూ మీకు మీరు రా(లే)ని దశలో ప్రతి విషయమూ సంశయాస్పదమూ ముగింపులేని తీరూ అవుతూ సహనాన్ని కోల్పోయే అవకాశముంది. ఆదాయం బాగున్నా తగు ప్రణాళిక లేకుండా వ్యయం చేసుకోవద్దు. ఖర్చు రాబోతున్న కాలం ముందుంది, భయపడకండి. శుభకార్య నిమిత్త వ్యయమే అది. మీ చొరవ కారణంగా ఎంతో కాలం నుండి వాయిదా పడుతూ వస్తున్న పనుల్లో కొన్ని పునః ప్రారంభమౌతాయి. ఆరోగ్యపరమైన అన్ని జాగ్రత్తలని – వాతావరణ పరంగా – తీసుకోండి తప్ప అశ్రద్ధ చేయడం సరికాదు. ముఖ్యంగా కంఠపరమైన సమస్య విషయంలో శ్రద్ధ అవసరం.

ప్రయాణ సందర్భాల్లో వస్తు, వాహన, ధన విషయాల్లో వాటిని ఒకరికి అప్పగించి ఆ బాధ్యత మొత్తం బయలుదేరే దగ్గర నుండి ఇంటికొచ్చేవరకూ వారిదే అని చెప్పండి. మరో బాధ్యతని కూడా ఆ వ్యక్తికి అప్పగించకండి. నమ్మకమైన బాధ్యతాయుతుడైన వ్యక్తికి ఈ పనిని అప్పగించండి.

లౌకిక పరిహారం: నాన్పుడు వద్దు. మొగమాటం లేకుండా వ్యవహరించండి.

అలౌకిక పరిహారం: శ్రీ శివాష్టోత్తరాన్ని పఠిస్తూ ఉండండి.

తుల (సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)

వాక్ స్థానంలో బుధ గ్రహం అనుకూలంగా లేకపోయిన పక్షంలో అలాంటివాళ్లు ఏం మాట్లాడినా అది అవతలివాళ్లకి మరోలానే అర్థమౌతుంది. దాంతో 'కలహం కరిష్యే' అనే సంకల్పం చెప్పుకుని తగాదాకి దిగడమే ఔతూ ఉంటుంది. అలాగని తులా రాశి వారికి ఎప్పుడూ నోరు సరిగా ఉండదనేది దీనర్థం కాదు గాని ప్రస్తుతం వాళ్లకి కలహాలు అధికంగా జరిగే అవకాశముంది. కలహించడమనేది పెద్ద సమస్య కాదు గాని – బురద నిండిన వర్షపు నీరు ఎలా కొంత సమయానిక్కాని తేరుకోదో – అలా కలహించిన వ్యక్తుల మనసు కూడా కొన్ని రోజులక్కానీ కుదుటపడదు. ఆ కారణంగా కలహానికి అవకాశం రాబోతోందని తెలుస్తున్న క్షణంలో దూరానికి వెళ్లిపోవడం సరైన పని. అయితే అది ప్రస్తుతం మీ చేతిలో లేని పనీ – కాని పనీ కూడా. వాహనాలతో యంత్ర పరికరాలతో అలాగే విద్యుత్ ఉపకరణాలతో పని చేసేటప్పుడు విధిగా జాగ్రత్తలని పాటించి తీరాలి. బుద్ధిలో ఏదో ఆలోచించుకుంటూ ఏకాగ్రత సరిలేక పై పనుల్ని చేస్తూండే కారణంగా ఇబ్బందులెదురౌతాయి. అందుకని వాటి జోలికి వెళ్లడం మంచిది కాదు – తప్పని సరైనప్పుడు బుద్ధి కుదురుగా ఉన్నప్పుడే ఆ పనుల జోలికి వెళ్లడం ఉత్తమం.

కొత్తగా చేరిన ఉద్యోగంలో పై అధికారులతో సమన్వయ భావం లోపించడంలో మనశ్శాంతి ఉండదు. ఉద్యోగం నుండి విరమించాలనే దృక్పథంతో అనిష్టంగా ఉంటారు ఉద్యోగ విధుల పట్ల. ప్రతి చిన్న పని కూడా మీ మనసు బరువుగా ఉండే కారణంగా పర్వతమెత్తడమంత కష్టంగా అనిపిస్తూ ఉంటుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే ధనం పుష్కలంగా ఉన్న పేదతనం, పరిచారికా జనం పుష్కలంగా ఉన్న ఏకాకితనం – నిస్సహాయ విధానం, పరిష్కారం పూర్తిగా తెలిసీ అపరిష్కృత సమస్యతో తలకిందులు అవుతూ ఉండడం అనే స్థితిలో ఉన్నారు మీరు.

లౌకిక పరిహారం: ఒక్క మెట్టు దిగితే మహారాజభోగం మీదే.

అలౌకిక పరిహారం: అర్ధనారీశ్వర స్తోత్రం మంచిది మీకు.

వృశ్చికం (అక్టోబర్ 23 - నవంబర్ 21)

నల్లగా ఆకాశమంతా నిండి ఎప్పటికీ కురవకుండా కనిపిస్తున్న మేఘం, ఆరుబయట ఏ పనిని చేయబోదామన్నా ఎంత భయాన్ని కలిగిస్తుందో – బొమ్మలో ఎంతో అందంగా బలిష్ఠంగా ఉన్న గుర్రం ఎప్పటికీ ఎంతకీ ఎలా పరిగెత్తకుండా నిలిచే ఉంటుందో – అలాగే మీకు న్యాయస్థానంలో ఎటూ తేలకుండా కేవలం వాయిదాలే పడుతూ ఉండే ఆ అపరిష్కృత సమస్య ఇప్పుడు కూడా ఒక కొలిక్కి వచ్చే అవకాశానికి నోచుకోదు. ఒకపక్క ధనం మరోపక్క కాలం ఇంకొక పక్క అపకీర్తి మరోపక్క ఎదురుచూపులతో విసుగనిపిస్తూ ఉంటుంది. ఎవరు పలకరించినా చికాకు, కోపం ఎక్కువవుతూ ఉంటుంది. ఓ పద్ధతీ నియమం లేకుండా వ్యయం చేసేస్తూ ఉంటారు.

మీ పని తీరుని మార్చుకుని మానసికంగా ఆనందాన్ని పొందుదామని ప్రయత్నిస్తారు. చేసే పనిలో వింత మార్పులకి ఈ వారంలో శ్రీకారం చుడతారు. అది మంచికే అవుతుంది. మీకోసం కొత్త ఉద్యోగం సిద్ధంగా ఉన్నప్పటికీ చేరాలనే ఆనందం ఉత్సాహమూ లేక – అవతలి ఒడ్డున ఉన్న పడవ ఎప్పుడు మన దగ్గరికొస్తుందా? – అని ఎదురుచూసే వ్యక్తిలా ఏ పనీ లేకుండా కాలక్షేపాన్ని చేస్తూ ఉంటారు.

శరీరం నిండు నిరాశతో నిస్పృహతో కాలాన్ని గడుపుతూ గమ్యం లేనివారిలా ఉంటారు. ఆప్తుడూ మిత్రుడూ అని భావించిన వ్యక్తి మీనుండి రుణాన్ని తీసుకోదలిస్తే – ఏదో ఓ కారణాన్ని చెప్పి లేదని చెప్పడం మంచిది ప్రస్తుత దశలో. తప్పక ఇవ్వాలనే గట్టి ఆలోచనతో మీరుంటే గనుక – ఎంత నష్టపోదలిచారో అంత సొమ్ముని దానం చేస్తూ – అప్పు ఇచ్చినట్లుగానూ – అతను తీరుస్తాడనే భ్రాంతి భ్రమలతోనూ ఉండండి.

లౌకిక పరిహారం: రుణాన్ని ఇయ్యద్దు. ఎదురుచూపు తప్పదు. భరించాల్సిందే మరి!

అలౌకిక పరిహారం: శని శ్లోకాన్ని రోజుకి 361 మార్లు పఠించడం ఉత్తమం.

ధనుస్సు (నవంబర్ 22 - డిసెంబర్ 21)

కన్న సంతానంతో అభిప్రాయ భేదాలొచ్చే అవకాశముంది కాబట్టి, 'ఇలాగే చేయాలి – ఇలాగే జరగాలి' అనే స్థిర బుద్ధితో మీరుండడం సరికాదని ముందుకి ముందే నిశ్చయపడి ఉండండి. కొన్నిటిని ఇలా చెప్పేయడం తేలికే. అయితే ఆచరణలో ఎంత ఇబ్బంది ఉంటుందో అని మీకే తెలుస్తుంది. అది తప్పనిసరీ అనుభవైకవేద్యం కూడా.

ఒకప్పుడు దూరమైన బంధువులూ దూరం జరిగిపోయిన మిత్రులూ కూడా క్రమంగా దగ్గరకొస్తూ మీకు సహకరిస్తూ ఉంటారు. బంధు మిత్రుల అండదండలున్నాయనే మనోధైర్యం మీకు కలుగుతుంది. దానధర్మాల మీదికి దృష్టి మళ్లడమే కాకుండా ఆధ్యాత్మికంగా ఓ గురువుని స్వీకరించాలనే దృక్పథం వస్తుంది. తీర్థయాత్రలకీ పుణ్యక్షేత్రాలకీ వెళ్లాలనే భావన బాగా పెరుగుతుంది. వీలు వెంబడి దైవకార్యాలని నిర్వహిస్తూ ఉంటారు.

ఉన్నత స్థితిలో ఉన్న పెద్దలతో పరిచయాలౌతాయి. వెంటనే ఈ పనీ ఆ పనీ అంటూ అడిగెయ్యడం కాకుండా వాళ్లెంతవరకూ సహాయపడగలరో, సహాయపడే మనస్తత్వమున్నవాళ్లో కాదో, ఏ పనీ చేయకుండా సమయాన్ని దాటబెట్టే లక్ష్యమున్న మనుషులో గమనించుకుని ఆ మీదట మాత్రమే పరిస్థితికనుగుణంగా సహాయం కోసం ప్రయత్నించడంలో భాగంగా నోరు విడిచి అడగండి. తెలియని ఆందోళన గుండె నిండుగా వ్యాపిస్తుంది. నిస్సహాయ స్థితిలో మనసులో మెదులుతూ ఉంటుంది. ఏవేవో ఊహలన్నీ కళ్లముందు కదులుతూంటాయి గాని ఏ ఒక్కటీ సానుకూలపడకపోవచ్చు ప్రస్తుతం. రుణం కోసం ప్రయత్నిస్తారు. రుణం మంజూరయ్యాక ఆత్మస్థైర్యం లేక వెనుకడుగు వేసే అవకాశముంది.

సంతానం, చదువు అంతంత మాత్రంగా ఉంటుంది. విద్యకి సంబంధించినవి కాక క్రీడలు, చదరంగం మొదలైనవాటిలో చురుగ్గా ఉంటారు.

లౌకిక పరిహారం: సంతానంతో మృదువుగా వ్యవహరించండి. సంభాషణల్లో జాగ్రత్త అవసరం.

అలౌకిక పరిహారం: రాజరాజేశ్వరీ స్తోత్రాన్ని పఠిస్తూ ఉండండి.

మకరం (డిసెంబర్ 22 - జనవరి 19)

ఓ మాదిరి బరువున్న పల్లకీ తేలికగా వెళ్లిపోతూండడానిక్కారణం దాన్ని మోస్తూండే ఓ పదిమంది బోయీలు. అలాగే ఎంతో బరువున్న రథం అలా ముందు ముందుకి తేలికగా సాగిపోతూండడానిక్కారణం ఇటూ అటూ కొన్ని వందల మంది భక్తులు తాళ్లతో లాగుతూ ఉండడమే. ఓ పెనుసర్పాన్ని కాలిగోళ్లలో ఇరికించుకుని గరుడపక్షి వేగంగా ఎగిరిపోతూండడానిక్కారణం బలమైన విశాలమైన రెక్కలే.

సరిగ్గా ఇలాగే మీరు చేయవలసిన కార్యభారం మొత్తం నలుగురూ నాలుగు చేతులు వేయడంతో శ్రమ లేకుండా పూర్తయిపోయి మనసు తేలికపడుతుంది మీకు. మీరు చేస్తున్న పనితీరు శీఘ్రవిధానం నష్టపోనితనం నష్టపెట్టని లక్షణం వంటి వాటి ద్వారా పదిమందికీ మీరు ఆకర్షణపాత్రులౌతారు. దాంతో కార్యభారం తగ్గి ఏకాగ్రతా బుద్ధితో పాటు మానసిక ఉత్సాహం మీ సొంతమౌతుంది కూడ. నిరుద్యోగులు సోమరితనాన్ని వీడి సకాలంలో దరఖాస్తు చేయడం, ఆ మీద వడివడిగా చేయాల్సిన అన్ని పనుల్నీ సక్రమంగా ముగిస్తూ గనుక ఉంటే ఉద్యోగం వచ్చేది మొదటగా మీకే. శ్రీమద్రామాయణంలో రావణాసురుడు మారీచుడున్న ఆశ్రమాన్నికొచ్చి అతని యాగం ముగిసేవరకూ నిలబడి ఎదురుచూసాడు. యాగం ముగిసిన వేళ అకస్మాత్తుగా రావణుణ్ణి చూసిన ఆ మారీచుడు 'పై అధికారి తన కిందివాని ఇంటికొచ్చా'డంటే ఏదో చేయించరాని తప్పుని బలవంతాన చేయించడానికేనని శాస్త్రం చెప్తోంది కాబట్టి నేనుగా చేయాల్సిన తప్పుడుపని ఏమిటి? నా అయిష్టానికి చివరిరోజు ఏది? ఎవని విషయంలో అధర్మకార్యాన్ని నిర్వహించాల్సి ఉందంటూ గుండెలో ప్రతిధ్వనించేలా మాట్లాడాడు. సరిగ్గా ఇదే పరిస్థితి మీకూ రాబోతోంది. సధైర్యంగా చెప్పండి 'చేయలేన'ని. లేదా సెలవు పెట్టి పొరుగూరు వెళ్లిపోండి.

లౌకిక పరిహారం: తెలిసి తెలిసి ఎవరి ఆనందానికీ తప్పుని చేయకండి.

అలౌకిక పరిహారం: లలితా సహస్రనామపఠనం శ్రేయస్కరం.

కుంభం (జనవరి 20 - ఫిబ్రవరి 18)

తెలుగులో ఓ సామెత – 'క్షణం తీరికలేదు, దమ్మిడీ ఆదాయం లేద'ని. అలా మీకు కూడ తీవ్రమైన పనిని చేస్తూ ఉండే ధోరణి. ఆదాయం మాత్రం అంతంతమాత్రంగా ఉండే విధానం కన్పిస్తుంది. ఎక్కడ లోపముందని గనుక విచారిస్తే – పనికి తగ్గ ప్రతిఫలాన్ని అడగకపోవడమే – అనేది సమాధానం.

పెద్దలతో మాట్లాడేటప్పుడు మర్యాదగానూ గౌరవపూర్వకంగానూ పలకరించి పనుల్ని సానుకూలం చేసుకోండి. మీకు తెలిసిన పెద్దవారుగాని ఉంటే వారి ద్వారా సహాయాన్ని మీ వరకే పరిమితం చేసుకోండి తప్ప మీకు తెలిసిన ఏ కొందరికో సహాయమంటూ అవతలివారిని ఇబ్బంది పెడితే, మీకు కూడ సహాయాన్ని పొందే అవకాశం లభించకపోవచ్చు.

ఇలా సహాయపడకపోవడం స్వార్థం, అసహాయ విధానమనుకోవద్దు. అవతలివారి మనస్తత్వాన్ని బట్టి పోవడం అనేది లోకసహజవిధానం. ఎవరిపనికో తోడుగా వెళ్లడం, మన పనికి సహాయకులుగా కొందర్ని తీసుకెళ్లడం, మరొకరికి సహాయపడే నిమిత్తం మీరు వెళ్లే ఊరికి పక్కగా ఉన్న ఊళ్లో వారి పనిని పూర్తి చేసుకురావడం.. వంటి పనులతో సమయం నష్టపోతారు.

శారీరక శ్రమకి గురి ఔతారు. పరిమిత స్వార్థమంటూ పెద్దలు చెప్పినట్లు కొన్ని కొన్ని పనుల్ని ఇతరులకి చేయకపోవడం కూడా ఒప్పే మరి. వివాహవ్యహారాల్లో అలాగే కొన్నింట మధ్యవర్తిగా ఉండడం అప్పులిచ్చేవారికి అడ్డుగా ఉండి రుణాన్ని ఇప్పించడం వంటి పనుల్లోకి వెళ్లనే వెళ్లద్దు. మాటమీద నిలబడే లక్షణం ఉన్న మీకు – మాట మీద ఏ మాత్రమూ నిలబడని అవతలి వ్యక్తులతో జరిగే వ్యవహారం కారణంగా పెద్దబండ నెత్తిమీద పడుతుంది. దాన్ని సరిచేసుకోడానికి జీవితకాలం పట్టచ్చు.

లౌకిక పరిహారం: వెచ్చించిన సమయానికి సరిపడినంత ఆదాయాన్ని అడగడం తప్పు కాదు.

అలౌకిక పరిహారం: దుర్గాస్తోత్రాన్ని పఠిస్తూ ఉండండి.

మీనం (ఫిబ్రవరి 19 - మార్చి 20)

జీవితమంతా సుఖసంతోషాలతో ఉన్నప్పుడూ, చేయవలసిందంటూ ఏదీ తాత్కాలికంగా కన్పడనప్పుడూ కదా దూరప్రాంతానికి తీర్థయాత్రలకి వెళ్తారు ఎవరైనా. అలాగే ఆధ్యాత్మిక గురుదర్శనం, వారి ఆశ్రమంలో కొంతకాలం పాటు గడపడం, దానధర్మాలని చేయడం.. వంటివన్నీ చేస్తారు. దానిక్కారణం ఎప్పటిపనుల్ని అప్పుడే చక్కబెట్టుకుని సిద్ధంగా ఉండడమే. వృత్తి ఉద్యోగవ్యాపారాల్లో చెప్పుకోదగిన ఇబ్బందులంటూ ఉండని కారణంగా శారీరక మానసిక శ్రమలు లేక ఎంతో ఆనందంగా ఉంటారు.

భార్యాభర్తల పరస్పర సదవగాహన బాగా ఉండే కారణంగా వజ్రసమానమైన శరీరంతోనూ బృహస్పతితో సమానమైన బుద్ధిబలంతోనూ ఉంటారు. ఇతరులెవరో మీరు మంచి విశ్వసించదగినవారనే అభిప్రాయంతో గాని మీ దగ్గర కొంత సొమ్ముని దాచుకునే అవకాశముంది. దాన్ని పొరపాటున కూడ సొంతపనులకి వినియోగించుకోకండి. మాట పోతే పరిచయం పోతుంది. పరిచయం తెగితే అండకాస్తా పడిపోయినట్లవుతుంది.

అండపోయిన పక్షంలో మనకి మనమే సహాయకులం కావలసివస్తుంది జాగ్రత్త!! మన దగ్గరుంటే ఎక్కడ వాడేస్తామో అనే భయంతో మరెవరి వద్దనో దాచకండి. అది ఇంకా ప్రమాదకరం. తెరచాప సహాయంతో పడవబాగా ప్రయాణిస్తున్న సందర్భంలోనే చుక్కానిని సక్రమంగా చూసుకుంటూ ఉండాలి. లేని పక్షంలో అది తన దిశ తప్పి ఎటుకోవెళుతూ ఏ కొండనో బలమైన రాతినో ఢీకొంటే కథ మొత్తం తలకిందులైపోతుంది.

కాబట్టి నమ్మకం చెడిపోయే పనికాదుగదా! అనుకుంటూ అనుక్షణం జాగరూకులై ఉండండి.

లౌకిక పరిహారం: నమ్మకాన్ని చెడగొట్టుకోకండి. దానధర్మాలని యధాశక్తి మాత్రమే చేయండి.

అలౌకిక పరిహారం: ఇష్టదైవాన్ని ధ్యానిస్తూ ఉండండి.

నవరత్నాలు -4

సాక్షి ఫ్యామిలీ

విజయవాడ ॥ శనివారం ॥ 5-1-2019



నీరు, నేల సాక్షిగా స్వాహా పర్వం

సీఎం చంద్రబాబు తొలుత విడుదల చేసిన శ్వేతపత్రంలో వెల్లడించిన మేరకు చూస్తే.. పెండింగ్ ప్రాజెక్టుల పనులన్నీ పూర్తయుండాలి. రాష్ట్రం సస్యశ్యామలమై ఉండాలి.. కానీ ఒక్క ప్రాజెక్టూ పూర్తి కాలేదు. అదనంగా ఒక్క ఎకరా ఆయకట్టుకూ నీళ్లివ్వలేదు. సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో రూ.20 వేల కోట్లు, నీరు-చెట్టు కింద రూ.పది వేల కోట్లు, చెరువులు, వాగులు, వంకల్లో పూడిక తీసిన మట్టి, ఇసుక అమ్మకం ద్వారా రూ.25 వేల కోట్లు.. వెరసి రూ.55 వేల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో ప్రత్యేకించి చెప్పక్కరలేదు.

- సాక్షి, అమరావతి / సాక్షి నెట్‌వర్క్

ఎవరైనా ఇంటికి పునాదులు వేసి..
గృహ ప్రవేశానికి రండంటూ అందరినీ పిలిచి
భోజనం పెడితే ఏమంటాం? పిచ్చోడంటాం..
లేదా మనందరినీ తప్పదోవ పట్టించడానికి
చెవిలో పూలు పెడుతున్నాడంటాం.
పోలవరం ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు
సరిగ్గా ఇదిగో ఇలానే చేస్తున్నారు. *- వైఎస్ జగన్*



- రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల ముసుగులో యథేచ్ఛగా పాలకుల దోపిడీ
- కేంద్రం కట్టాల్సిన పోలవరం ప్రాజెక్టును మేమే నిర్మిస్తామంటూ తీసుకున్న రాష్ట్రం
- ఒక్క గేటు పెట్టి ఆర్భాటం చేస్తున్న సీఎం చంద్రబాబు
- గత ఏడాదిలోనే నీళ్లిస్తామన్న మాట మార్చి.. వచ్చే ఏడాది అంటున్న వైనం
- వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో కూలీలుగా మారిన రైతులు
- తెలుగు నేలను సుభిక్షం చేయడానికి జలయజ్ఞం చేపట్టిన దివంగత సీఎం వైఎస్సార్
- ఆయన హయాంలో 70-80% ప్రాజెక్టుల పనులు పూర్తి
- మహానేత హఠాన్మరణంతో గ్రహణం.. మిగతా పనులను పూర్తి చేయలేని బాబు సర్కారు
- అక్రమార్జనకు వనరులుగా మార్చుకుని కమీషన్ల కోసం అంచనాల పెంపు
- మనందరి ప్రభుత్వం రాగానే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ హామీ
- నవరత్నాల్లో జలయజ్ఞానికి పెద్దపీట
- వైఎస్ జగన్‌తోనే సాగునీటి ప్రాజెక్టులకు మహర్దశ అంటున్న సాగునీటి రంగ నిపుణులు

ఆయ'కట్టు'కథలు.. కమీషన్ల పర్వాలు

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభంజనంలో కొట్టుకుపోయి వరుస ఓటములతో కుంగి కుదేలైన టీడీపీని అధికారంలోకి తేవడానికి ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు సాగు నీటి ప్రాజెక్టుల జపం చేసి, అధికారంలోకొచ్చాక తన అక్రమార్జనకు వాటిని వనరులుగా మార్చుకున్నారు. పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు మినహా మిగతా పెండింగ్ ప్రాజెక్టుల పనులను కేవలం రూ.17,368 కోట్లతోనే పూర్తి చేస్తానంటూ సాగునీటి ప్రాజెక్టులపై 2014 జూలై 28న విడుదల చేసిన శ్వేతపత్రంలో పేర్కొన్నారు. కానీ.. నాలుగున్నరేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.63,657.62 కోట్లు ఖర్చు చేశారు. పోలవరం ప్రాజెక్టు పనులకు రూ.10,227.92 కోట్లు, నీరు–చెట్టు కింద చేసిన పనులకు రూ.15,806.70 కోట్లు ఖర్చు చేశారు. అంటే.. మిగతా రూ.37,623 కోట్లను పెండింగ్ ప్రాజెక్టుల పనులకు ఖర్చు చేశామని చెబుతున్నా ఒక్క ప్రాజెక్టూ పూర్తయింది లేదు. నాలుగున్నరేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేసిన రూ.63,657.62 కోట్లను సక్రమంగా వినియోగించుకుని ఉండుంటే.. పెండింగ్ ప్రాజెక్టులన్నీ దాదాపుగా పూర్తయ్యేవని సాగునీటి రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జల సంరక్షణ, భూగర్భ జల వనరుల పరిరక్షణ ముసుగులో నీరు–చెట్టు కింద పనులు చేయకుండానే చేసినట్లు చూపి దోపిడీ చేయకుండా ఆ నిధులను పోలవరం ప్రాజెక్టుకు మళ్లించి ఉంటే ఈ పాటికి ఆ ప్రాజెక్టు పనులు కొలిక్కి వచ్చేవని జల వనరులశాఖ అధికార వర్గాలే అంగీకరిస్తున్నాయి. కమీషన్‌ల వర్షం కురిపించే కామధేనువులుగా సాగునీటి ప్రాజెక్టులను మార్చేయడం వల్ల ఈ దుస్థితి నెలకొంది.

- జలయజ్ఞం కింద దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన గుండ్లకమ్మ, పుష్కర, తాడిపూడి, గురురాఘవేంద్ర, భూపతిపాలెం, ముసురుమిల్లి, ఎర్రకాల్వ, తోటపల్లి తదితర 11 ప్రాజెక్టులు ముగింపు దశకు చేరుకున్నాయని, మిగిలిపోయిన ఐదు శాతం పనులు పూర్తి చేస్తే కొత్తగా 2,03,628 ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించవచ్చని 2013–14 సామాజిక ఆర్థిక సర్వే వెల్లడించింది. ఈ 11 ప్రాజెక్టులను కేవలం రూ.780 కోట్లతో పూర్తి చేయవచ్చని అప్పట్లో అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. కానీ ఆయకట్టుకు నీళ్లందించే డిస్ట్రిబ్యూటరీల పనుల్లో పెద్దగా కమీషన్‌లు రావనే నెపంతో ఆ పనులకు టీడీపీ సర్కార్ ప్రాధాన్యమివ్వలేదు.
- గాలేరు–నగరి తొలి దశ, హంద్రీ–నీవా తొలి దశ, తెలుగుగంగ ప్రాజెక్టులు 2014 నాటికే పూర్తయ్యాయి. కానీ ఆయకట్టుకు నీళ్లందించే డిస్ట్రిబ్యూటరీల పనులను టీడీపీ ప్రభుత్వం చేపట్టలేదు. దీనివల్ల 6.45 లక్షల ఎకరాలకు నీళ్లందించలేని దుస్థితి నెలకొంది.
- ఆయకట్టుకు నీళ్లందించి.. రైతులకు ప్రయోజనం చేకూర్చాలన్న చిత్తశుద్ధి ఉంటే.. ఆ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా పూర్తి చేసేది. కానీ తక్కువ ఖర్చుతో పూర్తయ్యే మిగిలిపోయిన పనుల అంచనా వ్యయాన్ని భారీగా పెంచేసిన సర్కారు.. పాత కాంట్రాక్టర్లను తొలగించి, కమీషన్లు ఇచ్చిన వారికి పనులు అప్పగించింది. అయినా ఆ పనులను పూర్తి చేయలేకపోయింది. దాంతో నాలుగున్నరేళ్లలో ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టూ పూర్తి కాలేదు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే క్రమంలో.. ఎప్పుడో పూర్తయి, జాతికి అంకితం చేసిన ప్రాజెక్టులనే చంద్రబాబు మళ్లీ ప్రారంభించి.. అది తన ఘనతగా చెప్పుకోవడానికి నానా తంటాలు పడుతుండటంపై అధికారవర్గాలే నివ్వెరపోతున్నాయి. తోటపల్లి ప్రాజెక్టు నుంచి సిద్ధాపురం ఎత్తిపోతల పథకం వరకూ ఇదే కథ.
- రాష్ట్రంలో సాగుకు యోగ్యమైన భూమి 199.04 లక్షల ఎకరాలుంది. ఉమ్మడి రాష్ట్రంలోనే సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, బోరు బావుల కింద 104.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందేవి. కానీ నాలుగున్నరేళ్లుగా ఆయకట్టు తగ్గిపోతూ వస్తోంది. గరిష్టంగా 76 లక్షల ఎకరాలకే సాగునీరు అందించినట్లు జల వనరుల శాఖ రికార్డులే చెబుతున్నాయి. కానీ.. క్షేత్ర స్థాయిలో ఆ మేరకు కూడా సాగునీళ్లు అందిన దాఖలాల్లేవని అధికార వర్గాలు చెబుతున్నాయి.

బాబు పుణ్యమా అని మా బతుకులిలా తగలడ్డాయి..

మాది నిరుపేద కుటుంబం. రెండెకరాల చిన్న రైతును. నాలుగేళ్లుగా చినుకు లేదు. పంటలు పండే పరిస్థితి లేదు. అప్పుడప్పుడు పడ్డ కొద్దిపాటి వర్షానికి కంది, మిరప, పత్తి లాంటి పైర్లు వేసినా ఆ తర్వాత వర్షాల్లేక ఎండిపోవడం మామూలైంది. పంటలు వేయడమే మానుకున్నాం. సేద్యాన్ని పక్కన పెట్టాం. కడుపు నిండాలంటే రెక్కల కష్టం తప్పలేదు. ఇక్కడ పనుల్లేకపోవడంతో వలస వెళ్లక తప్పలేదు. వరి కోతలకు కోస్తా, తెలంగాణ ప్రాంతాలకు.. చెరకు నరకడానికి శ్రీకాకుళం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు పోతున్నాం. ఒంట్లో సత్తా ఉన్నన్నాళ్లు నేను వెళ్లే వాడిని. ఇప్పుడు కష్టంగా ఉంది. మా పిల్లలు వెళుతున్నారు. నెల కిందట తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో వరి కోతలకు వెళ్లి.. ఆదివారం తిరిగొస్తుండగా లారీ ప్రమాదంలో మా పిల్లలకు గాయాలయ్యాయి. ఇప్పుడు ఇంటి దగ్గరే ఉన్నారు. అలా జరగకుండా ఉన్నట్లయితే గుంటూరు జిల్లాలో వరి కోతలకు వెళ్లేవారు. ఏడేళ్లుగా వలసపోతూనే ఉన్నాం. ఏడాదిలో మూడు నెలలే కూలి ఉంటుంది. దాంతోనే కుటుంబం మొత్తం బతకాల్సి వస్తోంది. బతుకు దుర్భరంగా ఉంది. వెలిగొండ ప్రాజెక్టు పనులను చంద్రబాబు సర్కారు పూర్తి చేయకపోవడంతో ఆయకట్టు రైతులమైన మా బతుకు భారమైంది. పొలాలన్నీ బీళ్లే. తిండి గింజలు, పశువుల మేత దొరికే పరిస్థితి లేదు. ప్రాణప్రదంగా పెంచుకున్న పశువులను కబేళాలకు తరలించి రైతులందరం ఇతర ప్రాంతాలకు కూలికెళ్లి బతుకీడుస్తున్నాం. మా బతుకులిలా తగలడ్డాయి. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వెలిగొండ పనులు వేగంగా జరిగాయి. అప్పుడే పనులు పూర్తయి నీరొచ్చి మా బతుకులు మారతాయన్న ఆశ చిగురించింది. ఆయన చనిపోయాక చంద్రబాబు ప్రభుత్వం వెలిగొండ పనులను పట్టించుకోలేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితేనే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తారన్న నమ్మకం ఉంది.



– నార్లగడ్డ సుబ్బయ్య, వెంకటరెడ్డి పల్లె, పుల్లలచెరువు మండలం, ప్రకాశం జిల్లా

పొలం వదిలేసి.. డ్రైవర్‌గా వెళ్తున్నా...



నాకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు. ఓ కుమార్తెకు పెళ్లి చేశా. మరో కుమార్తె ఇంటర్, కుమారుడు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. నాకు నాలుగెకరాల మామిడి తోట ఉంది. మూడేళ్లుగా కాపు తగ్గుతూ వస్తోంది. బోరు బావి తవ్వాలంటే రూ.80 వేలవుతోంది. అంత డబ్బు పెట్టలేని పరిస్థితి. పోనీ అప్పు తెద్దామన్నా ఆర్థికంగా చితికిపోయిన నాకు ఎవరిస్తారు? అప్పు దొరికే పరిస్థితి లేదు. తోటలో చెట్లన్నీ ఎండిపోయాయి. కష్టాలన్నీ ఒక్కసారిగా మొదలయ్యాయి. పిల్లల స్కూలు ఫీజులు కట్టలేని పరిస్థితి. ఒకప్పుడు ఎంతో మంది కూలీలకు పని కల్పించిన నేను.. ఇప్పుడు కుటుంబ పోషణ కోసం ట్రాక్టర్‌ను కూడా అమ్మేశాను. పండ్ల ఫ్యాక్టరీలో ప్యాకింగ్ కూలీగా పని చేసేందుకు మహారాష్ట్రకు కూలీగా వెళ్లాను. అక్కడ భాష రాక బతుకు భారమై మళ్లీ ఇంటికొచ్చాను. పొట్టకూటి కోసం ఇక్కడే ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నా. చంద్రబాబు సర్కారు అన్నదాతలను ఆదుకోదని తేలిపోయింది. నా గోడు వినేవారు లేరు. వైఎస్ జగన్ వస్తేనే మళ్లీ నాకు మునుపటి బతుకు వస్తుంది. ఆయనే ఉచితంగా బోరు వేయిస్తానన్నారు. పెట్టుబడికి డబ్బులు కూడా ఇస్తానన్నారు. ముఖ్యంగా మా జిల్లాలో ప్రాజెక్టులు పూర్తవుతాయి. మా పొలాలకు నీరొస్తుంది.

– అమ్మనబ్రోలు నాగయ్య, కొల్లూరుపాడు, ఉలవపాడు పంచాయతీ, ప్రకాశం జిల్లా.

చంద్రబాబు ఇలా చెప్పారు..




- చంద్రబాబు 2014 ఎన్నికప్పుడు.. అధికారంలోకి వచ్చాక పెండింగ్ ప్రాజెక్టులన్నీ దశలవారీగా పూర్తి చేస్తాం.
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం మినహా మిగిలిన ప్రాజెక్టులను రూ.17,368 కోట్లతోనే పూర్తి చేస్తాం.
- పోలవరం ప్రాజెక్టును 2018 నాటికి పూర్తి చేసి గ్రావిటీ ఆయకట్టుకు నీళ్లందిస్తాం.
- నదీ జలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షిస్తాం.
- సముద్రంలో కలుస్తున్న నదీ జలాలను మళ్లించి రెండు కోట్ల ఎకరాలకు నీళ్లందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం.

చంద్రబాబు చేసిందిదీ..: చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే కమీషన్లు ఇవ్వని కాంట్రాక్టర్లపై 60 సీ నిబంధన కింద వేటు వేశారు. మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని పెంచేసి.. కోటరీ కాంట్రాక్టర్లకు అప్పగించి కమీషన్లు వసూలు చేసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో రూ.37,952.92 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 23 ప్రాజెక్టుల అంచనా వ్యయాన్ని మాత్రం రూ.96,060.73 కోట్లకు పెంచేశారు. అంటే.. అంచనా వ్యయాన్ని రూ.58,107.86 కోట్లు పెంచేశారు. ఈ వ్యవహారంలో కాంట్రాక్టర్ల నుంచి భారీ ఎత్తున కమీషన్లు తీసుకున్నారనేది స్పష్టమవుతోంది.

- విభజన చట్టం ప్రకారం కేంద్రమే చేపట్టాల్సిన పోలవరం ప్రాజెక్టును.. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చుక్కానిలా నిలిచే ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి మరీ ఆ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలు దక్కించుకున్నారు. ఆ తర్వాత పనులన్నీ నామినేషన్‌పై కోటరీ కాంట్రాక్టర్లకు అప్పగించి కమీషన్లు వసూలు చేసుకున్నారు.
- బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును కేంద్రం ఇంకా నోటిఫై చేయక ముందే ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచేందుకు కర్ణాటక సర్కార్ చర్యలు తీసుకుంటున్నా, ప్రాజెక్టుల రీ డిజైన్ పేరుతో అదనపు నీటిని వినియోగించుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నా సీఎం చంద్రబాబు నోరు మెదపడం లేదు. కృష్ణా నదీ జలాల విషయంలోనే కాదు.. గోదావరి జలాలపై రైతుల హక్కుల పరిరక్షణలోనూ అదే కథ. చివరకు వంశధార జలాలపై ఉత్తరాంధ్ర ప్రజల హక్కులను కూడా పరిరక్షించలేకపోయారు.



మేమంతా ఇప్పుడు కూలీలుగా మారామని చెబుతున్న వెంకటరెడ్డి పల్లె రైతులు



అపర భగీరథుడు వైఎస్సార్

ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా, దేశ ధాన్యాగారం (రైస్ బౌల్ ఆఫ్ ఇండియా)గా ప్రసిద్ధికెక్కింది. కానీ 1995 నుంచి 2004 వరకు వరుస కరవులతో వ్యవసాయం సంక్షోభంలో పడింది. పది మందికి పట్టెడన్నం పెట్టే రైతులు ఆకలితో అలమటించారు. ఆత్మాభిమానం చంపుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నారు. కడలి పాలవుతున్న నదీ జలాలను మళ్లించి.. బంజరు భూములను సస్యశ్యామలం చేసి, కరవును శాశ్వతంగా తరిమికొట్టేందుకు 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం చేపట్టారు. తెలుగునేలను కరువనేదే ఎరుగని సీమగా మార్చాలని, దేశ ధాన్యాగారంగా నిలపడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు అన్నపూర్ణ నామధేయాన్ని సార్థకం చేసి.. రైతేరాజు అన్న నానుడిని నిజం చేసే దిశగా వేగంగా అడుగులేశారు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 2004లో రూ.లక్ష కోట్ల బడ్జెట్ లేదు. కానీ.. రూ.1,33,730 కోట్ల అంచనా వ్యయంతో 86 సాగునీటి ప్రాజెక్టుల పనులను చేపట్టారు. వాటిని పూర్తి చేయడం ద్వారా 1.21 కోట్ల ఎకరాలకు నీళ్లందించి, అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి పక్కాగా ప్రణాళిక వేసుకున్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా మొక్కవోని స్థైర్యంతో, చెదరని ఆత్మవిశ్వాసంతో.. అకుంఠిత దీక్షతో జలయజ్ఞాన్ని కొనసాగించారు. ఐదేళ్లలో రూ.53,205.29 కోట్లను ఖర్చుచేసి 16 ప్రాజెక్టులను పూర్తిగా, 25 ప్రాజెక్టులను పాక్షికంగా పూర్తి చేయడం ద్వారా 18.48 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీళ్లందించడంతోపాటు 2.07 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. సాగునీటి రంగం చరిత్రలో ఇదో చెరిగిపోని రికార్డు. అధిక శాతం ప్రాజెక్టు పనులను ఓ కొలిక్కి తెచ్చిన వైఎస్.. జలయజ్ఞం ఫలాలను సంపూర్ణ స్థాయిలో అందుబాటులోకి తెచ్చే క్రమంలో అమరుడయ్యారు.



మహానేత స్ఫూర్తి.. అదే ఆర్తి..

తెలుగునేలను సుభిక్షం చేయడానికి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞాన్ని చేపడితే.. దాన్ని పూర్తి చేసి, ఫలాలను రైతులకు అందించే గురుతర బాధ్యతను ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తీసుకున్నారు. ఆయన ప్రకటించిన నవరత్నాలలో జలయజ్ఞానికి పెద్దపీట వేశారు. మహానేత చేపట్టిన జలయజ్ఞాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేసి రాష్ట్రాన్ని సుభిక్షం చేసే సమర్థత.. ప్రణాళిక ఒక్క వైఎస్ జగన్‌కే ఉన్నాయని సాగునీటి రంగ నిపుణులు, రైతు సంఘాల నేతలు, రైతులు స్పష్టీకరిస్తున్నారు.

- అధికారంలోకి వచ్చిన తక్షణమే జలయజ్ఞం కింద చేపట్టిన ప్రాజెక్టుల పనులను సమీక్షించి.. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులను తొలి ప్రాధాన్యం కింద పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లందిస్తాం.
- పోలవరం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, కడలి పాలవుతున్న గోదావరి జలాలను పొలాలకు మళ్లించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం. చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతలను పూర్తి చేయడం ద్వారా ఉభయ గోదావరి జిల్లాలను దేశపు ధాన్యాగారంగా తీర్చిదిద్దుతాం.
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేస్తాం. ఎనిమిది లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందిస్తాం.
- వంశధార, తోటపల్లి, జంజావతి, తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టుల్లో మిగిలిపోయిన పనులను శరవేగంగా పూర్తిచేసి ఉత్తరాంధ్రను సుభిక్షం చేస్తాం.
- హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ, వెలిగొండ, గుండ్లకమ్మ, సంగం, నెల్లూరు బ్యారేజీలను ప్రణాళికాబద్ధంగా పూర్తిచేసి దుర్భిక్ష ప్రాంతాలైన రాయలసీమ, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలను సస్యశ్యామలం చేస్తాం.
- కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షించి, నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువలు, కృష్ణా డెల్టాకు సమృద్ధిగా నీళ్లందించేలా చూస్తాం.
- నిర్వాసితులుగా మారిన ప్రజలకు పునరావాసం కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతాం. *- వైఎస్ జగన్*



లక్షలాది రైతు కుటుంబాలకు వెలకట్టలేని లబ్ధి


• కియారా అద్వానీ

హోమ్‌ఫుడ్ ఇస్తే ఫ్రెండ్ అయిపోతా

"నాకు నార్త్ అండ్ సౌత్ అనే తేడా లేదు. యాక్టర్‌గా అన్ని రకాల పాత్రలు చేస్తూ గ్లోబల్ ఆడియన్స్‌కు రీచ్ అవ్వాలన్నదే నా లక్ష్యం. వీలైనంతమంది ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలనే ఉద్దేశంతోనే డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌వైపు కూడా ముందుకు అడుగులు వేస్తున్నాను. 'బాహుబలి' చిత్రం భాషాభేదాలను చెరిపేసింది. ప్రస్తుతం ద్విభాషా, త్రిభాషా చిత్రాలు కూడా రూపొందుతున్నాయి" అని కియారా అద్వానీ అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్‌చరణ్, కియారా అద్వానీ జంటగా రూపొందిన సినిమా 'వినయ విధేయ రామ'. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా కియారా అద్వానీ చెప్పిన సంగతులు.

• 'భరత్ అనే నేను' సినిమాలో నేను చేసిన వసుమతి క్యారెక్టర్‌కి 'వినయ విధేయ రామ' చిత్రంలో నా సీత క్యారెక్టర్‌కి డిఫరెన్స్ ఉంది. మంచి మాస్ కమర్షియల్ సినిమా ఇది. ఫ్యామిలీ మెంబర్స్ అందరూ ఉన్నప్పుడు సైలెంట్‌గా ఉంటుంది సీత. అదే ఎవ్వరూ లేకుండా రాముడు మాత్రమే ఉన్నప్పుడు డామినేట్ చేయాలని చూస్తుంది. అప్పుడు సీతనే బాస్ అన్నమాట (నవ్వుతూ). సినిమాలో రామ్‌చరణ్‌కి, నాకు మంచి కెమిస్ట్రీ కుదిరింది. అమేజింగ్ ఎక్స్‌పీరియన్స్. బోయపాటిగారు బాగా తీశారు. దానయ్యగారు కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు.

• బోయపాటిగారు ఫస్ట్ టైమ్ ఈ కథ చెప్పినప్పుడు మంచి ఫ్యామిలీ సినిమా చేయబోతున్నాననే ఫీలింగ్ కలిగింది. ప్రశాంత్‌గారు, స్నేహ గారు, వివేక్ ఒబెరాయ్‌గారు.. ఇలా సిల్వర్‌స్క్రీన్‌పై 15 మంది మంచి నటీనటులు కనిపిస్తారీ సినిమాలో. వీరందరితో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. ప్రతి సినిమాకు ప్రిపేర్ అయినట్లే ఈ సినిమాకు డైలాగ్స్ ప్రిపేర్ అయ్యాను. ఒత్తిడికి గురి కాలేదు.

• తెలుగు సినిమా అయినా, హిందీ సినిమా అయినా డైరెక్టర్ విజన్‌ను నేను పూర్తిగా నమ్ముతాను. సినిమాలో నా స్క్రీన్ టైమ్ ఎంతసేపు ఉందన్నది కాదు. నా బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చానా? లేదా? అని మాత్రమే ఆలోచించుకుంటాను. స్క్రీన్‌పై కనిపించే టైమ్‌లో నా పాత్రతో ఆడియన్స్‌ను ఎంత ఎంగేజ్ చేశానన్న అంశాన్నే ముఖ్యంగా భావిస్తాను. క్వాలిటీ బాగా రావాలని కోరుకుంటాను.

• చిన్నప్పటి నుంచే నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. భరతనాట్యం, కథక్‌లలో ప్రవేశం ఉంది. ఈ సినిమాలో బాగా డ్యాన్స్ చేసే అవకాశం వచ్చింది. ఇక రామ్ చరణ్‌గారు ఎంత బాగా డ్యాన్స్ చేస్తారో మీ అందరికీ తెలుసు. సాంగ్స్ షూట్ టైమ్‌లో టీమ్ నుంచి నాకు మంచి కాంప్లిమెంట్స్ వచ్చాయి. 'రామా లవ్స్ సీత, తస్సాదియా...' సాంగ్స్ నా ఫేవరెట్.

• యాక్టర్స్ అందరికీ మంచి టైమ్ వస్తుంది. 'ఎమ్ ఎస్. ధోని: ది అన్ టోల్డ్ స్టోరీ' సినిమాలో సాక్షి మహేంద్రసింగ్ పాత్ర చేశాను. ఆ టైమ్‌లో ధోని సినిమా సాక్షి కదా అన్నారు కొందరు. హ్యాపీగా అనిపించింది. ఆ తర్వాత 'భరత్ అనే నేను' సినిమాలో అవకాశం వచ్చింది. మహేశ్‌బాబు కో–స్టార్ అంటే తెలుగులో ఒక హీరోయిన్‌కి ఇంతకన్నా డ్రీమ్ లాంచ్ ఏం ఉంటుంది? అనిపించింది. నాకు టర్నింగ్ పాయింట్ అనిపించింది.

• బాలీవుడ్‌లో కరణ్‌జోహార్‌కి పెద్ద అభిమానిని నేను. ఓ రోజు ఆయన డైరెక్ట్‌గా కాల్ చేశారు. ఏదో పార్టీ అనుకున్నాను. కానీ ఆయన 'లస్ట్ స్టోరీస్'లో నేను చేయనున్న పాత్రకు తాను డైరెక్ట్ చేయనున్నట్లు చెప్పారు. అది చిన్న మినీ ఫిల్మ్‌లా అనిపించింది. సెన్సిబిలిటీగా, నెర్వస్‌గా అనిపించింది. ఆడిషన్ కూడా చేయలేదు. డైరెక్ట్‌గా సెట్‌లోకి వెళ్లిపోయాం. ఈ వెబ్ సిరీస్‌తో నాకు ఫీమేల్ ఆడియన్స్‌లో గుర్తింపు పెరిగింది.

• విజయ్ దేవరకొండకు నేను పెద్ద ఫ్యాన్‌ని. మంచి టాలెంటెడ్ యాక్టర్. తెలుగు 'అర్జున్‌రెడ్డి' హిందీ రీమేక్ 'కబీర్ సింగ్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నాను. ఆడియన్స్ పోలిక పెడతారని తెలుసు. కబీర్ (షాహిద్ కపూర్), ప్రీతి క్యారెక్టర్స్‌ను ఆడియన్స్ ఇష్టపడతారని అనుకుంటున్నాను. మేం కష్టపడుతున్నాం. సందీప్ వంగాగారు ప్యాషనేట్ డైరెక్టర్. ఇప్పటి వరకు వచ్చిన అవుట్‌పుట్ పట్ల ఆయన హ్యాపీగా ఉన్నారు. హిందీ నేటివిటీకి తగ్గట్లు అక్కడక్కడ మార్పులు చేశాం.

• మహేశ్‌బాబు, రామ్‌చరణ్ ఫ్యామిలీ ఓరియంటెడ్ పీపుల్. అందుకే వారి ఫ్యామిలీ మెంబర్స్‌తో కూడా మంచి రిలేషన్ ఉంది నాకు. 'భరత్ అనే నేను' సినిమా షూటింగ్ టైమ్‌లో నమ్రత, మహేశ్‌బాబు, సితారలతో స్నేహం ఏర్పడింది. 'వినయ విధేయ రామ' టైమ్‌లో చరణ్, ఉపాసనలతో రిలేషన్ కుదిరింది. హోమ్‌ఫుడ్ అంటే చాలా ఇష్టం. ఎవరైనా హోమ్‌ఫుడ్ ఇస్తే ఇట్టే ఫ్రెండ్ అయిపోతా(నవ్వుతూ).

• బాలీవుడ్‌లో 'కళంక్' చేశా, 'గుడ్‌న్యూస్, కబీర్ సింగ్' చేస్తున్నా. తెలుగులో కొన్ని కథలు వింటున్నాను. నా పాత్ర ఆసక్తికరంగా ఉండే మంచి సినిమాల్లో నేను భాగమైతే అంతే చాలు.

ఏంటి నిజమా?

కొత్త సినిమాలు సంతకం చేయడం లేదు. కేవలం టీవీ షో మాత్రమే చేస్తోంది. ఇది చాలదా గాసిప్ రాయుళ్లకు శ్రుతీహాసన్ పెళ్లికి శుభముహూర్తం పెట్టడానికి. అదే చేసేశారు. శ్రుతీ 2019లో తన లండన్ బాయ్‌ఫ్రెండ్ మైఖెల్ కోర్సలేను పెళ్లి చేసుకోబోతోంది అని రాసుకొచ్చారు. ఈ వార్త శ్రుతీ చెవిలో కూడా పడింది. వెంటనే 'ఏంటి నిజమా? ఇది నాకూ వార్తే' అంటూ ట్వీట్ చేశారు. మైఖేల్, శ్రుతీ కొంత కాలంగా రిలేషన్‌లో ఉన్న సంగతి తెలిసిందే. మరి ఔత్సాహికులు రాసుకొచ్చినట్టు శ్రుతీహాసన్ ఈ ఏడాది పెళ్లి చేసుకుంటారా? ఆవిడ కొట్టిపారేసినట్టే ఈ ఏడాది ప్రేమలోనే మునిగి తేలుతూ జీవితాన్ని ఆస్వాదిస్తారా? వేచి చూద్దాం.


• శ్రుతీహాసన్

సాక్షి ఫ్యామిలీ సినిమా
విజయవాడ ॥ శనివారం
5-1-2019


• అజిత్

జపాన్‌లోనూ విశ్వాసం

తమిళ స్టార్ హీరోల్లో అజిత్ కూడా ఒకరు. రజనీకాంత్‌లా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు అజిత్. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'విశ్వాసం'. అజిత్ కెరీర్‌లో 58వ చిత్రంగా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని శివ దర్శకత్వంలో సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించారు. నయనతార కథానాయిక. జగపతిబాబు స్టైలిష్ విలన్ పాత్రలో నటించారు. ఈ సినిమా సంక్రాంతికి విడుదల కానుంది. అంతేకాదు.. ఈ చిత్రాన్ని జపాన్‌లో కూడా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జపాన్‌కు చెందిన స్పేస్‌పార్క్ అనే సంస్థ ఈ చిత్రాన్ని అక్కడ విడుదల చేస్తోంది. కాగా, రజనీకాంత్ 'పేట' సినిమా కూడా చైనా, జపాన్ వంటి దేశాల్లోనూ ఈ సంక్రాంతికి విడుదలవుతుండటం విశేషం.


• విజయ్

మ్యాచ్ టైమ్ ఫిక్స్

ఫుట్‌బాల్ సాధన చేస్తున్నారట తమిళ హీరో విజయ్. అట్లీ దర్శకత్వంలో విజయ్ హీరోగా ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఇందులో నయనతార కథానాయికగా నటిస్తారు. ఈ సినిమాలో మహిళల ఫుట్‌బాల్ టీమ్‌కి విజయ్ కోచ్‌గా నటించనున్నారని కోలీవుడ్ టాక్. ఇటీవల ఈ సినిమా షూటింగ్ కోసం లాస్ ఏంజిల్స్‌లో లొకేషన్స్‌ని సెలెక్ట్ చేశారు టీమ్. తాజాగా ఈ సినిమా షూటింగ్ ఈ నెల 20న స్టార్ట్ కానుందని సమాచారం. అంతేకాదు ఈ సినిమాలోని 16 మంది ఫుట్‌బాల్ ప్లేయర్స్‌గా 16 మంది కొత్తమ్మాయిలను పరిచయం చేయనుండటం విశేషం. ఈ ఏడాది దీపావళికి ఈ చిత్రం విడుదలవుతుంది.


• కీరవాణి

ఇప్పుడు చాలెంజ్‌లు మానేశాను!

యన్.టి. రామారావు జీవితం ఆధారంగా ఆయన కుమారుడు బాలకృష్ణ నటించి, నిర్మించిన చిత్రం 'యన్.టి.ఆర్'. క్రిష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం రెండు భాగాలుగా రూపొందింది. మొదటి భాగం 'యన్.టి.ఆర్ : కథానాయకుడు' ఈ నెల 9న రిలీజ్ కానుంది. కీరవాణి సంగీత దర్శకుడు. ఈ సందర్భంగా ఆయన పంచుకున్న విశేషాలు.

• సాధారణంగా హీరోస్‌ని లార్జర్ దాన్ లైఫ్ ఇమేజ్‌తో చూపిస్తాం. యన్.టి. రామారావుని ఎలా చూపించారు?

ఎగ్జాగిరేషన్ లేకుండా మామూలుగా చూపించాం. ఆయన జీవితం గురించి చెప్పాలంటే 30 గంటలు సినిమా తీసుండాలి.

• సంగీత దర్శకుడిగా ఈ సినిమా ఓ చాలెంజ్ అనుకోవచ్చా?

కాదు.. ఎంజాయబుల్. చాలెంజింగ్ అనే పదాన్ని 'చెత్త సినిమా'కు సంగీతం ఇచ్చినప్పుడు వాడుతుంటాను. మనసుకి నచ్చిన సబ్జెక్ట్స్ చేయడం ఎప్పుడూ చాలెంజ్ కాదు. అలాగే ఇప్పుడు 'చాలెంజ్‌లు' స్వీకరించడం మానేశాను.

• ఆ ఉద్దేశంతోనే ఆ మధ్య 'చెత్త దర్శకులతో పని చేశాను' అని ట్వీట్ చేశారా? అప్పుడు అలాంటి చాలెంజింగ్ సినిమాలు చేసి ఇప్పుడు ఎందుకు విమర్శించారు?

వయసులో ఉన్నప్పుడు చాలా పనులు చేస్తాం. వయసు అయిపోయిన తర్వాత చేయలేం. వయసులో ఉన్నప్పుడు 20 పకోడీలు తింటాం. కానీ వయసైపోయాక తినలేం. అలాంటిదే ఇది కూడా. అలా అని ఆ సినిమాలు చేశానని రిగ్రెట్ అవ్వడం లేదు.

• మన అభిప్రాయాలను మనసులో దాచుకోవాలి. లేదా మాటలకు ఫిల్టర్ వేసుకుని మాట్లాడాలంటారు ఇండస్ట్రీలో..

నా అభిప్రాయాలను బహిరంగంగా చెప్పినా కూడా ఫలానా వ్యక్తి అని చెప్పలేదు కదా. సుబ్బారావు, పుల్లారావు అని పేరు పెట్టి విమర్శించలేదు కదా. సరదాగా ఓ విలేకరి 'ఈ ప్రాంతంలో సగం మంది మూర్ఖులు అన్నాడట. దాంతో ఒకతను ఇలా అంటావా? మాట వెనక్కి తీసుకో అన్నారట. దానికి అతను 'సగం మంది మూర్ఖులు కాదు' అన్నాడట. ఆ సగం మంది ఎవరని ఎవరికీ తెలియదు. వాళ్లకు వాళ్లే ఆలోచించుకోవాలి.

• 'ఇక రిటైర్ అవుతున్నా' అని గతంలో ప్రకటించారు. మనసు మార్చుకున్నారా?

మనసు ఇప్పుడూ మార్చుకోలేదు. రిటైర్ అయిపోయినట్టే. కానీ 'చాలెంజింగ్' సినిమాల నుంచి మాత్రమే. పకోడీలు తినడం లేదు. పెరుగన్నం తింటున్నా.

• మీ కెరీర్ స్టార్టింగ్ నుంచి ఇప్పటి వరకూ మీరు గమనిస్తే పాట పాటలానే ఉందా? స్టాండర్డ్ అలానే ఉందా?

పాటకు పల్లవి ప్రాణం. అప్పుడూ.. ఇప్పుడూ. సో అలానే ఉన్నట్టే. పాట నిడివి 3 నుంచి 5 నిమిషాలు. అది ఉంటే ఉన్నట్టే. సాహిత్యం, సింగర్ ఉన్నారా? వాళ్లు ఉంటే ఉన్నట్టే. స్టాండర్డ్ విషయానికి వస్తే ఈ డిబేట్ అప్పుడు కూడా ఉంది. సో స్టాండర్డ్ మారలేదు అంటాను. పాట చెక్కు చెదరకుండా అలానే ఉంది.

• మీకు రీప్లేస్‌మెంట్ ఎవ్వరూ రాలేదంటాం. ఏమంటారు?

ఆప్షన్ లేదని మీరంటారు. అది మీ భావం. దాసరిగారో పాట రాశారు. 'ఆగదు ఏ నిమిషము నీ కోసము...' అని. ఎవరి వల్లా జీవితం ఆగదు. భర్త చనిపోయిన స్త్రీని చూసి ఆయన లోటు తీరనిది అని అంటాం. భర్త చనిపోతే భార్య సతీ సహగమనం చేసుకోవాలా? అలా చేయడం తప్పు. తీరని లోటని చచ్చిపోమంటామా? బతికుండమంటావా? వాస్తవాన్ని అంగీకరించమంటాం. ప్రత్యామ్నాయం చూసుకోవాలంటాం కదా. ఇది కూడా అంతే. మీకు రీప్లేస్‌మెంట్ లేదనేది అపోహ అంటాను. ఎందరో వస్తున్నారు కదా.

• కానీ క్వాలిటీలో తేడాలుంటాయి కదా?

దీన్ని కూడా ఏకీభవించను. మీకు ఫలానా రెస్టారెంట్‌లో బిర్యానీ నచ్చొచ్చు. నాకు వేరే హోటల్లో పూరీ నచ్చొచ్చు. కళలకు, సైన్స్‌కు తేడా అదే. లెక్కలు, సైన్స్‌లో వందకు వంద మార్కులు సాధించొచ్చు. కానీ తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్ట్స్‌లో వేయరు. అవి ఆర్ట్స్. ఆ తేడాను అలా నిర్ణయించి పెట్టారు. చరిత్రకారులు కూడా చరిత్రను ఒక్కో దృష్టితో చెబుతారు. కొలమానం లేనప్పుడు రీప్లేస్‌మెంట్, పోలికలు ఉండవు. పని జరుగుతూ ఉంటుంది.

• మ్యూజిక్‌లో మీరు చూసిన మార్పేంటి?

ఇది వరకు రికార్డింగ్ అంటే ఓ స్టూడియోలో పెద్ద రికార్డింగ్ ల్యాబ్. ఒక ఇంజనీర్, స్టాఫ్. లోపలకు అడుగుపెడితే సెపరేట్ గదులు, మెషినరీ చాలానే ఉండేవి. ఆరోజుల్లో అలా ఉండేది. ఇప్పుడు.. ఫలానా హోటల్‌లో ఫలానా రూమ్ నెంబర్‌లో కంపోజింగ్ అంటారు. పక్క గదిలో ఏదో వ్యాపార లావాదేవీలు జరుగుతాయి. మరో గదిలో మరోటి.. మరోటి... వీటి మధ్యలో రికార్డింగ్. అక్కడో మైక్ ఉంటుంది. పాడి వెళ్లిపోవడమే. అప్పటికీ ఇప్పటికీ నేను గమనించిన అతి పెద్ద మార్పు అదే. అప్పటికి అది నచ్చింది. ఇప్పుడు ఇది నచ్చింది. నచ్చింది కాబట్టే ఇంకా మ్యూజిక్ చేయగలుగుతున్నాను.

• ఎన్టీఆర్ బయోపిక్ రెండు భాగాల్లో పాటలెన్ని ఉన్నాయి?

ఫస్ట్ పార్ట్‌లో నాలుగు, సెకండ్ పార్ట్‌లో నాలుగున్నాయి.

• ఈ సినిమాకి పాటలివ్వడంపై మీ అనుభూతి?

రామారావుగారి మీద నాకు ప్రత్యేక అభిమానం ఉంది. ఆయన సినిమాకు నన్ను సంగీతం చేయమనడాన్ని గర్వంగా ఫీల్ అవుతాను.


• కంగనా రనౌత్

ఝాన్సీ బాయ్‌లా నీకూ పరీక్షలే అన్నారు

చిన్నప్పుడు తమ్ముడికి ఆడుకునే గన్ను తనకు బొమ్మ కొనిచ్చినప్పుడు 'నేనెందుకు గన్నుతో ఆడుకోకూడదు. ఎందుకీ వివక్ష'.. ప్రశ్నించింది కంగనా రనౌత్. స్త్రీ ఎందులోనూ తక్కువ కాదని చిన్ని మనసులో నాటుకుపోయింది. పెరిగే కొద్దీ ఆ భావన పెరిగి పెద్దదైంది. హిమాచల్ ప్రదేశ్ నుంచి ఎలాంటి బ్యాగ్రౌండూ లేకుండా బాలీవుడ్‌కి వచ్చి స్టార్ అయింది. 'తను వెడ్స్ మను, రజ్జో, క్వీన్' చిత్రాలతో తానేంటో నిరూపించుకుంది. ఇప్పుడు 'మణికర్ణిక: ఝాన్సీ రాణి'గా రాబోతోంది. ఈ చిత్రం తెలుగు ట్రైలర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేసిన సందర్భంగా కంగనా ఇంటర్వ్యూ..

• స్క్రిప్ట్ దశ నుంచి షూటింగ్‌లో, ఇప్పుడు రిలీజ్‌కి రెడీ అయిన నేపథ్యంలో సాగిన 'మణికర్ణిక' ప్రయాణం మీకెలా అనిపించింది?

చాలా దశలు చూశాను. విజయేంద్రప్రసాద్‌గారైతే ఆ ఝాన్సీ లక్ష్మీబాయ్ ఎన్నో పరీక్షలు ఎదుర్కొంది. ఇప్పుడు ఈ సినిమా కూడా నిన్ను చాలా పరీక్షలు పెడుతోందన్నారు. అది నిజమే. ఈ చిత్రం షూటింగ్‌లో గాయపడ్డాను. ఆ తర్వాత అనుకోకుండా డైరెక్టర్‌గా మారాల్సి వచ్చింది. సినిమాల్లో యుద్ధ సన్నివేశాలు చాలా ఉన్నాయి. ప్రతి పరీక్షను దాటుకుంటూ వచ్చాను.

• కథ విన్నాక ఈ సినిమా కోసం మీరు ఏమేం నేర్చుకున్నారు?

కత్తి సాము నేర్చుకున్నాను. ఒకే కరవాలంతో కాదు.. కొన్ని సన్నివేశాల్లో రెండు కత్తులు దూస్తాను. దానికోసం చాలా ప్రాక్టీస్ చేశాను. కత్తిసాము, గుర్రపు స్వారీలో పర్ఫెక్షన్ తీసుకురావడానికి రెండు నెలలు కష్టపడ్డాను. ఝాన్సీ లక్ష్మీ బాయ్ శక్తివంతమైన స్త్రీ. నేను కూడా చూడ్డానికి అంతే పవర్‌ఫుల్‌గా కనిపించాలి. అందుకు తగ్గట్టుగా నా బాడీ లాంగ్వేజ్ మార్చుకున్నాను. 'బాహుబలి' తర్వాత వస్తున్న మంచి పీరియాడికల్ మూవీ 'మణికర్ణిక'. ఫస్ట్ ఉమెన్ యాక్షన్ మూవీ. అందుకే రాజీపడలేదు.

• లక్ష్మీ బాయ్ వీర వనిత. బ్యాగ్రౌండ్ లేని స్థాయి నుంచి స్టార్‌గా ఎదిగే క్రమంలో మీరు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. మహిళలందరూ ధైర్యంగా ఉండాలి కదా?

కచ్చితంగా ఉండాలి. రాణీ లక్ష్మీ బాయ్‌లాంటి వాళ్లను సమాజం తయారు చేయడానికి ముందుకొస్తే కాదనేవారు ఎవరుంటారు? అయితే నువ్వు ధైర్యంగా ఉండాలి అని ఎవర్నీ ఒత్తిడి చేయకూడదు. ధైర్యవంతులను నిరుత్సాహపరచకూడదు.

• ఓకే.. 'మణికర్ణిక'ని పూర్తి చేయడానికి డైరెక్షన్ సీట్‌లోకి రావాలన్నది మీ ఆలోచనా? అసలు ఏం జరిగింది?

క్రిష్‌గారు ఓ తెలుగు సినిమా ఒప్పుకోవడం వల్ల 'మణికర్ణిక' వాయిదా పడే పరిస్థితి వచ్చింది. మేం ఎలాగైనా జనవరిలోనే విడుదల చేయాలనుకున్నాం. దాంతో నిర్మాత కమల్ జైన్, రచయిత విజయేంద్ర ప్రసాద్‌గారు నన్నే డైరెక్షన్ చేయమన్నారు. అయితే ఇది ఈజీ మూవీ కాదు. ఒక చరిత్ర. అందుకే వేరే ఇద్దరు డైరెక్టర్లు పెట్టమన్నాను. అలా చేసినా సింక్ అవ్వలేదు. ఫైనల్లీ నేనే చేయాలని నిర్ణయించుకున్నాను. అయితే అప్పటికే క్రిష్ చేసి ఉండటంతో మిగతా నాకు కొంచెం సులువు అయింది.

• క్రిష్ అలా తప్పుకోవడం కరెక్టేనంటారా? పైగా 'మణికర్ణిక' గురించి ఆయన ఎక్కడా మాట్లాడటంలేదు కూడా?

ఒక పెద్ద ప్రాజెక్ట్ ఒప్పుకున్నారు కాబట్టే తప్పుకున్నారు. వాయిదా వేయడానికి ఇష్టం లేక మేం పూర్తి చేశాం. ఇక ఈ సినిమా గురించి ఆయన ఎందుకు మాట్లాడటంలేదు అంటే.. ఆయన చేస్తున్న ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టి ఉంటారు.

• మీరు దర్శకత్వ బాధ్యతలు చేపట్టడంవల్లే.. ఒక లేడీ డైరెక్టర్‌తో చేయడంతో ఇష్టం లేక సోనూ సూద్ తప్పుకున్నారట. కానీ ఆయనేమో గెటప్‌లో వచ్చిన మార్పు వల్లే అంటున్నారు?

గెటప్ మారినది నిజమే. సోనూ సూద్ 'సింబా' సినిమా ఒప్పుకున్నారు. ఆ సినిమా గెటప్‌కీ, దీనికీ సింక్ అవ్వదు. ఇందులో గడ్డం ఉండాలి. కానీ గడ్డం పెంచలేనంటూ తప్పుకున్నారు. అయినా ఇవాళా రేపూ గడ్డం గెటప్ అంటే పెంచాల్సిన అవసరమే లేదు. కావాలంటే పెట్టుడు గడ్డంతో మ్యానేజ్ చేయొచ్చు. కానీ సోనూ సూద్ తప్పుకున్నారు. అయినా ఓకే.

• మరో సినిమాకి దర్శకత్వం వహించాలని అనుకుంటున్నారట?

అవును. ఆ సినిమాకి విజయేంద్రప్రసాద్‌గారే కథ అందిస్తున్నారు. అయితే అందరూ అనుకుంటున్నట్లు ఇది ఏలియన్స్‌కి సంబంధించిన కథ కాదు.


• ధనుష్

పది రోజులు.. మూడు సినిమాలు

విష్ణు విశాల్ హీరోగా రామ్‌కుమార్ దర్శకత్వంలో వచ్చిన తమిళ చిత్రం 'రాక్షసన్' సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమా దర్శకుడు రామ్ కుమార్ మంచి చాన్స్‌ను కొట్టేశారు. మాస్ హీరో ధనుష్ సినిమాకి దర్శకత్వం వహించే చాన్స్ రామ్‌కుమార్‌కి దక్కింది. సత్యజ్యోతి ఫిల్మ్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. అలాగే సేమ్ నిర్మాణసంస్థలో 'కొడి' ఫేమ్ దురై సెంథిల్ కుమార్ దర్శకత్వంలో ధనుష్ హీరోగా ఓ సినిమా చేయనుండటం విశేషం. ''ధనుష్‌తో రెండు సినిమాలను చేయబోతున్నందుకు చాలా ఆనందంగా ఉంది'' అని సత్యజ్యోతి ఫిల్మ్స్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇటీవల ధనుష్ హీరోగా 'అసురన్' మూవీ అనౌన్స్‌మెంట్ వచ్చిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇలా జస్ట్ పది రోజుల్లో తన మూడు సినిమాలను అనౌన్స్ చేసి అభిమానులను ఖుషీ చేశారు ధనుష్. అంతా ఓకే కానీ ధనుష్, నాగార్జునలతో స్టార్ట్ అయిన మల్టీస్టారర్ మూవీ ఏమైనట్లబ్బా? అని ఆలోచిస్తున్నారు కోలీవుడ్ సినీవాసులు.

మామా కోడలు మళ్లీ కలిసే?


• అమితాబ్ బచ్చన్


• ఐశ్వర్యా రాయ్

'కజ్‌రారే కజ్‌రారే..' పాటలో కలిసి స్టెప్స్ వేశారు అమితాబ్ బచ్చన్, ఐశ్వర్యా రాయ్. ఆ తర్వాత 'సర్కార్ రాజ్' చిత్రంలోనూ స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఇప్పుడు మరొక్కసారి స్క్రీన్‌పై కలిసి యాక్ట్ చేయబోతున్నారని బాలీవుడ్ టాక్. దర్శకుడు మణిరత్నం ప్రస్తుతం తమిళ ఫేమస్ నవల 'పొన్నియిన్ సెల్వన్'ని సినిమాగా తీయాలని భావిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కథని గతంలో చాలాసార్లు సిల్వర్ స్క్రీన్ మీద చూపించాలని ప్రయత్నించారీ దర్శకుడు. కానీ కుదర్లేదు. లేటైనా లేటెస్ట్‌గా వస్తుంది అన్నట్లు ఈ సినిమాలో టాప్ నటీనటులను ఎంపిక చేసే పనిలో పడ్డారు. ఆల్రెడీ తమిళ హీరో విక్రమ్ ఓకే అయ్యారు. విజయ్, శింబు కూడా ఈ ప్రాజెక్ట్‌లో ఉంటారని వార్త. ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్రల కోసం అమితాబ్ బచ్చన్‌ను, ఐశ్వర్యా రాయ్‌ను సంప్రదించారట మణి. ఆల్రెడీ మణి దర్శకత్వంలో రూపొందిన 'ఇద్దరు, గురు, రావణ్' సినిమాలలో యాక్ట్ చేశారు ఐష్. అమితాబ్ బచ్చన్–మణిరత్నం కాంబినేషన్ మాత్రం ఫస్ట్ టైమ్. మరి.. మామా కోడలు చాలా కాలం తర్వాత ఈ సినిమాలో కనిపిస్తారన్న వార్త నిజమేనా? అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.

వాస్తవ సంఘటనతో...


• రక్షిత్, నక్షత్ర

'లండన్ బాబులు' ఫేమ్ రక్షిత్ హీరోగా తెరకెక్కనున్న చిత్రం 'పలాస 1978'. కరుణ కుమార్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో నక్షత్ర హీరోయిన్. తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో బిక్రమ్ కృష్ణ ఫిలింస్ పతాకంపై అప్పారావు బెల్లన, అట్లూరి వరప్రసాద్ నిర్మించనున్నారు. రెగ్యులర్ షూటింగ్ ఫిబ్రవరి 9న ప్రారంభం కానుంది. కరుణ కుమార్ మాట్లాడుతూ– ''చాలా చిత్రాలకు రచన, దర్శకత్వ విభాగంలో పని చేసిన నేను 'పలాస 1978' సినిమాతో దర్శకుడవుతున్నా. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందిస్తున్నాం'' అన్నారు. ''సినిమా మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోనే చిత్రీకరణ, నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకోనున్న తొలి చిత్రం మాదే'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: రఘు కుంచె, కెమెరా: విన్సెంట్ అరుల్.